'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 323

శుక్రవారం 13-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ హవా

175కు పైగా స్థానాల్లో తారిఖ్ రెహమాన్ పార్టీ ముందంజ -6లో

పాండ్యా, ఇషాన్ మెరుపులు

టి20 ప్రపంచకప్‌లో నమీబియాపై 93 పరుగుల తేడాతో భారత్ గెలుపు -12లో

ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి

శాసనసభలో ప్రజల గొంతు వినిపించకూడదని ప్రభుత్వం కుట్ర

- అందుకే ఏకైక ప్రతిపక్ష పార్టీ అయిన వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు
- మండలిలో సంఖ్యా బలం ఉంది కాబట్టి ప్రజా సమస్యలపై గట్టిగా గొంతెత్తాలి
- ఎమ్మెల్సీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు ఒక అబద్ధాన్ని సృష్టించి దానికి రెక్కలు కట్టారు
- వైఎస్సార్‌సీపీపై నిరంతరం బురదజల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారు
- 2024 మార్చి 16న ఎన్నికల కోడ్, మే 13న పోలింగ్..
- మే 15న టీటీడీలో నెయ్యి సరఫరాకు టెండర్లు ఓకే
- జూన్ 4న ఎన్నికల ఫలితాలు.. చంద్రబాబు సీఎం అయ్యాకే నెయ్యి సరఫరా ప్రారంభం
- జూలై 6, 12వ తేదీల్లో వచ్చిన నాలుగు ట్యాంకర్ల నెయ్యి నాణ్యత పరీక్షలో ఫెయిల్
- వాటిని వెనక్కు పంపిన టీటీడీ.. ఆగస్టు, సెప్టెంబర్‌లో తిరిగి అదే నెయ్యి సరఫరా
- తిరస్కరణకు గురైన నెయ్యిని మళ్లీ ఎలా అనుమతించారు? ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది చంద్రబాబే
- సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు
- వ్యవసాయం, విద్య, వైద్య రంగాలు తిరోగమనం
- పాలనంతా స్కామ్‌ల మయం.. విశాఖలో రూ.5 వేల కోట్ల భూమి 'గీతం'పరం
- వీటన్నింటినీ గట్టిగా ప్రశ్నించాలి.. ప్రజల తరపున గొంతు వినిపించాలి

3లో

“ ఎన్నికలప్పుడు ఇంటింటికీ ఇచ్చిన హామీలతో కూడిన బాండ్ల గురించి ప్రశ్నించే వారిపై దాడులు, తప్పుడు కేసులు.. అన్ని రంగాలూ తిరోగమనం.. విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావట్లేదు.. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారింది.. ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడీ సాగుతోంది.. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోంది. అదే 'క్యాషా.. సూట్‌కేసూ.. రాజేషు.. లోకేషు..' అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలి. గట్టిగా పోరాడాలి. - వైఎస్ జగన్

రూ.5 వేల కోట్ల భూమి 'గీతం'కు ఎలా ఇస్తారు?

రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే భూములా?

- శాసన మండలిలో మండిపడ్డ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ
- 99 పైసలకే భూములిచ్చే విధానం దేశంలో ఎక్కడైనా ఉందా?
- ఐటీ సంస్థల పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థలకు కేటాయింపులా?
- విశాఖలో ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులపై నిలదీత
- భూముల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ ఉంది కదా?
- వారు చేసే పనిని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎందుకిస్తున్నారు?
- లోపాయికారీ ఒప్పందాల వల్లే భూ కేటాయింపులని మండిపాటు
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్

7లో

'తల్లికి వందనం'పై దద్దరిల్లిన మండలి

- గవర్నర్‌తో అవాస్తవాలు చెప్పించారంటూ వైఎస్సార్‌సీపీ ఆగ్రహం
- రెండేళ్లు దాటినా తల్లికి వందనం ఇంకా పూర్తి స్థాయిలో ఎందుకు ఇవ్వలేదని నిలదీత
- తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి.. రెండో ఏడాది చాలా కుటుంబాలకు రూ.7-8 వేలు బకాయి
- ఒకసారి నియోజకవర్గ స్థాయిలో పరిశీలించి చూసుకోండని అధికార పక్షానికి హితవు
- కాదు అని నిరూపిస్తే సభకు క్షమాపణ చెబుతానని మండలి ప్రతిపక్ష నేత బొత్స సవాల్

7లో

జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

11లో

అమెరికాలో తెలుగమ్మాయి జాహ్నవి మృతికి కారణమైన పోలీస్ అధికారి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కేసులో ఆమె కుటుంబానికి దాదాపు రూ.262 కోట్లు నష్టపరిహారంగా ఇవ్వాలని నిర్ణయించారు.

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	120 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	213 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	147 కిలో	స్కిన్ లెస్	243 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ముందు నెయ్యి.. వెనుక గొయ్యి..

'హెరిటేజ్' కోసమే కుట్ర!

నెయ్యి కాంట్రాక్టు కోసం దిగజారిన చంద్రబాబు

సాక్ష్యాలతో సహా బయటపడ్డ దుర్మార్గం

పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుష్ప్రచార కుట్ర వెనుక లోగుట్టు బద్దలయ్యింది. తమ కుటుంబ వ్యాపార సంస్థ హెరిటేజ్ డెయిరీకి అడ్డగోలుగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే బాబు ఇంతటి రాద్ధాంతం చేస్తున్నారన్న విషయం సాక్ష్యాలతో సహా బయటపడింది. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు అడ్డగోలుగా నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. నేరుగా కాకుండా హెరిటేజ్‌కే చెందిన మహారాష్ట్రలోని ఇందాపూర్ డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టి కథ నడిపించారు.

8లో

మరింత పెద్ద & వెడల్పు అలాయ్ వీల్స్

ప్రీమియం క్రోమ్ యాక్సెంట్స్

మరింత పొడవైన ప్లష్ సీట్ 785mm

బెస్ట్-ఇన్ క్లాస్ మైలేజ్##

సెగ్మెంట్ లో మొదటి సారి ఆటో క్యాన్సిల్ వింకర్స్##

ఎక్స్ఛేంజ్ ఆఫర్ ₹2 500* | గవర్నమెంట్/ కార్పొరేట్ ఆఫర్స్ ₹3 200* | ఎక్స్-షోరూం ధర ₹78 141*

INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply

Hero GoodLife 24 క్యారట్ గోల్డ్ కాయిన్ గెలిచే అవకాశం మరియు ఎన్నో గ్యారంటీ బెనిఫిట్స్ పొందండి#

Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. $As per internal benchmarking of 125 cc scooters in India under standard conditions and may vary as per road & riding conditions. World's largest Two-wheeler manufacturer with the highest Two-wheeler unit sales by a single corporate entity globally, for the past 25 years. Data Source: SIAM Certificate. ##As per internal benchmarking of 125cc scooters in India under standard conditions. Actual mileage may vary based on road and riding conditions. #Benefits include Gold Coin/Silver Coin/ OTT Membership. Limited period offer. *Ex-showroom prices are applicable in AP. *T&C apply.

TOLL FREE 1800 266 0018

Authorised Dealers: Guntur: Associated Hero, 9289922516, Annapurna Motors, 9289233814, Narasaraopet: Lotus Motor World, 9289233907, Associate Dealer: Tenali: 07949293344, Bapatla: 7273836666, Ponnur: 07949294496, Sattenapalli: 07949294498, Cherukupalli: 07949293345, Also Available At: Vinukonda: 07949294509, Mangalagiri: 07949294513, Piduguralla: 9885988625, Repalle: 9515320031, Dachepalli: 9666406417, Santhamaguluru: 9573115012, Karempudi: 9440103681, Phirangipuram: 9705070555, Krosur: 8985621002, Thullur: 9666245777, Epuru: 9133834060.

RS/Hero/02/26

KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
ఆనందపు ప్రతి క్షణానికి KISNA
UP TO ₹5000 తగ్గింపు 5 గ్రాముకు
డైమండ్ & బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై*
UP TO ₹1000 తగ్గింపు గ్రాముకు
డైమండ్ & బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై*
డైమండ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో
గ్లోబల్ లీడర్ నుండి
90%* బైబ్యాక్ | 95%* ఎక్స్ఛేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
షరతులు వర్తిస్తాయి*
మా ప్రస్తుత ప్రత్యేక షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - శరత్ సిటీ మాల్ | ఇనార్బిట్ మాల్ – సైబరాబాద్ | సోమాజిగూడ | ఎ. ఎస్. రావు నగర్ | కూకట్‌పల్లి | కరీంనగర్
ఆంధ్రప్రదేశ్ - విజయవాడ | విశాఖపట్నం - గాజువాక | సంపత్ వినాయక దేవాలయం ఎదురుగా | శ్రీకాకుళం
రాబోయే షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - హిమాయత్‌నగర్ | చందా నగర్ | ఆంధ్రప్రదేశ్ – గుంటూరు | విశాఖపట్నం – ఇనోర్బిట్ మాల్ | మధురవాడ
ICICI Bank
5% Instant Discount*
KISNA ఇప్పుడు భారతదేశం అంతటా 130 ప్రత్యేక షోరూమ్‌లు మరియు 1,500 కంటే ఎక్కువ షాప్-ఇన్-షాప్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉంది | www.kisna.com
SCAN HERE

ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి

శాసనసభలో ప్రజల గొంతు వినిపించకూడదని ప్రభుత్వం కుట్ర

అందుకే ఏకైక ప్రతిపక్ష పార్టీ అయిన వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు

మండలిలో సంఖ్యా బలం ఉంది కాబట్టి ప్రజా సమస్యలపై గట్టిగా గొంతెత్తాలి

ఎమ్మెల్సీలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: శాసనసభలో ప్రజల తరఫున మన గొంతు వినిపించకూడదని ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందుకే ఏకైక ప్రతిపక్ష పార్టీ అయినప్పటికీ ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కౌన్సిల్ (శాసన మండలి)లో మనకు మంచి సంఖ్యా బలం ఉందని, ప్రజా సమస్యలపై గొంతెత్తి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ఎమ్మెల్సీలకు దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైఎస్ జగన్ అధ్యక్షతన పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. 'అందరూ యుద్ధంలో ఉన్నారు. నా కంటే మీకే ఇంకా బాగా తెలుసు. అందుకే మీరు కూడా సమర్థవంతంగా పోరాడతారు. మనకు శాసనసభలో బలం తక్కువ. అక్కడ మన గొంతు వినపడకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. సభలో ఉన్న ఏకైక ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మాత్రమే. అయినా ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడం లేదు. ఎందుకంటే, మనకు ఆ గుర్తింపును ఇస్తే, విపక్ష నేతకు కూడా సీఎంకు ఎంత సమయం ఇస్తారో దాదాపుగా అంతే సమయం మాట్లాడే అవకాశం ఇవ్వాల్సి వస్తుంది. అలా ఇవ్వడం ఇష్టం లేదు కాబట్టే, మన పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై గొంతెత్తలేం కాబట్టి, ఇక్కడ మీడియాతో మాట్లాడుతున్నాం. ఆధారాలతో సహా, అన్నీ వివరిస్తున్నాం' అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మండలిలో గట్టిగా నిలదీద్దాం

కౌన్సిల్‌లో మనకు బలం ఉంది. కాబట్టి మనకు మాట్లాడే అవకాశం వస్తుంది. మనకు మైక్ ఇస్తారు కాబట్టి, ప్రజల సమస్యలను గట్టిగా వినిపించే వీలుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ మీకు తెలుసు. సబ్జెక్టుల వారీగా పూర్తి అవగాహన పెంచుకోండి. అప్పుడే మనం గట్టిగా మాట్లాడగలం. దేనికైనా మంచి ప్రిపరేషన్ అవసరం. అవగాహన పెంచుకుంటే బాగా మాట్లాడగలుగుతాం. ఏ అంశంపై మాట్లాడినా తగిన ఆధారాలు, సాక్ష్యాలు చూపి మాట్లాడాలి. అప్పుడే మన గొంతు బలంగా పోతుంది.

లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని బాబు తట్టుకోలేకపోతున్నారు

తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు ఒక అబద్ధాన్ని సృష్టించి దానికి రెక్కలు కట్టారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర్‌రెడ్డిలపై దాడులు కానీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు.. ఇవన్నీ తిరుమల లడ్డూ వ్యవహారంలో ప్రశ్నించడాన్ని తట్టుకోలేక చంద్రబాబు చేసినవే. చివరకు చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని మనం గుళ్లలో పూజలు చేసినా, చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. ఏకంగా భౌతిక దాడులు చేస్తున్నారు. ఒక అబద్ధం సృష్టించి, దానికి రెక్కలు కట్టి ప్రచారం చేయడం తొలిసారి చూస్తున్నాం. అసలు కల్తీ నెయ్యి సరఫరాకు, వైఎస్సార్‌సీపీకి ఏమాత్రం సంబంధం లేదు.

టీటీడీలో నెయ్యి సరఫరాకు ఒక పక్కా విధానం

టీటీడీలో నెయ్యి సేకరణకు ఒక నిర్దిష్టమైన పటిష్ట విధానం ఉంది. నెయ్యి తెచ్చిన ట్యాంకర్లు కేంద్ర ప్రభుత్వం అక్రిడేటెడ్ ల్యాబ్ నుంచి సర్టిఫికెట్ తీసుకురావాలి. అలా వచ్చిన ట్యాంకర్‌లోని నెయ్యిని మళ్లీ టీటీడీ కూడా పరీక్షిస్తుంది. ఆ రిపోర్టు కూడా పాజిటివ్‌గా ఉంటేనే లోపలికి పంపిస్తారు. ఇదే పద్ధతిలో నాణ్యత లేక మన హయాంలో 18 సార్లు ట్యాంకర్లు వెనక్కు పంపాం. అంతకు ముందు చంద్రబాబు హయాంలో కూడా 2014–19 మధ్య 15 ట్యాంకర్లు వెనక్కు పంపారు. మరి ఇలాంటి పద్ధతి ఉన్నప్పటికీ కూడా దొడ్డిదారిన రిజెక్ట్ చేసినవి, తిరిగి టీటీడీకి వచ్చాయంటే, దానికి సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే కదా? మరి వీటన్నింటినీ మన పార్టీకి, మన ప్రభుత్వ కాలానికి ఆపాదించి రోజూ బురద చల్లుతున్నారు. వాస్తవానికి సీబీఐ చార్జిషీటులో అభియోగాలు ఎదుర్కొంటున్న కంపెనీలే 2014–19 మధ్య కూడా నెయ్యిని సరఫరా చేశాయి. ప్రీమియర్ డెయిరీ 2016, 2017, 2018లో కూడా నెయ్యి సరఫరా చేసింది. కానీ, కేవలం మన ప్రభుత్వానికి ఆపాదించి కుట్రలు చేస్తున్నారు.

హామీలన్నీ గాలికి..

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారు. ఇవన్నీ అమలు చేస్తామంటూ ఎన్నికలప్పుడు ఇంటింటికీ బాండ్లు ఇచ్చారు. అప్పుడు చెప్పిందేమిటి? ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? దారుణంగా మోసాలు చేస్తున్నారు. వాటి గురించి ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. అక్రమ కేసులు పెడుతూ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. మొత్తం వ్యవస్థలన్నీ నీరుగారిపోయాయి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి. ఉచిత పంటల బీమాను ఎత్తివేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పొదుపు సంఘాలన్నీ ఢమాల్ అంటున్నాయి. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారింది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. రూ.5 వేల కోట్ల విలువైన 54 ఎకరాల భూమిని గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారు. ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఇలా ఇచ్చుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోంది. అదే 'క్యాషు.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్..' అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలి. గట్టిగా పోరాడాలి. చిత్తశుద్ధితో కష్టపడి పని చేయండి. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయి. వచ్చేది మన ప్రభుత్వమే. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుంది. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం ఉంది.'

ఈ పాపం చంద్రబాబుదే

- లడ్డూ వ్యవహారానికి సంబంధించిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే. లెంపలేసుకోవాల్సిందీ చంద్రబాబే. ఒకసారి జరిగిన తీరు చూస్తే, రాష్ట్రంలో 2024 మార్చి 16న ఎన్నికల కోడ్ వస్తే, మే 13న పోలింగ్ జరిగింది. మే 15న టీటీడీలో నెయ్యి సరఫరాకు సంబంధించిన టెండర్లు ఓకే చేసి, ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయిన తర్వాతనే నెయ్యి సరఫరా ప్రారంభమైంది.
- జూన్ 12న మొదటి ట్యాంకర్ వచ్చింది. ఆ తర్వాత జూన్ 20, 25వ తేదీల్లో, జూలై 4న మొత్తం నాలుగు ట్యాంకర్లలో ఏఆర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసింది. అవన్నీ ల్యాబ్ పరీక్షల్లో పాస్ అయ్యాయి. ఆ తర్వాత జూలై 6, 12వ తేదీల్లో వచ్చిన నాలుగు ట్యాంకర్ల నెయ్యి నాణ్యత పరీక్షలో ఫెయిల్ అయింది. జూలై 23న ల్యాబ్ రిపోర్టు రావడంతో, జూలై 25న వాటిని వెనక్కు పంపించారు.
- అయితే అవే ట్యాంకర్లను జూలై 27న శ్రీకాళహస్తిలో వైష్ణవి డెయిరీకి సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత అవే ట్యాంకర్లను మరో డెయిరీ పేరుతో ఆగస్టు, సెప్టెంబర్‌లో తిరిగి టీటీడీకి పంపారు. ఆ తర్వాతే సీఎం హోదాలో చంద్రబాబు లడ్డూపై తీవ్ర ఆరోపణలు చేశారు.
- వెనక్కు పంపిన ట్యాంకర్లు తిరిగి టీటీడీలోకి వస్తే.. జరిగిన పరిణామాలు, జరిగిన తేదీలు చూస్తే మొత్తం ఇవన్నీ కూడా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాతే జరిగాయి. మరి సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే కదా?
- నిజానికి 2014–19 మధ్య ప్రీమియర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసింది. ఆ కంపెనీ 2019లో సరఫరా ఆపేసింది. కానీ, దాన్ని కేవలం మన ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారు. అంతకు ముందు సరఫరాకు సంబంధించి ప్రస్తావించడం లేదు. అసలు 2014–2019 మధ్య సరఫరా అయిన నెయ్యిపై కూడా విచారణ జరగాలి.
- ఇప్పుడు చెప్పండి.. ఎవరి హయాంలో ఆ ట్యాంకర్లు వచ్చాయి? ఎవరి హయాంలో టీటీడీ వాటిని అడ్డుకుంది? ఎవరి హయాంలో నెయ్యి శాంపిళ్లు తీసుకున్నారు? వెనక్కు పంపిన ట్యాంకర్లను తిరిగి తీసుకున్నది ఎవరి హయాంలో? ఇవన్నీ కూడా టీడీపీ హయాంలోనే జరిగాయి. ఇదంతా సీబీఐ సిట్ చార్జిషీట్‌లోనే ఉంది. మరి దీన్నంతటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించడం దుర్మార్గం కాదా?

ఉక్కు ఉద్యోగులపై వేధింపులు

- సీ షిఫ్ట్‌లో రాత్రి 10 నుంచి 6గంటల వరకు ఉద్యోగానికి వచ్చే స్టీల్‌ప్లాంట్ కార్మికులపై నిఘా
- ప్రతిరోజూ తనిఖీలు చేయాలని అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు
- ఇప్పటికే వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం
- ఒకవైపు వీఆర్ఎస్, మరోవైపు కాంట్రాక్ట్ లేబర్ తొలగింపు
- అధికారులకు 12 గంటల పని
- రాత్రివేళల్లో తనిఖీలతో కార్మికుల హడల్
- ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నైట్ షిఫ్ట్ విధులపై కట్టుదిట్టమైన నిఘా కోసం యాజమాన్యం ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసింది. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి ఉత్తర్వుల మేరకు 24 మంది జీఎంలతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. నైట్ షిఫ్ట్‌లో సిబ్బంది హాజరు, సాంకేతిక క్రమశిక్షణ, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ), భద్రతా ప్రమాణాల అమలును ఈ బృందం పరిశీలించనుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ప్రతిరోజూ టీమ్‌లోని ముగ్గురు సభ్యులు ఆయా విభాగాలను ఆకస్మికంగా సందర్శించి నిర్వహణా ప్రమాణాల ఉల్లంఘనలు, తప్పుడు విధానాలు, భద్రతా లోపాలను పరిశీలించి 12 గంటలలోపు సీజీఎం (వర్క్స్)కు నివేదిక అందజేయాలి. ప్రతిరోజూ వెళ్లాల్సిన ముగ్గురు సభ్యుల సమన్వయాన్ని ప్లాంట్ కంట్రోల్ విభాగం చూసుకుంటుంది.

కార్మికుల్లో ఆందోళన

రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పనిచేసే సీ షిఫ్ట్ సిబ్బందిపై ప్రత్యేకంగా ఈ తనిఖీలు జరగనున్నాయి. ఇప్పటికే వేతనాల చెల్లింపులో జాప్యం, స్వచ్ఛంద విరమణ పథకం (వీఆర్ఎస్) అమలు, కాంట్రాక్ట్ లేబర్ తొలగింపు, అధికారులకు 12 గంటల పని విధానంతో అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా నిర్ణయం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాత్రివేళ ఆకస్మిక తనిఖీలతో సిబ్బంది ఒత్తిడికి గురవుతారని యూనియన్ వర్గాలు అంటున్నాయి. చెకింగుల పేరిట వేధింపులు పెరుగుతాయనే భయం వ్యక్తమవుతోంది. భద్రతా ప్రమాణాల పేరుతో చేపడుతున్న చర్యలు, ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో జిల్లాకో రాజ్యాంగం నడుస్తోంది

- నెల్లూరు మేయర్ ఎన్నిక వెంటనే నిర్వహించండి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘాల ధర్నా

ఎస్ఈసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరు కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు తక్షణం నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట గురువారం గిరిజన సంఘాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా ఏపీ యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ.. గిరిజనులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జిల్లాకు ఒక రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. విశాఖపట్నం మేయర్ ఎన్నికకు పది రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చిన రాష్ట్ర ఎన్నికల కమిషన్, నెల్లూరులో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కాదా? అని నిలదీశారు. రాష్ట్రంలో కులాలను విభజించి పాలిస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. నెల్లూరు మేయర్ ఎన్నికపై ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎందేటి వెంకట సుబ్బయ్య యానాది, గిరిజన ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ఏలికల 'ఎలక'ట్టలేని నిర్లక్ష్యం

ఎ.కొండూరు కేజీబీవీలో విద్యార్థినులపై ఎలుకల దాడి

11 మంది విద్యార్థినులకు గాయాలు

ఎ.కొండూరు: ఎలుకలు కరిచి 11 మంది విద్యార్థినులు గాయపడిన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జరిగింది. విద్యార్థినులు బుధవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో చిమట ప్రసన్న, కావూరి కళావతి, చావల కుమారితో పాటు మరో ఎనిమిది మందిని ఎలుకలు తీవ్రంగా కరిచాయి. దీంతో ప్రిన్సిపాల్ విద్యార్థినిలకు స్థానిక ప్రాథమిక వైద్యశాలలో చికిత్స చేయించారు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు తహసీల్దార్ అరవింద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ కేశవరావు, జీసీడీఓ విశ్వ భారతిని విచారణకు ఆదేశించారు. వారు విద్యాలయాన్ని సందర్శించి ఘటనపై విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్, ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఎలుక కరిచిన విద్యార్థినులను గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ కార్యదర్శి నరెడ్ల వీరారెడ్డి తదితరులు పరామర్శించారు. కేజీబీవీలో సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల స్వాతిని వివరణ కోరగా విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన వాస్తవమేనన్నారు. మొత్తం 11 మందిని కరవగా వారికి టీటీ, ఏఆర్‌వీ వ్యాక్సిన్లు వేశామని వివరించారు.

ఎ.కొండూరు కేజీబీవీలో పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థినులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిన్నారికి వైఎస్ జగన్ అక్షరాభ్యాసం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓ చిన్నారికి అక్షరాభ్యాసం చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం దండు గోపాలపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లెనిన్ వివేక్ తన కుటుంబంతో గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. తమ కుమారుడు భార్గవ్ ప్రకాష్‌కు అక్షరాభ్యాసం చేయాలని కోరారు. వైఎస్ జగన్ ఆ బాలుడికి అక్షరాభ్యాసం చేసి.. ఆశీస్సులు అందజేశారు. దీంతో వివేక్ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో తమ కుమార్తెకు కూడా జగన్ చేతుల మీదుగా అన్నప్రాసన జరిగిందని లెనిన్ తెలిపారు.



అసెంబ్లీలో ఎమ్మెల్యేలు మాట్లాడటానికి ప్రజల నుంచి వచ్చిన ఇష్యూస్ సార్

వైఎస్ జగన్‌పై ఈర్ష్య.. 'సచివాలయం' పదం తొలగింపు

- గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్పు
- స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుగా నామకరణం

సాక్షి, అమరావతి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల ముందుకు తెచ్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నీరుగార్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు మరో అడుగు ముందుకేశారు. సచివాలయం అనే పదాన్ని తొలగిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామ సచివాలయాన్ని 'స్వర్ణ గ్రామ'గా, వార్డు సచివాలయాన్ని 'స్వర్ణ వార్డు'గా మార్పు చేశారు. అదేవిధంగా గ్రామ, వార్డు సచివాలయ శాఖను సైతం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖగా మార్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ బిజినెస్ రూల్స్‌లో మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 2019 అక్టోబర్ 2న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలన్నింటినీ వారి ఇంటి వద్దనే అందించారు. గ్రామ, వార్డు సచివాలయాల పేరును కొనసాగిస్తే వైఎస్ జగన్ గుర్తుకు వస్తారనే ఈర్ష్యతోనే చంద్రబాబు సర్కారు పేర్లను మార్చిందనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వం పేరు మార్చినప్పటికీ ప్రజలందరూ గ్రామ, వార్డు సచివాలయాలనే పిలుస్తారని, పేరు మార్చినంత సులభంగా ప్రజల మనసుల నుంచి ఆ ముద్రను తొలగించలేరని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఎవరు ఏర్పాటు చేశారనేది రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే అభిప్రాయాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేశాయి. చంద్రబాబు గత ప్రభుత్వం పెట్టిన పేర్లను రద్దు చేయడం లేదా మార్పు చేయడం తప్ప ఆ పథకాలను అమలు చేయడం లేదనే విషయం ప్రజలు గుర్తించారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రూ.100కి వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై వెనకడుగు

సాక్షి, అమరావతి: వారసత్వ ఆస్తులను కేవలం రూ.100కే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామని ప్రచారం చేసుకున్న చంద్రబాబు ప్రభుత్వం 3 నెలలు తిరక్కుండానే వెనుకడుగు వేసింది. ఆదాయం తగ్గిపోతుండడంతో చేసేదేమీ లేక పాత విధానాన్నే పునరుద్ధరిస్తూ గురువారం జీఓ జారీ చేసింది. అయితే వ్యవసాయ భూములకు సంబంధించి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రూ.100 రిజిస్ట్రేషన్ కొనసాగుతుందని తెలిపింది. పూర్వీకుల నుంచి సంక్రమించే వ్యవసాయ భూములను విల్లు లేకుండా వారసత్వంగా పంచుకుంటే స్టాంప్ డ్యూటీని తగ్గిస్తూ డిసెంబర్ 5న ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 478 జారీ చేసింది. సంబంధిత భూమి మార్కెట్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే రూ.100, రూ.10 లక్షలకు పైగా ఉంటే రూ.1000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. అదే జీఓలో 2021 నవంబర్‌లో రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పుడు తాజాగా ఆ నిర్ణయాన్ని మార్చుతూ కొత్త ఉత్తర్వులు ఇచ్చింది. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయేతర ఆస్తులను కూడా వారసత్వ వ్యవసాయ భూములుగా చూపించి తక్కువ స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అందుకే రూ.100, రూ.1000కి వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ల విధానాన్ని పాక్షికంగా ఉపసంహరిస్తున్నట్లు తెలిపింది. అందులో రద్దు చేసిన సర్క్యులర్‌ను అమల్లో ఉంచుతున్నట్లు స్పష్టంగా పేర్కొంది. ఆదాయం తగ్గిపోతుండడంతో ఆర్భాటంగా ప్రచారం చేసిన రూ.100కి రిజిస్ట్రేషన్లు చేసే విధానాన్ని ప్రభుత్వం మార్చేయడం గమనార్హం.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

RGM GROUP OF INSTITUTIONS
NANDYAL - 518501, ANDHRA PRADESH.
CONTACT: 9849409495, 9866308423
We invite dynamic and result-oriented professionals to work as Admission Coordinators across various districts of Andhra Pradesh
Responsibilities:
- Student counselling and admission guidance
- Organising admission campaigns and outreach programs
- Achieving district-level admission targets
- Liaison with parents
Eligibility:
- MBA or any PG
- Prior experience in admissions/education marketing preferred
- Good local reach and mobility
Interested candidates may send their updated resume to rgmopportunities@gmail.com
Principal

WANTED
WELFARE OFFICER
at Panasonic Life Solutions India Pvt Ltd
LOCATION: Sri City, Andhra Pradesh.
INDUSTRY: Manufacturing
Eligibility (as per AP Factories Rules)
Graduate from a recognized university, Postgraduate Diploma (minimum 2 years) in Labour Laws / Industrial Relations / HRM / Labour Welfare & Proficiency in Telugu language
KEY RESPONSIBILITIES
Ensure welfare facilities, handle employee grievances and promote industrial harmony & other responsibilities as per AP Factory Rules.
EXPERIENCE
Minimum 3–5 years in similar role preferred
APPLY
Send your resume to manigandan.n@in.panasonic.com within 10 days from the date of publication.
Address of the job location:
Plot No.11800, Central Expressway, Sricity DTZ, Mallavaripallem & Areor Village, Satyavedu Mandal, Tirupati District, Andhra Pradesh – 517646. India.
Contact number:
08576660600 (Landline)

APPOINTMENTS
SAKSHI
SAKSHI DIGITAL

అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవారు...
ప్రజలకు అత్యంత మేలు చేసేవారే!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 13 ఫిబ్రవరి 2026

'కృత్రిమ' ధోరణులపై కొరడా

డిజిటల్ ప్రపంచంలో కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా వేషం మార్చుకుని మోసగిస్తున్న మాయగాళ్ల పనిపట్టడానికి కేంద్రం నడుం బిగించింది. 2021లో తెచ్చిన సమాచార సాంకేతికత(ఐటీ) నిబంధనల్ని సవరిస్తూ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒకప్పుడు వదంతులుగా, లేదా తప్పుడు ప్రచారంగా చలామణీ అయిన ప్రతిదీ ఇప్పుడు అసలుగా భ్రమింపజేసే వీడియోలు, ఆడియోలుగా మారిపోతోంది. ఏది నిజమో, ఏది కాదో తెలుసుకునేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఎన్నికల్లో సామాన్య జనాన్ని ఏమార్చటానికి ప్రయత్నించటం దగ్గర నుంచి... మనుషుల్లో క్రౌర్యాన్నీ, హైన్యాన్నీ, నీచప్రవృత్తినీ ప్రేరేపించే, భావోద్వేగాలను రెచ్చగొట్టే ధోరణి గలవన్నీ డిజిటల్ ప్రపంచంలో స్వైరవిహారం చేస్తున్నాయి. వాటి ప్రభావంతో మనుషులు స్వీయనియంత్రణను కోల్పోయి, మానసిక దుర్బలులవుతున్నారు. కొందరు వ్యామోహాలకు లోనై నిలువుదోపిడీ ఇచ్చుకుంటున్నారు. ఆనక లబోదిబోమంటున్నారు. నిత్యజీవిత ఆచరణ ద్వారా, అధ్యయనం ద్వారా, అనుభవాల ద్వారా ఒక క్రమపద్ధతిలో రావలసిన జ్ఞానాన్ని కృత్రిమ మేధ అడ్డుకుని, వారిలోని విచక్షణను ఆవిరి చేస్తోంది. లింగవివక్ష అధికంగా ఉన్న సమాజాల్లో సహజంగానే మహిళలు ఈ సాంకేతికతల వల్ల బాధితులవుతున్నారు.

ప్రపంచమంతటా ఇప్పుడు డిజిటల్ యుగం నడుస్తోంది. బుడి బుడి నడకల్లో ఉన్న బుడతల దగ్గర్నుంచి, వృద్ధుల వరకూ అందరికందరూ దీని ప్రభావం నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఇందులో పొంచివున్న ప్రమాదాన్ని అందరి కన్నా ముందు పసిగట్టింది యూరోపియన్ యూనియన్(ఈయూ). అది రెండు మూడేళ్లపాటు శ్రమించి 2024లో తెచ్చిన ఈయూ కృత్రిమ మేధ(నియంత్రణ) చట్టం ఉన్నంతలో సమగ్రమైనది. అయితే ఆ చట్టం వచ్చేనాటికి డీప్ లెర్నింగ్ సాంకేతికత బీజప్రాయంలో ఉంది. దాంతో తయారయ్యే నకిలీ(ఫేక్)ని చెప్పడానికి 'డీప్‌ఫేక్' పదం ఇటీవల వాడుకలోకొచ్చింది. సామాజిక మాధ్యమాల్లోని కంటెంట్ వల్ల ఏర్పడగల ప్రమాదతీవ్రత ఆధారంగా ఆ చట్టం వాటిని నాలుగు రకాలుగా – అంగీకారయోగ్యం కానివి, అధిక ప్రమాదంతో కూడుకున్నవి, పరిమితంగా ప్రమాదకరమైనవి, కనిష్ఠ ప్రమాదం ఉన్నవిగా వర్గీకరించింది. మన ప్రభుత్వం ఇప్పుడు రూపొందించిన నిబంధనలు వినియోగదారుడి రక్షణ, దేశభద్రతనూ ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నాయి. ఈ నెల 20 నుంచి అమల్లోకొచ్చే ఆ నిబంధనలు ఇకపై ఏఐ ఆధారంగా రూపొందే ఎలాంటి కంటెంట్‌కైనా ఆ విషయాన్ని స్పష్టంగా సూచించటం తప్పనిసరి చేశాయి. అలాగే అసభ్యకరంగా, అభ్యంతరకరంగా, తప్పుడుగా ఉన్నాయని ప్రభుత్వాలు, లేదా న్యాయస్థానాలు నిర్ధారించి తొలగించమని ఆదేశిస్తే... మూడు గంటల్లో శిరసా వహించాలి. పాక్షిక లేదా పూర్తి నగ్నంగా చిత్రించే ఫొటోలు, వీడియోలు, శృంగార సంబంధిత కంటెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తమైన రెండు గంటల్లోనే తొలగించాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 36 గంటల గడువును వాటి తీవ్రతను బట్టి తగ్గించారు. హానికరమైన, చట్టవిరుద్ధమైన కంటెంట్ ఉన్నపక్షంలో అది తయారు చేసిందెవరో, అప్‌లోడ్ చేసిందెవరో కూపీలాగే ఉపకరణాలను సామాజిక మాధ్యమాలు రూపొందించుకోవటం తప్పనిసరి చేశారు.

అయితే మన ప్రభుత్వం రూపొందించిన విధానం ప్రతిస్పందన ప్రాతిపదికగా ఉంది. రూపొందే కంటెంట్ ఏ పరిమితుల్లో ఉండాలన్నది ఈయూ చట్టం ముందస్తుగా నిర్దేశిస్తోంది. ఏ సామాజిక మాధ్యమమైనా ఉల్లంఘించిన పక్షంలో మన నిబంధనలు క్రిమినల్ కేసులకు మొగ్గుచూపుతుండగా, ఈయూ చట్టం నిర్లక్ష్యం వహించిన సామాజిక మాధ్యమానికి దాని ప్రపంచవ్యాప్త టర్నోవర్‌లో 7 శాతం వరకూ జరిమానా విధిస్తోంది. మారుతున్న సాంకేతికతల్ని ఆసరాగా చేసుకుని ప్రతిరోజూ, ప్రతి నిమిషమూ వచ్చి పడుతున్న కంటెంట్‌ను అరికట్టడానికి నిబంధనలు ఏర్పర్చటం, చట్టాలు రూపొందించటం ఏ దేశంలో పాలకులకైనా పెను సవాలు. అంతకన్నా ముఖ్యం... అవి దుర్వినియోగం కాకుండా చూడటం! కుల, మత, రాజకీయ వివక్షతో సద్విమర్శలను నేరపూరితం చేసే ధోరణులు భావప్రకటనా స్వేచ్ఛను దెబ్బతీస్తాయి. సద్భావంతో చేసే సృజనాత్మ కతకు శాపంగా పరిణమిస్తాయి. బహుపరాక్!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.1.47 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మూల ప.3.55 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.2.09 నుండి 3.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.20 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.50 నుండి 10.34 వరకు, **శుక్రమూఢమి ఆఖరు, మతత్రయ ఏకాదశి.**

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

ప్రతిఫలం



ఒత్తిడి మీ నైపుణ్యానికి ప్రతిఫలం. దానిని ఒక హక్కులా అనుభవించండి. అలా అనుభవిస్తేనే మీరు ప్రత్యేకంగా ఏదైనా చేయగల స్థితిలో ఉంటారు. అసౌకర్యాన్ని స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఒత్తిడి మీకు మేలే చేస్తుంది తప్ప, మిమ్మల్ని నీరసపడనివ్వదు.

– సోమదేవ్ దేవ్‌వర్మన్, మాజీ టెన్నిస్ ఆటగాడు

గౌరవం

మీరు మంచి స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ఎవరైనా మిమ్మల్ని గౌరవిస్తారు. వేరే ఏ కారణంగానూ అది మీకు దక్కదు. మనుషులు మీతో ఇవాళ ఉన్నట్లు రేపు ఉండరు. దానర్థం అంతా మీ శత్రువులు అని కాదు. మీరు స్థిరంగా ఉండాలి.

– శరద్ కపూర్, సినీ నటుడు

న్యాయం

చట్టం బలహీనులకు కవచంగా ఉండాలి తప్పితే, బలవంతుల చేతిలో కత్తి కాకూడదు. న్యాయమూర్తులకు ధైర్యం లేకుండా ఇతర సద్గుణాలు – వివేకం, వివేచన, జ్ఞానం – ఉన్నా అవేవీ బలహీనులకు న్యాయం అందించలేవు.

– జస్టిస్ అజిత్ ప్రకాశ్ షా, లా కమిషన్ మాజీ చైర్మన్

వైకల్యాలు

బలమైన మనస్సు ఉన్న వారిని వైకల్యాలు ఎప్పటికీ ఆపలేవు. నేను నా సామర్థ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టి, నాలోని భౌతికమైన ప్రతికూల అంశాలను పక్కన పెట్టాను. వైకల్యం ఎంతటిదైనా, దాని గురించి బాధపడుతూ ఉండగలిగినంత పెద్దది కాదు జీవితం!

– వరుణ్ సింగ్ భాటి, పారా హైజంపర్

కవిత్వం

ఎవరూ తమ గురించి నిజమైన కథను రాయరని జార్జి ఆర్వెల్ అంటాడు. నిజమైన కథ అంటే, అది అవమానాల కథ. కానీ మీ రహస్య వేదనను మీ రహస్య ఆయుధంగా చేసుకోవటానికి ప్రయత్నించండి. మీ కథను కవిత్వంలో చెప్పుకోండి.

– విజయ్ శేషాద్రి, కవి – 'పులిట్జర్' విజేత

ప్రసంగం

ఆడియెన్స్‌ని ఆకట్టుకోవటం మీ ప్రసంగంలోని మొదటి భాగంలోనే జరిగిపోవాలి. "ఇది వినటం వల్ల నాకు ప్రయోజనం ఏమిటి?" అనే ప్రశ్నకు మొదటి 60 సెకన్లలోనే వారికి సమాధానం తెలిసిపోవాలి. కనుక మీ గురించి మీరు మాట్లాడటం మానేయండి.

– దీప్‌శిఖ కుమార్, 'టెడెక్స్' స్పీకర్

చైనాను బెదరగొడితే చాలు!

విశ్లేషణ

టంకశాల అశోక్

ప్రపంచం దృష్టి వెనిజులా, గ్రీన్‌ల్యాండ్, ఇరాన్ పరిణామాలపై కేంద్రీకృతం అయి ఉండటంతో, అమెరికన్లు మళ్లీ మళ్లీ ప్రకటిస్తున్న ఇండో–పసిఫిక్ వ్యూహం చర్చకు రావటం లేదు. ఈ వ్యూహంలో భారత దేశాన్ని కూడా భాగంగా చేసి చూపుతున్నందున, మౌలికంగా ఆ వ్యూహం ఏమిటో తెలుసుకోవటం అవసరం.

ఆ వ్యూహం ఏమిటో తెలిసేందుకు మూడు డాక్యుమెంట్లను చూడవలసి ఉంటుంది: ఒకటి – 2022 ఫిబ్రవరిలో అప్పటి డెమోక్రటిక్ బైడెన్ ప్రభుత్వం ప్రకటించిన 'ఇండో–పసిఫిక్ స్ట్రాటజీ'. రెండు – 2025 నవంబర్‌లో ప్రస్తుత రిపబ్లికన్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన 'నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ'. మూడు – ఇదే ప్రభుత్వం 2026 జనవరిలో, అనగా గత నెలలో ప్రకటించిన 'నేషనల్ డిఫెన్స్ స్ట్రాటజీ'. వీటన్నింటిలో ఇండో–పసిఫిక్ గురించిన సారాంశం ఈ విధంగా ఉంది. ప్రపంచ వాణిజ్యానికే అతిపెద్ద, అత్యంత క్రియాశీలమైన మార్కెట్ ప్రాంతం ఇది. కనుక అమెరికా భద్రత, స్వేచ్ఛ, సౌభాగ్యాలపై చాలా ప్రభావం చూపుతుంది.

చైనా సవాల్

ఈ ప్రకటనతో ఆరంభించిన అమెరికా వ్యూహం, తమ ప్రయోజనాల పరిరక్షణకు అక్కడ ఏమేమి చేయాలన్న విషయమై చాలానే చెప్పింది: పశ్చిమార్ధ భూగోళాన్ని మన్రో, డోన్రో డాక్ట్రిన్‌లను అనుసరించి పూర్తి నియంత్రణలోకి తెచ్చుకుంటున్నాము. పశ్చిమాసియాలో ప్రయోజనాలు ఇజ్రాయెల్ ద్వారా నెరవేరుతున్నాయి. యూరోపియన్ దేశాలు తమ సహచరులే గనుక, వారు తమ రక్షణ వ్యయాన్ని మాత్రం పెంచి తమతో నిలబడితే సరిపోతుంది. ఆర్కిటిక్‌కు సంబంధించి గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా అధీనంలోకి తెచ్చుకుంటే ఆ సమస్య తీరుతుంది. ఉక్రెయిన్ యుద్ధం తేలిపోతే రష్యాతో పేచీ ఉండదు. పైగా అది ఒక ప్రాంతీయ శక్తి మాత్రమే. ఆ విధంగా ఇక మిగిలేది ఇండో–పసిఫిక్ ఒక్కటే!

ఇండో–పసిఫిక్ మాత్రమే మిగిలి ఉండటం ఎందుకంటే చైనా కారణంగా. మరొక విధంగా చెప్పాలంటే, మొత్తం ప్రపంచపు భౌగోళిక వ్యూహంలోనే అమెరికాకు మిగిలి ఉండగల సమస్య చైనా అన్నమాట. వేరెవరో అనవలసిన అవసరం లేకుండా, వ్యూహ పత్రాలలో అమెరికన్ ప్రభుత్వాలే అరమరికలు లేకుండా చెప్పాయి. చైనా పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, ఆర్థికంగానే గాక సైనిక బలం రీత్యా కూడా ఎదిగి ఇపుడు తమకు పోటీదారుగా మారిందన్నాయి.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్

◆ ట్రంప్ వ్యూహ పత్రాలలో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, చైనా అభివృద్ధికి వారు వ్యతిరేకం కాదు. కానీ అమెరికా అగ్రస్థానానికి మాత్రం చైనా సవాలు కారాదు. ఇందుకోసం ఇండో–పసిఫిక్‌లోని అన్ని దేశాలనూ రక రకాల పేర్లతో ఉపయోగించుకుంటారు.

ఒత్తిడిలో అమెరికా

ఈ స్థితిని ఎదుర్కోవటం ఎట్లాగన్నది ప్రశ్న. మరొక మాటలో చెప్పాలంటే ఈ స్థితిని ఎదుర్కొని అమెరికా అగ్రస్థానాన్ని పదిలపరచుకోవటం, చైనాను ఇంతకుమించి ముందుకు రానివ్వక పోవటం అన్నమాట. రాగల కాలంలో అమెరికన్ వ్యూహాల కేంద్రీకరణ అంతా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉంటుందన్నది స్పష్టం. వాస్తవానికి ఈ ఆలోచనలు కొత్తవి కావు. పశ్చిమాసియాలో ఎదురు దెబ్బల తర్వాత డెమోక్రటిక్ అధ్యక్షుడు ఒబామా(2009–17), ఇక తమ దృష్టి అటునుంచి ఆసియాకు మారాలని ప్రతిపాదించారు. బైడెన్ (2021–25) పైన పేర్కొన్న 'ఇండో–పసిఫిక్ స్ట్రాటజీ'ని ప్రకటించారు. చైనాపై వాణిజ్య, పారిశ్రామిక యుద్ధాలను ట్రంప్ శక్తి మేర సాగించారు. అమెరికా ప్రయోజనాల కోసం ఇండో–పసిఫిక్ విధానమన్నది డెమోక్రటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాల రెండింటి ఉమ్మడి సంప్రదాయం అయింది.

తన మొదటి విడత పాలనా కాలంలో (2017–21) ఏ వ్యూహ పత్రమూ ప్రకటించని ట్రంప్ ఇపుడు ఏడాదిలోనే రెండు పత్రాలు తేవటం గమనించదగ్గది. పదేళ్ల క్రితంతో పోల్చితే అమెరికా బలహీనపడగా, చైనా బలపడింది. అమెరికాపై పలు విధాలైన ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. చైనాను కట్టడి చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆర్థికంగా చూసినట్లయితే వారికి వేర్వేరు దేశాల నుంచి ఇంధనంతో సహా వనరుల సేకరణకు, మార్కెట్లకు, పెట్టుబడులకు ఆటంకాలు కల్పించాలి. వాటిని తమ నియంత్రణలోకి తెచ్చుకుని, ఇంతవరకు వలె గాక రాగల కాలంలో తమ అభివృద్ధిని వేగవంతం చేయాలి. సైన్స్, టెక్నాలజీ ఆధునికీకరణలు, వాటి ఆధారంగా ఆధునిక ఉత్పత్తులు భవిష్యత్తుకు కీలకం అయినందున, ఆ రంగాలలో చైనా పురోగతి ఒక సవాలుగా మారినందున... ఆ విషయమై మరింత దృష్టి పెట్టాలి.

ఎన్ని వ్యూహాలు?

సైనిక విషయాలకు వస్తే వ్యూహ పత్రాలు ఒక సూత్రాన్ని పదే పదే పేర్కొనటం గమనించదగ్గది. అది– చైనాను కట్టడి చేయటమైతే తప్పనిసరి. కానీ యుద్ధం ద్వారా కాదు. ఒక బెదురు అన్నది సృష్టించి నిలువరించటం ద్వారా! బెదురును సృష్టించటం ఏ విధంగా? ఒకటి– ఇండో–పసిఫిక్ ప్రాంతంలోని తమ సైనిక స్థావరాలను (66 అని అంచనా) శక్తిమంతం చేయటం. రెండు– అక్కడి తమ కూటమి దేశాల సైన్యాలను బలోపేతం చేయటం. వారు తమ రక్షణ వ్యయాలను పెంచటం. మూడు– ఒకే చైనా విధానాన్ని కొనసాగిస్తూనే, తైవాన్‌ను తమ రక్షణ వ్యూహం కోసం ఉపయోగించుకోవటం. నాలుగు– జపాన్ నుంచి బోర్నియో వరకు వరుసగా గల మొదటి వరుస దీవులను (ఫస్ట్ ఐలాండ్ ఛెయిన్) దాటి చైనా యుద్ధ నౌకలు పసిఫిక్‌లోకి రాకుండా అడ్డుగోడ వంటిది తయారు చేయటం అన్నది వ్యూహం. దీనంతటి అమలు కోసమే ఇండియాతో కూడిన 'క్వాడ్'ను 2017లో క్రియాశీలం చేసి, 2021లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో కలిసి 'ఆకస్' తదితర సంస్థలు ఏర్పాటు చేశారు.

ట్రంప్ వ్యూహ పత్రాలలో ఆసక్తికరమైన అంశం ఒకటి కనిపిస్తుంది. దాని ప్రకారం, చైనా అభివృద్ధికి వారు వ్యతిరేకం కాదు. కానీ అమెరికా అగ్రస్థానానికి మాత్రం చైనా సవాలు కారాదు. ఇందు కోసం ఇండో–పసిఫిక్‌లోని అన్ని దేశాలనూ రకరకాల పేర్లతో ఉపయోగించుకుంటారు. ఈ వ్యూహాల అమలుకు వచ్చినప్పుడు మాత్రం కొన్ని సమస్యలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతోపాటు ఇండో–పసిఫిక్‌లోనూ అనేక దేశాలు అమెరికా ప్రయోజనాల కోసం ఉపయోగపడేందుకు సిద్ధంగా లేక బహుళ ధ్రువ ఆలోచనలు, అమెరికా–చైనా మధ్య సమతుల్యతల పాటింపు వంటివి చేస్తున్నాయి. ఇండియా కూడా ఈ కోవలోకే వస్తుంది. ట్రంప్ బుల్‌డోజరిజం కెనడా, యూరప్‌లలోనే వ్యతిరేకతను ఎదుర్కొంటూ, ఆ దేశాలు చైనాతో వరుస ఒప్పందాలు చేసు కోవటం ఇందుకు అడ్డం పడుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

కొలీజియంపై ప్రభుత్వ నీలినీడలు

అభిప్రాయం

నన్నూరి వేణుగోపాల్

ఇటీవల పుణేలోని ఐ.ఎల్.ఎస్. లా కాలేజీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చేసిన విమర్శలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 'ప్రభుత్వంలో ఉన్న వాళ్లకి నచ్చని తీర్పులిస్తే బదిలీ చేస్తారా?' అని ఇప్పటి అలహాబాద్ హైకోర్ట్ జడ్జి అతుల్ శ్రీధరన్ 'ఒక నాటి బదిలీ'ని ఉద్దేశించి అన్న మాటలు ఇవి. జస్టిస్ భూయానే కాకుండా జ్యుడీషియరీకి చెందిన ఇంకొందరు కూడా మాట్లాడారు. వాళ్ళలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. మోహన్ గోపాల్ కూడా ఉన్నారు. 'అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా ఉండే న్యాయమూర్తులతో హైకోర్టులను నింపే ప్రయత్నం జరుగుతోంది. న్యాయ వ్యవస్థను ఒక థియోక్రటిక్ సంస్థగా మార్చి, హిందూ రాష్ట్రానికి కీలక స్తంభంగా వేద ఆజ్ఞలను అమలు చేసే దిశగా నడిపించాలనే యత్నం కనిపిస్తోంది' అని ఆయన అన్నారు.

ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశిస్తూ 'ఆమె ఉగ్రవాదుల సోదరి, అలాగే వారి సముదాయానికి చెందిన ఒక మహిళ' అంటూ 2025 మే 12న, మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా అభ్యంతరకరంగా మాట్లాడారు. దానిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీధరన్ సుమోటోగా స్వీకరించి, కేసును నమోదు చేయించారు. దానికి ప్రతీకారంగానే కేంద్ర ప్రభుత్వం

ఆయన్ని బదిలీ చేయించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మొదట ఆయన్ని ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేయాలని నిర్ణయించిన సుప్రీంకోర్టు కొలీజియం, ప్రభుత్వం కోరిన వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకుని అలహాబాద్‌కు పంపింది. ప్రభుత్వం చేసిన అభ్యర్థనను బహిరంగంగా నమోదు చేస్తూ తన నిర్ణయాన్ని పునఃపరిశీలించడం కొలీజియం చరిత్రలోనే అరుదైన, విచారకరమైన ఘటన.

జస్టిస్ శ్రీధరన్ గతంలోనూ పాలకుల కన్నెర్రకు గురయ్యారు. 2020 ఢిల్లీ అల్లర్ల సమయంలో ముగ్గురు బీజేపీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులను ఆయన ప్రశ్నించారు. అలాగే జమ్మూ–కశ్మీర్ హైకోర్టులో ఉన్న సమయంలో 'పబ్లిక్ సేఫ్టీ యాక్ట్' కింద జారీ చేసిన పలు అక్రమ నిర్బంధ ఉత్తర్వులను ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. సీనియారిటీ ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లో నాల్గవ స్థానంలో ఉండాల్సిన ఆయన్ని, కావాలనే ఏడవ స్థానానికి పడిపోయేలా అలహాబాద్‌కు పంపి ఆయన భవిష్యత్తును దెబ్బకొట్టారనీ, ఇలాంటి పరిణామాలు ధైర్యవంతులైన న్యాయ మూర్తులను నిరుత్సాహపరుస్తాయనీ రిటైర్డ్ జస్టిస్ అభయ్ ఎస్. ఓకా కూడా గతంలోనే ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల అధికారం ఎవరి చేతిలో ఉండాలనే చర్చ ఈనాటిది కాదు. బ్రిటన్‌లో లార్డ్ ఛాన్సలర్, అమెరికాలో సెనెట్ ఈ బాధ్యతలు నిర్వహిస్తాయి. కెనడా, జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో స్వతంత్ర కమిషన్లు ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా మోడల్ 11 విభాగాల ప్రతినిధులతో అత్యంత పారదర్శకంగా ఉంటుందని పరిశోధకులు సర్కార్ అలీ అబ్బాస్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ సభలోనూ దీనిపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఏ ఒత్తిడికీ లోబడని స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉండాలని నాటి ఫెడరల్ కోర్టు చీఫ్ జస్టిస్ హెచ్.జె. కానియా నెహ్రూకు లేఖ రాశారు. అంబేడ్కర్ బ్రిటన్, అమెరికా పద్ధతుల్లోని లోపాలను ఎత్తి చూపారు. బ్రిటన్ పద్ధతిలో పారదర్శకత ఉండదనీ, అమెరికా పద్ధతిలో రాజకీయాలకు తలుపులు తెరిచినట్లవుతుందనీ ఆయన హెచ్చరించారు. అందుకే న్యాయవాది తేజ్ బహదూర్ సప్రూ రూపొందించిన సమతుల్య పద్ధతిని రాజ్యాంగ సభ ఆమోదించింది. ఇదే కాలక్రమేణా నేటి కొలీజియం వ్యవస్థగా రూపాంతరం చెందింది.

అన్ని వ్యవస్థలూ తన చెప్పుచేతల్లో ఉండాలని కోరుకునే బీజేపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా తన చేతుల్లో ఉంచుకోడానికి 'జ్యుడిషియల్ నియామకాల జాతీయ కమిషన్ బిల్లు'ను 2014లో ప్రవేశపెట్టింది. రాజ్యసభ ఆమోదించింది. దానికి అనుబంధంగా వచ్చిన 121వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో 180 ఓట్లు పడగా, 179 ఓట్లు అనుకూలంగా వచ్చాయి. కానీ ఆ తరువాత రకరకాల కారణాల చేత ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు కొలీజియం వ్యవస్థే నడుస్తోంది. కానీ అది పరాధీనంగా ఉండిపోయింది. అది జస్టిస్ అతుల్ శ్రీధరన్ బదిలీతో మరొక్కసారి రుజువయ్యింది.

వ్యాసకర్త మానవ హక్కుల కార్యకర్త । 98494 49012

సంఘటనా శక్తికి మారుపేరు

మాధవ సదాశివ గోల్వాల్కర్ యావత్ భారత దేశంలోనూ 'గురూజీ'గా సుప్రసిద్ధులు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘానికి (ఆర్ఎస్ఎస్) 33 సంవత్సరాలు (1906–1973) ద్వితీయ సర్‌సంఘ్‌చాలక్‌గా పని చేస్తూ దాదాపు 66 సార్లు దేశాన్ని చుట్టి వచ్చారు. ఆ క్రమంలో దేశంలోని లక్షలాది మంది తరుణ యువకుల హృదయాల్లో దేశభక్తిని రగుల్కొల్పారు. ఆయన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ జంతు శాస్త్రాన్ని చదివి, మద్రాస్ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరినప్పటికీ ఆర్థిక కారణాల వలన మధ్యలో చదువు నిలిపివేశారు. తదనంతరం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా చేరారు. అనేక అంశాలపై పట్టుగలిగిన ఆయన... విశ్వవిద్యాలయంలో జరిగే అన్ని చర్చలలో చురుకుగా పాల్గొనేవారు. అందుకే గోల్వాల్కర్‌ను అందరూ 'గురూజీ' అని పిలిచేవారు. కాలక్రమంలో ఈ పేరు మీదే ప్రసిద్ధులయ్యారు.



ఎం.ఎస్. గోల్వాల్కర్

ఆనాటి జమ్మూ–కశ్మీర్ రాజు రాజా హరిసింగ్‌ను ఒప్పించి తన రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేయటంలో గురూజీ పాత్ర కీలకం. దేశ విభజన సమయంలో వేలాది హిందువులు పాకిస్తాన్‌లో వివక్షకు గురై ఇల్లు, వాకిళ్లు కోల్పోయి భారతదేశానికి వలస వచ్చారు. వారికి అనేక ప్రాంతాలలో ఆశ్రయం కల్పించడంలో గురూజీ పాత్ర మరువలేనిది.

స్వాతంత్ర్యానంతరం పాకిస్తాన్, చైనాలతో జరిగిన మూడు యుద్ధాలలో ప్రభుత్వానికీ, సైనిక దళాలకీ అండగా ఉండే విధంగా స్వయంసేవకులకు గురూజీ మార్గదర్శనం చేశారు. ఆర్ఎస్ఎస్ సేవలకు ముగ్ధుడైన నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయం సేవకులను రిపబ్లిక్ డే పెరేడ్‌కు స్వయంగా ఆహ్వానించారు. ఆయన సర్‌సంఘ్‌చాలక్‌గా ఉన్న కాలంలోనే ఆర్ఎస్ఎస్‌పై గాంధీజీ హత్య నెపం మోపారు. ప్రభుత్వ నిషేధం విధించింది. అయితే ఈ ఒడుదొడుకులను గురూజీ సమర్థంగా ఎదుర్కొన్నారు.

గురూజీ ఆధ్వర్యంలో తీవ్రమైన ఉద్యమ ఫలితంగానే దేశవ్యాప్తంగా గోహత్యపై నిషేధం అమలులోకి వచ్చింది. భారతీయ జనతా పార్టీ (నాటి భారతీయ జనసంఘ్), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్ , సరస్వతీ శిశు మందిరాలు వంటి దాదాపు 20 సంఘ పరివార్ సంస్థలు గురూజీ ప్రోత్సాహం, మార్గదర్శనంలోనే ప్రారంభం అయ్యాయి. మాతృభూమి సేవకే అంకితమైన గురూజీ జీవితం 1973 జూన్ 5న ముగిసింది. వారి సేవానిరతి అనన్యం.

– ఆచార్య వై.వి. రామిరెడ్డి । శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
(నేడు మాఘ బహుళ ఏకాదశి– గోల్వాల్కర్ జయంతి)

డేటా పాయింట్

ఖరీదైన సందేశం

వినియోగదారులకు అందించిన ఎస్ఎంఎస్ సేవలకుగానూ రుసుముగా 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2023–25) సుమారు రూ. 3,388 కోట్లు వసూలు చేశాయని పార్లమెంట్ డేటా తెలియజేస్తోంది. (2020 నుంచి ఎస్బీఐ ఈ సేవలకు ఛార్జీలు నిలిపివేయడం గమనార్హం.)

వసూళ్లలో టాప్ 6 బ్యాంకులు

బ్యాంకుల వారీగా రుసుము వసూలు చేసిన సొమ్ము (కోట్లలో)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1188.14
కెనరా బ్యాంక్	506.28
పంజాబ్ నేషనల్ బ్యాంక్	360.45
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	308.72
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్	204.89
బ్యాంక్ ఆఫ్ బరోడా	202.42

ఇన్ బాక్స్

సంయమనం అవసరం

శ్రీశైలం కేవలం ఒక దేవస్థానం కాదు, కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక శ్వాస. శైవ పీఠాలలో అగ్రగణ్యమైన క్షేత్రం ఇది. అలాంటి పవిత్ర ప్రాంగణంలో భక్తులపై లాఠీచార్జి జరగడం అనేది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, భక్తుల గౌరవానికి మాయని మచ్చ! దేవాలయానికి వచ్చే భక్తుడు నేరస్థుడు కాదు, భగవంతుని దర్శనార్థం, ఆధ్యాత్మిక శాంతి కోసం వస్తాడు. అటువంటివాడిపై పరిస్థితుల ప్రభావం అని చెప్పి బలప్రయోగం చేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరగాలి. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. భక్తుల విశ్వాసం దెబ్బతినకూడదు. దేవాలయ పవిత్రత చెడకూడదు.

పురాణాలలో, ఇతిహాసాలలో శ్రీశైలానికి ఉన్న ప్రాశస్త్యం అపారం. ఈ క్షేత్రాన్ని దర్శించినవారికి మోక్షప్రాప్తి కలుగుతుందనీ, పాప క్షయమవుతుందనీ శాస్త్రాలు చెబుతాయి. ఆది శంకరాచార్యుల నుంచి అనేక సాధుసంతుల వరకు ఈ క్షేత్రాన్ని మహిమాన్వితంగా కొనియాడారు. అటువంటి ప్రదేశంలో భక్తులను కొట్టడం వారి విశ్వాసాలను దెబ్బతీయడమే! భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమాన హక్కులు, సమాన రక్షణ హామీ ఇస్తుంది. అయితే ఆచరణ ఆ సమానత్వాన్ని ప్రతిఫలించడం లేదు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో విధి నిర్వహించేవారు ప్రత్యేక శిక్షణ పొంది సహన దృక్పథం కలిగి ఉండాలి. శ్రీశైలం వంటి మహాక్షేత్రాల్లో జనసమ్మర్దం సహజం. కాబట్టి ముందస్తు ప్రణాళిక, సరైన క్యూ వ్యవస్థ, సాంకేతిక వనరుల వినియోగం, భక్తులతో మానవీయంగా సంభాషించే వాలంటీర్ వ్యవస్థ వంటి అన్నింటినీ బలోపేతం చేయాలి. సమస్యలు ఏర్పడినప్పుడు మొదటి ప్రత్యామ్నాయం లాఠీ కాకూడదు. చర్చ, హెచ్చరిక, నియంత్రణ చర్యలు... ఇటువంటి ప్రజాస్వామ్య పద్ధతులు అమలు కావాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి.

– పగుడాకుల బాలస్వామి । ధర్మాచార్య సంపర్క ప్రముఖ్, విశ్వ హిందూ పరిషత్, తెలంగాణ

నేటి నుంచి కోటప్ప కొండ తిరునాళ్లు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు అంతా సిద్ధమైంది. మహా శివరాత్రి రోజున నిర్వహించే తిరునాళ్లకు రెండు రోజుల ముందు ఏకాదశి నుంచే కోటప్పకొండలో భక్తుల రద్దీ ప్రారంభమవుతుంది. మూడు రోజుల్లో లక్షలాది మంది భక్తులు కోటప్పకొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకుని శివరాత్రి జాగరణ చేస్తారు. గత ఏడాది శివరాత్రి రోజున 1.20 లక్షల మంది త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ ఏడాది 1.50 లక్షల మంది దర్శించుకుంటారని అంచనా వేస్తున్నారు. కొండ దిగువన జరిగే జాతర మహోత్సవంలో 15 నుంచి 20 లక్షల మంది పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్యార్థినికి మత్తు సూది గుచ్చిన ఆగంతకులు

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థినికి ఇద్దరు ఆగంతకులు మత్తు మందు సూదితో గుచ్చి పరారయ్యారు. పాఠశాలకు వెళ్లిన తరువాత విద్యార్థినికి మైకం, చేయి నొప్పిగా ఉండడంతో పాఠశాల సిబ్బంది గుర్తించి బాలికను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విద్యార్థినిని విచారించగా మార్గమధ్యలో కొత్తపేట సమీపంలో ద్విచక్ర వాహనంపై మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు తన చేతికి ఇంజెక్షన్ గుచ్చి పారిపోయినట్లు తెలిపింది. బాలిక నరసరావుపేట రోడ్‌లోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పాఠశాలకు వచ్చే సమయంలో ఈ ఘటన జరిగింది.

శివభక్తులకు మంత్రులు క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ డిమాండ్

సాక్షి, అమరావతి: శ్రీశైలం పుణ్యక్షేత్రంలో శివస్వాములు, భక్తులపై పోలీసుల లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ హోంశాఖ, అటవీ, దేవదాయ శాఖల మంత్రులు బహిరంగ క్షమాపణలు కోరాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 41 రోజుల కఠిన దీక్షలు పూర్తిచేసుకుని కాలినడకన 40 కిలో మీటర్లకు పైగా నడిచొచ్చిన శివస్వాములకు వేగంగా దర్శనం చేయించి పంపించాల్సిందిపోయి.. వేల మందిని గంటలకొద్దీ కంపార్ట్‌మెంట్లలో కుక్కి వేధించారని ఆరోపించారు. భక్తులకు కనీసం మంచినీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఆలయాల్లో వరుస దుర్ఘటనలు జరుగుతున్నా ఈ ప్రభుత్వం మేల్కోవడంలేదని మండిపడ్డారు. క్యూలైన్లలో ఉండలేక మహిళా భక్తులు గోడలు దూకి బయటకొస్తున్న వీడియోలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయన్నారు. సాక్షాత్తు ఏఎస్పీనే మాల ధరించిన శివ భక్తులపై లాఠీలు ఝుళిపించడం హిందూ ధర్మాన్ని అవమానించడమేనన్నారు. శ్రీశైలంలో భక్తులపై లాఠీచార్జి చేసిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని శివశంకర్ డిమాండ్ చేశారు.

లడ్డూ వివాదంపై అనవసర చర్చలు ఆపండి

తిరుమల: తిరుమల లడ్డూ వివాదంపై రాజకీయ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గురువారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడారు. ఈ అంశంలో దేవుడిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం తప్పు అని హెచ్చరించారు. రాజకీయాల కోసం కోట్లాది మంది భక్తులను మనోవేదనకు గురి చేయొద్దని సూచించారు.

శ్రీశైలంలో మద్యం బాటిళ్లు, సారాయి పట్టివేత

ఐదుగురిపై కేసులు నమోదు

పవిత్ర పుణ్యక్షేత్రంలో వరుస ఘటనలు

మోటార్ సైకిల్ ట్యూబ్‌లో దాచిన మద్యం బాటిళ్లు

పట్టుబడిన మద్యం బాటిళ్లు, సారాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

శ్రీశైలం: పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైలం దేవస్థానం పరిధిలో వరుస ఘటనలు భక్తులను కలవర పెడుతున్నాయి. తాజాగా గురువారం శ్రీశైలం పరిధిలో ఉన్న కొత్తపేట, మేకలబండ తదితర ప్రాంతాల్లో మద్యం బాటిళ్లు, సారా పట్టుబడ్డాయి. జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు, సారాయి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు ఆధ్వర్యంలో సీఐ మోహన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. కొత్తపేటకు చెందిన నల్లబోతుల వెంకటయ్య, మల్లమ్మ వద్ద నుంచి 18 లీటర్ల సారా, నాగరాజు నాయక్ ఇంటి వద్ద తెలంగాణకు చెందిన 49 మద్యం బాటిళ్లు, మేకలబండకు చెందిన కుడుముల వీరమ్మ ఇంటిలో 15 మద్యం బాటిళ్లు, లక్ష్మీదేవి ఇంటి సమీపంలో మోటార్ సైకిల్ ట్యూబులో దాచిన 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది మద్యం అమ్మకాలపై నిఘా ఉంచినట్లు సీఐ తెలిపారు. మద్యం బాటిళ్లు, సారాయి కలిగి ఉన్న ఈ ఐదుగురిపై దేవదాయ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు.

కప్పం కడితేనే దుకాణాలకు అనుమతి

కోటప్పకొండ రైతులకు టీడీపీ ఎమ్మెల్యే చదలవాడ అనుచరుల బెదిరింపులు

- రూ.5 లక్షలు ఇస్తేనే శివరాత్రి ఉత్సవాల్లో దుకాణాలు పెట్టుకోండంటూ హుకుం
- లేదంటే ధ్వంసం చేస్తామని బెదిరింపులు
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- చేసేది లేక కోటప్పకొండ తిరునాళ్ల ప్రదేశంలో ధర్నాకు దిగిన రైతులు

ఆందోళనకు దిగిన రైతులు

నరసరావుపేట రూరల్: 'మేం అడిగినంత ఇస్తేనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. మాకు తెలియకుండా ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తాం' అంటూ పల్నాడు జిల్లా కోటప్పకొండలోని రైతులను, దుకాణాదారులను నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అనుచరులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే చదలవాడను బాధిత రైతులు కలిసి గోడును వెళ్లబోసుకోగా.. తన అనుచరులు చెప్పినట్టు చేయాలని ఆయన చెప్పడంతో రైతులు కోటప్పకొండలో ఆందోళనకు దిగారు. టీడీపీ, జనసేన జెండాలతో టెంట్ ఏర్పాటు చేసుకుని న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్లకు లక్షలాది మంది తరలివస్తారు. యాత్రికుల కోసం కొండ దిగువన జాతర జరిగే ప్రదేశంలో దుకాణాలు, వినోదం కోసం జెయింట్ వీల్ వంటివి తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారు. తమ భూముల్లో దుకాణాలు పెట్టుకున్నందుకు వ్యాపారుల నుంచి రైతులు కొంత మొత్తాన్ని అద్దె రూపంలో తీసుకుంటారు. ఈ మొత్తంలోనే కొంత గ్రామ పంచాయతీకి పన్నుగా చెల్లించేవారు. అయితే.. రెండేళ్లుగా తిరునాళ్లలో నిర్వహించే దుకాణాలపై టీడీపీ నాయకుల కన్ను పడింది. ఎమ్మెల్యే అనుచరుడు, తెలుగు యువత నాయకుడు నాగూర్‌మీరా గత ఏడాది దుకాణాదారులు, జెయింట్ వీల్ నిర్వాహకుల నుంచి రూ.5 లక్షలు వసూలు చేశారు. ఈ ఏడాది కూడా రూ.5 లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు. మంగళవారం రాత్రి జెయింట్ వీల్ నిర్వాహకులు సామగ్రితో కొండకు చేరుకోగా.. నాగూర్‌మీరా అనుచరులు అడ్డుకోవడంతో రైతులు నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 'మా భూముల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే మీకెందుకు డబ్బులివ్వాలి' అని రైతులు నిలదీశారు. 'మీకు దిక్కున్నచోట చెప్పుకోండి. మాకు డబ్బులు ఇవ్వాల్సిందే' అని ఎమ్మెల్యే అనుచరులు హెచ్చరించారు. దీంతో రైతులంతా ఎమ్మెల్యే చదలవాడను కలిసి గోడు వెళ్లబోసుకోగా.. నాగూర్‌మీరా చెప్పినట్టే చేయాలని ఎమ్మెల్యే బదులిచ్చారు. దీంతో చేసేదిలేక రైతులంతా కోటప్పకొండకు చేరుకుని జాతర జరిగే స్థలంలో ఆందోళనకు దిగారు. టీడీపీ, జనసేన జెండాలతో టెంట్ ఏర్పాటు చేసుకుని న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. 'మేమంతా టీడీపీ, జనసేన అభిమానులమే. టీడీపీ కూటమి విజయం కోసం కృషి చేసిన మాకే ఇలా అన్యాయం చేస్తే ఎలా' అని ప్రశ్నించారు.

కుక్కల్ని లెక్కెట్టండి!

సచివాలయ ఉద్యోగులకు కొత్త టాస్క్

Mahila Police Duties Shift wise at Sri Sri Sri Sangameswara Swamy Temple, Sangam Village from 14.02.2026 to 21.0[illegible]

S.No	Date	Shift-1 (6.00AM to 02.00PM)	Shift-2 (02.00PM to 10.00PM)	Shift-3 (10.00PM-06.00[illegible]
1	14.02.2026	—	—	TANKALA DURGA BHAVA[illegible] Mahila Police, Mobile N[illegible] 9963400157
2	15.02.2026	CHINTALURI CHIRANJEEVI LAKSHMI, Mahila Police, Mobile No: 8185012122	BUDI LAVANYA, Mahila Police, Mobile No: 8639665979	ENAMALA GOWREESWA[illegible] Mahila Police, Mobile N[illegible] 7995193112
3	16.02.2026	NADIMINTI RAMACHARRI, Mahila Police, Mobile No: 9492237055	CHOKKAPU SANDHYA RANI, Mahila Police, Mobile No: 9381737342	CHOUDARI ASHALATHA Mahila Police, Mobile N[illegible] 9390887337
4	17.02.2026	NEDIRA SRILATHA, Mahila Police, Mobile No: 7780698134	ALIVELUMANGA NADIMINTI, Mahila Police, Mobile No: 9391852332	ALLINA KRISHNAVENI, Ma[illegible] Police, Mobile No: 9573[illegible]
5	18.02.2026	YENUGUTALA RUPAVATI, Mahila Police, Mobile No: 8008278056	JALAKA JANAKHI, Mahila Police, Mobile No: 7702990823	KAARAMSETTI PRABHA, M[illegible] Police, Mobile No: 8500590[illegible]
6	19.02.2026	MUDIDADA NAGAMANI, Mahila Police, Mobile No: 8179144610	SASAPU SAILAJA, Mahila Police, Mobile No: 9346769361	TANKALA DURGA BHAVAN[illegible] Mahila Police, Mobile No 9963400157
7	20.02.2026	CHINTALURI CHIRANJEEVI LAKSHMI, Mahila Police, Mobile No: 8185012122	BUDI LAVANYA, Mahila Police, Mobile No: 8639665979	ENAMALA GOWREESWAR[illegible] Mahila Police, Mobile No 7995193112
8	21.02.2026	NADIMINTI RAMACHARRI, Mahila Police, Mobile No: 9492237055	CHOKKAPU SANDHYA RANI, Mahila Police, Mobile No: 9381737342	CHOUDARI ASHALATHA, Mahila Police, Mobile No: 9390887337

Mandal Parishad Development Officer, Mandal Praja Parishad, VANGARA

సచివాలయ ఉద్యోగులకు శివరాత్రి ఉత్సవాల విధులు కేటాయిస్తూ వంగర ఎంపీడీఓ ఇచ్చిన ఉత్తర్వులు

సాక్షి, పార్వతీపురం మన్యం/వంగర: చంద్రబాబు ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. వివిధ సర్వేలతో పని ఒత్తిడికి గురిచేయడం, సదుపాయాలు సమకూర్చకపోవడం, వారు చేయాల్సిన పనులు కాకుండా ఇతర పనులు అప్పగించడంతో వారంతా రోడ్లెక్కి ఆందోళనలు చేశారు. వేధింపులు భరించలేక కొందరు తనువు చాలించారు. అయినా పట్టించుకోని ప్రభుత్వం వారికి కొత్తకొత్త పనులు అప్పగిస్తూనే ఉంది. తాజాగా.. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీలో వీధి కుక్కలు ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టాలంటూ సచివాలయాల్లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మున్సిపల్ ఉన్నతాధికారులు కొత్త టాస్క్ ఇచ్చారు. ఈ ఆదేశాలపై వార్డు ఉద్యోగులు భగ్గుమంటున్నారు. తాము చదువుకున్న చదువేమిటి.. చేస్తున్న పని ఏమిటో తెలియక ఉద్యోగులు అసంతృప్తికి లోనవుతున్నారు. ఇదెక్కడి ఉద్యోగం బాబోయ్ అంటూ తలలు పట్టుకుంటున్నారు.

ఇక్కడితో అయిపోలేదు: విజయనగరం జిల్లా వంగర మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏటా శివరాత్రి రోజున జరిగే ఉత్సవాలకు ఈ ఏడాది సచివాలయ ఉద్యోగులకు డ్యూటీలు వేయడం విమర్శలకు తావిస్తోంది. చీపురుపల్లి ఆర్డీవో ఆదేశాల మేరకు మండల పరిషత్ నుంచి 32 మంది, రెవెన్యూ శాఖ నుంచి ఏడుగురు వీఆర్‌ఓలకు సంగాంలో డ్యూటీలు వేశారు. గతంలో ఎన్నడూ వీరిని విధుల్లో వినియోగించకపోగా, తాజాగా ఎంపీడీఓ, తహసీల్దార్ 12న ఆర్‌సీ నెం.20–2026–బి పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14నుంచి 21వరకు ఎవరెవరు ఏఏ షిఫ్టులలో విధులకు హాజరు కావాలో అందులో పేర్కొన్నారు. సచివాలయ మహిళా ఉద్యోగులకు రాత్రి షిఫ్టులు వేయడంపై భగ్గుమంటున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ నెల 15నుంచి 21 వరకు మహిళా పోలీసులకు విధులు కేటాయించారు. విధులకు డుమ్మా కొడితే బాధ్యతారాహిత్యం కింద చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీశైల మల్లన్నకు పాగా సిద్ధం

- నియమ నిష్టలతో తయారుచేసిన పృథ్వీ సుబ్బారావు కుటుంబ సభ్యులు
- జాండ్రపేట హస్తినాపురం నుంచి పాగా తీసుకుని శ్రీశైలం పయనం

శ్రీశైల శిఖరాన అలంకరించిన పాగా

శ్రీశైలం టెంపుల్: మహా శివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో మల్లికార్జునుడిని పెళ్లి కొడుకుగా సిద్ధం చేసే సమయాన తలపై చుట్టేందుకు పాగా సిద్ధమైంది. దేశంలో ఏ శైవక్షేత్రంలోనూ లేని విధంగా శ్రీశైలంలో మాత్రమే మల్లన్నకు పాగా అలంకరణ ఉంటుంది. ప్రకాశం జిల్లా చీరాల మండలం జాండ్రపేట హస్తినాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం వంశపారంపర్యంగా మల్లన్న తలపాగా తయారు చేసి చుడుతోంది. గ్రామానికి చెందిన కందస్వామి, వేంకట సుబ్బారావు హయాంలో పాగా వస్త్రం తయారీకి ఒక ప్రత్యేక మగ్గాన్ని ఏర్పాటు చేసి నేసేవారు. రోజుకో మూర చొప్పున 300 రోజులు 300 మూరలు నేసేవారు. మహా శివరాత్రి పర్వదినానికి 15 రోజుల ముందు వస్త్రాలతో శాస్త్రోక్తంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శ్రీశైలం బయలుదేరి మల్లన్నకు పాగా చుట్టేవారు. ప్రస్తుతం వారి వారసుడు పృథ్వీ సుబ్బారావు కుటుంబ సభ్యుల సహకారంతో కార్తీకమాసంలో మంచి రోజు చూసుకుని పాగా వస్త్రం నేతను ప్రారంభిస్తున్నారు. శివరాత్రికి పది రోజుల ముందు 300 మూరలు పూర్తయ్యే విధంగా ప్రణాళిక తయారు చేసుకుని స్వచ్ఛమైన తెల్లటి దారాన్ని వినియోగించి పాగా వస్త్రాన్ని నేస్తున్నారు. పాగా నేత పూర్తయ్యే వరకూ శాకాహారమే తీసుకుంటూ నియమ నిష్టలను పాటిస్తారు. ఒక పూట మాత్రమే భోజనం చేస్తూ... నేలపై నిద్రిస్తూ నిత్యం శివనామస్మరణ చేస్తారు.

ఆలయ మర్యాదలతో స్వాగతం

ఈ ఏడాది సిద్ధం చేసిన పాగాను తీసుకుని జాండ్రపేట హస్తినాపురం నుంచి పృథ్వీ సుబ్బారావు కుటుంబ సభ్యులు శ్రీశైలం బయలుదేరారు. వీరు శుక్రవారం స్వామి క్షేత్రానికి చేరుకుని ఈ నెల 15న మహా శివరాత్రిని పురస్కరించుకుని శివయ్యకు సమర్పిస్తారు. పృథ్వీ సుబ్బారావు కుటుంబానికి శ్రీశైల దేవస్థానం నుంచి ఏటా ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని దేవస్థాన అధికారులు అందజేస్తారు. పాగా వస్త్రంతో వచ్చే వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి... భోజనం, వసతి, ప్రత్యేక దర్శనాలతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాన్ని కూడా అందజేస్తారు. పాగా నేసేందుకు నెలకు రూ.6వేల చొప్పున అందజేయడంతో పాటు, మహాశివరాత్రి నాడు పాగా చుట్టిన తర్వాత రూ.50వేల ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తున్నారు.

శివ భక్తులపై పోలీసుల లాఠీచార్జి శోచనీయం

- రద్దీని అంచనా వేయకపోవడం ప్రభుత్వ శాఖల వైఫల్యమే
- కనీసం శివరాత్రికైనా సరైన మౌలిక వసతులు కల్పించాలి
- వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు (దక్షిణాంధ్ర) నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): శ్రీశైలంలో మూడు రోజుల క్రితం కఠోర దీక్షలో ఉన్న శివ స్వాములపై పోలీసులు లాఠీచార్జి చేయడం శోచనీయమని, ఈ చర్యను వీహెచ్‌పీ ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు(దక్షిణాంధ్ర) నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఎంతమంది భక్తులు వస్తారనే అంచనా వేయడం, కనీస సదుపాయాలు కల్పించడంలో దేవదాయ, పోలీసు, ఇతర శాఖల మధ్య సమన్వయం లేకపోవడాన్ని ప్రభుత్వ వైఫల్యంగా భావిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఆయన కర్నూలులోని వినాయక ఘాట్‌లో వినాయక స్వామి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో శివ స్వాముల పాదయాత్రకు 14 రోజులపాటు అనుమతి ఇచ్చేవారని, ఈసారి పులుల గణనతో కేవలం ఏడు రోజులే అనుమతివ్వడం, స్పర్శ దర్శనానికి కూడా ఐదు రోజులే సమయం ఉండటంతో భక్తులు ఒక్కసారిగా తరలివచ్చారని పేర్కొన్నారు. భక్తుల రద్దీని అంచనా వేయడంలో ప్రభుత్వ శాఖలు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. కనీస సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. అధికారులు ఎక్కువగా వీఐపీ దర్శనాలకు అనుమతివ్వడంతో స్వాములు ఇబ్బంది పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు శ్రీశైలం బ్రహ్మోత్సవాల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతాధికారులు, హిందూ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించాల్సి ఉన్నా అది జరిగిందో లేదో అర్థం కావడంలేదన్నారు. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న శివరాత్రి వేడుకలకైనా సరైన సదుపాయాలు కల్పించి భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సాయిరెడ్డి కోరారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భాను ప్రకాష్ మాట్లాడుతూ వచ్చిన భక్తులకు భద్రత, సౌకర్యాలు కల్పించే విషయంలో శ్రీశైల ఆలయ కమిటీ, అధికారులు ఎందుకు అంత నిర్లక్ష్యంతో ఉన్నారో పోలీసులు, ఆలయ ఈఓ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా శివస్వాములపై లాఠీచార్జి చేసిన పోలీసులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో అందరూ సంయమనం పాటించాలని కోరారు. విలేకరుల సమావేశంలో ప్రతాప్‌రెడ్డి, సందడి మహేశ్వర్, ఈపూరి నాగరాజు, తుంగా రమేష్ పాల్గొన్నారు.

మహాక్రతువులో పొరపాట్లు జరుగుతుంటాయి

దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

శ్రీశైలం టెంపుల్: మహాక్రతువులు జరిగేటప్పుడు కొన్ని పొరపాట్లు జరుగుతుంటాయని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీశైలం దేవస్థానంలో జరిగిన పొరపాట్లను పరోక్షంగా ఒప్పుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామికి గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 41 శైవక్షేత్రాల్లో కలెక్టర్లు, ఎస్పీల పర్యవేక్షణలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాక్రతువు జరిగేటప్పుడు ధర్నాలు, నిరసనలు జరుగుతుంటాయని, వాటిని సరిచేసుకుని ముందుకు పోతుంటామన్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 9న జరిగిన శివస్వాముల ధర్నాలు, నిరసనలపై కలెక్టర్, శ్రీశైల దేవస్థాన చైర్మన్, పాలకమండలి, ఈఓతో చర్చించామన్నారు. అయితే శివస్వాములపై ఏఎస్పీ లాఠీచార్జ్ విషయాన్ని మీడియా ప్రశ్నించగా మంత్రి మౌనంగా వెళ్లిపోయారు.

ఉపాధ్యాయురాలిపై కత్తితో దాడి

బంగారు చైన్ లాక్కొని పరారీ

బాధితురాలి పరిస్థితి విషమం

ఉపాధ్యాయురాలి నుంచి వివరాలను సేకరిస్తున్న పోలీసులు

చిల్లకూరు: ఉపాధ్యాయురాలిపై ఓ ఆటో డ్రైవర్ కత్తితో దాడి చేసి బంగారు చైన్ లాక్కుని ఉడాయించిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అశోక్‌నగర్‌లో హరిత అనే ఉపాధ్యాయురాలు తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. ఆమె తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం గొట్టికాడులోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. గురువారం ఎప్పటిలాగే పట్టణంలోని కోర్టు సెంటర్ వద్ద ఆటోలో బయల్దేరారు. ఆటోలో ఉపాధ్యాయురాలు మాత్రమే ఉండటంతో ఇదే అదనుగా భావించిన చెన్నూరుకు చెందిన డ్రైవర్ వెంకట రమణయ్య మార్గంమధ్యలో చెమిర్తి వద్ద నిర్మానుష్య ప్రాంతంలో వాహనం నిలిపి, ఉపాధ్యాయురాలిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఆటోను అక్కడే వదిలి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయురాలిని సమీప గ్రామస్తులు గమనించి గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని ఆమె నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

రావణ వాహనంపై భ్రమరాంబ, మల్లికార్జున స్వామి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఐదో రోజు గురువారం భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామికి రావణవాహన సేవ నిర్వహించారు. ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని అలంకార మండపంలోకి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చి రావణవాహనంపై ఆశీనులను చేశారు. ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వేలాది మంది భక్తులు కనులారా దర్శించుకున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు శుక్రవారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకి సేవోత్సవం, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

స్కూల్ వద్ద మృతదేహంతో ఆందోళన (ఇన్‌సెట్‌లో) సుధీర్ (ఫైల్)

నెల్లూరు సిటీ : మనస్తాపంతో ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలంలో చోటుచేసుకుంది. ఈ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు పంచాయతీలో గల ఓ ప్రైవేటు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదువుతున్నాడు. ఈ క్రమంలో పాఠశాలలోని ఓ టీచర్ వద్ద నగదు అపహరించాడనే ఆరోపణతో మూడు రోజులు క్రితం మందలించి కొట్టడంతో బాలుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తల్లి బుధవారం ఉదయం వెళ్లగా, బాలుడు ఇంట్లోనే ఉన్నాడు. ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తోటపల్లి గూడూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. మరోవైపు విద్యార్థి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమంటూ తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాలు ఆరోపించారు. ఈ మేరకు మృతదేహంతో పాఠశాల ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటలపాటు ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పోలీసులను భారీగా మోహరించారు.

చంద్రబాబు సీఎం కుప్పానికా.. రాష్ట్రానికా?

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారెడ్డి సూటి ప్రశ్న

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు ముఖ్యమంత్రి కేవలం కుప్పం నియోజకవర్గానికేనా.. లేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికా... అని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పులిపాటి దుర్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు సర్కార్ ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎక్కడా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని చెప్పారు. కానీ, కుప్పం నియోజకవర్గంలో మాత్రమే 3,500 కొత్త పింఛన్లు మంజూరు చేశారని వివరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను ఒకేవిధంగా చూడాలన్నారు. రాజమహేంద్రవరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం దుర్గారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం–2016ను అమలు చేయాలన్నారు. దివ్యాంగుల కోసం చంద్రబాబు ప్రకటించిన 'ఇంద్రధనస్సు–7 వరాలు' అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. దివ్యాంగులకు డిసెంబర్‌లో ఉచిత బస్సు పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, మూడు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. సదరం సర్టిఫికెట్ ఇచ్చే క్రమంలో వైకల్య శాతం తగ్గించి దివ్యాంగులను సంక్షేమ పథకాలకు అనర్హులుగా చేస్తున్నారని దుర్గారెడ్డి ఆరోపించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర, ఉపాధ్యక్షుడు కోలాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి పాత మెట్ల వద్ద జంతుబలికి యత్నం

అడ్డుకున్న అర్చకులు, శానిటేషన్ సిబ్బంది

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని దుర్గగుడి పాత మెట్ల మార్గం వద్ద జంతువును బలి ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాన్ని ఆలయ అర్చకులు, శానిటేషన్ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ ఘటన గురువారం దుర్గగుడిలో కలకలం సృష్టించింది. మహాశివరాత్రి సందర్భంగా ఓ కుటుంబం అమ్మవారి సంబరం చేసుకుంటూ ఊరేగింపుగా కనకదుర్గనగర్ మీదగా శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి మహా మండపం వద్దకు చేరుకుంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాత మెట్ల మార్గం ఎదుట మేక, కోడిని కోసేందుకు వారు ప్రయత్నించారు. వినాయకుడి గుడిలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, శానిటేషన్ సిబ్బంది గుర్తించి, అడ్డుకున్నారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులను తప్పించుకుని మేకను, కోడిని మహా మండపం వరకు ఏ విధంగా తీసుకెళ్లారనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనకదుర్గ నగర్, ప్రసాదాల కౌంటర్లు, గోశాల, మహా మండపం వద్ద ఉన్న నాలుగు సెక్యూరిటీ పాయింట్లను దాటుకుని పాత మెట్ల వరకు జంతువులను తీసుకువెళ్లడంతో భక్తులు విస్మయానికి గురయ్యారు.

మరో 114 రఫేల్ యుద్ధ విమానాలు

రూ.3.6 లక్షల కోట్లతో సమీకరణ ప్రతిపాదనకు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం

- నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరిరానున్న 18 విమానాలు
- మిగతావి భారత్‌లో దేశీయంగా తయారీ
- దేశీయ రక్షణ రంగ అభివృద్ధికి ఊతం
- వివరాలు వెల్లడించిన రక్షణ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ: అధునాతన యుద్ధ విమానాలతో దేశ సరిహద్దులను, గగనతలాలను శత్రు దుర్భేద్యంగా చేసే లక్ష్యంగా భారత రక్షణ మంత్రిత్వ శాఖ అదనంగా 114 రఫేల్ ఫైటర్‌జెట్‌లను కొనుగోలుచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.3.6 లక్షల కోట్లతో రూపొందించిన కొనుగోలు ప్రతిపాదనలను గురువారం రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని రక్షణ శాఖ మంత్రి పరిధిలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి(డీఏసీ)'ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 18 యుద్ధ విమానాలను ఫ్రాన్స్‌లోనే తయారుచేసి భారత్‌కు సరఫరాచేయనున్నారు. మిగతా 96 విమానాలను భారత్‌లో తయారుచేయనున్నారు. వీటిల్లో సగానికిపైగా విమానాలను దశలవారీగా దేశీయంగా తయారు చేసిన విడిభాగాలతో రూపొందించనున్నారు. ఇందుకోసం దేశీయంగా అనుబంధ కర్మాగారాలను నెలకొల్పడంతో దేశీయ రక్షణరంగ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందనుంది. రఫేల్ విమానాలతో పాటు అత్యంత ఎత్తులో తిరిగే సూడో శాటిలైట్(ఏఎస్–హెచ్ఏపీఎస్)లనూ కొనుగోలుచేయనున్నారు. సూడో శాటిలైట్లు సౌరఫలకాలతో పని చేస్తూ నిఘా, పర్యవేక్షణ, కమ్యూనికేషన్ సేవలను అందిస్తాయి. మరో నాలుగురోజుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటన మొదలుకానున్న వేళ ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ ఏవియేషన్‌తో ఒప్పందం కుదరబోతుండటం విశేషం. దసాల్ట్ సంస్థలో దాదాపు 10 నెలలపాటు విస్తృతస్థాయిలో చర్చలు జరిపాక ఈ ఏడాది చివరిలోపు సమగ్రస్థాయిలో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. విమానాలతోపాటు వాటిలోని విడిభాగాల తయారీకి సంబంధించిన సాంకేతికత బదిలీ వంటి అంశాలపై కూలంకషంగా చర్చించాల్సి ఉంది. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఎస్) ఆమోదం పొందాల్సి ఉంది. ''అదనపు విమానాలతో భారతవాయుసేన.. సరిహద్దుల వంటి ఉద్రిక్త ప్రాంతాల్లో దాడి సామర్థ్యాలు ద్విగుణీకృతమవుతాయి. వీటితోపాటు కొనే శక్తివంత క్షిపణులు సుదూరాల్లోని శత్రు స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడిచేసే సత్తాను పెంచుతాయి. ఒక సూడో ఉపగ్రహాలు అనేవి 30 కిలోమీటర్ల ఎత్తులో స్ట్రాటో ఆవరణలో చక్కర్లు కొడుతూ శత్రు స్థావరాలపై నిఘా, పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ ఇంటెలిజెన్స్, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సేవలను అందిస్తాయి''అని రక్షణ శాఖ తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆనాడు రూ.1.63 లక్షల కోట్లతో మొదలై..

2015లో మోదీ ప్రభుత్వం భారత వాయుసేనలోని స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గిపోతోందని, వీటిని అత్యాధునిక యుద్ధవిమానాలతో భర్తీచేయాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు భారత్‌కు 36 రఫేల్ విమానాలను సరఫరాచేసింది. ఇవి ప్రస్తుతం భారత వాయుసేన స్క్వాడ్రాన్‌లో సేవలందిస్తున్నాయి. గతంలోనూ 114 బహుళ ప్రయోజనకర యుద్ధ విమానాలు(ఎంఆర్ఎఫ్ఏ)లు తమకు అవసరమని భావించి వాయుసేన రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్(టెండర్)ను జారీచేసింది. అప్పట్లో అది ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధాల కొనుగోలు ఒప్పంద ప్రతిపాదనల్లో ఒకటిగా రికార్డ్‌కెక్కింది. ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకునేందుకు దసాల్ట్ ఏవియేషన్‌తోపాటు అమెరికాకు చెందిన లాక్‌హీల్డ్ మార్టిన్, బోయింగ్, యూరోఫైటర్ కంపెనీలు పోటీపడ్డాయి. భారత్‌కు రఫేల్ విమానాలు విక్రయించేందుకు దసాల్ట్, ఎఫ్–21లను అమ్మేందుకు లాక్‌హీల్డ్ మార్టిన్, టైఫూన్ జెట్‌లను విక్రయించేందుకు యూరోఫైటర్ సంస్థలు ఆసక్తి చూపించాయి. గరిష్టంగా 42 స్క్వాడ్రాన్‌లకు అనుమతి ఉండగా 31 స్క్వాడ్రాన్లను కొనుగోలుచేయాలని రక్షణశాఖ భావించింది.

సైన్యం, నేవీ కోసమూ కొనుగోళ్లు..

భారత సైన్యం కోసం దేశీయంగా తయారైన వైభవ్ ట్యాంక్ విధ్వంసక మందుపాతరలు, యుద్ధట్యాంక్‌లను తరలించే ఆర్మ్డ్ రికవరీ వెహికల్(ఏఆర్‌వీ), ఉభయచర ఫైటింగ్ వెహికల్(బీఎంపీ–2), టీ–72 ట్యాంక్‌లనూ కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలకూ 'రక్షణ కొనుగోళ్ల మండలి(డీఏసీ)'ఆమోదముద్ర వేసింది. భారతనావికాదళం కోసం పీ8ఐ రకం నిఘా, పర్యవేక్షణ విమానంతోపాటు దేశీయంగా తయారుచేసే నాలుగు ఎండబ్ల్యూ మెరైన్ గ్యాస్ టర్బైన్‌తో పనిచేసే ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్ల కొనుగోలు ప్రతిపాదనలకూ ఆమోదం తెలిపారు.

కుడి కంటి చూపు కోల్పోయిన ఇమ్రాన్

- నా ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు
- పాక్ మాజీ ప్రధాని ఆరోపణ
- జైలులో ఆయన్ను కలిసిన సుప్రీంకోర్టు ప్రతినిధి వెల్లడి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ పదవీచ్యుత ప్రధాని ఇమ్రాన్ ఖాన్(73) కుడి కన్ను పూర్తిగా కనిపించకుండా పోయింది. జైలులో తన భద్రత, అందించే ఆహారం విషయంలో సంతృప్తిగా ఉన్న ఆయన.. తన ఆరోగ్య సమస్యల్ని మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ. న్యాయవాది సల్మాన్ సఫ్దర్ ఈ విషయాలను వెల్లడించారు. ఇమ్రాన్‌ను ఉంచిన రావల్పిండిలోని అడియాలా జైలును బుధవారం మధ్యాహ్నం సందర్శించిన ఆయన..ఉన్నతాధికారుల సమక్షంలో 2 నుంచి 2.35 గంటల మధ్య రెండో నంబర్ సెల్‌లో ఉన్న ఇమ్రాన్‌తో మాట్లాడారు. ఈ మేరకు ఇమ్రాన్ యోగక్షేమాల గురించి రూపొందించిన 8 పేజీల నివేదికను గురువారం సుప్రీంకోర్టుకు అందజేశారు. 'అక్టోబర్ వరకు తన కంటి చూపు బాగానే ఉంది. గత మూడు నెలల్లోనే కుడి కన్ను పూర్తిగా కనిపించకుండా పోయింది. మొదట్లో కన్ను మసకగా కనిపించింది. జైలు సూపరింటెండెంట్‌కు చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు, ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత క్రమంగా కనిపించకుండా పోయింది. అనంతరం ఒక డాక్టర్ వచ్చి పరీక్షలు చేశారు. కుడికంట్లో రక్తం గడ్డకట్టిన కారణంగానే దెబ్బతిందని చెప్పారు. చికిత్స చేసినప్పటికీ పెద్దగా ఫలితముండదని ఆయన అన్నారు'అని ఇమ్రాన్ చెప్పినట్లు సఫ్దర్ పేర్కొన్నారు. చూపు కోల్పోవడం, సరైన సమయంలో ప్రత్యేక వైద్య సాయం అందకపోవడంపై ఆయన కలత చెందుతున్నట్లు, తీవ్రంగా ఆవేదన చెందుతున్నట్లు గమనించానని సఫ్దర్ రాశారు. 'నాతో మాట్లాడుతున్నంత సేపూ నీళ్లతో నిండిన కళ్లను పదేపదే టిష్యూ పేపర్‌తో తుడుస్తూనే ఉన్నారు. ఇమ్రాన్ శారీరకంగా తీవ్రమైన ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది'అని సఫ్దర్ పేర్కొన్నారు. ఇమ్రాన్ బీపీ, ఆక్సిజన్ స్థాయిలను వైద్యులు రోజుకు మూడుసార్లు నమోదు చేస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ తెలిపారన్నారు. ఆయనకు సహాయకుడిగా ఓ ఖైదీని అందుబాటులో ఉంచారని చెప్పారు. అయితే, ఇమ్రాన్‌ను కలుసుకునేందుకు కుటుంబసభ్యులకు అవకాశమివ్వాలని సఫ్దర్ సిఫారసు చేశారు. కంటివైద్యం విషయంలో ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులను లోపలికి అనుమతించాలన్నారు. కోరిన విధంగా మరిన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కూడా సూచించారు. ఇమ్రాన్‌ను కలుసుకునేందుకు తమను అనుమతించడం లేదని, జైల్లోనే ఆయన్ను చంపేందుకు కుట్రలు జరుగుతున్నాయంటూ కుటుంబ సభ్యులు, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ నివేదికలోని అంశాలు వెలుగులోకి రావడం గమనార్హం.

హోరెత్తిన లోక్‌సభ

అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఆగ్రహం

- తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని స్పష్టీకరణ
- దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ చేతులు కలిపారు
- బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపణలు
- ఆయనపై మండిపడిన విపక్షాలు.. సభ వాయిదా

న్యూఢిల్లీ: అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని లోక్‌సభలో విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సభలో అలజడి సృష్టించాయి. గురువారం ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ప్రారంభించారు. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. వాణిజ్య ఒప్పందాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నినాదాలతో హోరెత్తించారు. మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు నూతన లేబర్ కోడ్స్‌ను సైతం ఉపసంహరించుకోవాలంటూ నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి విపక్ష సభ్యులపై అసహనం వ్యక్తంచేశారు. వెనక్కి వెళ్లి సీట్లలో కూర్చోవాలని చెప్పారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడం పార్లమెంట్ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. వాటిని వెంటనే వదిలేయాలని సూచించారు. అయినప్పటికీ సభలో అలజడి సద్దుమణగలేదు. విపక్షాలు నినాదాలు ఆపలేదు. దాంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అంతకుముందు సభలో ప్రశ్నోత్తరాలు కేవలం ఏడు నిమిషాలపాటు జరిగాయి. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత ప్రభుత్వం పలు మినహాయింపులు ఇవ్వడాన్ని ప్రతిపక్ష సభ్యులు తప్పుపట్టారు.

నిషికాంత్ దూబే వ్యాఖ్యలపై దుమారం

సభ పునఃప్రారంభమైన తర్వాత బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపాడని, దేశానికి వ్యతిరేకంగా కుట్రలు సాగిస్తున్నాడని ఆరోపించారు. దాంతో సభ దద్దరిల్లింది. దూబే వ్యాఖ్యలను విపక్ష ఎంపీలు ఖండించారు. ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సభను స్తంభింపజేశారు. పరిస్థితి అదుపు తప్పేలా ఉండడంతో సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి ప్రకటించారు. గురువారం పార్లమెంట్ ఉభయ సభల్లో ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్(అమెండ్‌మెంట్) బిల్లు–2026 ఆమోదం పొందింది. బడ్జెట్ సమావేశాల మొదటి సెషన్‌లో ఆమోదం పొందిన మొదటి బిల్లు ఇదే కావడం విశేషం.

మమ్మల్ని ఉరి తీస్తామన్నా సిద్ధమే: వేణుగోపాల్

అధికార పక్షం ప్రవేశపెట్టే తీర్మానాలకు తాము భయపడబోమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తేల్చిచెప్పారు. తమను ఉరి తీస్తామన్నా సరే అందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. కావాలంటే ఉరి తీసుకోవచ్చని అన్నారు. రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఇచ్చిన నోటీసుపై వేణుగోపాల్ స్పందించారు. లోక్‌సభ స్పీకర్ తమకు న్యాయం చేయడం లేదని, అందుకే ఆయనను తొలగించాలని కోరుతూ నోటీసు ఇచ్చామని తెలిపారు. బుధవారం లోక్‌సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడాన్ని వేణుగోపాల్ తప్పుపట్టారు.

రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: దూబే

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన మరోసారి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌పై చర్యలు చేపట్టాలని కోరుతూ నోటీసు ఇచ్చానని చెప్పారు. దూబే గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రాహుల్ తరచుగా విదేశాల్లో పర్యటిస్తూ సోరోస్ ఫౌండేషన్, యూఎస్ఎయిడ్, ఫోర్డ్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమవుతున్నారని చెప్పారు. దేశ వ్యతిరేక శక్తులతో మిలాఖత్ అయ్యారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని నోటీసులో ప్రస్తావించానని పేర్కొన్నారు. రాహుల్ థాయ్‌లాండ్, వియత్నాం, కాంబోడియా పర్యటనల గురించి ఇందులో వివరించానని చెప్పారు. ఇది సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం నోటీసు కాదన్నారు. ఇది స్వతంత్ర నోటీసు అని పేర్కొన్నారు.

రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని ఎందుకు రద్దు చేయాలో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ సభా హక్కులను రాహుల్ ఉల్లంఘించారో చెప్పాలని అన్నారు. తమపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా వెనక్కి తగ్గబోమని, నిజాలే మాట్లాడతామని వ్యాఖ్యానించారు.

రష్యాలో వాట్సాప్ బంద్

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధం తర్వాత ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా గ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించిన రష్యా తాజాగా వాట్సాప్ యాప్‌నూ నిలువరించింది. దీంతో రష్యాలోని తమ 10 కోట్ల మంది యూజర్లకు సేవలు నిలిచిపోయాయని వాట్సాప్ గురువారం ప్రకటించింది. ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ను కాదని నిఘా ఉన్న ప్రభుత్వరంగ 'మ్యాక్స్'యాప్‌ను వాడాలని వినియోగదారులపై రష్యా ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని 'వాట్సాప్'అధికార ప్రతినిధి ఆరోపించారు. ''రష్యాలోని మా యూజర్లతో అనుసంధానమయ్యేందుకు చేయాల్సిందంతా చేస్తున్నాం''అని ఆయన అన్నారు. దీనిపై రష్యా అధ్యక్ష భవనం(క్రెమ్లిన్) అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడారు. ''వాట్సాప్ యజమాన్యం అయిన మెటా ప్లాట్‌ఫామ్స్ రష్యా చట్టాలను అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. రష్యన్ యూజర్ల డేటాను స్థానికంగా భద్రపర్చి మాతో షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకు సమ్మతి తెలుపుతూ ముందుకొస్తే అందుకు అనుగుణంగా ఒప్పందాలు చేసుకోవచ్చు. అప్పుడు వాట్సాప్ ఖాతాలు యథాతథంగా కొనసాగుతాయి''అని ప్రభుత్వ టాస్ వార్తాసంస్థతో చెప్పారు. తమ చట్టాలను ఉల్లంఘిస్తున్న టెలిగ్రామ్ యాప్‌పై కొత్త ఆంక్షలు విధించబోతున్నామని రష్యా కమ్యూనికేషన్స్ సంబంధ నియంత్రణ సంస్థ రాస్‌కోమ్‌నాడ్జార్ గత వారం ప్రకటించడం తెల్సిందే. దీనిపై రక్షణరంగ బ్లాగర్లు నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఉక్రెయిన్‌తో పోరాడుతున్న రష్యా సైనికులు అత్యధికంగా టెలిగ్రామ్ యాప్‌నే వాడతారు. దీనిపై ఆంక్షలు అమలైతే యుద్ధ తాజా వార్తలు, పోకడలు తెలీకుండా పోతాయని వాళ్లు వెల్లడించారు. వాట్సాప్‌పై గత ఏడాదే కాల్స్‌పై పరిమితి విధించి పాక్షిక ఆంక్షలు అమలుచేయగా బుధవారం నుంచి యావత్ యాప్ అందుబాటులోకిలేకుండా చేసింది. వ్లాదిమిర్ పుతిర్ సారథ్యంలోని రష్యా సర్కార్ చాన్నాళ్లుగా ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వ గుప్పిట్లో ఉంచుకునేందుకు శతథా ప్రయత్నిస్తోంది. సోషల్‌మీడియాలోని సమాచారాన్ని తమతో పంచుకోవాలని ఆయా సామాజికమాధ్యమవేదికలను ఒత్తిడిచేస్తోంది. ఈ డేటా షేరింగ్ కుదరదని, వినియోగదారుల వ్యక్తిగత డేటాకు రక్షణ కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టంచేయడంతో ఆ సంస్థలపై పుతిన్ ప్రభుత్వం కఠిన ఆంక్షల, నిషేధ కొరడా ఝుళిపిస్తోంది.

నేడు సేవా తీర్థ్ ప్రారంభం

కొత్త భవనంలోకి ప్రధాని కార్యాలయం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) చిరునామా మారబోతోంది. ప్రధాని నరేంద్ర మోదీ సౌత్ బ్లాక్‌ను విడిచిపెట్టి, ఇకపై కొత్త భవనం సేవా తీర్థ్ నుంచే అధికారిక విధులు నిర్వర్తించబోతున్నారు. నూతన పీఎంఓగా తీర్చిదిద్దిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌ను మోదీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. అలాగే కర్తవ్య భవన్–1, కర్తవ్య భవన్–2ను సైతం ప్రారంభించనున్నారు. పీఎంఓతోపాటు జాతీయ భద్రతా మండలి సచివాలయం, కేబినెట్ సెక్రెటేరియట్ కూడా సేవా తీర్థ్‌లోనే కొలువుదీరనున్నాయి. ప్రస్తుతం ఇవి ఢిల్లీలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. కర్తవ్య భవన్–1, 2లలో కేంద్ర న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయ శాఖలతోపాటు ఇతర శాఖలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా శాఖల కార్యాలయాలు లుటెన్స్ ఢిల్లీ రైసినా హిల్స్‌లోని నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లో ఉన్నాయి. వాటిని ఖాళీ చేయబోతున్నారు. ప్రధాని మోదీ చివరిసారిగా సౌత్ బ్లాక్‌లో శుక్రవారం సాయంత్రం కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని ఇప్పటికే కామన్ సెంట్రల్ సెక్రెటేరియెట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు తరలించారు.

డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ

- ప్రతినిధుల సభలో కెనడాపై టారిఫ్‌లను ఖండిస్తూ డెమొక్రాట్ల తీర్మానం
- తీర్మానానికి అనుకూలంగా 219, వ్యతిరేకంగా 211 ఓట్లు
- ట్రంప్ తీరును తప్పుపట్టిన ఆరుగురు రిపబ్లికన్ సభ్యులు

వాషింగ్టన్: విచ్చలవిడిగా టారిఫ్‌ల బాదుడుతో ప్రపంచ దేశాలను బెంబేలెత్తిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెనడాపై టారిఫ్‌ల విషయంలో ట్రంప్ దూకుడును సొంత పార్టీ నేతలే వ్యతిరేకించారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తానని ఆయన ఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే. చైనాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి కెనడా ఉత్సాహం చూపుతుండడాన్ని ఆయన తప్పుపట్టారు. అంతేకాకుండా కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, ట్రంప్ మధ్య విభేదాలు ముదురుతున్నాయి. మాటల యుద్ధం సాగుతోంది. మొత్తానికి అమెరికా, కెనడా మధ్య చిచ్చు మొదలైంది. కెనడాపై గత ఏడాది 35 శాతం సుంకాలు విధించారు. మరిన్ని సుంకాలకు సిద్ధమవుతున్నారు. కెనడాపై టారిఫ్‌ల విషయంలో ట్రంప్ ప్రతిపాదనను ఖండిస్తూ విపక్ష డెమొక్రటిక్ సభ్యులు అమెరికా కాంగ్రెస్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభలో ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై బుధవారం ఓటింగ్ జరిగింది. తీర్మానానికి అనుకూలంగా 219 మంది, వ్యతిరేకంగా 211 మంది ఓటు వేశారు. తీర్మానం నెగ్గింది. ఆరుగురు రిపబ్లికన్ సభ్యులు తీర్మానానికి మద్దతు పలికారు. అంటే ట్రంప్‌కు సొంత పార్టీ నుంచే చుక్కెదురైంది. ఈ తీర్మానంపై త్వరలో సెనేట్‌లో ఓటింగ్ జరుగనుంది. ఒకవేళ సెనేట్‌లో కూడా ఆమోదం పొందినప్పటికీ ట్రంప్ తన అధికార బలంతో వీటో చేస్తారనడంలో సందేహం లేదు. ట్రంప్ టారిఫ్‌ల విధానం స్వదేశంలోనే చాలామందికి నచ్చడం లేదు. వాణిజ్య ఒప్పందాల విషయంలో టారిఫ్‌లను ట్రంప్ ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. తమతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికిగాను చర్చలకు రాకపోతే టారిఫ్ లు పెంచేస్తానని బెదిరిస్తున్నారు. మరోవైపు విదేశీ ఉత్పత్తులపై సుంకాల బాదుడు వల్ల అమెరికాలో వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దాంతో ప్రజల్లో అసంతృప్తి ప్రబలుతోంది. అది చట్టసభ సభ్యులపై ఒత్తిడిని పెంచుతోంది. ట్రంప్ మొండితనం వల్ల నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ప్రజలపై భారం పడుతోందని వారు విమర్శిస్తున్నారు. ట్రంప్ వల్ల రాజకీయంగా నష్టపోతున్నామన్న ఆందోళన ఆయన పార్టీ నేతల్లో నెలకొంది.

ట్రంప్ హెచ్చరికలు

సొంత పార్టీ నేతలకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. తన విధానాలను వ్యతిరేకిస్తే తీవ్ర పరిణా మాలు ఉంటాయన్నారు. కెనడాపై టారిఫ్‌ల విషయంలో ప్రతినిధుల సభలో విపక్ష డెమొక్రటిక్ పార్టీ తీర్మానం ప్రవేశపెట్టడం, దానికి రిపబ్లికన్ పార్టీ సభ్యులు మద్దతివ్వడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఐఎం లక్నోలో 3 కొత్త ఏఐ కోర్సులు

న్యూఢిల్లీ: ఎప్పటికప్పుడు కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు చేరువచేయాలనే లక్ష్యంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(లక్నో) గురువారం మూడు ఏఐ కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్) ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిజినెస్ అనలిటిక్స్, టెక్ ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ సైన్స్ + టెక్ ఎంబీఏ కోర్సులను అందుబాటులోకి తెచ్చారని ఆయన వెల్లడించారు. గురువారం ఢిల్లీలో జరిగిన భారత్ బోధన్ ఏఐ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ''నైతిక ఏఐలో భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా అవతరింపజేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం. మేనేజ్‌మెంట్ విద్యతోపాటు ఆవిష్కరణలు, రియల్ వరల్డ్ సోషియాటిక్ అప్లికేషన్లలో ఏఐ కోర్సులను విస్తృతంగా అందించాలని బిజినెస్ స్కూళ్లకు సూచిస్తున్నాం. ఏఐ ఆధారిత భవిష్యత్తుకు తగ్గట్లుగా విద్యార్థులను తయారుచేయడంతోపాటు మానవీయ విలువలను పెంపొందిస్తూ జాతీయాభివృద్ధికి సాంకేతికత దోహదపడేలా చేయండి''అని బిజినెస్ స్కూళ్లకు మంత్రి పిలుపునిచ్చారు. ''ప్రపంచంలోనే అత్యధిక యువ కార్మికశక్తితో అలరారే భారత్‌లో దేశీయంగా ఏఐ మోడళ్లను తయారుచేసుకునే అద్భుత అవకాశం దాగి ఉంది. ఇది ప్రపంచ సమస్యలనూ తీర్చగలదు అని చెప్పారు.

బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ హవా

- 175కుపైగా స్థానాల్లో ముందంజలో బీఎన్‌పీ
- కేవలం 30 స్థానాల్లో జామాతే ఇస్లామీ కూటమి
- 299 స్థానాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు
- శుక్రవారం తుది ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

ఓటేస్తున్న బీఎన్‌పీ చీఫ్ తారిఖ్ రహ్మాన్, జమాతే చీఫ్ షఫీకుర్ రహ్మాన్, తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్

ఢాకా: పదవీచ్యుత బంగ్లాదేశ్ మహిళా ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలాక ఆ దేశంలో గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హసీనా వైరి పార్టీ 'బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) హవా కొనసాగుతోంది. 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో 299 స్థానాలకుగాను గురువారం పోలింగ్ జరిగింది. సాయంత్రానికి పోలింగ్ ముగియగానే ఓట్ల లెక్కింపు ఆరంభించారు. ఇందులో కడపటి వార్తలు అందేసరికి 175కు పైగా స్థానాల్లో బీఎన్‌పీ పార్టీ ముందంజలో ఉంది. 67 ఏళ్ల షఫీకుర్ రెహమాన్ సారథ్యంలోని జామాతే ఇస్లామీ కూటమి కేవలం 30 స్థానాల్లో ముందంజలో ఉంది. 15 ఏళ్ల తర్వాత తమ పార్టీ మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని బీఎన్‌పీ పార్టీ చైర్మన్ తారిఖ్ వ్యాఖ్యానించారు. నెలల తరబడి మొహమ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వ ఏలుబడిలో హిందువులపై దాడులు, హింసాత్మక ఘటనలతో అట్టుడికిపోతున్న దేశంలో ఇకనైనా ప్రజాస్వామ్య ప్రభుత్వం కొలువుతీరుతుందన్న ఆశతో కోట్లాది మంది బంగ్లాదేశీ ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మధ్యాహ్నానికి 48 శాతం పోలింగ్

స్థానిక కాలమానం ప్రకారం నాలుగున్నర గంటలకు పోలింగ్ ముగిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు 48 శాతం పోలింగ్ నమోదైందని ప్రభుత్వ బీఎస్ఎస్ వార్తాసంస్థ ప్రకటించింది. అప్పటికే క్యూ లైన్లలో ఉన్న వారికి సైతం ఓటేసే అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం పెరిగే ఆస్కారముంది. ఓట్ల లెక్కింపు తర్వాత తుది ఫలితాలను శుక్రవారం వెల్లడిస్తామని ఎలక్షన్ అధికారులు ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలతోపాటు దేశ రాజ్యాంగ సవరణ కోరుతూ 84 అంశాలతో రెఫరెండం సైతం నిర్వహించారు. ఈ రెఫరెండంకు జూలై నేషనల్ చార్టర్ అని పేరుపెట్టారు. పదవీచ్యుత షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ పార్టీని ఈసారి ఎన్నికల నుంచి బహిష్కరించడంతో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జామాతే ఇస్లామీ కూటమిల మధ్యే ప్రధానంగా పోటీ జరిగింది. జామాతే ఇస్లామీ కూటమిలో 11 పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. 2024లో ఉద్యమాన్ని లేవదీసిన విద్యార్థి సంఘాలు ఏర్పాటుచేసిన నేషనల్ సిటిజెన్ పార్టీ(ఎన్‌సీపీ) సైతం జామాతే ఇస్లామీ కూటమిలో భాగస్వామిగా ఉంది. శాంతియుతంగా పోలింగ్‌లో పాల్గొన్నందుకు ఓటర్లకు తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్ కృతజ్ఞతలు తెలిపారు. '' ఈ ఎన్నికలు, రెఫరెండం అనేవి చరిత్రాత్మకమైనవి. ఒకరకంగా కొత్త బంగ్లాదేశ్ పుట్టినరోజు ఇది'' అని యూనుస్ వ్యాఖ్యానించారు. మాజీ మహిళా ప్రధానమంత్రి, దివంగత ఖలీదా జియా కుమారుడు, బీఎన్‌పీ పార్టీ చైర్మన్ తారిఖ్ రెహమాన్ ఢాకా–17, బోగ్రా–6 నియోజకవర్గాల్లో విజయం సాధించారు. జమాతే చీఫ్ షఫీకుర్ ఢాకాలోని నియోజకవర్గంలో ముందంజలో ఉన్నారు. ఖుల్నాలో బీఎన్‌పీ అభ్యర్థి అలీ అస్గర్ లోబీ చేతిలో జమాతే ప్రధాన కార్యదర్శి మియా గోలం పోర్వార్ ఓటమిపాలయ్యారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగితే ఓడిపోయినా సరే ఫలితాలను అంగీకరిస్తామని బీఎన్‌పీ, జమాతే నేతలు వ్యాఖ్యానించడం విశేషం. 300 స్థానాలకు పోలింగ్ జరగాల్సి ఉండగా ఒక స్థానంలో అభ్యర్థి ఆకస్మిక మరణంతో మిగతా 299 నియోజకవర్గాలకే గురువారం పోలింగ్ చేపట్టారు. దేశవ్యాప్తంగా 42,779 పోలింగ్ కేంద్రాల్లో 50 లక్షల మంది తొలిసారి ఓటర్లు సహా దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు ఓటేసేందుకు తమ పేరును నమోదుచేసుకున్నారని ఎన్నికల అధికారులు గతంలోనే ప్రకటించారు. ఈసారి 50 రాజకీయ పార్టీలకు చెందిన 1,755 అభ్యర్థులతో పాటు మరో 273 మంది స్వతంత్రులు ఈసారి పోటీపడ్డారు. 15 ఏళ్లపాటు దేశాన్ని పరిపాలించిన హసీనా, అవామీ లీగ్ పార్టీ లేకుండా బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఈమె పార్టీ చిహ్నమైన పడవ తొలిసారిగా బ్యాలెట్ పత్రాల నుంచి మాయమైంది.

పలు చోట్ల ఉద్రిక్తత..

పలు పోలింగ్‌కేంద్రాల వద్ద హింసాత్మక ఘటనలు జరిగాయి. నాలుగు జిల్లాల్లో జరిగిన ఘటనల్లో 9 మంది చనిపోయారని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. గోపాల్‌గంజ్‌లో పోలింగ్‌కేంద్రం సమీపంలో హ్యాండ్‌బాంబ్ పేలిన ఘటనలో 13 ఏళ్ల బాలిక గాయపడింది. ఘర్షణలు జరిగిన చోట్ల డజన్ల మందిని అదుపులోకి తీసుకున్నారు.

అప్పటి వరకు ఆరావళిని తాకనివ్వం: సుప్రీం

న్యూఢిల్లీ: ఆరావళి పర్వత శ్రేణిపై నిపుణులు స్పష్టత ఇచ్చే వరకు ఆ ప్రాంతాన్ని తాకేందుకు ఎవ్వరినీ అనుమతించబోమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. హరియాణా ప్రభుత్వం అందజేసిన జంగిల్ సఫారీ ప్రాజెక్టు సవరించిన ప్రతిపాదనపై గురువారం ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆరావళి శ్రేణిపై స్పష్టత వచ్చిన తర్వాతే ఈ ప్రాజెక్టు విషయం పరిశీలిస్తామని తెలిపింది. 'సఫారీ ప్రాజెక్టు పరిధిని గతంలో ఉన్న 10 వేల ఎకరాల నుంచి 3,300 ఎకరాలకు తగ్గించాం. ఈ మేరకు సవరించిన ప్రతిపాదనలను కేంద్ర కమిటీకి అందజేసేందుకు అనుమతించాలని కోరుతున్నాం'అని రాష్ట్ర ప్రభుత్వ లాయర్ ధర్మాసనాన్ని కోరారు. 'మేం నిపుణులం కాదు. ఆరావళి నిర్వచనాన్ని నిపుణులు నిర్ణయిస్తారు. ఆ విషయంలో స్పష్టత వచ్చే వరకు ఆరావళిని తాకేందుకు కూడా ఎవ్వరినీ అనుమతించం'అని పేర్కొంది. హరియాణా, రాజస్తాన్‌లే కాదు, ఇతర రాష్ట్రాలకు కూడా ఆరావళితో సంబంధముందన్న ధర్మాసనం..సఫారీ ప్రాజెక్టు, ఆరావళి నిర్వచనం రెండూ వేర్వేరు అంశాలని పేర్కొంది. హరియాణా ప్రభుత్వం ప్రపంచంలోనే అతిపెద్దదైన ఆరావళి జూ సఫారీ ప్రాజెక్టును ఆరావళి శ్రేణిలోని గుర్గావ్, నూహ్ జిల్లాల పరిధిలోని 10 వేల ఎకరాల్లో తలపెట్టిన సంగతి తెలిసిందే.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 2125 9899

ఏదడిగినా చెప్పలేకపోతున్నారు..

- ప్రభుత్వం వద్ద సమాధానం ఉండటంలేదు
- బడ్జెట్ సమావేశాల్లోపు తల్లికి వందనం బకాయిలు చెల్లించాలి
- శాసన మండలి విపక్ష నేత బొత్స డిమాండ్

ఎమ్మెల్సీలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: శాసన మండలిలో ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోందని 'మండలి' విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఏ ప్రశ్న అడిగినా వారి వద్ద సమాధానం ఉండటంలేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోపు తల్లికి వందనం బకాయిలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి గురువారం బొత్స మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.. 'పక్క రాష్ట్రాల్లో బహిరంగ వేలం ద్వారా పరిశ్రమలకు భూములు ఇస్తుంటే ఇక్కడ మాత్రం సీఎం చంద్రబాబు తన అనుయాయులకు, బినామీలకు ప్రభుత్వ భూమిని 99 పైసలకే ధారాదత్తం చేస్తున్నారు. దీనిపై మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. భూ కేటాయింపుల విషయంలో ప్రభుత్వం నిబంధనలు పాటించడంలేదు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఉచితంగా 55 ఎకరాలు రాసిచ్చేస్తే రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరిగిపోతుందా? టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినా కొత్తగా ఒక్కరికి కూడా సామాజిక పింఛన్లు మంజూరు చేయలేదని వారే ఒప్పుకున్నారు. ఎప్పుడిస్తారని అడిగితే.. స్పష్టమైన తేదీ ప్రకటించకుండా ఇస్తామని చెప్పి తప్పించుకుంటున్నారు. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసంచేశారు. చాలామంది ఖాతాల్లో కేవలం రూ.7 వేలు రూ.8 వేలు, రూ.9 వేలు జమచేసి ప్రభుత్వం చేతులు దులిపేసుకున్న విషయాన్ని కూడా సభ దృష్టికి తీసుకొచ్చాం. దీనిపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు పోతోంది. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేలోపు తల్లికి వందనం బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వ చర్యల కారణంగా చాలామంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు' అన్నారు.

హిందువులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

'అసెంబ్లీలో ప్రశ్నిస్తామనే భయంతో మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వడంలేదు. ప్రజల గొంతును వినిపిస్తే ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. మా నేతలపై అక్రమ కేసులన్నింటిపై చర్చిస్తాం. తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. సగటు హిందువు భయపడేలా మాట్లాడారు. వీటన్నిటిపై మండలిలో గట్టిగా ప్రశ్నిస్తాం. చంద్రబాబు హయాంలోనే నాణ్యతలేని నెయ్యి వచ్చినట్లు సీబీఐ కూడా చెప్పింది. దీనిపై ఆయన హిందువులకు క్షమాపణ చెప్పాలి.'

- లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

సభా సమయం వృథా కానివ్వొద్దు

మండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, అమరావతి: సభా సమయం వృథా కాకుండా సభ్యులు సహకరించాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సూచించారు. గురువారం ఉదయం 10.07 నిమిషాలకు ప్రారంభమైన మండలి సమావేశం ప్రశ్నోత్తరాల్లో 11.38 సమయంలో కొద్దిసేపు విరామం ప్రకటించిన చైర్మన్ మోషేన్‌రాజు తన చాంబర్‌లో బీఏసీ సమావేశం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 1.16 గంటలకు ప్రారంభమైన మండలి సమావేశంలో బీఏసీ నిర్ణయాలను చైర్మన్ వెల్లడించారు. ఉదయం 10గంటలకు సభ ప్రారంభించి మధ్యాహ్నం 1.30 గంటలకు ముగించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రశ్నోత్తరాల చర్చను క్లుప్తంగా గంటన్నర వ్యవధిలో ముగించాలన్నారు. టీ బ్రేక్‌కి 30 నిమిషాలు కేటాయిస్తున్నట్టు తెలిపారు.

మండలి ప్యానల్ స్పీకర్ల వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రస్తుత శాసనమండలి సమావేశాల్లో ప్యానల్ స్పీకర్ల వివరాలను చైర్మన్ మోషేన్‌రాజు గురువారం వెల్లడించారు. పేరాబత్తుల రాజశేఖరం, తిరుమల నాయుడు, ఇషాక్ బాషా, మొండితోక అరుణ్ కుమార్‌ను నామినేట్ చేస్తున్నట్టు ప్రకటించారు.

అంతా బాబు భజనే..

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో అంతా 'నారా' కుటుంబ భజన
- వారిని ఆకాశానికెత్తిన జనసేన ఎమ్మెల్యే కొణతాల

సాక్షి, అమరావతి: 'సీఎం చంద్రబాబుకు ఎకనామిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్–2025 అవార్డు లభించింది. ఆయన సతీమణి భువనేశ్వరి ఔట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు–2025 అందుకున్నారు. లోకేశ్ సతీమణి బ్రాహ్మణిని బిజినెస్ టుడే మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు–2025 వరించింది. నారా దేవాన్ష్ చెస్‌లో ప్రపంచ స్థాయి రికార్డులు సాధించారు. ఇంతటి చరిత్ర కలిగిన నాయకులు ఉండటం రాష్ట్రానికి ఓ గౌరవం' అని నారా కుటుంబాన్ని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆకాశానికి ఎత్తారు. దేవాన్ష్‌కు చెస్‌లో అవార్డులు రావడం సామాన్యమైన విషయం కాదన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను చంద్రబాబు, లోకేశ్ భజన కార్యక్రమంగా అధికార పార్టీల ఎమ్మెల్యేలు మార్చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు శాసనసభలో ప్రవేశపెట్టారు. దానిని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు బలపరచగా, పలువురు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగం, తమ నియోజకవర్గాల అభివృద్ధి, ప్రజల సమస్యల గురించి ప్రస్తావించకుండా చంద్రబాబు, లోకేశ్‌లను ప్రసన్నం చేసుకోవడానికి ఒకరిని మించి ఒకరు పోటీ పడ్డారు. సభలో లేని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి పదే పదే ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలు చేస్తూ ఆయన వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. రాజకీయాల్లో సీనియర్ అయిన కొణతాల రామకృష్ణ ఏకంగా చంద్రబాబు, లోకేశ్‌లతోపాటు, ఏకంగా వారి కుటుంబ సభ్యులను సైతం ఆద్యంతం పొగుడుతూ ఆకాశానికి ఎత్తడం గమనార్హం.

రూ.5 వేల కోట్ల భూమి 'గీతం'కు ఎలా ఇస్తారు?

రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే భూములా?

- శాసన మండలిలో మండిపడ్డ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ
- 99 పైసలకే భూములిచ్చే విధానం దేశంలో ఎక్కడైనా ఉందా?
- ఐటీ సంస్థల పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థలకు కేటాయింపులా?
- విశాఖలో ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులపై నిలదీత
- భూముల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ ఉంది కదా..
- వారు చేసే పనిని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎందుకిస్తున్నారు?
- లోపాయికారీ ఒప్పందాల వల్లే భూ కేటాయింపులని మండిపాటు
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి సభ్యుల వాకౌట్

సాక్షి, అమరావతి: విశాఖలో సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యుడు, ఎంపీ భరత్‌కు చెందిన గీతం యూనివర్సిటీ ఆక్రమణలోని రూ.5 వేల కోట్లు విలువచేసే 55 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎలా క్రమబద్ధీకరిస్తారని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్, ప్రైవేట్ సంస్థలకు 99 పైసలకే భూములు ఎలా ఇస్తారని నిలదీశారు. లులు, సత్వా, ఉర్సా తదితర కంపెనీలకు రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రాసిచ్చేస్తున్నారని నిప్పులు చెరిగారు. ఏ ప్రశ్న అడిగినా ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోందన్నారు. విశాఖపట్నంలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కేవలం 99 పైసలకే రియల్ ఎస్టేట్ సంస్థలకు చంద్రబాబు ప్రభుత్వం కట్టబెట్టడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుపట్టింది. గురువారం శాసన మండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో దీనిపై దాదాపు గంటపాటు చర్చ సాగింది. ఈ అంశంపై ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలకు 99 పైసలకే కేటాయించిన భూముల వివరాలపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ.. ఐదు సంస్థలకు 99 పైసలకే భూములు కేటాయించినట్టు వెల్లడించారు. తమ ప్రభుత్వ పాలసీలో భాగంగా ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు విశాఖపట్నంలో ఐటీ ఎకో సిస్టం తీసుకొచ్చేందుకే ఈ కేటాయింపులు చేశామన్నారు. దీనిపై మండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణతో కలిసి వైఎస్సార్‌సీపీ తరఫున ప్రశ్న లేవనెత్తిన మాధవరావు, వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. 'ఐటీ కంపెనీల పేరుతో విలువైన భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు కూడా అతి తక్కువ ధరలకు ఇచ్చేస్తున్నారు. రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకు 27 ఎకరాలు ఎలా కట్టబెట్టారు? ఆ సంస్థకు రూ.1,500 కోట్ల విలువైన భూమిని ఇచ్చేశారు. వాస్తవానికి భూములను అభివృద్ధి చేసి, మౌలిక వసతులు కల్పించి.. పరిశ్రమలకు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగంలో ఏపీఐఐసీ ఉంది. కానీ వారు చేసే పనిని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎందుకిస్తున్నారు? ఏపీఐఐసీ కంటే రియల్ ఎస్టేట్ సంస్థలు మెరుగైన అభివృద్ధి చేస్తాయా? 99 పైసలకే భూములు ఇవ్వడం దేశంలో మరెక్కడా లేదు. రియల్ ఎస్టేట్ సంస్థలకు ప్రభుత్వ భూములు కేటాయించవచ్చా? ఈ విధానం ఎక్కడైనా ఉందా? ఐటీ పార్కుల అభివృద్ధి నుంచి ఏపీఐఐసీని తప్పిస్తున్నారా? ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధిని కూడా ప్రైవేటు కంపెనీలకు ఎందుకిస్తున్నారు?' అని ప్రశ్నించారు.

> విశాఖలో ఐదు సంస్థలకు 99 పైసల చొప్పున భూములు కేటాయించడం వాస్తవం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు 21.16 ఎకరాలు, కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాలు, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు 13.29 ఎకరాలు, రహేజా రియల్ ఎస్టేట్‌కు 27.1 ఎకరాలు, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ సంస్థకు 3.55 ఎకరాలను 99 పైసలకే ఇచ్చాం. ఎకరం 99 పైసలకు కాదు. ఆయా సంస్థల్లో ఒక్కో సంస్థకు ఇచ్చిన మొత్తం భూమి 99 పైసలే.
>
> - శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానం

లోపాయికారీ లావాదేవీలే..

విశాఖపట్నంలో ఐటీ ఎకో సిస్టం, డేటా సెంటర్ అని చెబుతూ లోపాయికారీగా వాళ్లకున్న లావాదేవీలతో, స్వార్థ ప్రయోజనాల కోసమే ప్రభుత్వం అతి కారుచౌకగా భూ కేటాయింపులు చేస్తుందని బొత్స మండిపడ్డారు. 'రియల్ ఎస్టేట్ సంస్థకు కూడా 99 పైసలకు భూములు ఇచ్చుకోవచ్చని మంత్రి చెబుతున్నారు. విశాఖలోని విలీన భూములను 99 పైసలకే ఇస్తున్నారు. ఇందులో పారదర్శకత లేదు. వాస్తవాలు ప్రపంచానికి తెలియాలి. పక్క రాష్ట్రాల్లో పారదర్శకంగా జరుగుతున్నాయి. అక్కడ మార్కెట్ ధరలకు భూములు కొంటుంటే ఇక్కడ మాత్రం 99 పైసలకే ఇచ్చేస్తున్నారెందుకు? విశాఖలో ఐటీ ఎకో సిస్టం ఇప్పుడిది కాదు. 2004లోనే ప్రారంభించాం. అప్పుడు ఆ శాఖ మంత్రిని నేనే. 2014–19 మధ్య మీరేం చేశారో మీ తండ్రి (చంద్రబాబు)ని చెప్పమనండి. ఇప్పుడు మీరు ఏదైతే ఎకో సిస్టం, డేటా సెంటర్ గురించి మాట్లాడుతున్నారో వాటిని 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక (విశాఖలో అదాని డేటా సెంటర్) తెచ్చింది నిజం కాదా?' అని ప్రశ్నించారు. ఈ భూ దోపిడీకి, లాలూచీలకు, ప్రజా వ్యతిరేక నిర్ణయాల పట్ల వైఎస్సార్‌సీపీ నిరసన తెలియజేస్తూ వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఏడాది క్రితం రిజిస్టరైన సంస్థలకు రూ.వేల కోట్ల భూములా?

గత 20 నెలల కాలంలో 99 పైసలకు ఐదు కంపెనీలకు భూములు ఇచ్చినట్టు చెబుతున్నారని, అయితే గత సంవత్సరంలో రిజిస్టర్ అయిన కంపెనీకి కూడా వేల కోట్ల విలువైన భూములు ఎలా కేటాయించారంటూ ఎమ్మెల్సీ మాధవరావు నిలదీశారు. 'విశాఖ నడిబొడ్డున లులూ సంస్థకు 13.74 ఎకరాలు 99 ఏళ్లకు లీజుకిచ్చారు. విజయవాడలో రూ.156 కోట్ల పెట్టుబడికి రూ.600 కోట్ల భూమిని లీజుకిచ్చారు. ఇంత తక్కువ పెట్టుబడికి ఎంతో విలువైన భూమి ఇవ్వడం ఏంటి? ప్రభుత్వం రూ.లక్ష కోట్లు పెట్టి టెండర్లు పిలిచి రాజధాని కడుతోంది. అదే 4.15 ఎకరాలకు టెండర్లు పిలిచి భవనం ఎందుకు కట్టడం లేదు?' అని ప్రశ్నించారు. 'ఇంకా పునాది దశలో ఉన్న అమరావతిలో భూముల ధరల కంటే విశాఖలో ఇంకా తక్కువకు ఇస్తున్నారు. వాస్తవానికి మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలని తక్కువ ధరకు భూములిస్తారు. కానీ విశాఖలో ఎంతో విలువైన భూమిని ఇంత తక్కువకు ఎందుకిస్తున్నారో చెప్పాలి' అని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడులు జవాబిస్తూ 1994 నుంచి 2004 మధ్య నాటి సీఎం చంద్రబాబు తక్కువ ధరకు హైదరాబాద్‌లో భూములు కేటాయించబట్టే అనేక కంపెనీలు వచ్చాయన్నారు. ఇందులో భాగంగానే విశాఖలో భూములు కేటాయిస్తున్నామని చెప్పారు.

'తల్లికి వందనం'పై దద్దరిల్లిన మండలి

- గవర్నర్‌తో అవాస్తవాలు చెప్పించారంటూ వైఎస్సార్‌సీపీ ఆగ్రహం
- రెండేళ్ల తల్లికి వందనం ఇంకా పూర్తి స్థాయిలో ఎందుకు ఇవ్వలేదని నిలదీత
- తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి.. రెండో ఏడాది చాలా కుటుంబాలకు రూ.7–8 వేలు బకాయి
- కాదు అని నిరూపిస్తే సభకు క్షమాపణ చెబుతానని మండలి ప్రతిపక్ష నేత బొత్స సవాలు
- 15 శాతం మందికి అందలేదని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్న మంత్రి కొలుసు
- ఒక గ్రామ సచివాలయం పరిధిలో పథకం అందని వారి జాబితాను అందజేసిన ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి
- అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వేయకపోయినా వేసినట్లు ఎలా చెబుతారని ఆగ్రహం

బకాయిలపై నిలదీస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సవాళ్లు ప్రతిసవాళ్లతో గురువారం శాసన మండలి దద్దరిల్లింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో అధికార, విపక్ష పార్టీ సభ్యులు ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు. గవర్నర్ చేత అవాస్తవాలు చెప్పించారంటూ వైఎస్సార్‌సీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. తల్లికి వందనం పథకం కింద మొదటి ఏడాది ఒక్క రూపాయి పడలేదని, రెండో ఏడాది పూర్తిగా రూ.15 వేలు ఇవ్వకుండా తగ్గించి ఇచ్చి, గవర్నర్ చేత మాత్రం పూర్తిగా ఇచ్చేసినట్లు అవాస్తవాలు చెప్పించారని ఎత్తి చూపారు. అన్నదాత సుఖీభవ కింద ఏ రైతు ఖాతాలో రూ.20,000 జమ చేయకుండానే ఇచ్చేసినట్లు అసత్యాలు వల్లె వేయించారని విమర్శించారు. దీనిపై మంత్రి కొలుసు పార్థసారధి స్పందిస్తూ.. గవర్నర్ ప్రసంగంలోని ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నామని, అర్ధ సత్యాలతో సభను తప్పుదోవ పట్టించొద్దంటూ అడ్డు తగలడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎవరివి అవాస్తవాలో.. ఎవరివి నిజాలో ప్రజలు తెలుసుకుంటారన్నారు. ఇప్పటికీ చాలా కుటుంబాలకు తల్లికి వందనం కింద పూర్తి స్థాయిలో డబ్బులు పడలేదని, ఈ మాటకు తానూ కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఇది తప్పు అని నిరూపిస్తే క్షమాపణ చెప్పి తన మాటలు వెనక్కి తీసుకుంటానని సవాల్ విసిరారు. కావాలంటే మీ నియోజకవర్గ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. దీనిపై మంత్రి పార్థసారధి స్పందిస్తూ.. సాంకేతిక కారణాలతో ఒకరిద్దరికి పడకపోవచ్చని, వీటిని తమ దృష్టికి తీసుకువస్తే సరి చేస్తామన్నారు.

దమ్ముంటే తప్పు అని నిరూపించండి

ఒకరిద్దరు కాదు.. 15–18 శాతం మందికి ఇంకా రూ.7 వేల నుంచి రూ.8 వేలు చెల్లించాల్సి ఉందనే మాటకు ఇప్పటికీ తాను కట్టుబడి ఉన్నానని బొత్స ప్రతి సవాల్ విసరడంతో అధికార పక్షం ఆత్మరక్షణలో పడింది. ఆధారాలిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమని, అన్నదాత సుఖీభవ కూడా పడలేదంటూ తప్పుడు సమాచారం చెపుతున్నారని మంత్రి పార్థసారథి చర్చను పక్కదోవ పట్టించే యత్నం చేశారు. ఇది పెద్దల సభ అని, తాము తప్పుడు సమాచారంతో సభను తప్పుదోవ పట్టించామని నిరూపిస్తే బేషరతుగా క్షమాపణ చెపుతానంటూ బొత్స మరోసారి స్పష్టం చేశారు. తిరిగి చర్చను ప్రారంభించిన చంద్రశేఖర రెడ్డి.. ఒక గ్రామంలోని సచివాలయంలో 21 మందికి తల్లికి వందనం అందలేదని ఫిర్యాదులు చేస్తే, వాటిని పరిశీలించి పరిష్కరించామంటూ చూపిస్తున్నా, ఇప్పటికీ తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని లబ్ధిదారులు చెపుతున్నారంటూ ఆధారాలను సభకు సమర్పించారు. దీనిపై రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలుగచేసుకుంటూ.. అధికారుల తప్పు ఉంటే తప్పకుండా వారిని సస్పెండ్ చేస్తామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్లో భయాందోళనలు సృష్టించి, రద్దు చేసినట్లు ప్రకటించి.. వేరే పేరుతో దాన్నే కొనసాగిస్తున్నారని చంద్రశేఖరరెడ్డి తప్పు పట్టారు. 'గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చి ఇప్పుడు ఇంటి వద్దకే పౌర సేవలు అంటున్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి కొత్తగా రెండు జిల్లాలు తీసుకువచ్చారు. తొలిసారి ముఖ్యమంత్రి అయిన జగన్ ఏకంగా ఒకేసారి కొత్తగా 13 జిల్లాలు తీసుకొచ్చారు. తద్వారా ఎవరు విజన్ ఉన్న ముఖ్యమంత్రో ఇట్టే తెలుస్తోంది' అని చంద్రశేఖర రెడ్డి అన్నారు.

20 నెలల్లో ఒక్కరికైనా కొత్తగా పింఛన్ ఇచ్చారా?

- శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి : కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ 20 నెలల్లో రాష్ట్రంలో 60 ఏళ్లు నిండిన వృద్ధుల్లో ఏ ఒక్కరికైనా కొత్తగా వృద్ధాప్య పింఛను మంజూరు చేసిందా? అని శాసన మండలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వితంతు (స్పౌజ్ కేటగిరి కాకుండా), దివ్యాంగులల్లో కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్లు మంజూరు చేయలేదని తూర్పారపట్టింది. గురువారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఈ అంశంపై ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'ఎన్నికలప్పుడు 50 ఏళ్లకే పింఛను అని హామీ ఇచ్చారు గానీ, ఇప్పుడు దాని ఊసెత్తడం లేదని.. ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన జవాబు చెబుతారన్నారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు మంజూరు చేసిన పరిస్థితి ఉంటే, చంద్రబాబు ప్రభుత్వంలో ఈ రెండేళ్ల కాలంలో ఒక్క కొత్త పింఛను కూడ ఇవ్వలేదని తప్పుపట్టారు. మరోవైపు, గత ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్ల సంఖ్య కన్నా ఇప్పుడు దాదాపు ఐదు లక్షల పింఛన్లు తగ్గిపోయాయని ఎత్తి చూపారు. మరో లక్ష దాక దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తారంటున్నారని చెప్పారు. అర్హులకు పింఛన్లు కూడా మంజూరు చేయకపోతే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 66 లక్షలకు పైబడి పింఛన్లు ఇచ్చారని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదన్నారు. వీటిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బదులిస్తూ గత 20 నెలలుగా పింఛన్లు తొలగించలేదని చెప్పారు. వృద్ధాప్య పింఛన్లు పొందే వారిలో భర్త చనిపోయిన వారి భార్యలకు స్పౌజ్ పింఛన్లు ఇస్తున్నామన్నారు. గత 20 నెలల్లో 4.70 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు చనిపోయినందున, వారి పింఛన్‌ని ఆపామని తెలిపారు. దివ్యాంగుల పింఛన్లు రెండోసారి రీ వెరిఫికేషన్ జరుగుతుందని, నోటీసులివ్వడం వాస్తవం అన్నారు. అయితే ఇప్పటి వరకు దివ్యాంగుల పింఛన్లు ఎవరికీ ఆపలేదని చెప్పారు. కొత్తగా వృద్ధాప్య, వితంతు పింఛన్ల కోసం దరఖాస్తులు ఓపెన్ చేస్తామని చెప్పారు. దీనిపై బొత్స మాట్లాడుతూ.. ఇంతకూ కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. లేదా ఇలానే ఐదేళ్లూ గడిపేస్తారా అని ప్రశ్నించారు. మంత్రి కొండపల్లి బదులిస్తూ.. కొత్త పింఛన్ల మంజూరుకు విధి విధానాలు తయారు చేసి, కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

యూనివర్సిటీలకు యూనిఫైడ్ యాక్ట్

- పుట్టపర్తిలో ఐఐఐటీ ఏర్పాటు చేయడం లేదు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: యూనివర్సిటీలన్నిటినీ యూనిఫైడ్ యాక్ట్ కిందకు తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు మంత్రి లోకేశ్ చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. అనుబంధ కళాశాలల గుర్తింపును ప్రామాణిక పద్ధతిలో చేసేందుకు వీలుగా ఏకీకృత చట్టానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. వర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోనూ మార్పులు చేస్తామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఐఐఐటీని ఏర్పాటు చేయడం లేదని తెలిపారు.

గిరిజన ఉద్యోగుల బదిలీలు, నియామకాలకు చట్టం

గిరిజన ఉద్యోగుల బదిలీలు, నియామకాల కోసం త్వరలో చట్టం చేసే యోచనలో ఉన్నట్టు గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. ఈ చట్టం ద్వారా 40 లక్షల మందికి మేలు జరుగుతుందన్నారు. బొబ్బిలిలో లోచెర్ల–శివదావలస ఎత్తిపోతల పథకం మంజూరుకు ఎటువంటి ప్రతిపాదన లేదని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తోటపల్లి కాలువలో సిల్ట్ తొలగింపు, కాలువ భాగాల సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు, బ్యారేజీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నిర్మాణం రూ.3.95 కోట్లతో చేపట్టామన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటగా రోడ్ల నిర్మాణం

వేసిన రోడ్లు వేసినట్టుగానే పాడైపోతున్నాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. జీరో అవర్‌లో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేస్తున్న రోడ్లు కొద్దిరోజులకే పాడైపోతున్నాయని చెప్పారు. కొత్త టెక్నాలజీతో రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

జీరో అవర్ ప్రశ్నలకు స్పందించాలి

జీరో అవర్‌లో సభ్యులు వేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఏ ఒక్కరూ తాము అడిగిన ప్రశ్నలను నోట్ చేసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. 'సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రుల దగ్గర అప్పటికప్పుడు సమాధానాలు ఎలా ఉంటాయి. మీకు కనిపించకపోవచ్చు. అధికారులు అన్నీ రాసుకుంటారు.' అని రఘురామకృష్ణరాజు బదులిచ్చారు.

బాధ అనిపించింది: స్పీకర్ అయ్యన్న

గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు చూసి తనకు బాధగా అనిపించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. చట్టసభల పట్ల అవగాహన కల్పించేందుకు విద్యార్థులను అసెంబ్లీ సమావేశాలు వీక్షించేందుకు అవకాశం కల్పించగా, రాష్ట్రవ్యాప్తంగా 200కు పైగా విద్యాసంస్థలు దరఖాస్తు చేసుకున్నాయన్నారు.. కానీ నిన్న గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటనలు చూసి విద్యార్థులు ఏం స్ఫూర్తి పొందుతారని, అలాంటి ఘటనల ద్వారా ఏం సందేశం ఇస్తున్నామో తెలుసుకోవాలని సభ్యులకు సూచించారు. కాగా, ప్యానల్ స్పీకర్లు మండలి బుద్ధప్రసాద్, వరదరాజులరెడ్డి, జ్యోతుల నెహ్రూ, లలితకుమారి, దాసరి సుధ, విష్ణుకుమార్‌రాజు అవసరాన్ని బట్టి వ్యవహరిస్తుంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రతిపాదించారు.

20 మంది సలహాదారులను నియమించాం

- 12 మంది కన్సల్టెంట్లు కూడా..
- వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నలకు అసెంబ్లీలో లిఖితపూర్వక సమాధానం

సాక్షి, అమరావతి : ఇరవై మంది సలహాదారులతో పాటు మరో 12 మంది కన్సల్టెంట్లను నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. జూన్–2024 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నియమించిన సలహాదారులు, కన్సల్టెంట్ల నియామకాలపై వైఎస్సార్‌సీపీ సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ప్రశ్నోత్తరాల వేళ ఈ అంశం చర్చకు వచ్చిన సందర్భంలో స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు బదులిస్తూ.. ఈ ప్రశ్న వేసిన సభ్యులు సభలోలేని కారణంగా సమాధానం చెప్పినట్టేనన్నారు. కేబినెట్ హోదాలో గౌరవ సలహాదారులుగా జి. సతీష్‌రెడ్డి, సుచిత్రా ఎల్లా, డాక్టర్ కేవీసీ గాంధీ, శ్రీధర పణికర్ సోమనాథ్, డాక్టర్ మంతెన సత్యనారాయణరాజులను నియమించగా.. కేబినెట్ హోదాతో సలహాదారులు ఎంఏ షరీఫ్, చాగంటి కోటేశ్వరరావు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, సీహెచ్ సీతారామాంజనేయప్రసాద్, పోచంపల్లి శ్రీధర్‌రావులను నియమించినట్లు ప్రభుత్వం తెలిపింది. వీరితో పాటు మరో 10 మందిని వివిధ శాఖలకు సలహాదారులుగా, 12 మంది కన్సల్టెంట్లను నియమించినట్లు పేర్కొంది. ఇక కన్సాలిడేట్ పే రూపంలో వీరికి ఏటా రూ.12 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వేతన రూపంలో చెల్లిస్తుండగా, రూ.లక్ష నుంచి రూ.1.82 లక్షల వరకు అలవెన్స్ రూపంలో ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

పవన్‌ను కలిసిన బాలకృష్ణ

- గత అసెంబ్లీ సమావేశాల్లో చిరంజీవిపై విమర్శలు
- ఇప్పుడు ముందే సమావేశమై చర్చలు

సాక్షి, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ గురువారం హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో చిరంజీవిని కించపరుస్తూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన బాలకృష్ణ నేరుగా పవన్ కళ్యాణ్ చాంబర్‌కి వెళ్లి చర్చలు జరపడం చర్చనీయాంశమైంది.

ఐఆర్ ప్రకటించి పీఆర్సీ ఏర్పాటు చేయాలి

- డీఏలతో పాటు అన్ని బకాయిలూ చెల్లించాలి
- మండలిలో ఎమ్మెల్సీలు గోపీమూర్తి, రామచంద్రారెడ్డి డిమాండ్

ఎమ్మెల్సీలు గోపీమూర్తి, రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఐఆర్ ప్రకటించి పీఆర్సీని ఏర్పాటు చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. శాసనమండలిలో గురువారం ప్రత్యేక ప్రస్తావనల్లో భాగంగా గోపీమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలతో పాటు అన్ని బకాయిలు చెల్లించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.40 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని, గ్రంథాలయ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు, బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఎర్రకాలువకు మరమ్మతు పనులు ప్రారంభించాలని కోరారు. తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ.. పాత భవనాల్లో కొనసాగుతున్న విజయనగరం మహారాజ ఆస్పత్రిని కొత్త మెడికల్ కాలేజీకి అనుసంధానించాలని కోరారు.

క్లుప్తంగా...

కుప్పం డీఎస్పీపై శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు

కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం డీఎస్పీ చట్టాలను ఉల్లంఘిస్తూ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ గురువారం మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయనతో మాట్లాడేందుకు యత్నించినా, ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా తన సమక్షంలోనే తన వ్యక్తిగత కార్యదర్శిని బెదిరించి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తానని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. కుప్పం ఎమ్మెల్సీనైన తనకు గౌరవం ఇవ్వడం లేదని, ఉద్దేశపూర్వకంగానే తనను లక్ష్యంగా చేసుకుని, ఫోన్ ట్యాపింగ్ నిర్మొహమాటంగా చెబుతున్నారని వెల్లడించారు. సమగ్ర దర్యాప్తు కోసం ప్రివిలేజెస్ కమిటీని పంపాలని ఎమ్మెల్సీ భరత్ ఆ లేఖలో కోరారు.

ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తాం

టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడికి పార్టీ నుంచే బెదిరింపులు

సాక్షి, అమరావతి: తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ ప్రాంగణంలో హెచ్చరించడం చర్చనీయాంశమైంది. గురువారం అసెంబ్లీ లాబీలో శ్రీనివాసరావు కొలికపూడి ఎదురు పడటంతో ఆగి మాట్లాడారు. 'వాట్సాప్‌లో పిచ్చి పిచ్చి స్టేటస్‌లు పెడుతూ ఎప్పుడూ పోరాటం చేయాలనుకుంటున్నావ్' అంటూ కొలికపూడిపై పల్లా మండిపడ్డారు. జీవిల పల్లి కస్సీరు పెడుతుండంతో కొలికపూడి వాట్సాప్ స్టేటస్ పెట్టి గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులకు ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చడంతో అధికార టీడీపీ ఇరకాటంలో పడింది. తాను 3 రోజుల్లో 35 గ్రామాల్లో తిరిగి 480 కుటుంబాలతో మమేకమయ్యానని, రోడ్లు లేని గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు చూసి దుఃఖం ఆపుకోలేక పోయానని తన స్టేటస్‌లో కొలికపూడి వెల్లడించారు. ఒకవైపు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గ్రామాలు స్వర్గ గ్రామాలుగా మారాయని డప్పు కొట్టుకుంటుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కొలికపూడి క్షేత్రస్థాయిలో ఉన్న దారుణ పరిస్థితులపై బయటకు చెప్పడం ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో కొలికపూడిపై పల్లా శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు. ఇలాగే చేస్తే తాము ఎమ్మెల్యేగా కూడా గుర్తించకుండా ఉంటామని హెచ్చరించారు. పల్లా తన వివరణ వినే అవకాశం ఇవ్వకపోవడంతో వివరణ కోసం సీనియర్లతో తనకు గైడెన్స్ ఇప్పించాలంటూ కొలికపూడి ఏదేవా చేస్తూ వెళ్లిపోయారు.

వేతన సవరణ కమిటీని నియమించాలి

ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిటీని నియమించి, సీపీఎస్ రద్దు దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు గురువారం చేపట్టిన సమ్మెకు సంఘీభావంగా ఎన్టీఆర్ జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నూతన కార్మిక చట్టాలు, పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. వార్డు సచివాలయ ఉద్యోగులను నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతుల్లో జరుగుతున్న నష్టాన్ని భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు, టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్. సోమయాజులు, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురికేశవులు, పంచాయతీరాజ్ డిప్లొమా అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వెంకటరెడ్డి, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

● ముందు నెయ్యి.. వెనుక గొయ్యి..

హెరిటేజ్ కోసమే కుట్ర!

నెయ్యి కాంట్రాక్టు కోసం దిగజారిన చంద్రబాబు

సాక్ష్యాలతో సహా బయటపడ్డ దుర్మార్గం.. దేవదేవుడి పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై దారుణమైన అభాండాలు

- నెయ్యి తీగ లాగితే బయటపడ్డ హెరిటేజ్ డొంక
- ఇందాపూర్ డెయిరీకి కాంట్రాక్టు కోసమే చంద్రబాబు కుట్ర
- హెరిటేజ్‌కు అనుబంధ సంస్థే ఈ ఇందాపూర్ డెయిరీ
- మొత్తం 22 సంస్థలతో హెరిటేజ్ సిండికేట్
- 2014–19లో వాటికే రూ.189.19 కోట్ల నెయ్యి కాంట్రాక్టులు
- నాడు కిలో రూ. 278కే ఇందాపూర్‌కు కాంట్రాక్టు
- రేటు తక్కువ కాబట్టి కల్తీ అంటున్న బాబు సూత్రం ఇందాపూర్‌కూ వర్తిస్తుందిగా..
- కూటమి అధికారంలోకి రాగానే రంగంలోకి వచ్చిన ఇందాపూర్
- ఇతర డెయిరీలను బెదరగొట్టేందుకే నెయ్యిపై బాబు రాద్ధాంతం
- అందుకే టెండర్లలో పాల్గొనని ప్రముఖ డెయిరీలు..
- హెరిటేజ్ సిండికేట్‌కు తాజాగా 10 లక్షల కిలోల నెయ్యి కాంట్రాక్టు



Item No :374
Page No :241

MARKETING DEPARTMENT (PROCUREMENT WING)
M1/ 34022(31)/162/2018-Proc-Sec-TTD

Sub: TTD - Marketing Department – Procurement wing, Tirupati – Procurement of 87,750 kgs of enhanced flavor of Cow ghee through Tins from the dairies of Southern India - e-tenders invited – Technical bid and financial bid opened – Recommendations of the Purchase Committee – Placed before the TTD Board for approval - Regarding.

Ref: e-Tender dated: 27-08-2018 (Tech. Bid) & 28-08-2018 (fin.bid).

@@@

NOTE:

(1) This is with regard to procurement of **87,750 Kgs** of enhanced flavor of Cow ghee with Agmark Special Grade through tins from the dairies located in Southern India for use in moulding of Laddu prasadams in Srivari Temple for a period of 3 **months on trail basis.**

తయారైన లడ్డూ ప్రసాదం సువాసనకు పైపూత కోసం 2018లో నెయ్యి సరఫరా టెండర్లను పిలిచిన టీటీడీ

			Member 4). Sri O. Balaji, FA&CAO (FAC), TTD, Tirupati
17	Earlier purchase rate	:	Rs. 278/- per kg (through tins)
18	Previous supplier	:	M/s Indapur Dairy and Milk Producers Limited, Indapur, Maharashtra
19	The rate offered by the	:	Rs.306/- per kg (tins)

7	Sri Vijaya Visakha Milk Producers Company Ltd., Visakhapatnam, Andhra Pradesh	Qualified
8	Cavinkare Private Limited., Chennai, Tamilnadu	Technically disqualified for want of Agmark certificate
9	Indapur Dairy and Milk Producers Limited, Indapur, Maharashtra	Disqualified in lab test

ఇందాపూర్ డెయిరీ నుంచి కిలో నెయ్యి రూ.278 చొప్పునే కొనుగోలు చేసినట్టు వెల్లడిస్తున్న టీటీడీ రికార్డులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఎంత బాధ్యతాయుతంగా మాట్లాడాలి.. అందులోనూ పరమపవిత్రంగా ప్రపంచమంతా భావించే తిరుమల శ్రీవారి విషయంలో ఇంకెంత జాగ్రత్తగా ఉండాలి? కానీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవేవీ ఆలోచించలేదు. పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై అంతులేని విషం అలవోకగా చిమ్మేశారు. జంతువుల కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలిపారని అభాండాలు వేసేశారు. సీబీఐ సిట్ దర్యాప్తు జరిపి చార్జిషీట్ సమర్పిస్తూ క్లీన్‌చిట్ ఇచ్చినా ఆయన వెనక్కి తగ్గలేదు. లడ్డూ ప్రసాదానికి వాడిన నెయ్యిలో బ్యాక్టీరియా క్లీనింగ్‌కు వాడే రసాయనాలు కలిశాయని కూడా ఆరోపించారు. తన వాదనలను బలపరిచేందుకు సొంతంగా వన్‌ మ్యాన్ కమిషన్ కూడా వేశారు. ఇక మానవమాత్రులెవరూ ఈ దుర్మార్గాన్ని అడ్డుకోలేరనుకున్నారో ఏమో.. ఆ దేవదేవుడే దీనిపై దృష్టి సారించాడనుకుంటా.. చంద్రబాబు దుష్టపూరిత కుట్ర వెనుక లోగుట్టు అనూహ్యంగా బట్టబయలైంది. తమ కుటుంబ వ్యాపార సంస్థ హెరిటేజ్ డెయిరీ అడ్డగోలుగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే బాబు ఇంతటి రాద్ధాంతం చేస్తున్నారన్న విషయం సాక్ష్యాలతో సహా బయటపడింది. ప్రసాదంపై దుష్ప్రచారంతో ఇతర డెయిరీలను భయభ్రాంతులకు గురి చేసి టెండర్లలో పాల్గొనకుండా చేయడం... ఏకపక్షంగా హెరిటేజ్ ఫుడ్స్ సిండికేట్‌కే నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టడం.. అసలు కుట్రన్న విషయం బయటపడింది.

Corporate | Business Verticals | #PureDoodhKiShakti | Products | Investors | Subsidiaries | News & Events | Contact Us

16	HN	Survey No. 13/1, Durves Village, Taluk & District Palghar 401403, Palghar Tahashil, Palghar, Maharashtra - 401403	11519023000470	Palghar
17	I	INDAPUR DAIRY AND MILK PRODUCTS LTD At Post- Gokhali, On Indapur- Baramati Road, Tal- Indapur, Dist- Pune, Maharashtra - 413106	10012022000159	Indapur
18	RH	REGAL HELATHY FINE FOODS PVT LTD Plot No 29, Road No.5, Aleap Indl.Estate, Gajularamaram, Qutubullapur, Rangareddi, Telangana - 500090	10017047000704	Aleap
19	SD	SCHREIBER DYNAMIX DAIRIES PRIVATE LIMITED LIMITEDLE-94,MIDC,Baramati,Bhigwan Road, Baramati, Pune, Maharashtra - 413133	10012022000264	Baramati

హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ లో భాగమే ఇందాపూర్ డెయిరీ అని స్పష్టం చేస్తున్న హెరిటేజ్ ఫుడ్స్ వెబ్‌సైట్



Agmark Special Grade through tankers from **M/s. Karnataka Milk Federation (Mother dairy unit), Bangalore.**

(ii). To procure 35% quantity i.e., 5,77,500 Kgs of Cow Ghee with Agmark through tankers from **M/s. Indapur Dairy & Milk Products Ltd., Indapur, Pune District.**

(b).To accord sanction for an amount of **Rs.50,49,00,000/-** (Rupees Fifty crore and forty nine lakh only) for arranging payment to the above suppliers towards supply of the above item.

Res.No.166 dated 15.01.2015
(a) and (b) Approved

Sd/- J.S.V.Prasad,
Chairman,
Specified Authority,

ఇందాపూర్ డెయిరీ నుంచి 5,77,500 కిలోల నెయ్యిని 2015లో కొనుగోలు చేసినట్లు వెల్లడిస్తున్న టీటీడీ రికార్డులు

టీటీడీ నెయ్యి టెండర్ల తీగ లాగుతుంటే...

హెరిటేజ్ ఫుడ్స్ డొంక కదులుతోంది. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు అడ్డగోలుగా నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. నేరుగా కాకుండా హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీకి చెందిన మహారాష్ట్రలోని ఇందాపూర్ డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టి కథ నడిపించారు. అది కూడా కేవలం కిలో రూ.278 చొప్పున అతి తక్కువ ధరకే నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇవ్వడం గమనార్హం. ఇక ఆ ఐదేళ్లలో పూర్తిగా హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలోని పచ్చ సిండికేటే ఏకంగా రూ.189.19 కోట్ల విలువైన టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లను హైజాక్ చేసింది. ఇక 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరోసారి ఇందాపూర్ డెయిరీ తెరపైకి వచ్చింది. నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కొల్లగొట్టడం మొదలుపెట్టింది. 2014–19లో ఏకపక్షంగా కొనసాగించిన దోపిడీ విధానాన్ని పునరావృతం చేసేందుకే చంద్రబాబు పవిత్రమైన లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యాన్ని దెబ్బతీసే కుతంత్రానికి బరితెగించారని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. లడ్డూ ప్రసాదంపై సృష్టించిన వివాదం మాటున చంద్రబాబు అవినీతి బాగోతం ఇదిగో ఇలా ఉంది...

'ఇందాపూర్' ముసుగే... దోపిడీ 'హెరిటేజ్'దే

2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులను హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు అడ్డగోలుగా కట్టబెట్టారు. అది కూడా ఇందాపూర్ డెయిరీ అనే సంస్థ ముసుగులో కట్టబెట్టడం చంద్రబాబు పన్నాగానికి నిదర్శనం. ఇందాపూర్ డెయిరీ ఎవరిదో కాదు హెరిటేజ్ ఫుడ్స్ అనుబంధ సంస్థే అన్నది అసలు విషయం. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చైర్‌పర్సన్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు దేశంలో పాలు, పాల ఉత్పత్తులు(డెయిరీ ప్రొడక్ట్స్) తయారు చేసే 22 సంస్థలు ఉన్నాయి. మహారాష్ట్రలోని 'ఇందాపూర్ డెయిరీ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ లిమిటెడ్' కూడా వాటిలో ఒకటి. ఆ ఇందాపూర్ డెయిరీకే 2014–19లో టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టింది అప్పటి చంద్రబాబు ప్రభుత్వం. ఇందాపూర్ డెయిరీతోపాటు గోవింద్ డెయిరీ, సుభీ డెయిరీ, ప్రీమియర్ డెయిరీ, సేలం నమక్కల్ డెయిరీ, హర్యానాలోని కమల్ మిల్క్ తదితర డెయిరీలతో సిండికేట్‌గా ఏర్పడి వ్యవహారం నడిపారు. ఏకపక్షంగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టారు. అంతే కాదు ఇందాపూర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యి శాంపుల్స్ 2016లో ల్యాబ్ పరీక్షల్లో విఫలమయ్యాయి. ఆ డెయిరీపై అనర్హత వేటు వేశారు. కానీ నెలలోపే అనర్హతను తొలగించడం గమనార్హం.

హెరిటేజ్ సిండికేట్‌కే అడ్డగోలుగా నెయ్యి కాంట్రాక్టులు

హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీకి చెందిన ఇందాపూర్ డెయిరీతోపాటు ఆ సిండికేట్‌లోని డెయిరీలకే చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టింది. 2014–19లో మొత్తం రూ.189.19 కోట్ల విలువైన నెయ్యి సరఫరా కాంట్రాక్టులు ఇచ్చారని టీటీడీ రికార్డులు వెల్లడిస్తున్నాయి.

- 2015 జనవరిలో 16.50లక్షల కిలోల నెయ్యి కొనుగోలు కోసం టీటీడీ టెండర్లు పిలిచింది. కాగా ఇందాపూర్ డెయిరీ వేసిన బిడ్ ఎల్ 1గా రాలేదు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్)కు చెందిన మదర్ డెయిరీ యూనిట్ ఎల్ 1గా నిలిచింది. దాంతో ఆ డెయిరీపై అప్పటి టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ ఒత్తిడి తీసుకువచ్చి ఇందాపూర్ డెయిరీకి 35శాతం కాంట్రాక్టు దక్కేలా చేసింది. అంతేకాదు ఇందాపూర్‌కు అనుగుణంగా టెండరు నిబంధనలను కూడా సవరించారు. తద్వారా ఇందాపూర్ డెయిరీకి 5,77,500 కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. అదీ కిలో రూ.306కే. అంటే మొత్తం రూ.17.61 కోట్ల విలువైన నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు.
- 2015, మేలో ఇందాపూర్ డెయిరీకి 2.25లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. కిలో రూ.278 చొప్పున సరఫరాకే ఆ కాంట్రాక్టు ఇవ్వడం గమనార్హం. అంటే మొత్తం రూ.6.25కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టారు.
- 2016 జనవరిలో 18లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు కూడా ఇదే పచ్చ సిండికేట్‌కే కట్టబెట్టారు. కిలో నెయ్యి కేవలం రూ.285 చొప్పునే గోవింద్ డెయిరీ, సుభి డెయిరీలకు ఇచ్చారు. అంటే రూ.51.30 కోట్ల కాంట్రాక్టును దోచిపెట్టారు.
- 2016 మార్చిలో మరోసారి అదే సిండికేట్‌కు నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కింది. ఈసారి 2.25 లక్షల కిలోల నెయ్యిని కిలో రూ.306 చొప్పున సిండికేట్‌లోని గోవింద్ డెయిరీకి కట్టబెట్టారు. అంటే రూ.6.88 కోట్ల కాంట్రాక్టు ఇచ్చారు. (విస్మయం కలిగించే అంశం ఏమిటంటే.. ఈ టెండర్లలో ఇందాపూర్ డెయిరీ పాల్గొంది. కానీ ఆ డెయిరీ నెయ్యి శాంపిల్స్ ల్యాబ్ పరీక్షల్లో విఫలమయ్యాయి. దాంతో అనర్హమైనదిగా ప్రకటించారు. ఆర్నెల్లకే నిషేధం తొలగించి టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.)
- 2016 ఏప్రిల్‌లో ప్రీమియర్ డెయిరీకి 20లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. అది కిలో రూ.332కే చొప్పునే. అంటే రూ.66.40 కోట్ల విలువైన కాంట్రాక్టు కట్టబెట్టారు.
- 2016, సెప్టెంబరులో 2.25లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు హర్యానాలోని కమల్ మిల్క్ కంపెనీకి ఖరారు చేశారు. ఆ డెయిరీ తొలిసారి టీటీడీ టెండర్లలో పాల్గొంది. పచ్చ సిండికేట్‌లో చేరడంతోనే ఈసారి ఆ సంస్థ పేరిట కాంట్రాక్టు ఇచ్చారు. కిలో రూ.376 చొప్పున రూ.8.46 కోట్ల కాంట్రాక్టు దక్కింది.
- 2018, నవంబరులో మరోసారి ఇందాపూర్ డెయిరీకి 6.17లక్షల కిలలో నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టారు. ఇక అదే సిండికేట్‌లోని ప్రీమియర్ డెయిరీకి 3.33లక్షల కిలోల నెయ్యి, సేలం నమక్కల్ డెయిరీకి 85వేల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారు. హెరిటేజ్ ఫుడ్స్ సిండికేట్‌లోని ఆ మూడు డెయిరీలకు కిలో రూ.312 చొప్పున మొత్తం రూ.32.29కోట్ల కాంట్రాక్టును కట్టబెట్టారు.



5. Accordingly, financial bid of technically qualified bidder was opened on 04.11.2025. The details are furnished below.

S. No	Name of the Tenderer	Rate quoted per Kg Rs. Ps. (incl. of all taxes)	Status
1.	M/s Indapur Dairy and Milk Product Limited, Indapur	658.00	L-1
2.	M/s Mother Dairy Fruit & Vegetable Private Limited, Tirupati	709.00	L-2

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2025లో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో ఇందాపూర్ డెయిరీ పాల్గొనట్టు వెల్లడిస్తున్న టీటీడీ రికార్డులు

మీది కూడా కల్తీ నెయ్యేనా చంద్రబాబూ...!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో నెయ్యి రూ.340 నుంచి రూ.410 వరకు పలు సార్లు వివిధ రేట్లకు కొనుగోలు చేస్తే తక్కువ రేటు కాబట్టి కల్తీ నెయ్యి అని చంద్రబాబు నానా రాద్ధాంతం చేస్తున్నారు. కానీ అసలు విషయం ఏమిటంటే... 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కిలో నెయ్యి కేవలం రూ.278, కిలో రూ.306 చొప్పున కొనుగోలు చేయడం గమనార్హం. అది కూడా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు చెందిన ఇందాపూర్ డెయిరీ నుంచే. అంటే తక్కువరేట్లే కాబట్టి ఇందాపూర్ డెయిరీతోపాటు హెరిటేజ్ సిండికేట్ ఐదేళ్లపాటు సరఫరా చేసింది కల్తీ నెయ్యేనని చంద్రబాబు ఒప్పుకున్నట్టే కదా. మరి అందుకు చంద్రబాబు తిరుమల శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెబుతారా అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

లడ్డూ ప్రసాదంపై పైపూతా...!?

ఇక 2014–19లో హెరిటేజ్ సిండికేట్ సరఫరా చేసింది కల్తీ నెయ్యేననే వాదనను అప్పటి ప్రభుత్వమే బలపరిచే విధంగా వ్యవహరించడం గమనార్హం. లడ్డూ ప్రసాదాలు సువాసన వచ్చేందుకు పైపూతగా నెయ్యి సరఫరాకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం టెండర్లు పిలవడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యితోనే సువాసన రావాలి. కానీ సువాసన కోసం పైపూతగా నెయ్యి కొనుగోలు కోసం మళ్లీ టెండర్లు పిలవడం ఏమిటి...! అంటే హెరిటేజ్ సిండికేట్‌లోని డెయిరీలు సరఫరా చేసింది కల్తీ నెయ్యేనని ఒప్పుకున్నట్టే కదా. అందుకే పైపూతగా నెయ్యి సరఫరా కోసం 2018, ఆగస్టులో టెండర్లు పిలిచి పరాగ్ మిల్క్, దొడ్ల డెయిరీల నుంచి 87,750 కిలోల నెయ్యి కొనుగోలు చేసింది. దీనిని బట్టి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగింది చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనేనని స్పష్టమవుతోంది.

కూటమి రాగానే మళ్లీ తెరపైకి ఇందాపూర్ డెయిరీ

2019లో టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోగానే హెరిటేజ్ ఫుడ్స్ కు చెందిన ఇందాపూర్ డెయిరీ టీటీడీ టెండర్ల ప్రక్రియ నుంచి తప్పుకుంది. అయిదేళ్లపాటు కనీసం బిడ్లు కూడా దాఖలు చేయలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ తెరపైకి వచ్చింది. 2025 నవంబరులో టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనడం గమనార్హం. కిలో రూ.658 చొప్పున నెయి సరఫరాకు బిడ్ దాఖలు చేసింది. మొత్తం 10లక్షల కిలోల నెయ్యిలో 35శాతం అంటే 3.50లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇందాపూర్ డెయిరీకి కట్టబెట్టారు. ఇక హెరిటేజ్ సిండికేట్‌లోని ఇతర డెయిరీలు మిగిలిన 6.50లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. అంటే మొత్తం రూ.65.80కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టేశారు.

కార్మిక గర్జన

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కదంతొక్కిన కార్మికులు

సాక్షి, అమరావతి: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికలోకం కదంతొక్కింది. సీఐటీయూ. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర పది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమ్మె విజయవంతమైంది. 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన 4 కొత్త లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. పలుచోట్ల వామపక్షాలు, కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ, ఆశ, వీఓఏ, మిడ్ డే మిల్, ఎల్‌ఐసీ తదితర యూనియన్ల శ్రేణులు ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, మానవహారాలు నిర్వహించారు. పలు డిమాండ్లపై తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. సమ్మె కారణంగా కాకినాడ పోర్టులో ఎగుమతులు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు స్తంభించాయి. బ్యాంకులు, బీఎస్‌ఎన్‌ఎల్, సహకార బ్యాంకులు, సంఘాలు, వాణిజ్య సంస్థల కార్యకలాపాలు నిలిచిపోయాయి. అరకు, బొర్రాలోని పర్యాటక సంస్థలన్నీ మూతబడ్డాయి. సమ్మెకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక సంఘాల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2గంటల వరకూ దుకాణాలు మూసేశారు. 15 జిల్లాల్లో మధ్యాహ్నం వరకూ ఆటోల బంద్ నిర్వహించారు. అప్పర్ సీలేరులో విద్యుత్తు కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. వీటీపీఎస్ వద్ద ఇంజినీర్లతో సహా నిరసనలు తెలియజేశారు. పోస్టల్ ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ ఉక్కు కర్మాగారం కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. విజయవాడలోనూ కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.

బాబూ ఏమిటీ లాలూ'ఛీ'

మీ హెరిటేజ్‌దే కదా ఇందాపూర్ డెయిరీ

- 2014లో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌తో కలిపి నెయ్యి సరఫరా చేసిందిగా..
- 2025లో మరలా నెయ్యి సరఫరాకు టెండర్ వేసిన అవే సంస్థలు
- తాజాగా కేజీ నెయ్యి ధరను రూ.658కి పెంచుతూ టెండర్లు
- ధరలు పెంచడం వెనుక భారీ కుట్ర
- దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాల్సిందే
- టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యి ధరలు, టెండర్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సంస్థ 'హెరిటేజ్' ప్రమేయంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. తిరుపతిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన హెరిటేజ్ సంస్థకు సంబంధించిన పలు ఆధారాలను బయటపెట్టారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే.. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫొటోతో పాటు 'ఇందాపూర్ డెయిరీ మిల్క్ ప్రొడక్ట్స్' అనే సంస్థ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా స్పష్టంగా ఉందని భూమన వెల్లడించారు. ఇదే ఇందాపూర్ సంస్థ 2014లో 16.50 లక్షల కేజీల నెయ్యిని కేజీ రూ.306కే టీటీడీకి సరఫరా చేసిన విషయాన్ని బయటపెట్టారు. మరోవైపు చంద్రబాబు హయాంలోనే (2014–19 మధ్య) ప్రీమియర్ డెయిరీ ఆగ్రో ఫుడ్స్ అనే సంస్థ కేజీ నెయ్యిని రూ.320, రూ.273, రూ.332కే దాదాపు 40 లక్షల కేజీల మేర సరఫరా చేసిందని సిట్ చార్జిషీట్‌లో నివేదించిన విషయాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.300లోపే స్వచ్ఛమైన నెయ్యి ఎవరిస్తారంటూ పదేపదే చంద్రబాబు ప్రశ్నించడాన్ని భూమన గుర్తుచేశారు. తన హయాంలో తక్కువ ధరకు కొన్నప్పుడు లేని అభ్యంతరం, ఇతరుల హయాంలో ఎందుకు వచ్చిందని ఆయన నిలదీశారు. మరోవైపు గతంలో కేజీ నెయ్యి రూ.278కు సరఫరా చేసిన ఇందాపూర్ సంస్థ, చంద్రబాబు అధికారంలోకి రావడంతో ఇప్పుడు కేజీ నెయ్యి ధరను ఏకంగా రూ.658కు పెంచి టెండర్లు దాఖలు చేయడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. 2014లో ఎల్–1 (కర్ణాటక మిల్క్ ఫెడరేషన్), ఎల్–2 (ఇందాపూర్) కలిపి కాంట్రాక్ట్ తీసుకున్నాయని, ఇప్పుడు 2025లో కూడా అవే సంస్థలు పోటీకి రావడం వెనుక భారీ లాలూచీ ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

హెరిటేజ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్టే ఇందాపూర్ డెయిరీ

చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ సంస్థ వెబ్‌సైట్‌ను తనిఖీచేస్తూ.. వాళ్ల మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్స్ చూస్తే.. ఇందాపూర్ డెయిరీ మిల్క్ ప్రొడక్ట్స్ అనే సంస్థ నారా భువనేశ్వరి ఫోటోతో పాటు ఉంది. 2014లో 16.50 లక్షల కేజీల నెయ్యిని కేజీ రూ.306కే ఇందాపూర్ డెయిర్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ మదర్ డెయిరీ యూనిట్‌తో కలిసి టీటీడీకి సరఫరా చేసింది. అప్పటి స్పెసిఫైడ్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న జేఎస్‌వీ ప్రసాద్ సంతకంతో 15–01–2015లో అనుమతి ఇచ్చారు. మొత్తం రూ.50.49 కోట్ల విలువైన నెయ్యిని ఈ రెండు సంస్థలు సంయుక్తంగా టీటీడీకి సరఫరా చేశాయి. ఈ ఇందాపూర్ సంస్థ హెరిటేజ్ యూనిట్ అని టీటీడీ వెబ్‌సైట్‌లో ఉంది. 2015లో ఇందాపూర్ సంస్థ మళ్లీ టెండర్లలో పాల్గొని కేజీ రూ.278కే నెయ్యి సరఫరా చేసింది. అంటే చంద్రబాబు కుటుంబ ఆధీనంలో నారా భువనేశ్వరి ఛైర్మన్‌గా ఉన్న హెరిటేజ్ సంస్థ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్టే ఇందాపూర్ డెయిరీ మిల్క్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ అనే విషయాన్ని వాళ్లే స్పష్టం చేశారని భూమన తెలిపారు.

అధిక ధరల వెనుక మతలబేంటో చెప్పాలి

ఇందాపూర్ పేరుతో నెయ్యి సరఫరా చేస్తూ.. హెరిటేజ్ సంస్థ పేరును బయటకు రాకుండా చూసుకున్నారని.. దీనికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని, దీని వెనుక ఉన్న వాస్తవాలను బయటపెట్టాలని భూమన డిమాండ్ చేశారు. ఒకేసారి కేజీ నెయ్యి రూ.658కు ఎందుకు పెరిగింది ? ఇదే సంస్థ రూ.278కు సరఫరా చేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో అంత తక్కువ ధర రూ.300కే ఎలా ఇస్తారని ప్రశ్నించిన చంద్రబాబు.. తన హెరిటేజ్‌కు చెందిన ఇందాపూర్ యూనిట్ కూడా అదే ధరకు సరఫరా చేసిందంటే అది కూడా కల్తీ నెయ్యి అనే అనుమానం ఇప్పుడు కలుగుతోందన్నా రు. ఒకవేళ ఇవాళ రూ.658కు పెంచి టెండర్లు దాఖలు చేసిందంటే.. ఏస్థాయిలో లాభాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రశ్న తలెత్తుతుందన్నా రు. 2014లో రూ.306కే 16.50 లక్షల కేజీలు నెయ్యి కొన్నప్పుడు ఎల్–1గా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ సరఫరా చేసిందని గుర్తు చేశారు. అప్పుడు కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌తో పాటు ఎల్ –2 గా ఉన్న ఇందాపూర్ మిల్క్ ఫెడరేషన్‌కు కలిపి కాంట్రాక్ట్ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆ రెండు సంస్థలే 2025లో పోటీకి వచ్చాయంటే.. ఈ సంస్థలు కలిపి టెండర్లు దాఖలు చేయడం, చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ఉన్న ఇందాపూర్ కూడా కలిసి ఉండడం వెనుక లాలూచీ ఉందన్న అనుమానాలను భూమన వ్యక్తం చేశారు. హెరిటేజ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ అయిన ఇందాపూర్ డెయిరీ ద్వారా జరుగుతున్న ఈ లావాదేవీల వెనుక ఉన్న వాస్తవాలను చంద్రబాబు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, కార్పొరేటర్ మోహన్‌కృష్ణ యాదవ్, పార్టీ సోషల్ మీడియా కో– ఆర్డినేటర్ బ్యాంగి నవీన్ పాల్గొన్నారు.

Who discovered the magnetic affects of current



ELECTRICITY

8 MARKS QUESTIONS

1. Deduce the expression for the equivalent resistance of the three resistors connected in parallel.

A. ***Parallel connection of resistors:*** Two or more resistors are said to be connected in parallel if same potential difference exist across them.

i) Consider three resistors R_1, R_2 and R_3 connected in parallel.

ii) Suppose a current I flows through the circuit when a cell of voltage 'v' is connected across the combination.

iii) The current I is divided as I_1, I_2 and I_3 which are flow through R_1, R_2 and R_3 respectively.



$I = I_1+I_2+I_3$ ....(1)

By Ohm's law,

$$I_1 = \frac{V}{R_1}; I_2 = \frac{V}{R_2}; I_3 = \frac{V}{R_3}$$

Substituting the values of I_1, I_2 and I_3 in eqn (1)

$$I = \frac{V}{R_1} + \frac{V}{R_2} + \frac{V}{R_3} \quad \text{............(2)}$$

Let us replace the three resistors with a single resistance R_{eq} such that the potential difference in the circuit does not change.

$$\therefore R_{eq} = \frac{V}{I} \qquad I = \frac{V}{R_{eq}}$$

From equation (2)

$$\frac{V}{R_{eq}} = \frac{V}{R_1} + \frac{V}{R_2} + \frac{V}{R_3}$$

$$V.\frac{1}{R_{eq}} = V\left(\frac{1}{R_1} + \frac{1}{R_2} + \frac{1}{R_3}\right)$$

$$\therefore \frac{1}{R_{eq}} = \frac{1}{R_1} + \frac{1}{R_2} + \frac{1}{R_3}$$

2. How can you prove that when several resisters are joined in series the resistance of the combination is equal to the sum of their individual resistances.

A. 1) Join three resistors R_1, R_2 and R_3 in series between the ends X and Y and connect them with a battery on ammeter and a plug key.

2) Insert a voltmeter of across the ends of X and Y of the Series Combination of three resistors of as Shown in the circuit.



Resistors in series

3) plug the key in the circute and note the voltmeter readings. It gives the potential difference across the series combination of visitors let it be V.

4) Now measure the potential differences across the two terminals of the battery compare the two values.

5) Take out the plug key and disconnect the voltmeter Now inject the voltmeter across the ends of H and P of the first resistor.

6) plug the key and Measure potential differences across the first resistor. let it be V_1.

7) Similarly measure the potential differences across the other three resistors separately. Let these values be V_2 and V_3 respectively.

8) The potential difference across a combination of resisters in series in equal to the sum of Potential difference across the individual resistors. That is $V = V_1+V_2+V_3$ --------(1)

9) The three resistors in series by an equivalent single resistance of resistance R_s such that potential difference V across it. and the current I the I -through the circuit remains same.

10) Applying the ohm's law to the entire circuit, we have $V = R_s$ ---------------(2)

11) On applying Ohm's law to the three v is resistors separately. We further have.

$V_1 = IR_1$ ------------------- (3)

$V_2 = IR_2$ ------------------ (4)

$V_3 = IR_3$ ------------------- (5)

12) From eq (1) $IR_s = IR_1+IR_2+IR_3$ or $R_s = R_1+R_2+R_3$

13) Hence when the several resistors are joined in series the resistance of the combination is equal to the sum of their individual resistance.

3. Define Ohm's Law. Write an activity to verify Ohm's Law.

A. **Ohm's Law:** The potential difference between the ends of a conductor is directly proportional to the electric current passing through it at constant temperature.

Aim : To verify Ohm's law or to show that $= \frac{V}{I}$ constant for a conductor.

Material required: A nichrome wire of length 0.5 cm, an ammeter, a voltmeter and four cells of 1.5V each.



Electric circuit for studying Ohm's law

Procedure:

1. Set up a circuit as shown in the figure, consisting of a nichrome wire XY of length, say 0.5 m, an ammeter, a voltmeter, and iron metals.
2. First use only one cell as the source in the circuit. Note the reading in the ammeter I, for the current and reading of the voltmeter V for the potential difference across the nichrome wire 'XY' in the circuit. Tabulate them in the table.
3. Next connect two cells in the circuit and note the respective readings of the ammeter and voltmeter for the values of current through the nichrome wire and potential difference across the nichrome wire.
4. Repeat the above steps using three cells and then four cells in the circuit separately.
5. Calculate the ratio of V to I (for each pair of potential difference V and current I)
6. We can see the reading in the following table.

S. No.	Number of cell using in the circuit	Current through the nichrome wire I (amp)	Potential difference across the nichrome wire V (volt)	V/I (Volt / amp)
1.	1			
2.	2			
3.	3			
4.	4			

Plot a graph between V and I and observe the nature of the graph.



Observations :

We observe that the ratio V/I is approximately the same to the graph between V and I is a straight line. A straight-line graph shows that as the current through the wire XY increases , the potential difference across the wire increases. This is called Ohm's law.

Explanation:

When we increase the cell or battery in the circuit step by step, the potential difference increases across the wire XY.

The potential difference is directly proportional to the current $V \propto I$ flowing through it. Reading in voltmeter and ammeter increases respectively.

Conclusion :

The ratio of V and I is a constant and this constant ratio is called Resistance. Hence Ohm's law is proved.

4. Explain the following :

a) Why is tungsten used almost exclusively for filament of electric lamps?

b) Why are the conductors of electric heating devices, such as bread- toasters and electric irons, made of an alloy rather than a pure metal?

Continued on next page..

c) **Why is the series arrangement not used for domestic circuits?**

d) **How does the resistance of a wire vary with its area of cross - section?**

e) **Why are copper and aluminium wires usually employed for electricity transmission?**

A. a) The tungsten is used almost exclusively for filament of electric lamps because it has a very high melting point (33000C). on passing electricity through tungsten filament, its temperature reaches to 27000C and it gives heat and light energy without being melted.

b) The conductors of electric heating devices such as bread-toasters and electric irons, are made of an alloy rather than a pure metal because the resistivity of an alloy is much higher than that of pure metal and an alloy does not undergo oxidation (or burn) easily even at high temperature.

c) The series arrangement is not used for domestic circuits because in series circuit, if one electrical appliance stops working due to some defect, then all other appliances also stop working because the whole circuit is broken.

d) The resistance of a wire is inversely proportional to its area of cross- section, i.e., Resistance R $\infty(1/\pi r^2)$. If the area of cross section of a conductor of fixed length is increased, then resistance decreases because there are more free electrons for movement in conductor.

e) Copper and aluminium wires usually employed for electricity transmission because they have very low resistances. So, they do not become too hot on passing electric current.

MAGNETIC EFFECTS OF ELECTRIC CURRENT

Important topics: Magnetic effect of current, Magnetic field lines, Magnetic flux, Magnetic flux density, Magnetic field due to straight wire carrying current, Magnetic field due to circular coil, Solenoid, Overloading of an Electric Circuit, Electric Fuse, Short Circuit.

Key Words

- **Magnetic field:-** A vector field that describes the magnetic influence on moving electric charges, electric currents and magnetic materials.
- **Field lines:-** Imaginary lines used to represent the direction and strength of a magnetic field with the direction of the line indicating the direction of the magnetic force.
- **Magnetic compass:-** A device that is used to find the direction by means of a needle that always points north. It works by aligning Itself with the Earth's magnetic field.
- **Magnetic flux:** The number of lines passing through the plane of area 'A' perpendicular to the field is called 'magnetic flux'. It is denoted by ϕ.
- **Magnetic flux density:** The magnetic flux density is defined as the magnetic flux passing through unit area taken perpendicular to the field.

  $B = \frac{\phi}{A}$
- **Solenoid :** The solenoid is an insulated and tightly wound long circular wire having large number of turns whose radius is small in comparison to its length. Magnetic field produced by a solenoid is similar to the magnetic field produced by a bar magnet.
- **Short Circuit :** Short-circuiting is caused by the touching of live wires and neutral wire and suddenly a large current flows.
- **Overloading of an Electric Circuit :** The overheating of electrical wire in any circuit due to the flow of a large current through it is called overloading of the electrical circuit.
- **Electric Fuse :** It is a protective device used for protecting the circuit from short - circuiting and overloading. It is a piece of thin wire of material having a low melting point and high resistance.

1 MARK QUESTIONS

1. **What is the direction of the magnetic field lines around a current carrying wire.**

A. Circular

2. **What is the region around a magnet where a force of attraction and repulsion is detected.**

A. Magnetic field.

3. **What is the nature of magnetic field line passing through the centre of current carrying circular loop**

A. Straight line.

4. **What is the best material to make permanent magnets.**

A. Alnico

5. **Who discovered the magnetic affects of current.**

A. HC Oersted.

6. **List two sources of magnetic fields.**

A. Magnet, Moving charges, Electric current.

7. **Which field has both strength and directions are constant?**

A. Uniform magnetic field.

8. **Name the long wire wound in a close packed helix.**

A. Solenoid.

9. **What is the unit of magnetic flux density?**

A. Weber/mt² (or) Tesla.

10. **What is induced current?**

A. The current produced by moving a straight line in a magnetic field is called 'induced current'.

2 MARK QUESTIONS

1. **What does the divergence of magnetic field lines near the ends of a current carrying straight Solenoid indicate.**

A. i. The magnetic field lines around a solenoid are closer together at the ends of the solenoid and spread out further away from the ends.

ii. This indicates that the magnetic field is strongest at the ends of the solenoid and the weakest away from the ends.

2. **List two methods of producing magnetic field The Sources of magnetic fields are as follows**

A. a) electromagnets

b) permanent magnets

c) current-carrying conductors

3. **The value of magnetic field induction which is uniform is 2T. What is the flux passing through the surface of area 1.5m² perpendicular to field?**

A. Magnetic induction of uniform field B = 2T

Surface area A = $1.5m^2$

Flux ϕ = ?

We know

$$B = \frac{\phi}{A} \Rightarrow \phi = BA\cos\theta$$

$\phi = BA$

Where B is perpendicular to area *l*s

$\Delta\phi = 2\times1.5 = 3$ Weber.

4. **Imagine that you are sitting in a chamber with your back to one wall. An electron beam, moving horizontally from back wall towards the front wall, is deflected by a strong magnetic field to your right side. what is the direction of magnetic field?**

A. The direction of the magnetic field is vertically downwards by Fleming's left hand role Explanation

1) Central finger is placed in the direction of current which is opposite to the direction of electron beam.
2) Thumb is placed force towards right side.
3) The force finger pointing downwards gives the direction of magnetic field.

5. **What is the function of an earth wire? why is it necessary to earth metallic appliances?**

A: 1) The main function of earth wire is to protect appliances from Sudden damage to leakage of current.

2) The metallic body of electric appliances is connected to earth wire so that any leakage of electric current is transferred to the ground.

6. **When does an electric short circuit occur?**

A. An electric short circuit occurs when the live wire and neutral wire come in contact with each other. It happens When.

1. The insulation of the wire is damaged.
2. There fault in the electrical appliances.

7. **What is the function of an earth wire? Why is it necessary to earth metallic application?**

A. Earth wire is a safety measure that provides a low resistance conducting path to the current. Sometimes due to excess heat or wear and tear, the live wire comes in direct contact. with the metallic over of the appliances, which can give an electric shock on touching them. To prevent from the shock the metallic part is connected to the earth through a three pin plug due to which the current flow to the earth at the instant there is a circuit.

AV Sudhakar
School Assistant (PS),
ZPPHS Chennarayunipalem,
Bogole (M), SPSR Nellore

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **Which of the following converts electrical energy into mechanical energy**
   a) motor b) battery
   c) generator d) switch

2. **Which of the following converts mechanical energy into electrical energy**
   a) motor b) battery
   c) generator d) switch

3. **The magnetic force on a current carrying wire placed in uniform magnetic field if the wire is oriented perpendicular to magnetic field is**
   a) 0 b) ILB
   c) 2ILB
   d) ILB/2

4. **One Tesla =**
   a) Newton/Coloumb
   b) Newton / ampere - meter
   c) Ampere / meter
   d) Newton / ampere second

5. **Unit of Magnetic flux**
   a) dyne
   b) Oersterd
   c) Guass
   d) Weber

క్లుప్తంగా...

రాష్ట్రంలో అసంపూర్తిగా హార్బర్లు

• ఎంపీ మేడా రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన హార్బర్ల నిర్మాణాన్ని చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేయడంతో అవి అసంపూర్తిగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి హార్బర్ల పనులు జరగడం లేదని కేంద్రం దృష్టికి తెచ్చారు. బోట్ల సురక్షిత బెర్తింగ్, ల్యాండింగ్ సౌకర్యాలు, ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్, ఆక్షన్ హాల్స్, శుభ్రమైన చేపల హ్యాండ్లింగ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వీటిని ప్రారంభించారని చెప్పారు. కేంద్రం జోక్యం చేసుకుని హార్బర్లను పూర్తి చేయాలని కోరారు.

మాజీ మంత్రి కాకాణికి హైకోర్టులో ఊరట

సాక్షి, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో బాలిక మృతి చెందిన ఘటనపై ప్రభుత్వాన్ని విమర్శించినందుకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులో ఆయనకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఈ కేసులో చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేర్ని నానిపై కేసులో చట్టప్రకారం నడుచుకోండి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానికి హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై నమోదు చేసిన కేసులో చట్ట ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుకు నోటీసు జారీ చేసి... తదుపరి విచారణను మార్చి 12కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ ప్రభంజనం

మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు (ఎడ్యుకేషన్): ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో 25 ర్యాంకులు సాధించారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మీడియాకు గురువారం తెలిపారు. సీఎంఏ ఫైనల్‌లో చందు రవితేజ 16వ ర్యాంకు, కొల్లి దుంతిసాయి 17వ ర్యాంకు, టి.అశోక్‌కుమార్ 30వ ర్యాంకు, జీఎస్ ఏలుమలై 31వ ర్యాంకు, జాగర్లమూడి హస్విత 40వ ర్యాంకు సాధించినట్టు వివరించారు. సీఎంఏ ఇంటర్‌లో దేవరచెట్టి ఆయుష్మాన్ 5వ ర్యాంకు, అబ్బూరి జశ్వంత్‌సాయి 13వ ర్యాంకు, వనం లోకేశ్ 21వ ర్యాంకు, కె.మహేష్ 22వ ర్యాంకు, కూరాకుల భవ్యాస్ 25వ ర్యాంకు, ఎస్.మనోహర్ చౌదరి 27వ ర్యాంకు, ఏ.భువనేశ్వరి 28వ ర్యాంకు, కరణం ఉదయ్‌కిరణ్ 32వ ర్యాంకు, గొల్లపల్లి వీరగీత 35వ ర్యాంకు, కె.మానస 37వ ర్యాంకు, కొయ్య గణేష్ 37వ ర్యాంకు, బీవీ మూర్తేశ్వరరావు 39వ ర్యాంకు, టి.మధుసూదన్‌రెడ్డి 41వ ర్యాంకు, గోనుగుండ్ల నేహాశ్రీ 42వ ర్యాంకు, ఆర్.చరణ్‌కుమార్ 46వ ర్యాంకు, ఆర్.కృతి 47వ ర్యాంకు, డి.నిఖిల్ రామ్‌సాయి 47వ ర్యాంకు, ఓ.మునిజశ్వంత్ 48వ ర్యాంకు, కాట్రగడ్డ వందన 48వ ర్యాంకు, కె. సాత్విక్ 49వ ర్యాంకు కైవసం చేసుకున్నారని చెప్పారు.

సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న జెనెక్స్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్): సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమీ విద్యార్థులు విజయభేరి మోగించారని డైరెక్టర్లు ఎన్.వెంగళరెడ్డి, పి.కొండలరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం స్థానిక హరనాథపురంలోని అకాడమీలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 559 మార్కులతో జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు సాధించాడన్నారు. అమూల్య 545 మార్కులు, కె.అజయ్‌కుమార్ 544, కె.చందన 543, బి.శ్వేత 541, బి.సాయికృష్ణారెడ్డి 537, నవ్యశ్రీ 534, నవీన్ 526, ఎస్‌కే సమీర 525, దివ్యప్రియ 510 మార్కులు సాధించారన్నారు. సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో రామ్‌ప్రసాద్‌నాయక్ 583 మార్కులు, రోహిత్ 582, అజయ్ నిహార్ 573, గోవర్ధన్ 567, భరత్‌కుమార్, 557, లక్ష్మీఅలేఖ్య 556, లాస్యప్రియ 550, హరీష్ 549 మార్కులు పొందారని వివరించారు. సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో 18 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. సీఎంఏ ఫైనల్, ఇంటర్‌లో 152 మంది ఉత్తీర్ణులైనట్టు చెప్పారు.

జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

2023లో అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన జాహ్నవి

కందుల జాహ్నవి సొంతూరు కర్నూలు జిల్లా ఆదోని

మూడు రోజుల క్రితం తండ్రి శ్రీకాంత్ గుండెపోటుతో మరణం

జాహ్నవి (ఫైల్)

కర్నూలు (సెంట్రల్)/ఆదోని సెంట్రల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన కందుల జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారాన్ని వాషింగ్టన్‌లోని సియోటెల్ సిటీ అటార్నీ జనరల్ ఎరికా ఇవాన్స్ అధికారికంగా ప్రకటించారు. ''జాహ్నవి మృతి మా హృదయాలను కలచివేసింది. ఈ ఆర్థికసాయమైనా ఆమె కుటుంబానికి కాస్తంత ఓదార్పు అందిస్తుందని ఆశిస్తున్నాం'' అని ఇవాన్స్ వెల్లడించారు.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన జాహ్నవి

కర్నూలు జిల్లా ఆదోనిలోని తిరుమలగిరిలో నివాసం ఉంటున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, విజయలక్ష్మి దంపతులు కౌతాళం మండలం కుంబళనూరు నుంచి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు సంతానం. మొదటి కుమార్తె జాహ్నవి ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లింది. అక్కడి నార్త్ ఈస్టన్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ కోర్సులో చేరింది. అయితే 2023 జనవరి 23న జాహ్నవి రోడ్డు దాటుతుండగా పోలీసు పెట్రోలింగ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో 100 అడుగుల దూరంలో ఎగిరిపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయింది. ఈ ప్రమాదానికి పోలీసు వాహనం నడుపుతున్న కెవిన్ డవే అనే అధికారి కారణమయ్యారు. అయితే ఆమె మృతిపై మరో అధికారి డేనియల్ అడరర్ అత్యంత నిర్లక్ష్యంగా జోకులు వేస్తూ మరో అధికారితో మాట్లాడడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. ''ఈమెకు 26 ఏళ్లు ఉంటాయేమో. అయినా సాధారణ వ్యక్తి. ఈమె మరణానికి ఎలాంటి విలువ లేదు'' అని అడరర్ వ్యాఖ్యానించడం మరో అధికారి బాడీ కెమెరాలో రికార్డయింది. భారత విద్యార్థి మృతి, అధికారి అనుచిత వ్యాఖ్యలపై భారత్ భగ్గుమంది. అమెరికా పౌరులూ డేనియల్ అడరర్ తీరును ఖండించారు. దీంతో అతనిపై వేటు పడింది. విధుల నుంచి పోలీసు ఏజెన్సీ తప్పించింది. ఈ క్రమంలో సియాటెల్ సిటీ అధికారులే తమ కుమార్తె మరణానికి కారణమని 110 మిలియన్ డాలర్లు పరిహారంగా చెల్లించాలని జాహ్నవి కుటుంబం 2024 సెప్టెంబర్‌లో దావా వేసింది. ఈ క్రమంలో పూర్తి స్థాయి విచారణ జరిపిన వాషింగ్టన్ రాష్ట్రంలోని సియాటెల్ సిటీ అటార్నీ జనరల్ ఎరికా ఇవాన్స్ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతోనే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించి బాధిత కుటుంబానికి పరిహారం ప్రకటించారు. ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.262 కోట్ల పరిహారం చెల్లించేలా అగ్రిమెంట్ జరిగినట్లు తెలుస్తోంది. త్వరలోనే బాధిత కుటుంబానికి భారత ఎంబసీ ద్వారా ఆ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మూడు రోజుల క్రితమే జాహ్నవి తండ్రి మృతి

ఆదోనిలోని తిరుమలగిరిలో నివాసం ఉంటున్న జాహ్నవి తల్లిదండ్రులు కుమార్తె మరణంతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితమే తండ్రి శ్రీకాంత్ గుండెపాటుతో మరణించారు. దీంతో తల్లి విజయలక్ష్మి, చిన్న కూతురు మాత్రమే ఉన్నారు. ఈ క్రమంలో వారికి భారీ పరిహారం అందితే ఎంతో అండగా ఉంటుంది. అయితే ఈ విషయం వారికి తెలియదు. ప్రస్తుతం వారు శ్రీకాంత్ మరణంతో తీవ్ర విషాదంలో ఉన్నారు.

రాజధాని నిర్మాణ పనుల్లో నిబం'ధన'ల లూటీ

- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే రూ.3,005.25 కోట్ల పనులు కాంట్రాక్టర్‌కు అప్పగింత
- మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించేందుకు పీఏవో ససేమిరా
- దాంతో ఆ పనులకు అనుమతివ్వాలంటూ ఆర్థిక శాఖకు ఏడీసీఎల్ ఎండీ ప్రతిపాదన
- వాటిని ఆమోదించిన ఆర్థిక శాఖ
- గతంలో రూ.524.70 కోట్లతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్ పనుల్లోనూ ఇదే తీరు

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణ పనుల్లో ప్రభుత్వ పెద్దల దన్నుతో ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్), సీఆర్‌డీఏ(రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) ఉన్నతాధికారులు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనడానికి ఇది మరో తార్కాణం. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే రూ.3,005.25 కోట్ల పనులను కాంట్రాక్టర్లకు ఏడీసీఎల్ అప్పగించేసింది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఆ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు మొబిలైజేషన్ అడ్వాన్సు, బిల్లులు చెల్లించడానికి పీఏవో (పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్) కార్యాలయం అధికారులు నిరాకరించారు. దీంతో చేసేదిలేక ఆ పనులకు అనుమతి ఇవ్వాలని ఆర్థిక శాఖకు ఏడీసీఎల్ ఎండీ గతేడాది నవంబర్ 27, ఈ ఏడాది జనవరి 6న ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు వాటిని ఆర్థిక శాఖ ఆమోదించింది. దీంతో రూ.3,005.25 కోట్లతో చేపట్టిన ఆ పనులకు అనుమతిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇదే తరహాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్ల పనులను రూ.524.70 కోట్ల వ్యయంతో కాంట్రాక్టర్లకు అప్పగించడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. రాజధానిలో జోన్–8 (కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి) లే అవుట్ అభివృద్ధి పనులను రూ.1,863 కోట్లతో చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఏడీసీఎల్ అధికారులు పంపిన ప్రతిపాదనపై గతేడాది నవంబర్ 12న పురపాలక శాఖ ఆమోదముద్ర వేసి, పరిపాలన అనుమతి ఇచ్చింది. అలాగే ఈ–13 రహదారిని ఎన్‌హెచ్–16 వరకూ పొడిగించేందుకు 7.29 కిలోమీటర్ల పొడవున ఆరు వరుసల రహదారి నిర్మాణ పనులను రూ.834.66 కోట్ల అంచనా వ్యయంతో.. ఇక ఈ–15 రహదారిని పాత మంగళగిరి హైవే వరకూ పొడిగించే పనులను రూ.307.59 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఏడీసీఎల్ అధికారులు పంపిన ప్రతిపాదనపై గతేడాది మార్చి 19న పురపాలక శాఖ ఆమోదముద్ర వేసి, పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ మూడు పనులు చేపట్టడానికి ఆర్థిక శాఖ అనుమతి తీసుకోలేదు.

మూడు ప్యాకేజీలూ మేఘాకే..

- ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఏ పనీ చేపట్టకూడదన్నది నిబంధన. కానీ.. ఆ నిబంధనను ఉల్లంఘించి ఈ మూడు పనులకు ఏడీసీఎల్ అధికారులు టెండర్లు పిలిచారు. రాజధానిలో జోన్–8 లే అవుట్‌లో రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ, విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్ వంటి వాటికి యుటిలిటీ డక్టులు, మురుగు నీటి శుద్ధి కేంద్రాలు, శుద్ధి చేసిన నీటిని పునర్ వినియోగించేందుకు పైపు లైను.. రహదారులకు ఇరువైపులా చెట్లను పెంచడంతోపాటు ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులకు రూ.1305.39 కోట్ల వ్యయంతో నవంబర్ 14న ఏడీఎసీఎల్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ టెండర్లలో 4.03 శాతం అధిక ధర అంటే.. రూ.1358 కోట్లకు కోట్ చేసిన మేఘా సంస్థకు పనులు అప్పగించడానికి సీఆర్‌డీఏ అథారిటీ, కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. దాంతో ఆ పనులను మేఘాకు అప్పగించారు. దీని వల్ల ఖజానాపై రూ.52.61 కోట్ల భారం పడింది. అంటే.. ఖజానాకు ఆ మేరకు నష్టం వాటిల్లింది. ఆ మేరకు కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరింది. ఇక ఈ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.277.85 కోట్లను రీయింబర్స్ చేస్తామని ఏడీసీఎల్ పేర్కొంది. అంటే.. ఈ పనుల కాంట్రాక్టు విలువ రూ.1,635.85 కోట్లకు చేరుకుంది.
- ఈ–13 రహదారిని ఎన్‌హెచ్–16 వరకూ పొడిగించేందుకు 7.29 కిమీల పొడవున ఆరు వరుసల రహదారి నిర్మాణ పనులకు రూ.384.78 కోట్ల అంచనా వ్యయంతో పిలిచిన టెండర్లలో 4.10 శాతం అధిక ధరకు అంటే రూ.400.55 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన మేఘా సంస్థ వాటిని దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ వంటి పన్నుల రూపంలో అదనంగా రూ.81.92 కోట్లు ఏడీసీఎల్ ఇవ్వనుంది. అంటే.. దాని కాంట్రాక్టు విలువ రూ.482.47 కోట్లకు చేరింది. అంటే.. కి.మీకు రూ.66.18 కోట్ల చొప్పున రోడ్డు నిర్మాణ పనులను అప్పగించినట్లు స్పష్టమవుతోంది. ఇదే పద్ధతిలో జాతీయ రహదారులను కి.మీకు రూ.20 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ఏఐ నిర్మిస్తుండటం గమనార్హం.
- ఇక ఈ–15 రహదారిని పొడిగించే పనులకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్వహించిన టెండర్లలో 3.98 శాతం అధిక ధరకు అంటే రూ.72.78 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన మేఘా సంస్థ వాటిని దక్కించుకుంది.
- ఈ మూడు ప్యాకేజీల పనుల దక్కించుకున్న మేఘాకు.. కాంట్రాక్టు విలువలో 10 శాతం

2. In the reference 2nd read above, the Chairperson & Managing Director, ADCL has informed that, the Government have issued Administrative Sanction for an amount of ₹1863.00 crore towards Package XXXXXI in G.O.Rt.No.1234 of MA&UD (CRDA) Dept., dated 12.11.2025, without obtaining concurrence of the Finance Department. Therefore, she has requested that necessary orders be issued for financial concurrence to the above GO, for smooth processing of work bills payments.

నిబంధనలకు విరుద్ధంగా రూ.1,863 కోట్లతో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడానికి వీలుగా ఆర్థిక శాఖ అనుమతి ఇప్పించాలని కోరుతూ ఏడీసీఎల్ ఎండీ పంపిన ప్రతిపాదన

Municipal Administration & Urban Development (CRDA) Department – Issued administrative sanction in G.O.Rt.No.1234, MA&UD(CRDA)Dept., Dt.12.11.2025, for an amount of ₹1863.00 crore towards Package XXXXXI for the "Construction of Roads, Drains, Water Supply, Sewerage, Utility Ducts for Power and ICT, Reuse Water Line, STP, and Avenue Plantation, compatible with Trunk Infrastructure in Layouts for Land Pooling Schemes at Krishnayapalem (V), Venkatapalem (V), Penumaka (V), and Undavalli (V) villages in Zone-8 area, and Penumaka Layout in adjacent zones of Amaravati Capital City, Andhra Pradesh – Post-fact approval of Finance Department - Orders – Issued.

==

MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (CRDA) DEPARTMENT

G.O.Rt.No.148 **Dated :12.02.2026**

Read the following:-

ఏడీసీఎల్ ఎండీ పంపిన ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదించడంతో.. రూ.1,863 కోట్లతో చేపట్టిన పనులకు అనుమతి ఇస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి గురువారం జారీ చేసిన ఉత్తర్వులు

గతంలోనూ ఇదే తీరు..

రాజధానిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్ల కోసం ఎస్+12 పద్ధతిలో 18 టవర్లలో 432 ఫ్లాట్ల (యూనిట్లు) నిర్మాణ పనులు 2019 నాటికే 72 శాతం పూర్తయ్యాయి. ఆ పనులకు రూ.363.68 కోట్ల బిల్లులు చెల్లించారు. మిగిలిన 28 శాతం పనుల వ్యయం రూ.272.22 కోట్లు. కానీ.. ఆ పనుల అంచనా వ్యయాన్ని రూ.524.70 కోట్లకు పెంచేసి, 2017లో వాటిని అప్పగించిన ఎన్‌సీసీ సంస్థకే మళ్లీ ఇప్పుడు కట్టబెట్టారు. అంటే.. అంచనా వ్యయాన్ని రూ.252.48 కోట్లు పెంచేసినట్లు స్పష్టమవుతోంది. 2018–19 నాటితో పోల్చితే ఇప్పుడు స్టీలు, సిమెంటు, పెట్రోల్, డీజిల్, నిర్మాణ సామగ్రి ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. పైగా ఇసుక ఉచితం. అయినా సరే మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 92.75 శాతం పెంచేయడంపై ఇంజినీర్లు నివ్వెరపోతున్నారు. ఆ పనులకూ ఆర్థిక శాఖ అనుమతి లేకపోవడంతో మొబిలైజేషన్ అడ్వాన్సు చెల్లించేందుకు పీఏవో కార్యాలయం తిరస్కరించింది. దాంతో ఆర్థిక శాఖ అనుమతి కోసం సీఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు వాటికి ఆర్థిక శాఖ అంగీకరించడంతో ఆ పనులకు అనుమతి ఇస్తూ గతేడాది జూలై 13న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మొబిలైజేషన్ అడ్వాన్సు చెల్లించాలని ఏడీసీఎల్ అధికారులు పంపిన ప్రతిపాదనలను పీఏవో కార్యాలయం తిరస్కరించింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా చేపట్టిన ఆ పనులకు మొబిలైజేషన్ అడ్వాన్సులతోపాటు ఎలాంటి బిల్లులు చెల్లించబోమని తేల్చిచెప్పింది.

నాసిరకం లైనింగ్‌పై పీపీఏ సీరియస్

- పగుళ్లు వచ్చిన చోట లైనింగ్ మొత్తం తొలగించి, కొత్తగా నిర్మించాలని ఆదేశం
- ఆ మేరకు పనులు చేస్తున్న కాంట్రాక్టర్

పీపీఏ సీఈవో ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాసిరకంగా చేసిన లైనింగ్‌ను తొలగించే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ లైనింగ్ పనులు అత్యంత నాసిరకంగా చేస్తుండటంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో యోగేష్ పైథంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నాసిరకంగా వేసిన లైనింగ్‌ను తొలగించి... నిబంధనల ప్రకారం నాణ్యతతో చేయాలని ఆదేశించారు. దీంతో లైనింగ్ పగిలిపోయిన ప్రాంతాల్లో మొత్తం లైనింగ్‌ను కాంట్రాక్టు సంస్థ తొలగించి కొత్తగా లైనింగ్ చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ 5, 5ఏ ప్యాకేజీల పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తుండటం, అత్యంత నాసిరకంగా కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తుండటం వల్ల అప్పుడే ఎక్కడికక్కడ పగుళ్లు రావడం.. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ పెద్దల అండ ఉండటంతో నాణ్యతపై అధికారులు నోరుమెదపలేని పరిస్థితిని ఆధారాలతో సహా బట్టబయలు చేస్తూ ఈ నెల 8న 'వియ్యంకులకు పోలవరం' శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై పీపీఏ సీఈవో యోగేష్ పైథంకర్ స్పందించారు. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను వివరణ కోరారు. తక్షణమే నాసిరకంగా చేసిన పనులను తొలగించి.. నాణ్యతతో పనులు చేయించాలని ఆదేశించారు. దాంతో కాకినాడ జిల్లా తుని మండలం వి.కొత్తూరు సమీపంలో పోలవరం ఎడమ కాలువకు అత్యంత నాసిరకంగా చేసిన లైనింగ్ పనులను గురువారం నుంచి కాంట్రాక్టర్ తొలగిస్తున్నారు. వాటి స్థానంలో కొత్తగా కాంక్రీట్ లైనింగ్ వేయనున్నారు.

భారీగా అంచనాలు పెంచేసినా...

పోలవరం ఎడమ కాలువ 5, 5ఏ ప్యాకేజీల్లో 2019 అక్టోబర్ 3 నాటికి మిగిలిన రూ.81.63 కోట్ల విలువైన పని అంచనా వ్యయాన్ని చంద్రబాబు ప్రభుత్వం రూ.293.66 కోట్లకు పెంచేసింది. వాటిని 4.68 శాతం అధిక ధరకు.. అంటే రూ.307.41 కోట్లకు కోట్ చేసిన ఈనాడు రామోజీరావు కుమారుడి వియ్యంకుడు రాయల రఘుకు చెందిన 'ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్'కు గతేడాది అక్టోబర్ 17న కట్టబెట్టింది. అంటే.. మిగిలిన పని అంచనా వ్యయం కంటే రూ.225.78 కోట్లు (277 శాతం) ఎక్కువకు అంచనాలను పెంచేసినట్లు స్పష్టమవుతోంది. పనులు అత్యంత నాసిరకంగా చేస్తూ పెంచేసిన అంచనా వ్యయాన్ని 'నీకింత... నాకింత' అంటూ పచ్చ ముఠా పంచుకు తింటోందని సాగునీటి రంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా 2019 ఏప్రిల్ 1న రాజమహేంద్రవరం బహిరంగ సభ వేదికగా కమీషన్ల కోసం పోలవరం ప్రాజెక్టును సీఎం చంద్రబాబు 'ఏటీఎం'గా మార్చుకున్నారంటూ ప్రధాని మోదీ చేసిన ఆరోపణలను గుర్తు చేస్తున్నారు.

భీమిలి బీచ్‌లో నిర్మాణాలు జరుగుతుంటే పట్టదా!

- చోద్యం చూసిన అధికారులపై చర్యలు చేపట్టండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖలోని భీమునిపట్నం బీచ్ సమీపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల విషయంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారుల తీరుపై హైకోర్టు మండిపడింది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోకుండా చోద్యం చూసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ నిర్మాణం విషయంలో స్పందించని అధికారులను జీవీఎంసీ కమిషనర్ రక్షిస్తున్నారంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. అలక్ష్యం ప్రదర్శించిన అధికారుల పేర్లు ఇవ్వాలని ఇప్పటికే రెండు సార్లు ఆదేశించినా ఇవ్వలేదని తెలిపింది. కమిషనర్ తీరుతో తాము విసిగిపోయామంది. భీమునిపట్నం బీచ్‌లో నిర్మించిన అక్రమ కట్టడం తొలగించడం వల్ల వచ్చిన వ్యర్థాలను మూడు వారాల్లో తొలగించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. భీమునిపట్నం బీచ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ గోడ నిర్మించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ 2024లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గురువారం ఈ వ్యాజ్యంపై మరోసారి విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెస్టోబార్‌ల విషయంలో చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు దాఖలు చేసిన పిల్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. దీనిపై లోతుగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

ఈ–బస్సుల నిర్వహణకు 12 డిపోల ఎంపిక

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే 'పీఎం ఈ–బస్ సేవ' పథకం ద్వారా రాష్ట్రంలో 750 ఈ–బస్సులను నిర్వహించేందుకు పుణేకు చెందిన పినాకిల్ మొబిలిటీ సంస్థను ఎంపిక చేసినట్టు ఆర్టీసీ ఈడీ రవివర్మ తెలిపారు. ఈ–బస్సుల చార్జింగ్, నిర్వహణ, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కోసం రాష్ట్రంలో 11 నగరాల్లో 12 డిపోలను ఎంపిక చేసినట్టు ఆయన గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆయా డిపోల్లో ఈ–బస్సులతో పాటు డీజిల్ బస్సులను కూడా సమాంతరంగా నిర్వహిస్తామన్నారు.

అంబటికి 26 వరకు రిమాండ్

5 రోజుల కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు లీగల్/రాజమహేంద్రవరం: వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు ఈ నెల 26 వరకు రిమాండ్ విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి సంబరాల అంశంపై సత్తెనపల్లి పోలీసుల పీటీ వారెంట్‌పై అంబటి రాంబాబును గుంటూరు కోర్టుకు తీసుకొచ్చారు. ఇప్పటికే రెండు కేసుల్లో ఆయనకు బెయిల్ రాగా.. సుమారు 33 కేసుల్లో 41 నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినా ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు పాత కేసుల్ని తవ్వి పీటీ వారెంట్లు ఇస్తున్న సంగతి తెలిసిందే. 2023లో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో దానిపై కోర్టులో ప్రైవేటు కంప్లెయింట్ దాఖలు చేశారు. దీంతో అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో ఇప్పటి వరకు కనీసం నోటీసులు కూడా ఇవ్వని పోలీసులు బుధవారం పట్టాభిపురం కేసులో బెయిల్ రాగానే ఎఫ్ఐఆర్‌ను సవరించి అదనపు సెక్షన్లు పెట్టి పీటీ వారెంట్‌పై గురువారం కోర్టుకు తీసుకొచ్చారు.

'కక్ష సాధింపుతో ఇబ్బంది పెట్టాలనే ఇలాంటి కేసులు'

అంబటి రాంబాబు తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇది మూడేళ్లలోపు శిక్షపడే కేసు కావడంతో రిమాండ్ ఇవ్వకూడదని వాదించారు. ప్రభుత్వం తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. ఇది మనీ సర్క్యులేషన్ స్కీం కింద వస్తుందని అందుకే రిమాండ్ ఇవ్వాలని కోరారు. దీనిపై పొన్నవోలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా రంగోలి పోటీల బహుమతుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం మనీ సర్క్యులేషన్ కింద ఎలా వస్తుందని, వచ్చిన డబ్బులతో మహిళలకు బహుమతులు అందచేశారని పొన్నవోలు తెలిపారు. దీనికి 420 సెక్షన్ ఎలా వర్తిస్తుందో చెప్పాలన్నారు. దీనికి సంబంధించిన తీర్పులేమైనా ఉంటే చూపించాలని కోరారు. కేవలం కక్ష సాధింపుతో అంబటి రాంబాబును ఇబ్బంది పెట్టాలనే చిన్న చిన్న కేసులను పెద్దవిగా చూపిస్తున్నారని పొన్నవోలు అన్నారు. కేసును సాయంత్రానికి వాయిదా వేసిన న్యాయమూర్తి ఈ నెల 26 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు పోలీసులు అంబటి రాంబాబును 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 13న వాదనలు వినిపించనున్నారు. కాగా.. అంబటి రాంబాబును కోర్టులో హాజరుపరిచేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి గురువారం ఉదయం 6.30 గంటలకు తీసుకెళ్లారు. కోర్టులో వాదనలు ముగిసి మరో 14 రోజులు రిమాండ్ విధించడంతో తిరిగి రాత్రి 8.30 గంటల సమయంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు.

చంద్రబాబు ఎన్ని అబద్ధాలు చెప్పినా నిజం కావు

- తాడేపల్లిలోని 10.4 ఎకరాలు ఇప్పటికీ రైల్వే రికార్డుల్లోనే ఉన్నాయి
- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిలో హెలీప్యాడ్ కోసం రైతు భూమిని బలవంతంగా లాక్కున్నారంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఘాటుగా స్పందించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. దశాబ్దాలుగా రైల్వే ఆధీనంలో ఉన్న ఆ భూమిని ఏ రైతూ సాగు చేసిన ఆధారాల్లేవని స్పష్టం చేశారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నందునే.. వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే అబద్ధాలు చెబితే తప్పు ఒప్పు కాదని విమర్శించారు. తాడేపల్లిలోని సర్వే నంబర్లు 223, 226 సీ2లో 10.4 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా నమోదై ఉందని... ఆ భూమిని తమ ప్రభుత్వం 22ఏలో చేర్చలేదని.. అది 2015లో ఆర్‌సీ నంబర్ 2207/2015 సీ5 ద్వారా నమోదైందన్నారు. అనంతరం 2016 మే 26న ఈ భూమి అధికారికంగా నోటిఫై అయిందని, గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న రికార్డులు కూడా దీనిని నిర్ధారిస్తున్నాయని, మంగళగిరి–తాడేపల్లి మున్సిపాలిటీ రికార్డుల్లో కూడా ఇవే వివరాలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన ఆ ప్రైవేట్ వ్యక్తి అసలు రైతే కాదని, ఆయన ఓ పారిశ్రామికవేత్త అని వేమారెడ్డి అన్నారు. అనుకూల మీడియా ఉందని సీఎం చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెబితే నమ్మే రోజులు కావన్నారు.

స్నేహిత్ శుభారంభం

చెన్నై: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ శుభారంభం చేశాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 100వ ర్యాంకర్ స్నేహిత్ 9–11, 11–8, 8–11, 11–7, 11–6తో భారత్‌కే చెందిన దివ్యాంశ్ శ్రీవాస్తవపై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. భారత్‌కే చెందిన ఆకాశ్ పాల్, అంకుర్, హర్మీత్ కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

సాకేత్ జంట ఓటమి

చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ డబుల్స్‌లో సాకేత్ మైనేని–సిద్ధాంత్ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్–సిద్ధాంత్ ద్వయం 5–7, 4–6తో జే క్లార్క్ (బ్రిటన్)–శశికుమార్ ముకుంద్ (భారత్) జంట చేతిలో ఓడింది. సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సుమిత్ నగాల్ (భారత్) 6–4, 6–7 (2/7), 3–6తో పీటర్ బార్ (రష్యా) చేతిలో, సిద్ధార్థ్ (భారత్) 2–6, 3–6తో కస్నికొస్కీ (పోలాండ్) చేతిలో ఓడిపోయారు.

రత్ననాయకే

రత్ననాయకే, షనక మెరుపులు

ఒమన్‌పై శ్రీలంక విజయం

పల్లెకెలె: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు టి20 ప్రపంచకప్‌లో రెండో విజయం అందుకుంది. ఒమన్ జట్టుతో గురువారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో దసున్ షనక నాయకత్వంలోని శ్రీలంక జట్టు 105 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పవన్ రత్ననాయకే (28 బంతుల్లో 60; 8 ఫోర్లు, 1 సిక్స్), దసున్ షనక (20 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61; 7 ఫోర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 120 పరుగులే చేసింది. మొహమ్మద్ నదీమ్ (56 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. శ్రీలంక బౌలర్లలో చమీర, తీక్షణ రెండు వికెట్ల చొప్పున తీశారు. వెల్లలాగె, హేమంత, కమిందులకు ఒక్కో వికెట్ దక్కింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X జింబాబ్వే
వేదిక: కొలంబో; ఉ.గం. 11 నుంచి

కెనడా X యూఏఈ
వేదిక: న్యూఢిల్లీ; మ.గం. 3 నుంచి

నెదర్లాండ్స్ X అమెరికా
వేదిక: చెన్నై; రాత్రి గం. 7 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇషాన్, పాండ్యా చెలరేగగా...

భారత్‌కు భారీ విజయం • 93 పరుగులతో నమీబియా ఓటమి
వరుణ్ చక్రవర్తి 3/7 • ఆదివారం పాకిస్తాన్‌తో భారత్ పోరు

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్, చిన్న బౌండరీలు కాబట్టి భారత జట్టు ఈసారి '300' కొడుతుందా అనే చర్చ మధ్య నమీబియాతో మ్యాచ్ మొదలైంది. ఆరంభంలో ఆట చూస్తే అది సాధ్యమే అని కూడా అనిపించింది. చివరకు వచ్చేసరికి ఇది జరగకపోయినా గత మ్యాచ్‌తో పోలిస్తే భారత బ్యాటింగ్ పదును పెరిగింది. అమెరికాతో ఆశించిన స్కోరుకంటే చాలా తక్కువగా నమోదు చేసిన టీమిండియా ఈసారి మాత్రం 200 దాటింది. ఆపై సమష్టి ప్రదర్శనతో బలహీన ప్రత్యర్థిని కట్టడి చేసిన జట్టు తమ టి20 ప్రపంచకప్ చరిత్రలో అతి పెద్ద విజయాన్ని నమోదు చేసింది. ఇషాన్ మెరుపులు, వరుణ్ చక్రవర్తి పొదుపైన బౌలింగ్, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టును గెలిపించాయి. ఇక ఆదివారం పాకిస్తాన్‌తో జరిగే అసలు పోరుపైనే అందరి దృష్టి నిలిచింది.

న్యూఢిల్లీ: టి20 వరల్డ్‌కప్ డిఫెండింగ్ చాంపియన్ భారత్ గ్రూప్ 'ఎ'లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 93 పరుగుల తేడాతో నమీబియాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (24 బంతుల్లో 61; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు సాధించారు. నమీబియా కెప్టెన్, ఆఫ్‌స్పిన్నర్ గెరార్డ్ ఎరాస్మస్ (4/20) పొదుపైన బౌలింగ్ సహా 4 వికెట్లు పడగొట్టడం విశేషం. భారత్ చివరి 11 బంతుల్లో 4 పరుగులు మాత్రమే చేసి 5 వికెట్లు చేజార్చుకుంది. అనంతరం నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. లౌరెన్ స్టీన్‌కాంప్ (20 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా...వరుణ్ చక్రవర్తి 7 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ కోసం భారత తుది జట్టులో రెండు మార్పులు జరిగాయి. అభిషేక్ శర్మ అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతని స్థానంలో సంజు సామ్సన్‌కు అవకాశం దక్కగా... బుమ్రా తిరిగి రావడంతో సిరాజ్‌ను తప్పించాల్సి వచ్చింది. తమ తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఈ నెల 15న కొలంబోలో పాకిస్తాన్‌తో తలపడుతుంది.

ఇషాన్ 6, 6, 6, 6, 4...

అభిషేక్ గైర్హాజరులో అదృష్టవశాత్తూ మ్యాచ్ అవకాశం దక్కించుకున్న సంజు సామ్సన్ (8 బంతుల్లో 22; 1 ఫోర్, 3 సిక్స్‌లు) సిక్స్‌తో స్కోరింగ్ మొదలు పెట్టినా అది ఎక్కువసేపు సాగలేదు. షికోంగో ఓవర్లో వరుసగా 6, 6, 4 బాదిన అతను తర్వాతి బంతికి వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో ఇషాన్ తన జోరును మొదలు పెట్టాడు. 8 బంతుల వ్యవధిలో 4 ఫోర్లు కొట్టిన అతను... స్మిట్ వేసిన ఓవర్లో సిక్సర్లతో చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో వరుసగా 6, 6, 6, 6, 4 బాదిన అతను 20 బంతుల్లోనే అర్ధ సెంచరీని పూర్తి చేసుకోవడం విశేషం. పవర్‌ప్లే ముగిసేసరికి 86 పరుగులు చేసిన భారత్... 6.5 ఓవర్లలోనే 100 పరుగులను అందుకుంది. టి20 వరల్డ్ కప్‌లో అతి తక్కువ బంతుల్లో (35 బంతుల్లో) వంద పరుగులు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఇషాన్ అవుటైన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ (12), హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ (21 బంతుల్లో 25; 3 ఫోర్లు) కూడా తక్కువ వ్యవధిలోనే వెనుదిరిగారు. అయితే పాండ్యా, శివమ్ దూబే (16 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) భారీ భాగస్వామ్యంతో స్కోరు 200 దాటింది. వీరిద్దరు 39 బంతుల్లో 81 పరుగులు జత చేశారు. షికోంగో ఓవర్లో వరుసగా సిక్స్, 2 ఫోర్లు కొట్టిన హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. చివర్లో వేగంగా ఆడే ప్రయత్నంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది.

ఇషాన్ కిషన్

హార్దిక్ పాండ్యా

టపటపా...

ఛేదనలో దాదాపు సగం ఓవర్ల వరకు నమీబియా ప్రదర్శన మెరుగ్గానే ఉంది. పవర్‌ప్లేలో జట్టు 57 పరుగులు చేసింది. స్టీన్‌కాంప్‌తో పాటు ఫ్రైలింగ్ (15 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), ఎరాస్మస్ (11 బంతుల్లో 18; 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. 9.1 ఓవర్లలో జట్టు 86/2 వద్ద నిలిచింది. అయితే ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. భారత బౌలర్లు చెలరేగడంతో నమీబియా బ్యాటర్లు ఎవరూ నిలవలేకపోయారు. 8 పరుగుల వ్యవధిలో తర్వాతి నాలుగు వికెట్లు కోల్పోయిన టీమ్ కోలుకోలేకపోయింది. ఒకే స్కోరు వద్ద జట్టు చివరి 3 వికెట్లు పడ్డాయి.

ఎరాస్మస్ 'డెడ్ బాల్'

భారత్‌తో మ్యాచ్‌లో నమీబియా కెప్టెన్ ఎరాస్మస్ బౌలింగ్ శైలి చర్చకు దారి తీసింది. బౌలింగ్ క్రీజ్ వద్ద నుంచి చాలా వెనుక ఉంటూనే అతను బంతులు వేస్తుండటం కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది. అతని తొలి ఓవర్లో దీనిని అంపైర్ టకర్ 'డెడ్ బాల్'గా ప్రకటించాడు. దాంతో అంపైర్‌కు ఎరాస్మస్‌కు మధ్య కాస్త వాదన జరిగింది. అయితే అతని మరుసటి ఓవర్లో అంపైర్ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. నిబంధనల ప్రకారం అది తప్పేమీ కాదు. అయితే తొలి ఓవర్లో మరీ అంపైర్ వెనక నుంచి బౌలింగ్ చేసిన ఎరాస్మస్ ఈసారి కాస్త ముందుకు వచ్చి అంపైర్‌కు కనపడేలా బౌలింగ్ చేయడంతో సమస్య రాలేదు. ఈ తరహా బౌలింగ్‌తో పాటు తన రెగ్యులర్ ఆఫ్ స్పిన్...రౌండ్ ఆర్మ్...ఇలా వైవిధ్యాన్ని చూపిస్తూ భారత బ్యాటర్లను కన్‌ఫ్యూజన్‌కు గురి చేసిన ఎరాస్మస్ నాలుగు వికెట్లు బుట్టలో వేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) షికోంగో (బి) ఎరాస్మస్ 61; సామ్సన్ (సి) స్టీన్‌కాంప్ (బి) షికోంగో 22; తిలక్ (సి) స్మిట్ (బి) ఎరాస్మస్ 25; సూర్యకుమార్ (స్టంప్డ్) గ్రీన్ (బి) స్కాల్ 12; పాండ్యా (సి) (సబ్) లీషర్ (బి) ఎరాస్మస్ 52; దూబే (రనౌట్) 23; రింకూ (సి) ఎరాస్మర్ (బి) స్మిట్ 1; అక్షర్ (బి) ఎరాస్మస్ 0; వరుణ్ (నాటౌట్) 1; అర్ష్‌దీప్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 209. వికెట్ల పతనం:** 1–25, 2–104, 3–120, 4–124, 5–205, 6–205, 7–206, 8–206, 9–209. **బౌలింగ్:** రూబెన్ 4–0–38–0, షికోంగో 3–0–41–1, స్మిట్ 4–0–50–1, హీన్‌గో 1–0–18–0, ఎరాస్మస్ 4–0–20–4, స్కాల్ 4–0–41–1.

నమీబియా ఇన్నింగ్స్: స్టీన్‌కాంప్ (బి) వరుణ్ 29; ఫ్రైలింక్ (సి) దూబే (బి) అర్ష్‌దీప్ 22; జాన్ నికోల్ (సి) అక్షర్ (బి) వరుణ్ 13; ఎరాస్మస్ (సి) తిలక్ (బి) అక్షర్ 18; స్మిట్ (బి) వరుణ్ 0; గ్రీన్ (హిట్‌వికెట్) (బి) దూబే 11; క్రూగర్ (సి) బుమ్రా (బి) అక్షర్ 5; రూబెన్ (బి) బుమ్రా 6; స్కాల్ (సి) అక్షర్ (బి) పాండ్యా 4; షికోంగో (ఎల్బీ) (బి) పాండ్యా 0; హీన్‌గో (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 116. వికెట్ల పతనం:** 1–33, 2–67, 3–86, 4–86, 5–88, 6–94, 7–111, 8–116, 9–116, 10–116. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4–0–21–2, అర్ష్‌దీప్ సింగ్ 3–0–36–1, శివమ్ దూబే 2.2–0–11–1, జస్‌ప్రీత్ బుమ్రా 4–0–20–1, వరుణ్ చక్రవర్తి 2–0–7–3, అక్షర్ పటేల్ 3–1–20–2.

'అన్నదమ్ములు' అదరగొట్టారు

ప్రపంచకప్‌లో ఇటలీ తొలి విజయం నమోదు
10 వికెట్లతో నేపాల్ చిత్తు • గెలిపించిన 'మోస్కా' బ్రదర్స్

నేపాల్ మూడో టి20 ప్రపంచ కప్ ఆడుతుండగా... ఇటలీ మొదటిసారి వరల్డ్ కప్ బరిలోకి దిగింది. తొలి పోరులో స్కాట్లాండ్ చేతిలో 73 పరుగులతో ఇటలీ చిత్తుగా ఓడగా...నేపాల్ చివరి వరకు ఇంగ్లండ్‌ను బెదరగొట్టి దురదృష్టవశాత్తూ 4 పరుగులతో ఓడింది. ఈ రెండు జట్ల మధ్య అనుభవం, ఫామ్‌ను బట్టి చూస్తే అంతా నేపాల్‌నే ఫేవరెట్‌గా భావించారు. పైగా వాంఖెడే మైదానం సగానికి పైగా నేపాల్ అభిమానులతోనే నిండిపోయి అదనపు మద్దతు కూడా కనిపించింది. అయితే ఇటలీ మాత్రం ఎక్కడా తగ్గలేదు. తమకంటే మెరుగైన జట్టుతో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి సంచలనాన్ని నమోదు చేసింది. 'మోస్కా బ్రదర్స్' కలిసి వరల్డ్ కప్‌లో ఆడిన రెండో మ్యాచ్‌లోనే ఇటలీకి ఘన విజయాన్నందించారు.

జస్టిన్ మోస్కా, ఆంథోనీ మోస్కా

ముంబై: టి20 వరల్డ్ కప్‌లో చిన్న జట్ల మధ్య జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో అంచనాలకు భిన్నమైన ఫలితం నమోదైంది. గురువారం జరిగిన ఈ పోరులో ఇటలీ 10 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌటైంది. ఆరిఫ్ షేక్ (24 బంతుల్లో 27; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ రోహిత్ పౌడెల్ (23), ఆసిఫ్ షేక్ (20) తలా కొన్ని పరుగులు చేశారు. ఇతర ప్రధాన బ్యాటర్లు కుశాల్ భుర్తేల్ (5), దీపేంద్ర సింగ్ ఐరీ (17) ప్రభావం చూపించలేకపోవడంతో నేపాల్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఇంగ్లండ్‌పై గత మ్యాచ్‌లో 17 ఫోర్లు, 7 సిక్స్‌లు బాదిన నేపాల్ బ్యాటర్లు ఈసారి 7 ఫోర్లు, 3 సిక్స్‌లు మాత్రమే నమోదు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లెగ్ స్పిన్నర్ క్రిషాన్ కలుగమగే (3/18) మూడు కీలక వికెట్లతో జట్టును దెబ్బ తీశాడు. అనంతరం ఛేదనలో ఇటలీ ఎక్కడా తడబడకుండా అలవోకగా దూసుకుపోయింది. ఇటలీ 12.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లుగా బరిలోకి దిగిన అన్నదమ్ములు ఆంథోనీ మోస్కా (32 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), జస్టిన్ మోస్కా (44 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) కలిసి అభేద్యంగా మరో 44 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించారు.

'మెనెంటీ బ్రదర్స్' కూడా...

'మోస్కా బ్రదర్స్'కు ఆటలో స్ఫూర్తిగా నిలిచిన మరో ఇద్దరు ఆస్ట్రేలియన్ సోదరులు కూడా ఇటలీ జట్టులోనే ఉన్నారు. నేపాల్‌తో మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన హ్యారీ మెనెంటీ చిన్నవాడు కాగా, బెన్ మెనెంటీ అతనికంటే మూడేళ్ల పెద్దవాడు. వీరు కూడా సిడ్నీకి చెందిన వారే. ఈ ఇద్దరి ప్రోత్సాహంతోనే క్రికెట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన 'మోస్కా బ్రదర్స్' ఇప్పుడు వారిద్దరిలో కలిసి ఇటలీ జట్టు తరఫున వరల్డ్ కప్ ఆడటం విశేషం. అయితే 'మెనెంటీ'లకు ఇప్పటికే చెప్పుకోదగిన అనుభవం ఉంది. బిగ్ బాష్ లీగ్‌లో అడిలైడ్ స్ట్రయికర్స్, సిడ్నీ సిక్సర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు టాస్మేనియా తరఫున 35 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడారు.

బెన్ హ్యారీ

హాకీ వరల్డ్ కప్‌లో ఆడి...

ఇటలీ టీమ్‌లో ఇద్దరు దక్షిణాఫ్రికా క్రికెటర్లు కూడా ఉన్నారు. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన దురదృష్టవశాత్తూ గాయంతో టోర్నీకి దూరమైన వేన్ లీ మాడ్సన్ స్వస్థలం డర్బన్. జాతీయ జట్టుకు టెస్టు ఆడే అవకాశం రాకపోయినా... మాడ్సన్‌కు ఏకంగా 253 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల అనుభవం ఉంది. అతను దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున 2006 హాకీ వరల్డ్ కప్‌లో, 2006 కామన్వెల్త్ గేమ్స్‌లో ఆడటం విశేషం. సఫారీ టీమ్‌కు 2021 వరకు 6 వన్డేలు, 13 టి20లు ఆడిన జేజే స్మట్స్ ఇప్పుడు ఇటలీ టీమ్‌లో ఉన్నాడు. తన జీవితంలో ఒక్కసారి కూడా ఇటలీ దేశంలో అడుగు పెట్టకుండా అతను ఆ దేశం తరఫున వరల్డ్ కప్ ఆడుతుండటం ఆసక్తికరం.

ఆస్ట్రేలియా నుంచి వచ్చి...

ఇటలీ తొలి గెలుపులో ఇద్దరు సోదరులు ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా కీలక పాత్ర పోషించారు. తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం ఇటలీ నుంచి ఆస్ట్రేలియాకు వలస వెళ్లగా వీరిద్దరు అక్కడే సిడ్నీలో పుట్టారు. అక్కడి క్రికెట్ సంస్కృతి వల్ల ఆటపై మక్కువ పెంచుకొని ఇద్దరూ కలిసే ఆటను నేర్చుకోవడంతో పాటు ప్రాక్టీస్ కూడా చేసేవారు. ఆస్ట్రేలియాలో క్లబ్ స్థాయిలో ఆడిన తర్వాత వీరిద్దరు ఇటలీ చేరారు. తమ కొత్త జట్టును తీర్చిదిద్దేందుకు ఇటలీకి ఇలాంటి ఆటగాళ్ల అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో జాతీయ జట్టుకు ఎంపికైన వీరిద్దరు 2022లో ఒకే మ్యాచ్ ద్వారా (గ్రీస్‌పై) అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయడం విశేషం. టోర్నీ ముగిసిన తర్వాత 'మోస్కా బ్రదర్స్' తిరిగి ఆస్ట్రేలియాకు వెళ్లిపోతారు. పెద్దవాడైన ఆంథోనీ పదేళ్ల పాటు కార్పెంటర్‌గా పని చేసి బాలఖైదీల కేంద్రంలో కార్పెంటర్ పనిని నేర్పించే ఉద్యోగంలో ఇటీవలే చేరాడు. మూడేళ్లు చిన్నవాడైన జస్టిన్ ఒక పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్నాడు.

7 టి20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటి వరకు ఏడు అన్నదమ్ముల జోడీలు కలిసి మ్యాచ్‌లు ఆడాయి. తాజా ప్రపంచకప్‌లో ఇటలీ నుంచి రెండు 'బ్రదర్స్' జోడీలు ఆంథోనీ మోస్కా–జస్టిన్ మోస్కా ; హ్యారీ మెనెంటీ –బెన్ మెనెంటీ రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగాయి. గతంలో ఇర్ఫాన్ పఠాన్–యూసుఫ్ పఠాన్ (భారత్; 2007)... నాథన్–బ్రెండన్ మెకల్లమ్ (న్యూజిలాండ్)... డ్వేన్ బ్రావో–డారెన్ బ్రావో (వెస్టిండీస్) ... మోర్నీ మోర్కెల్–అల్బీ మోర్కెల్ (దక్షిణాఫ్రికా)... డేవిడ్ హస్సీ–మైక్ హస్సీ (ఆస్ట్రేలియా) 'బ్రదర్స్' కలిసి టి20 ప్రపంచకప్‌లో ఆడారు.

శ్రీలంకలో పుట్టి...

కలుగమగే

నేపాల్‌తో మ్యాచ్‌లో సత్తా చాటిన లెగ్‌స్పిన్నర్ క్రిషాన్ కలుగమగే శ్రీలంకలో పుట్టాడు. క్రికెట్‌పై పిచ్చితో ఆటను మొదలు పెట్టిన అతను అండర్–15 స్థాయి వరకు అక్కడే ఆడాడు. అయితే అదే సమయంలో కుటుంబం ఇటలీ వలస వెళ్లేందుకు సిద్ధమైంది. ఇటలీలో ఆట ఉండదు కాబట్టి తన క్రికెట్ కెరీర్ కోల్పోతానని భయంతో అతను వెళ్లడానికి ఇష్టపడకపోయినా చివరకు తప్పలేదు. అయితే అక్కడికి వెళ్లాక క్రికెట్ అవకాశాలు రావడంతో పరిస్థితి మారి వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆదివారం మాత్రమే సాధన చేసే కలుగమగే... ఇటాలియన్ స్పెషల్ పిజ్జాలు తయారు చేసే 'లా విటా పిజారియా' అనే హోటల్‌లో సోమవారం నుంచి శనివారం వరకు 'షెఫ్'గా పని చేస్తాడు.

మూడు పతకాలూ మనవే

• 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్
• ఐశ్వర్య ప్రతాప్, నీరజ్, అఖిల్‌లకు స్వర్ణ, రజత, కాంస్యాలు

పతకాలతో నీరజ్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్, అఖిల్ (ఎడమ నుంచి)

న్యూఢిల్లీ: స్వదేశంలో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం సీనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలతోపాటు టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 362 పాయింట్లతో ప్రపంచ రికార్డు స్కోరును సాధించాడు. స్వర్ణ పతకాన్ని నెగ్గాడు. భారత్‌కే చెందిన నీరజ్ కుమార్ 361.8 పాయింట్లతో రజతం కైవసం చేసుకోగా... అఖిల్ షెరాన్ 343.5 పాయింట్లతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. ఐశ్వర్య ప్రతాప్, నీరజ్, అఖిల్‌లతో కూడిన భారత బృందం 1769 పాయింట్లతో టీమ్ విభాగంలో స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్లు అడ్రియన్ కర్మాకర్ 353.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని... మానవేంద్ర సింగ్ షెఖావత్ 338.6 పాయింట్లతో కాంస్య పతకాన్ని నెగ్గారు. అడ్రియన్ కర్మాకర్, మానవేంద్ర సింగ్, ప్రిన్స్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో 1741 పాయింట్లతో బంగారు పతకాన్ని సాధించింది. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటి వరకు భారత షూటర్లు 38 స్వర్ణాలు, 16 రజతాలు, 16 కాంస్యాలతో కలిపి 70 పతకాలు సాధించారు.

సెమీస్‌లో రష్మిక జోడీ

పుణే: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక–అంకిత రైనా (భారత్) ద్వయం 7–6 (9/7), 6–3తో భారత్‌కే చెందిన వైష్ణవి–వైదేహి జంటపై గెలుపొందింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక–అంకిత రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశారు. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లికి మాత్రం నిరాశ ఎదురైంది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ (భారత్)–జుజానా పావ్లీకొస్కా (పోలాండ్) జంట 6–4, 3–6, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో పోలీనా బఖ్‌ముత్కినా (బెల్జియం)–మరియా గొలోవినా (రష్యా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది.

భారత్ 0 అర్జెంటీనా 8

రూర్కెలా: పురుషుల ప్రొ హాకీ లీగ్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. ఒలింపిక్ మాజీ చాంపియన్ అర్జెంటీనాతో గురువారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 0–8 గోల్స్ తేడాతో ఓడిపోయింది. బుధవారం బెల్జియం చేతిలో 1–3తో ఓడిన టీమిండియా... రెండో మ్యాచ్‌లో మాత్రం ఖాతా కూడా తెరువలేదు. అర్జెంటీనా తరఫున టొమాస్ డొమినె (15వ, 20వ, 26వ, 60వ నిమిషాల్లో) నాలుగు గోల్స్ చేయగా... నికోలస్ డెల్లా టెరీ (30వ నిమిషంలో), టొమాస్ రూయిజ్ (14వ నిమిషంలో), ఇగ్నాసియో (25వ నిమిషంలో), లూసియో మెండెజ్ (22వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఈ మ్యాచ్‌లో తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను, ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను భారత ఆటగాళ్లు వృథా చేయడం గమనార్హం. నేడు విశ్రాంతి దినం. శనివారం జరిగే మూడో మ్యాచ్‌లో బెల్జియంతో భారత్ ఆడుతుంది.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
559	147
83,675	25,807

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,739	▽	327
డోజోన్స్	49,614	▽	507
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,395	▽	77
డాక్స్	24,304	▽	187
షాంఘై	4,134	△	2
నిక్కీ	57,639	▽	11

అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	90.10	91.12
£	బ్రిటన్ పౌండ్	122.04	126.08
€	యూరో	106.19	109.04
¥	జపాన్ యెన్ (100)	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	62.10	66.05
S$	సింగపూర్ డాలర్	69.50	73.26
SAR	సౌదీ రియాల్	23.29	24.89
UAE D	యూఏఈ దిర్హమ్	23.80	25.07
¥	చైనా యువాన్	12.25	14.07

వసూల్ రాజాలకు వార్నింగ్

- కస్టమర్ల వేధింపులకు చెక్
- కాల్స్ రికార్డ్ చేయాలి
- రుణగ్రహీతలతో మర్యాదగా వ్యవహరించాలి
- రికవరీ ఏజెంట్లకు ఆర్‌బీఐ గైడ్‌లైన్స్

ముంబై: రికవరీ ఏజెంట్లు ఆగడాలకు కళ్లెం దిశగా రిజర్వ్ బ్యాంక్ గురువారం కొన్ని ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. వీటి ప్రకారం లోన్ రికవరీ బాధ్యతలు నిర్వర్తించే ఏజెంట్లు తప్పనిసరిగా దానికి సంబంధించిన శిక్షణ పొందాలి. బ్యాంకు ఉద్యోగి లేదా రికవరీ ఏజెంట్లు రుణగ్రహీతతో గౌరవప్రదంగా మాట్లాడాలి. వసూలు కోసం వెళ్లినప్పుడు కూడా మర్యాదకరంగా వ్యవహరించాలి. రుణగ్రహీతలకు ఏజెంట్లు చేసే ఫోన్ కాల్స్ అన్నీ కూడా తప్పకుండా రికార్డ్ అయ్యేలా బ్యాంక్ చర్యలు తీసుకోవాలి. ఏజెంట్లు లేదా ఉద్యోగుల దగ్గరున్న కస్టమర్ల వివరాలను దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రికవరీ ప్రయత్నాల్లో భాగంగా బెదిరింపులు, దుర్భాషలాడటం, అనుచిత మెసేజీలు పంపించడంలాంటివి చేయకూడదు. రుణ గ్రహీత కుటుంబం దుఃఖంలో ఉన్న పరిస్థితుల్లో, వివాహ వేడుకలు, పండుగల్లాంటి సందర్భాల్లో లోన్ రికవరీ ప్రయత్నాలు చేయకూడదు. రికవరీ ఏజెంట్లుగా వ్యవహరించే వారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబీఎఫ్) నిర్వహించే 'డెట్ రికవరీ ట్రైనింగ్' తీసుకోవడాన్ని తప్పనిసరి చేసే అంశాన్ని ఆర్‌బీఐ పరిశీలిస్తోంది. రికవరీ ఏజెన్సీలు తాము నియమించుకునే ఏజెంట్ల పూర్వచరిత్ర గురించి కూడా తెలుసుకునేలా బ్యాంకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ రుణ బాకీల అంశం న్యాయస్థానం పరిధిలో ఉంటే ఆ వ్యవహారాన్ని ఉద్యోగులకు లేదా రికవరీ ఏజెంట్లకు రిఫర్ చేసే విషయంలో బ్యాంకులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. మానిటరీ పాలసీ సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా రికవరీలకు నిర్దిష్ట ప్రకటన చేసిన మీదట రిజర్వ్ బ్యాంక్ తాజా ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించడం గమనార్హం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
క్విక్ కామర్స్‌లో హైరింగ్ కిక్ | విశాఖలో ఇళ్ల అమ్మకాలు ఢీలా

ఇక ధరల లెక్క కొత్తగా

- వినియోగ ధరల సూచీలో కీలక మార్పులు
- జనవరిలో ద్రవ్యోల్బణం 2.75%
- సీపీఐకి బేస్ ఇయర్‌గా 2024
- తెలంగాణలో ధరలు ఎక్కువ

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణ సూచీ.. క్షేత్రస్థాయిలో వాస్తవ ధరలను ప్రతిఫలించడం లేదన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. వీటికి సమాధానంగానా అన్నట్టు.. కేంద్ర ప్రభుత్వం వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ)లో కీలక మార్పులు, చేర్పులు చేసింది. సీపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం (రిటైల్)కు ఇప్పటివరకు 2012 బేస్ ఇయర్‌గా ఉండగా దీన్ని 2024కు మార్చింది. గృహ వినియోగ, వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) 2023–24ను ఇందుకు పరిగణనలోకి తీసుకుంది. సీపీఐలో కొన్ని వినియోగ వస్తువులను, సేవలను చేరుస్తూ.. అదే సమయంలో కొన్నింటిని తొలగించింది. కొన్నింటి వెయిటేజీ తగ్గిస్తూ.. కొన్నింటికి పెంచింది. కొత్త బేస్ సంవత్సరం ఆధారంగా చూస్తే ఈ ఏడాది జనవరిలో నిత్యావసర ధరలు పెరిగినట్టు తెలుస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం 2.75 శాతానికి ఎగిసింది. 2012 బేస్ సంవత్సరం ప్రకారం డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 1.33 శాతమే. సీక్వెన్షియల్‌గా (నెలవారీ) పెరగ్గా.. 2025 జనవరిలో ఉన్న 4.26 శాతంతో పోల్చినప్పుడు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం జనవరిలో 2.77 శాతంగా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో 2.73 శాతంగా నమోదైంది. ముఖ్యంగా ఆహారం, మెటల్స్ ధరలు పెరగడం ద్రవ్యోల్బణం ఎగిసేందుకు దారితీసింది. దీంతో ద్రవ్యోల్బణం వరుసగా మూడో నెలలోనూ పెరిగినట్టయింది. అయినప్పటికీ ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్యం 4 శాతానికి దిగువనే ఉండడం గమనార్హం. ఈ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసింది.

సీపీఐలో చేరినవి	సీపీఐ నుంచి తొలగించినవి
గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు (అద్దెలు, నిర్వహణ వ్యయాలు)	వీసీఆర్/వీసీడీ/డీవీడీ ప్లేయర్లు
ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు/స్ట్రీమింగ్ సేవలు	రేడియో, టేప్‌రికార్డర్
విలువ ఆధారిత పాడి ఉత్పత్తులు	వినియోగించిన వస్త్రాలు
బార్లీ, సంబంధిత ఉత్పత్తులు	సీడీ/డీవీడీలు, ఆడియో/వీడియో క్యాసెట్లు
పెన్ డ్రైవ్‌లు, ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్క్	కాయిర్/రోప్
వ్యాయామ పరికరాలు	హైరింగ్ చార్జీలు (బాడుగకు తీసుకున్న వాటికి చెల్లించేవి)
అటెండెంట్, బేబీ సిట్టర్ (ఇళ్లలో సహాయకులు)	

- కొత్త సిరీస్ ప్రకారం దేశంలో అత్యధికంగా 4.92 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం తెలంగాణలో నమోదైంది. ఆ తర్వాత కేరళ, తమిళనాడులో అధిక ద్రవ్యోల్బణం కనిపించింది.
- జనవరిలో ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం 2.13 శాతంగా, హౌసింగ్‌లో 2.05 శాతం చొప్పున నమోదైంది. వస్త్రాలు, పాదరక్షల విభాగంలో 2.98 శాతంగా ఉంది.
- వెల్లుల్లి, ఉల్లి, ఆలుగడ్డలు, కందిపప్పు, శనగపప్పు ధరలు తగ్గాయి.
- వెండి, బంగారం, వజ్రం, ప్లాటినం ఆభరణాలు, టమాటాలు, కొబ్బరి, కొబ్బరి నూనె ధరలు పెరిగాయి.
- కొత్త సిరీస్‌లో వస్తువులు 259 నుంచి 308కి పెరిగాయి. సేవలు సైతం 40 నుంచి 50కు చేరాయి. ధరల ప్రభావం మరింత వాస్తవికంగా ఉండేందుకు ఈ చేరికలు సాయపడనున్నాయి.
- సూచీలో ఆహారం, పానీయాలకు ఇప్పటి వరకు 45.86 శాతం వాటా ఉంటే, కొత్త సిరీస్‌లో 36.75 శాతానికి తగ్గింది.

హెచ్‌యూఎల్ హవా

క్యూ3లో లాభం రూ. 6,603 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ రంగ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 6,603 కోట్లను తాకింది. ఐస్‌క్రీమ్ బిజినెస్ విడదీత కారణంగా వన్‌టైమ్ ఆర్జన ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 2,989 కోట్లు ఆర్జించింది. క్వాలిటీ వాల్స్(ఇండియా) పేరుతో ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను స్వతంత్ర సంస్థగా విడదీసింది. ఇది మినహాయిస్తే నికర లాభం 1 శాతమే పుంజుకుని రూ. 2,562 కోట్లకు చేరింది. కాగా.. ఈ కాలంలో కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 576 కోట్లు కేటాయించింది. ఇక తాజా త్రైమాసికంలో మొత్తం అమ్మకాలు 6 శాతం బలపడి రూ. 16,197 కోట్లను తాకాయి. గత క్యూ3లో రూ. 15,322 కోట్ల ఆదాయం అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు 6 శాతంపైగా పెరిగి రూ. 13,078 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నీరసించి రూ. 2,410 వద్ద ముగిసింది.

టెక్ టైటాన్స్ షేక్

559 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ ● నిఫ్టీకి 147 పాయింట్ల నష్టం

ముంబై: అంతర్జాతీయంగా అడ్వాన్స్‌డ్ కృత్రిమ మేధ(ఏఐ) ఆందోళనలు అధికమవడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలు సన్నగిల్లడంతో దేశీయ ఐటీ కంపెనీల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. మరోవైపు ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడులు చేసేందుకు యూఎస్ సిద్ధమవడంతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఫలితంగా గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ అరశాతానికి పైగా నష్టపోయింది. సెన్సెక్స్ 559 పాయింట్లు పతనమై 83,675 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 147 పాయింట్లు నష్టపోయి 25,807 వద్ద నిలిచింది. ఉదయమే బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా అదే వైఖరి కొనసాగించాయి. ఐటీతో పాటు రియల్టీ, చమురు, ఇంధన, సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ డిస్క్రెషనరీ, కమోడిటీస్ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇంట్రాడేలో 717 పాయింట్లు క్షీణించి 83,517 వద్ద, నిఫ్టీ 202 పాయింట్లు పతనమై 25,752 ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఆసియాలో జపాన్, హాంగ్‌కాంగ్, ఇండోనేసియా మార్కెట్లు నష్టపోయాయి. చైనా, కొరియా, థాయ్‌లాండ్, సింగపూర్ మార్కెట్లు లాభాలతో గట్టెక్కాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. అమెరికా సూచీలు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ షేర్లలో కోఫోర్జ్ 6.61%, టెక్ మహీంద్రా 6.40%, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఎల్‌టీఐఎం 6% - 5.50 శాతం క్షీణించాయి. హెచ్‌సీఎల్ టెక్, ఎంఫసీస్, విప్రో, పెర్సిస్టెంట్ షేర్లు 5% పతనమయ్యాయి. సెన్సెక్స్ కోల్పోయిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 500 పాయింట్లు కావడం గమనార్హం. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయి టాప్–5 షేర్లలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌లు తొలి స్థానాల్లో ఉన్నాయి.
- టీసీఎస్ షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారి రూ.10 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. దీంతో మార్కెట్ క్యాప్ పరంగా ఐదో స్థానానికి పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంకు షేరు నాలుగో స్థానానికి చేరింది.

మహీంద్రా ఈ-ఆటో 'ఉడో'

ప్రారంభ ధర రూ. 3,58,999

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మహీంద్రా గ్రూప్‌లో భాగమైన మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ తాజాగా 'ఉడో' పేరిట ఎలక్ట్రిక్ ఆటోను గురువారమిక్కడ ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ధర రూ. 3,84,299 కాగా పరిమిత కాలం పాటు రూ. 3,58,999కి అందించనున్నట్లు సంస్థ ఎండీ సుమన్ మిశ్రా తెలిపారు. రిటైల్ విక్రయాలు ప్రారంభించామని, ఈ వారంలో డెలివరీలు మొదలవుతాయని చెప్పారు. తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంటులో దీన్ని ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం రూ. 500 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు మిశ్రా చెప్పారు. ఉడో ఒక్కసారి చార్జి చేస్తే 200 కి.మీ. రేంజి ఇస్తుందని, గరిష్టంగా గంటకు 55 కి.మీ. వేగం ఉంటుందని పేర్కొన్నారు. 1.5 లక్షల కి.మీ. లేదా 6 ఏళ్ల వారంటీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగానే విక్రయాలపై దృష్టి పెడుతున్నామని, అవకాశాలను బట్టి ఎగుమతి కూడా చేస్తామని మిశ్రా తెలిపారు.

సాక్షి సినిమా

ఆగస్టులో ప్యారడైజ్

● నాని

'దసరా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో జడల్ అనే పాత్రలో నటిస్తున్నారు నాని. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నాని క్యారెక్టర్ పరిచయ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాను తొలుత మార్చి 26న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. ఆగస్టు 21న రిలీజ్ చేస్తున్నట్లుగా గురువారం మేకర్స్ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న 'ది ప్యారడైజ్' మూవీ ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో రిలీజ్ కానుంది.

టీజర్‌కి వేళాయె!

● మహేశ్‌బాబు

'పెద కాపు' మూవీ ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'నాగబంధం'. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అభిషేక్ నామా దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ వేసవిలో విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15న రిలీజ్ కానుంది. అయితే విశేషం ఏంటంటే... హీరో మహేశ్‌బాబు చేతుల మీదుగా ఈ టీజర్‌ను లాంచ్ చేయించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాకి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే, జునైద్ కుమార్, సీఈఓ: వాసు పోతిని.

రెండు గంటలు హాయిగా నవ్వుకుంటారు

- విశ్వక్ సేన్

● అనుదీప్, కయాదు లోహార్, విశ్వక్ సేన్, నాగవంశీ

''స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి 'ఫంకీ' సినిమా చూసి ఎంజాయ్ చేయండి. రెండు గంటలు ఎలా అయిపోయాయో కూడా తెలియనంతగా మా సినిమా చూసి హాయిగా నవ్వుకుంటారు'' అని విశ్వక్ సేన్ తెలిపారు. ఆయన హీరోగా, కయాదు లోహార్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఫంకీ'. కేవీ అనుదీప్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా నేడు విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో అనుదీప్ కేవీ మాట్లాడుతూ–''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. కుటుంబంతో కలిసి సినిమాను ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''ఫంకీ' నా కెరీర్‌లో మొదటి కామెడీ సినిమా'' అన్నారు కయాదు లోహార్. ''సినిమా నేపథ్యంలో జరిగే కథ ఇది. దర్శకుడికి, నిర్మాత కూతురికి మధ్య జరిగే సరదా కథ'' అన్నారు సూర్యదేవర నాగవంశీ.

కూతుళ్లు కూడా వారసులే

- అర్జున్

''సీతా పయనం' యూనివర్సల్ కాన్సెప్ట్. అందుకే తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం'' అని అర్జున్ తెలిపారు. ఆయన కుమార్తె ఐశ్వర్య, నిరంజన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ మూవీకి దర్శకత్వం వహించడంతో పాటు అతిథి పాత్రలో నటించిన అర్జున్ మాట్లాడుతూ– ''మా అమ్మాయి ఐశ్వర్యకి నటన అంటే ఆసక్తి. అందుకే సినిమాల్లోకి తీసు కొచ్చాను. కొడుకులే కాదు, కూతుళ్లు కూడా వారసులే. 'సీతా పయనం' కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుంది. ఈ కథలో హీరోగా విశ్వక్ సేన్‌ని అనుకున్నాం. ఆ స్థానంలోకి నిరంజన్ వచ్చాడు. చాన్స్ వస్తే నేను, విశ్వక్ కలిసి సినిమా చేస్తాం. అనూప్ రూబెన్స్ పాటలు, నేపథ్య సంగీతం బాగా కుదిరాయి. ఇక ఎవరైనా మంచి కథతో వస్తే 'హనుమాన్ జంక్షన్ 2' మూవీని నా దర్శకత్వంలోనే నిర్మిస్తా. నా 'జెంటిల్‌మెన్' చిత్రాన్ని ఇప్పుడు రీ రిలీజ్ చేయాలని ఉంది'' అని చెప్పారు.

లీలావతి వినోదం

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సతీ లీలావతి'. నాగ మోహన్ నిర్మించిన ఈ సినిమా మార్చి 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ–''సతీ లీలావతి' సినిమా ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. మూడు నెలల్లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేశాం. దర్శక–నిర్మాతల సపోర్ట్ వల్లే ఇది సాధ్యమైంది. పూర్తి వినోదాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు. ''కమల్‌హాసన్‌గారి 'సతీ లీలావతి' చిత్రంతో నా సినిమాను పోల్చను. కానీ ప్రేక్షకులందరూ రిలేట్ అయ్యేలా మా సినిమాను తీశాం'' అని చెప్పారు తాతినేని సత్య. ''ఇది నా తొలి చిత్రం. ఈ సినిమా ప్రయాణంలో నేను ఎన్నో నేర్చుకున్నాను'' అని చెప్పారు నాగ మోహన్. నటుడు సప్తగిరి మాట్లాడారు.

నవ్వించే హే భగవాన్

● లావణ్య

''హే భగవాన్' మూవీ ట్రైలర్ బాగుంది. ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. సుహాస్ తెలుగు సినిమాలతో పాటు తమిళ మూవీస్‌లోనూ సత్తా చాటుతున్నాడు. 'హే భగవాన్' పెద్ద సక్సెస్ అవ్వాలి'' అని హీరో సాయిదుర్గా తేజ్ చెప్పారు. సుహాస్, శివానీ నాగారం జోడీగా వీకే నరేష్ కీలక పాత్ర పోషించిన చిత్రం 'హే భగవాన్'. గోపీ అచ్చర దర్శకత్వంలో బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 20న విడుదల కానుంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. గురువారం 'నాట్ ఏ ట్రైలర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయిదుర్గా తేజ్,

● వంశీ, వాసు, సాయిదుర్గా తేజ్, శివాని, సుహాస్, నరేష్, నరేంద్ర రెడ్డి, గోపి

మరో అతిథిగా డైరెక్టర్ రామ్ అబ్బరాజు హాజరయ్యారు. నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ– ''ఈ మూవీ ఫస్ట్ కాపీ చూసి, బాగా నవ్వుకున్నాను'' అన్నారు. ''ఈ కథను ఊహించిన టాప్ ఐదుగురికి ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఒక్కొక్కరికి రూ. 20వేలు ప్రైజ్ మనీ ఇవ్వబోతున్నాం'' అని వంశీ నందిపాటి తెలిపారు. ''మా సినిమాని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు సుహాస్, శివానీ నాగారం. ''కొత్తదనం కోరుకునేవారికి మా సినిమా కచ్చితంగా బాగా నచ్చుతుంది'' అని వీకే నరేష్, గోపీ అచ్చర, బి. నరేంద్ర రెడ్డి తెలిపారు.

దిల్ రాజు డ్రీమ్స్‌లో మార్కండేయ

● సిస్లా, విక్రాంత్, 'దిల్' రాజు

''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ స్థాపించిన 23 ఏళ్లలో 60 చిత్రాలు పూర్తి చేసిన మా సంస్థకు 'దిల్ రాజు డ్రీమ్స్' మరో విభాగం. 'మార్కండేయ' మూవీ కథ నచ్చడంతో ఈ చిత్రాన్ని మా దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్‌లో తొలి సినిమాగా నిర్మించడం సంతోషంగా ఉంది'' అని 'దిల్' రాజు తెలిపారు. విక్రాంత్ హీరోగా సిస్లా వీఎంకే తెరకెక్కిస్తున్న చిత్రం 'మార్కండేయ'. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు డిస్ట్రిబ్యూటర్‌గా డబ్బు పోగొట్టుకున్నాను. ఆ తర్వాత 'పెళ్లి పందిరి' సినిమా నిలబెట్టింది. 'మార్కండేయ' మూవీని 2027 మహాశివరాత్రికి విడుదల చేస్తాం. ఈ బ్యానర్‌లో మరో నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటిలో రెండు ఓటీటీ, మరో రెండు థియేట్రికల్‌గా రిలీజ్ అవుతాయి. ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో 'ఎల్లమ్మ, రౌడీ జనార్ధన, దేత్తడి' వంటి సినిమాలు నిర్మిస్తున్నాం'' అని చెప్పారు. ''మాలాంటి కొత్తవాళ్లకు అవకాశం ఇచ్చి నిలబెడుతున్న రాజుగారికి థ్యాంక్స్'' అని సిస్లా వీఎంకే పేర్కొన్నారు. ''ఇతిహాసాల నుంచి తీసుకున్న కథతో మేం చేస్తున్న ఒక మిస్టిక్ థ్రిల్లర్ మూవీ 'మార్కండేయ'' అన్నారు విక్రాంత్. ఈ కార్యక్రమంలో కెమెరామేన్ జగదీశ్ వర్మ భూపతిరాజు, మ్యూజిక్ డైరెక్టర్ హరి ఎస్‌ఆర్ మాట్లాడారు.

యూత్‌కి హుషారు

● అష్, వాసవి

అష్, వాసవి గణేషన్ జంటగా నటించిన చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో బిక్షు దర్శకత్వంలో వెంకట్ యాదవ్ ఈ సినిమాను నిర్మించారు. ఏషియన్, సురేష్ ఫిలింస్ సంస్థలు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాయి. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న డి. సురేష్‌బాబు మాట్లాడుతూ– ''నేటి యువ తరానికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది''అన్నారు. ''ఇందులో రవి పాత్రలో నటించాను. ఈ సినిమాతో హిట్ సాధిస్తాం'' అన్నారు అష్. ''నా జీవితంలో చూసిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాను'' అన్నారు బిక్షు. ''యూత్‌కు, వారి తల్లిదండ్రులకు ఈ సినిమాలో మంచి సందేశం ఉంది. ఎంటర్‌టైనింగ్ పంథాలో చెప్పాం'' అన్నారు వెంకట్ యాదవ్.

ఇలా ఎలా చేశావన్నారు!

- మానసా వారణాసి

సంతోష్ శోభన్, మానసా వారణాసి జంటగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 14న విడుదల కానుంది. నిర్మాత–డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో మానసా వారణాసి మాట్లాడుతూ– ''కపుల్‌ఫ్రెండ్లీ' సినిమాలో ఉద్యోగం కోసం ప్రయత్నించే మిత్ర పాత్రలో నటించాను. ఈ చిత్రంలో శివ (హీరో సంతోష్ పాత్ర పేరు), మిత్రల ప్రేమకథ రొటీన్‌గా ఉండదు. వీరిద్దరి ప్రపంచాలు వేరు... లక్ష్యాలు వేరు. లివింగ్ టుగెదర్ కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో కాస్త కొత్తగా చూపించాం. ఇక నా దృష్టిలో గ్లామర్ అంటే ఎక్స్‌పోజింగ్ కాదు. 'కపుల్ ఫ్రెండ్లీ'లో రెండు కిస్సింగ్ సీన్స్ ఉన్నాయి. యూనిట్ అంతా ఒక కథతో ఓ మ్యాజిక్ క్రియేట్ చేసేందుకు ట్రై చేస్తుంటే నటిగా నేనూ ప్రొఫెషనల్‌గా ఉండాలి కదా అని నటించాను. రొమాంటిక్ సీన్స్ అయినా బ్యూటిఫుల్‌గా, పొయెటిక్‌గా తెరకెక్కించారు. టీజర్, ట్రైలర్ రిలీజ్ అయ్యాక మా ఇంట్లో వాళ్లు కొంచెం ఇబ్బందిగా మాట్లాడారు. మన వారణాసి కుటుంబంలో ఉండి ఇలా ఎలా చేశావ్ అన్నారు. ఆ తర్వాత మా ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అర్థం చేసుకొని.. సపోర్ట్ చేశారు'' అని చెప్పారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీతో ప్రమాణం చేయిస్తున్న సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్, కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా మెడమల్లి బాలాజీ ప్రమాణం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా మెడమల్లి బాలాజీ గురువారం ప్రమాణం చేశారు. మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో బాలాజీతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అంతకుముందు బాలాజీ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వీఎస్‌జీబీ పార్థసారథి యనమండ్ర చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ ఇవన సాంబశివప్రతాప్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రమాణం అనంతరం జస్టిస్ బాలాజీ సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారితో కలిసి ధర్మాసనంలో కేసులను విచారించారు. ఆయన నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33కి చేరింది.

అటెండర్ ఖాతాలోకి రూ.2.63 కోట్లు

రూ.40 లక్షలు విత్‌డ్రా చేసుకుని పరారీ

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న మసూద్‌ఖాన్ బ్యాంకు ఖాతాలో పొరపాటున రూ.2.63 కోట్లు జమ అయింది. ఈ విషయాన్ని గమనించిన మసూద్‌ఖాన్ వెంటనే రూ.40 లక్షలు విత్‌డ్రా చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నైకు చెందిన ఓ వ్యక్తి బుధవారం స్టేట్‌బ్యాంకు ఖాతాలో రూ.2.63 కోట్లు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. తన బ్యాంకు ఖాతా నంబర్‌లో పొరపాటున ఒక సంఖ్య తప్పుగా నమోదు చేశాడు. ఆ విషయాన్ని బ్యాంకు సిబ్బంది కూడా గమనించలేదు. దీంతో ఆ మొత్తం అటెండర్ మసూద్‌ఖాన్‌కు చెందిన కదిరిలోని స్టేట్ బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఆ విషయాన్ని గ్రహించిన మసూద్‌ఖాన్ రూ.40 లక్షలు వివిధ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేసి విత్ డ్రా చేసుకున్నాడు. తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కాగా రూ.2.63 కోట్లు వేరే ఖాతాకు జమ అయినట్లు కాస్త ఆలస్యంగా గుర్తించిన చెన్నై స్టేట్ బ్యాంకు సిబ్బంది కదిరి బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అతని ఖాతాను ఫ్రీజ్ చేశారు. అప్పటికే రూ.40 లక్షలు డ్రా చేయడంతో కదిరి స్టేట్ బ్యాంక్ మేనేజర్ విశ్వేశ్వరరావు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో అటెండర్ మసూద్‌ఖాన్ కుటుంబ సభ్యులను సీఐ నారాయణరెడ్డి పిలిపించి విచారించారు. డ్రా చేసిన డబ్బు రెండు రోజుల్లో తిరిగి చెల్లిస్తామని అటెండర్ మసూద్‌ఖాన్ సోదరుడు తెలిపాడు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రభుత్వ టీచర్

రూ.24.50 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మగటపల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని రూ.24.50 లక్షలు పోగొట్టుకున్నారు. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... మగటపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొనుకు శ్రీనివాస్‌కు ఇటీవల ఫేస్‌బుక్‌లో సైబర్ నేరగాళ్లు ఒక లింక్‌ను పంపారు. దానిని ఓపెన్ చేయగా, కేంద్ర ప్రభుత్వ పథకం పేరుతో కొంత డబ్బులు ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తే రూ.10 లక్షల విలువైన ఎరువులు పంపిస్తామని, వాటిని అమ్మితే భారీ లాభం వస్తుందంటూ నమ్మించారు. నమ్మిన శ్రీనివాస్ మొదట కొంత డబ్బును ఫోన్ పే చేశారు. ఆ తర్వాతా విడతల వారీగా రూ.24.50 లక్షలు బదిలీ చేశారు. అయినా ఎరువులు రాకపోవడంతో శ్రీనివాస్ 1930కు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాంకు అధికారులు నిందితుల ఖాతాలో రూ.9 లక్షలు ఫ్రీజ్ చేశారు.

నేను దాక్కోలేదు

- కమిటీ విచారణకు రమ్మని నన్నెవరూ పిలవలేదు
- పిలిస్తే వచ్చి అన్ని వివరాలూ చెప్పేందుకు సిద్ధం
- కమిటీ సభ్యుడికి ఫోన్ చేసి తన వాదన వినాలని అభ్యర్థించా: ఎమ్మెల్యే అరవ బాధితురాలు

సాక్షి, అమరావతి: భయపడి తానేమీ దాక్కోలేదని, ఎక్కడికీ పారిపోలేదని రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధిత మహిళ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తనపై పలు మీడియా చానళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవమని, తాను న్యాయపరంగా ఈ సమస్యను ఎదుర్కోవడానికి అవసరమైన యత్నాలు చేస్తున్నానని వివరించారు. అలాగే జనసేన నియమించిన కమిటీ విచారణకు రావాలని తనను ఎవరూ పిలవలేదని స్పష్టం చేశారు. తనకు తానుగా కమిటీ సభ్యుడు శివశంకర్‌కు ఫోన్ చేసి తన వాదన వినాల్సిందిగా అభ్యర్థించి పెన్‌డ్రైవ్, లేఖ పంపించానని వెల్లడించారు. పిలిస్తే కమిటీ ముందుకు వెళ్లేందుకు సిద్ధమన్నారు.

ఎమ్మెల్యే అరవ బాధితురాలి వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

అసెంబ్లీ బాత్రూంలో 'అరవ' వికృత చేష్టలు

- రెస్ట్‌రూం నుంచి మహిళకు వీడియో కాల్
- ప్రైవేట్ పార్ట్స్ చూపిస్తూ మాట్లాడిన కూటమి ఎమ్మెల్యే
- శాసన సభా ప్రాంగణంలో ఉండి మహిళకు ముద్దులు
- రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే శ్రీధర్ మరో వీడియో వెలుగులోకి
- ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆవేదనలో బాధితురాలు

సాక్షి, అమరావతి: తాను శాసన సభ్యుడిననే కనీస స్పృహ కూడా లేకుండా కూటమికి చెందిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చేసిన వికృత చేష్టల్లో మరో వీడియో వెలుగులోకి వచ్చింది. చట్టసభలో ఉన్నానన్న విషయాన్నే మర్చిపోయి అరవ చేసిన అసభ్య వీడియో కాల్ బయటకు వచ్చింది. బాధిత మహిళ స్వయంగా విడుదల చేసిన ఆ వీడియోలో.. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన శాసనసభ సమావేశాలకు హాజరైన అరవ శ్రీధర్ అక్కడి నుంచే బాధిత మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడారు. యూరిన్ పోసుకుంటూ ఆ మహిళకు తన శరీరంలోని ప్రైవేట్ భాగాలను శ్రీధర్ చూపిస్తూ.. అసభ్యకరంగా సైగలు చేశారు. అభ్యంతరకర పదాలతో మహిళకు సందేశాలు పంపించారు. అక్కడితో ఆగకుండా అసెంబ్లీలోని టాయిలెట్ నుంచే బాధిత మహిళకు వీడియో కాల్ ద్వారా ముద్దులు కూడా పెట్టారు. ఆ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మరోవైపు అరవ శ్రీధర్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడని ఆధారాలతో సహా బయటపెట్టినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదంటూ బాధిత మహిళ ప్రశ్నిస్తున్నారు. తనకు న్యాయం చేయాలని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఆమె గురువారం సామాజిక మాధ్యమాల ద్వారా అభ్యర్థించారు. కాగా, ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరుకావడం లేదు.

ఇంటర్ హాల్‌టికెట్ల విడుదల

ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు

సాక్షి, అమరావతి: ఈనెల 23 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి https://bie.ap.gov.in వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. రెండో ఏడాది విద్యార్థులు మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబర్, మొదటి ఏడాది విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ పొందవచ్చన్నారు. మనమిత్ర వాట్సాప్ నంబర్ (9552300009)కు 'హాయ్' అని మెసేజ్ చేసిన అనంతరం వచ్చే వివరాల ఆధారంగా కూడా హాల్‌టికెట్‌ను పొందవచ్చని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు తమ లాగిన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

23 నుంచి పరీక్షలు ప్రారంభం

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. రెండో ఏడాది విద్యార్థులకు 24న పరీక్షలు ప్రారంభమవుతాయి. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. అయితే మార్చి 3న జరగాల్సిన రెండో ఏడాది మ్యాథ్‌మెటిక్స్, సివిక్స్ పేపర్లు మార్చి 4న, మార్చి 20న ప్రకటించిన మొదటి ఏడాది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్లు మార్చి 21న నిర్వహిస్తారు. మార్చి 3న హోలీ, మార్చి 20 రంజాన్ సెలవులు ఉండడంతో ఈ మార్పులు చేశారు. మిగిలిన పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఉంటాయి.

సెకండియర్ సిలబస్‌లోనూ మార్పులు

2026–27 విద్యా సంవత్సరం నుంచి అమలు

ఇంటర్మీడియట్ సెకండియర్ సిలబస్‌లోనూ మార్పులు చేపట్టారు. వాటిని 2026–27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. జాతీయ విద్యా విధానం–2020 మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ మార్పులు చేసినట్టు గతంలో బోర్డు ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ఫస్టియర్‌లో మార్చిన సిలబస్‌కు అనుగుణంగా సెకండియర్ సబ్జెక్టుల సిలబస్, పాఠ్యాంశాలనూ పునర్ వ్యవస్థీకరించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకు చర్యలు చేపట్టారు. సైన్సు విభాగం సబ్జెక్టులకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ ఆధారంగా మార్పులు చేయనున్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం సబ్జెక్టులకు ఇంటర్మీడియట్ బోర్డు సవరించిన సిలబస్‌ను అమలు చేస్తారు. 2025–26లో సవరించని తెలుగు, ఉర్దూ, తర్కం, పాలన, భూగోళ శాస్త్రాల సిలబస్‌లనూ మార్చనున్నారు. వృత్తి విద్యా కోర్సులను నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మార్గదర్శకాల ప్రకారం సవరించనున్నారు.

లాసెట్, ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

- నోటిఫికేషన్ వెలువరించిన ఉన్నత విద్యామండలి
- మే 4న ప్రవేశ పరీక్షలు.. 18న తుది ర్యాంకుల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లాసెట్, ఎడ్‌సెట్–2026 ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు గురువారం ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. లాసెట్‌ను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎడ్‌సెట్‌ను ద్రవిడియన్ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

లాసెట్ 2026..: లాసెట్‌కు మార్చి 12వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అనంతరం రూ.వెయ్యి అపరాధ రుసుముతో 16 వరకు, రూ.2వేలతో 20వరకు, రూ.4వేలతో 24వరకు, రూ.10వేలతో మార్చి 28 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. మార్చి 30న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తోంది. ఏప్రిల్ 20న హాల్ టికెట్లు విడుదల చేసి మే 4న ప్రవేశ పరీక్ష, 18న తుది ఫలితాలను ప్రకటించనుంది.

ఎడ్‌సెట్ 2026: ఎడ్‌సెట్‌కు మార్చి 9వరకు దరఖాస్తుల సమర్పణకు గడువు ఇచ్చింది. అనంతరం రూ.వెయ్యి అపరాధ రుసుముతో మార్చి 13వరకు, రూ.2వేలతో 17వరకు, రూ.4వేలతో 21వరకు, రూ.10వేలతో 25వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. మార్చి 26న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించగా ఏప్రిల్ 20న హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచనుంది. మే 4న ఆన్‌లైన్‌లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహించి 18న తుది ర్యాంకులు ప్రకటించనుంది.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి గుంటూరు

శుక్రవారం । 13 । ఫిబ్రవరి । 2026



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,800, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,400 వరకు పలికింది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 36.0923 టీఎంసీలు.

సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ మట్టం గురువారం 536.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 31,240 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

రుద్రాక్ష వాహనంపై మల్లేశ్వరుడు

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవ కైంకర్య పరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన మాజేటి ఉదయ్ శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉదయ్‌కుమార్, బాలగంగాధర గుప్తా, రంగా సత్యనారాయణ, శివ మోహన్‌మూర్తి సురేంద్రబాబు, పెద్దబాబు, శివప్రసాదరావు, రంగారావు గుప్తా, రవీంద్రనాథ్ గుప్తా, గోపాలకృష్ణ కుమార్, మధుసూదన వెంకట సుబ్బారావు, చెన్నకేశవ శేషగిరిరావులు వ్యవహరించారు. ఈవో గోపీ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.

అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

మంగళగిరి టౌన్ : మంగళగిరిలో అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు గురువారం తెల్లవారుజామున విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న వాహనాన్ని పలువురు గోసంరక్షణ వాదులు వెంబడించి కాజ టోల్‌గేటు వద్ద అడ్డుకుని మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణ, బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఓ చిన్న వాహనంలో సుమారు 25 దూడలను పెట్టి, వాటికి ఊపిరి ఆడకుండా చేయడంతో వాటిలో ఏడు దూడలు మృత్యువాతపడ్డాయని, సుమారు 12 గంటల పాటు వాటికి నీళ్లు, ఆహారం లేక సొమ్మసిల్లి పోయాయని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈనెల 21న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీన జరగనుంది. ఈ మేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గురువారం షెడ్యూల్ విడుదల చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన 21న ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనున్న సర్వసభ్య సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, జెడ్పీటీసీలు హాజరై అజెండాలోని అంశాలపై చర్చిస్తారు.

వృద్ధాశ్రమానికి దాతల సాయం

తాడికొండ: తుళ్ళూరు మండలం పెదపరిమిలోని ముప్పా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ కొండా సాంబిరెడ్డి లక్ష రూపాయలు, మేక భారతి లక్ష రూపాయలు, కొల్లి కోటిరెడ్డి 50 వేల రూపాయలు చెక్కులను గురువారం మేనేజింగ్ ట్రస్ట్ ఎంవీ రామిరెడ్డికి అందజేశారు. దాతలు కొండా సాంబిరెడ్డి, మేక భారతి మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న ట్రస్ట్‌కు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం దాతలను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్ల... చరిత వేనోళ్ల!

- మూడు రోజుల పాటు కొండలో భక్తుల రద్దీ
- ఏకాదశి నుంచి భక్తుల రాక ప్రారంభం
- పండుగ రోజున జాగరణతో ముగియనున్న జాతర
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

నేటి నుంచి కోటప్పకొండ మహాశివరాత్రి మహోత్సవం

కోటప్పకొండ ఆలయం (ఫైల్)

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల జాతర మహోత్సవానికి అంతా సిద్ధమయింది. మహాశివరాత్రి రోజున నిర్వహించే తిరునాళ్లకు రెండు రోజుల ముందు ఏకాదశి నుంచే కోటప్పకొండలో భక్తుల రద్దీ ప్రారంభమవుతుంది. మూడు రోజుల్లో లక్షలాది మంది భక్తులు కోటప్పకొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. కొండ దిగువున విద్యుత్ ప్రభల వెలుగులతో నిర్వహించే శివరాత్రి జాగరణతో ఉత్సవం ముగియనుంది. కోటప్పకొండ తిరునాళ్లకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలు నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి కోటయ్య స్వామికి మొక్కులు చెల్లించుకుని స్వామి వారి సన్నిధానంలో శివరాత్రి జాగరణ చేస్తారు.

- గత ఏడాది శివరాత్రి రోజున 1.20 లక్షల మంది త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ ఏడాది 1.50 లక్షల మంది దర్శించుకుంటారని అంచనా వేస్తున్నారు.
- కొండ దిగువన జరిగే జాతర మహోత్సవంలో 15 నుంచి 20 లక్షల మంది పాల్గొంటారని అధికారుల అంచనాగా ఉంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు.

విస్తృత ఏర్పాట్లు

- స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యూలైన్‌లు, స్వామి వారి ప్రసాదాలు లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు.
- ఎండ వేడిమి లేకుండా చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అందజేసేందుకు వాటర్ బాటిల్స్, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్స్, పాలు అందుబాటులో ఉంచారు. కొండ దిగువన ఏర్పాట్లు ఇంకా పూర్తి కాలేదు.
- ఆర్ అండ్ బీ లైటింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు, స్నాన ఘాట్ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బారికేడింగ్ పనులు గురువారం ప్రారంభించారు. స్నానఘాట్‌ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. తాగు నీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

- ఏకాదశి నుంచే కోటప్పకొండకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపే విధంగా ఏర్పాట్లు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, గుంటూరు, వినుకొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులతో భక్తులను కొండకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.
- ఏకాదశి రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కొండ మీద పార్కింగ్ రద్దీని బట్టి కార్లు, ట్రాక్టర్లకు అనుమతిస్తామని రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి కోటప్పకొండలో గురువారం ఆమె పర్యటించారు. క్యూలైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖలు సమన్వయంతో పని చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదని ఆదేశించారు. ఆర్డీవో మధులత, ఈవో డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లలో ప్రభుత్వ వైఫల్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కోటప్పకొండలో గురువారం ఆయన పర్యటించి తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. లక్షలాది మంది వచ్చే తిరునాళ్లకు అరకొరగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు జరిగితే చంద్రబాబు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సత్రాలకు నీటిని సరఫరా చేసే శంభులింగం చెరువును ఇప్పటి వరకు నీటితో నింపలేదని తెలిపారు. మరమ్మతులు పూర్తికాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చే లింకు రోడ్లు మరమ్మతులు కూడా చేపట్టలేదని తెలిపారు. ఘాట్ రోడ్డు టోల్ గేట్ ద్వారా సంవత్సరానికి రూ.60 లక్షల ఆదాయం అటవీ శాఖకు వస్తున్నా మొక్కలకు నీళ్లు కూడా అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. కొండకు కిలోమీటరు దూరంలో బస్టాండ్ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే రోజుకొక గ్రూపుతో కొండకు వచ్చి రోడ్లు ఊడ్చి వెళ్లడం మినహా ఏర్పాట్లు జరుగుతున్న తీరును పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఏర్పాట్లపై ఆరా తీస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

పథకాలపై సానుకూల దృక్పథం పెంచాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రజలలో సానుకూల దృక్పథం పెరగాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రజల సానుకూల దృక్పథంపై సంబంధిత అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చి అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో అమలు పక్కాగా ఉండాలని, అందుకు తగిన పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నాయో గుర్తించాలని, వాటిని పరిష్కరించుకుంటూ పథకాలు, కార్యక్రమాలు, సేవలు చక్కగా అమలు జరిగేలా చూడాలన్నారు. పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తున్న సరుకులు ప్రజలకు సకాలంలో అందడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ప్రజలకు రేషన్ అందటం వలన సానుకూల దృక్పథం ఏర్పడుతుందని చెప్పారు. సమావేశంలో డీఎస్ఓ పి.కోమలి పద్మ, హౌసింగ్ పీడీ జె.వి.ఎస్. ఆర్.కె ప్రసాద్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ రమేష్, గనుల శాఖ ఉప సంచాలకులు ఎన్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టినింట ప్రవేశించిన వీరమ్మ

ఉయ్యూరు: వీరమ్మతల్లి శ్రీ కనక చింతయ్య సమేతంగా మెట్టినింటిలోకి ప్రవేశించారు. 15 రోజులు పాటు వైభవంగా జరిగిన తిరునాళ్ల ముగియటంతో గురువారం ఉదయం ఆలయం నుంచి అమ్మవారు పల్లకీలో ఊరేగింపుగా తరలివెళ్లి మెట్టినింటిలో కొలువుదీరారు. తిరుగు ప్రయాణంలోనూ అమ్మవారు ఊయల స్తంభాల వద్ద ఊయల ఊగి.. మెట్టినింటి పరిసరాల్లో గ్రామోత్సవం జరుపుకొన్నారు. పల్లకీకి భక్తులు హారతులు పట్టి స్వాగతం పలికారు.

విద్యుత్ దీపాలతో పెదకాకాని శివాలయం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పండగ శోభను సంతరించుకున్న పెదకాకాని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం

పెదకాకాని: గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భ్రమరాంబ అమ్మవారిని పెళ్లి కుమార్తె అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేకువజామున ఐదు గంటలకు సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాత్రి 10.30 గంటలకు ధ్వజారోహణ, ఆలయ బలిహరణ, తదితర కార్యక్రమాలు శైవాగమ పద్ధతిన దేవస్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకస్వాములచే నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, పాలకమండలి చైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమాలలో పాలకమండలి చైర్మన్, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతలచే రూ.5 లక్షలతో నిర్మించిన పీపీజీఎల్ షెడ్, గ్రామోత్సవాల సేవలకు దాతలు సమర్పించిన లక్ష రూపాయల విలువైన ట్రక్కును ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్, డీసీ గోగినేని లీలాకుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షెడ్డు దాతలు నందిపాటి రామకృష్ణ శివకుమారి, నందిపాటి భరత్‌కుమార్ శోభ దంపతులు, ట్రక్కు దాతలు గోగినేని వీరాబాయి, శివరామ్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో పెళ్లి కుమార్తెగా భ్రమరాంబ అమ్మవారు

శివాలయంలో పెళ్లి కుమారునిగా మల్లేశ్వర స్వామి వారు

క్వారీ తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభలు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు వచ్చే భారీ విద్యుత్ ప్రభలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలతో పాటు చిన్నచిన్న ప్రభలు వందల సంఖ్యలో వస్తుంటాయి. ఈ ఏడాది నారాకోడూరులో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు రూపుదిద్దుకుంటున్నాయి. సుద్దపల్లి, గొడవర్రు, గుండవరం, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల నుంచి భారీ ప్రభలు అందంగా ముస్తాబై తరలిరావటానికి సిద్ధమవుతున్నాయి.

- దాదాపు వంద అడుగుల ఎత్తులో నిర్మించే భారీ విద్యుత్ ప్రభలు సుమారు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వ్యయంతో రూపుదిద్దుకుంటున్నాయి. నారాకోడూరు–జీబీసీ రోడ్డులోని శివాలయం ఎదురుగా మిత్ర మండలి, తెనాలి రోడ్డులోని గ్రామ ప్రభ, గుంటూరు రోడ్డులోని మార్కెట్టు కాంప్లెక్స్ ఎదురుగా గ్రామ సెంటర్ భారీ విద్యుత్ ప్రభలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.
- చేబ్రోలు గ్రామ ప్రభ, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి గ్రామ ప్రభలు ముస్తాబవుతున్నాయి. గత వంద సంవత్సరాలుగా దేవాలయానికి భక్తులు ప్రభలు నిర్మించుకురావటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.
- ఇక క్వారీ దేవాలయం వద్ద అన్ని శాఖల అధికారుల భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

క్వారీ తిరునాళ్లకు ముస్తాబైన దేవాలయం, నారాకోడూరు శివాలయం ఎదుట సిద్ధమవుతున్న మిత్రమండలి భారీ విద్యుత్ ప్రభ

వాహనాల రాకపోకలకు ఇబ్బంది...

- దేవాలయం పరిసర భూములు క్వారీలుగా మారటంతో పాటు దేవాలయం చుట్టుపక్కల గోడలు నిర్మించటంతో దేవాలయం చుట్టూ వాహనాలు రాకపోకలు సాగించటానికి కొంత ఇబ్బంది ఏర్పడుతున్నది. దేవాలయం వద్దకు వ్యాపారాలు నిర్వహించుకోవటానికి చిరు వ్యాపారులు తరలివస్తున్నారు. జెయింట్ వీల్, రంగుల రాట్నాలు, ట్రైన్స్ ,తదితర ఏర్పాట్లు చేసుకున్నారు.
- దేవదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- సుద్దపల్లి, నారాకోడూరు, శలపాడు గ్రామాలకు చెందిన పొక్లయినర్ యజమానులు, లారీ యజమానులు క్వారీ బాలకోటేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరమే పనులు ప్రారంభిస్తుంటారు.

ఆలయం వద్ద భక్తుల పొంగళ్లు

చేబ్రోలు: మహాశివరాత్రికి మూడు రోజుల ముందుగానే వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రాక ఆరంభమైంది. గురువారం దశమి కావటంతో మహిళలు ఉదయాన్నే ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్డుల్లో పొంగళ్లు పొంగించుకొని, స్వామి వారికి సమర్పించారు.

మహాశివరాత్రి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చేబ్రోలు: క్వారీ తిరునాళ్ల మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయ శాఖాధికారి నరసింహారావు, తహసీల్దారు కె. శ్రీనివాసశర్మ, డీఎల్‌పీవో స్వరూపారాణిలు తెలిపారు. దేవస్థానం ప్రాంగణం వద్ద గురువారం మహాశివరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్వారీ తిరునాళ్ల వివరాలను తెలియజేశారు.

- 13వ తేదీన స్వామి వారికి నైవేద్యం, పొంగళ్లు సమర్పించటం, పశువులు, జీవాలను గుడి వద్దకు తీసుకురావటానికి అనుమతించనున్నట్లు వారు తెలిపారు.
- 14న గుడి వద్దకు వాహనాలు, వాహనపూజ, వాహనాలపై ప్రభలు పెట్టుకొని ప్రదక్షిణలు చేయటానికి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు.
- 15న మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు స్వామి వారి దర్శనానికి మాత్రమే అనుమతి ఉందన్నారు. నైవేద్యాలు, పొంగళ్లు, పశువులు, వాహనాలు అనుమతించబడవన్నారు. దీప స్తంభం వద్ద మొక్కుబడులు ఉన్న వారు చెల్లించుకోవాలని సూచించారు.
- 13,14 తేదీలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- తెనాలి నుంచి 25, గుంటూరు నుంచి 15 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.
- ఆలయానికి వచ్చే భారీ విద్యుత్ ప్రభలకు ఈ ఏడాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పండుగ రోజును పొన్నూరు, గుంటూరు, తెనాలి రహదారులలో ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నట్లు తెలిపారు.

తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

శిలా శాసనాల డిజిటలైజేషన్‌కు శ్రీకారం

మంగళగిరి టౌన్ : భారతీయ చారిత్రక వారసత్వాన్ని భద్రపరిచే దిశగా భారత్‌శ్రీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చెన్నై పురావస్తు, పురాతత్వ శాఖ శాసన విభాగ బృందం శిలాశాసనాల డిజిటలైజేషన్ కార్యక్రమానికి మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం శ్రీకారం చుట్టారు. ఈ దేవస్థానంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా చెన్నై, ఎపిగ్రాఫీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం ఏసుబాబు బృందం శ్రీకృష్ణదేవరాయల హయాం నుంచి 18వ శతాబ్దం వరకు శిలాశాసనాలను సాంకేతికత విధానంతో పరిశీలన జరిపి అధ్యయనం చేశారు.

- ఏసుబాబు మాట్లాడుతూ విజయవాడ కనకదుర్గ ఆలయం వద్ద అక్కన్న, మాదన్న గుహల శిలాశాసనాలు, పాత శివాలయం వద్ద శాసనాలను అధ్యయనం చేయడం జరిగిందని పేర్కొన్నారు.
- పురాతన దేవాలయాలు, శిలా నిర్మాణాలు, కోటలు, ఇతర చారిత్రక కట్టడాలపై చెక్కబడిన శాసనాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ రూపంలో భద్రపరచ్చడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.
- శిలాశాసనాల లిపి ఆధారంగా స్థానిక భాషల్లో అనువదింపజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. చెదిరిపోతున్న అక్షరాలను స్పష్టంగా గుర్తించి డేటాబేస్‌లో నమోదు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ఈ శాసనాలు శాశ్వతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.
- మంగళగిరి పరిధిలోని చారిత్రక ఆధారాలు, శిలాశాసనాలను అధ్యయనం చేసి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన అధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్, ఫ్రీలాన్స్ ఆర్కియాలజిస్ట్ రామగంగాధర్, చెన్నై పురాతత్వశాఖ ఎపిగ్రాఫీ స్టాంపైజ్ మెకానిక్ ఎస్.అలిగేషన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అధ్యయనం చేస్తున్న ఆర్కియాలజీ అధికారులు

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	91,680
అమ్మకాలు	97,840
నిల్వ	19,476

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు-5	13,500–22,500
273	14500–24,000
341	14,000–26,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	14,000–21,000
నంబరు-5	13,000–21,000
341	14,000–23,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 - 19,000
బాడిగ-355	14,000 - 25,500
దేవనూరు డీలక్స్	15,500 - 27,500
ఆర్మూర్	13,000 - 17,000
తాలుకాయలు	8,000 - 12,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000-19,000
బాడిగ - 355	14,000-24,00
తాలు	8,500 - 12,000

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

విద్యార్థిపై దాడి కేసులో ఏడుగురు అరెస్టు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ సమీపంలో కొద్ది రోజుల కిందట జరిగిన సంఘటనకు సంబంధించి బుధవారం చేబ్రోలు పోలీసులు తొమ్మిది మంది నిందితులలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుతున్న హేమంత్‌కు అదేకాలేజిలో చదువుతున్న శ్రీరామ్ మధ్య వివాదం ఉంది. హేమంత్‌కు స్నేహితుడైన బాపట్ల జిల్లా చుండూరు గ్రామానికి చెందిన భరత్‌కు తెలియజేశాడు. విద్యార్థి సంఘం నాయకుడుగా ఉన్న భరత్ ఫోన్ చేసి శ్రీరామ్‌ను హెచ్చరించాడు. దీనిని మనసులో పెట్టుకున్న శ్రీరామ్ తన స్నేహితులతో కలసి విజ్ఞాన్ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న సపోటా తోటలలోని ఖాళీ ప్రదేశానికి పిలిపించి అక్కడ క్రూరంగా, మానవత్వం మరచి దాడిచేశారు. ఈ సంఘటనను వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసి ప్రచారం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు పొన్నూరు రూరల్ సీఐ పి కృష్ణయ్య, ఎస్ఐ పి వీరనారాయణలు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. దారా పరిమళ రిహాన్ ఉరఫ్ లక్కీ, వెలిశెట్టి ఆదర్శబాబు, వాకా సోమశేఖర్ బాబు ఉరఫ్ సోము, రాపోలు తిరుపతిరావు, నందం బాలకోటేశ్వరరావు, టి బాలసాయి రామ్, కొత్త సాయి అమరనాథ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచటంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌లో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

గుంటూరు మెడికల్: హజ్ యాత్రకు వెళ్లే వారికి గుంటూరు జీజీహెచ్‌లో రెండో రోజు గురువారం మెడికల్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే 157 మందికి వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమానికి సహకరించిన హజ్ యాత్రికులకు కృతజ్ఞతలు తెలియజేసినారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, హాజీ హసన్ బాష పాల్గొన్నారు.

ఘనంగా క్రెడాయ్ అమరావతి చాప్టర్ ప్రారంభం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి విజయవాడ క్లబ్‌లో గురువారం క్రెడాయ్ అమరావతి చాప్టర్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ విచ్చేసి క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ 2026 డైరీని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. క్రెడాయ్ అమరావతి చాప్టర్ కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవం జరిగింది. క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్‌గా జి.రామ్‌రెడ్డి, చైర్మన్‌గా ఎ.నాగమల్లేశ్వరరావు, ప్రెసిడెంట్‌గా ఆర్.కొండలరావు, జనరల్ సెక్రటరీగా ఎన్.పి. ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ జి. రామ్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో క్రెడాయ్ భాగస్వామ్యం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. క్రెడాయ్ ఏపీ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, ప్రెసిడెంట్ బాయన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరి దాసరి రాంబాబు ఉన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయకుంటే తీవ్ర ఉద్యమం

- కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక
- గుంటూరులో కార్మికుల మహాప్రదర్శన

నిరసన ర్యాలీలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు, కార్మికులు

లక్ష్మీపురం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లు నష్టదాయకమైనవని, వాటిని రద్దు చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వివిధ కార్మిక, ఉద్యోగ, రైతుసంఘాల నాయకులు హెచ్చరించారు. దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం గుంటూరు నగరంలోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నగర కన్వీనర్ బి.ముత్యాలరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ్‌కుమార్ అధ్యక్షతన సభ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వి. కృష్ణ, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూనిస్, వైఎస్సార్ టీయూ నగర అధ్యక్షులు మురళి, రైతు కూలీ సంఘం నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కిషోర్, లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు ప్రసాద్, రైతుసంఘ జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఏఐకెయంయస్ రాష్ట్ర కార్యదర్శి ఘనిరాజులు మాట్లాడారు. కనీసం వేతనం రోజుకు రూ.168 ఉంటే సరిపోతుందని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని విమర్శించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కనీస వేతనం రూ.800లుగా నిర్ణయించి అమలు చేస్తుందని గుర్తు చేశారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయటం నేరమని, ఆందోళనలు చేస్తే జైళ్లకు పంపేందుకు అనుకూలంగా కార్మిక కోడ్‌లు రూపొందించారని విమర్శించారు. ఇది కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నించేవారి గొంతు నులమటమేనని అన్నారు. ఇటీవల మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందం మన దేశ రైతాంగానికి తీవ్రమైన నష్టం చేస్తుందని పేర్కొన్నారు. నూతన విత్తన చట్టాన్ని రద్దు చేయాలని కార్మిక, రైతు సంఘాలు ఏకకంఠంతో వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, టింబర్ ముఠా, ఆటో, అగ్రికల్చర్ యూనివర్సిటీ, రిటైర్డ్ పెన్షనర్స్, కోల్డ్ స్టోరేజి ముఠా, అల్యూమినియం వర్కర్స్, సివిల్ సప్లయీస్ ముఠా, 104, 108, విద్యుత్ కాంట్రాక్టు, మెడికల్ రంగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

సమ్మెలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్మికులు

ర్యాలీలో భవన నిర్మాణ రంగ కార్మికులు

లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ మంగళగిరిలో కార్మికుల భారీ ర్యాలీ

అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం

మంగళగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, లేబర్ కోడ్‌ల రద్దుకు మంగళగిరిలో గురువారం వివిధ కార్మిక సంఘాలు, ఏఐటీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్ టీయూసీ రైతు సంఘాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద నుంచి తెనాలి రోడ్డు, మెయిన్ బజార్, గాలిగోపురం మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అంబేడ్కర్ సెంటర్ వద్ద జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

అంబేడ్కర్ సెంటర్‌లో వివిధ సంఘాల నాయకులు, కార్మికుల మానవహారం

అందరి సహకారంతో శివాలయం అభివృద్ధి

- ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కోసూరి పూర్ణచంద్రరావు
- పెదకాకాని శివాలయం పాలకవర్గం ప్రమాణస్వీకారం

పెదకాకాని: అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ధర్మకర్తల మండలి నూతన చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు అన్నారు. పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మొత్తం 13 మంది పాలకమండలి సభ్యులతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి ధనమహేశ్వరప్రసాద్‌లచే ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు కోసూరు పూర్ణచంద్రరావును చైర్మన్‌గా పాలకవర్గం సభ్యుడు వరికూటి వీరసుధాకర్ ప్రతిపాదించగా మరొక సభ్యుడు కంభంపాటి వెంకయ్య బలపరచడంతో కోసూరి పూర్ణచంద్రరావును పాలకవర్గం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే డి నరేంద్రకుమార్ సమక్షంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ కోసూరి మాట్లాడుతూ స్వామివారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ నూతన పాలకవర్గం సభ్యులుగా చేబ్రోలు వెంకట భాస్కర పున్నారావు, కంభంపాటి వెంకయ్య, కొమ్మూరి మల్లికార్జునరావు, భైరపనేని ధనలక్ష్మి, కొండా లత, ధూపాటి శివ శంకరరావు, వడ్లమూడి సువర్ణలక్ష్మి, వుల్లం రాజేశ్వరి, బండారు మల్లేశ్వరి, వరికూటి వీర సుధాకరరావు, బాణావత్ మంగమ్మ, పాముదుర్తి నాగలక్ష్మి, ఎక్స్‌అఫిషియోసభ్యుడు పేటేటి ధనమహేశ్వరప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శివాలయం నూతన పాలకవర్గం సభ్యులచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న డీసీ గోగినేని

వెట్టి చాకిరి తీవ్రమైన నేరం

చీరాలటౌన్: వెట్టి చాకిరీ తీవ్రమైన నేరం.. ఎవరైనా వెట్టిచాకిరీకి వ్యక్తులను నియమించుకోవడం నేరమని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖరనాయుడు తెలిపారు. వెట్టి చాకిరి చట్టం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి అయినందున జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో అవగాహన పంపొందించేందుకు వెట్టి చాకిరి నేరం వాల్‌పోస్టర్ గురువారం చీరాల ఆర్డీవో ఆవిష్కరించారు. ఆర్డీవో మాట్లాడుతూ భారత రాజ్యాంగం వెట్టిచాకిరి నిర్మూలించిందని, ఎవరైనా ముందస్తుగా డబ్బు, అప్పులు, ఇతర కారాణాలతో వ్యక్తులను బలవంతంగా పని చేయడం విరుద్ధమన్నారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడైనా వెట్టి చాకిరికి నియమించుకున్న సమాచారం తహసీల్దార్ కార్యాలయాల్లో అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.షాడోస్ ప్రతినిధి రాజా సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులతో నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో శ్రీమేధ – కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో టాప్ మార్కులు సాధించారని సంస్థ డైరెక్టర్లు శేషసాయి బాబు, అన్నా నందకిషోర్ తెలిపారు. గురువారం కొత్తపేటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీకాం జనరల్ తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో 600 మార్కులకు ఫాలక్ జైన్ 519 మార్కులు, పి.జైన్ 512, రిద్ధి జైన్ 496, చింతపల్లి శ్రీచిన్న మల్లేశ్వరి 490, మొహమ్మద్ ఫర్హానా బేగం 482 మార్కులతోపాటు, బీకాం కంప్యూటర్స్ విభాగంలో 800 మార్కులకు గాను ఆదిత్య 674 మార్కులు, ఓర్సు వెంకటేశ్వర్లు 669, లక్షితా జైన్ 649 మార్కులతో యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారని తెలిపారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో బీకాం కంప్యూటర్స్ విభాగంలో 850 మార్కులకు గాను బట్టు షారోనికా 726 మార్కులు, షేక్ నగినా 723, షేక్ క్యూబా కౌసిన్ 694, బి.కాం జనరల్ విభాగంలో 650 మార్కులకుగాను శరత్‌చంద్ర 583 మార్కులు, రితిక కుమారి 576, తేజోష్ బొత్రాజైన్ 576, షేక్ సుమయ 553, ఎం. మోక్షిత 547 మార్కులతో యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారని తెలిపారు. విద్యార్థులతోపాటు అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

గుండవరం(చేబ్రోలు): పాత కక్షలు, ఆస్తి గొడవల కారణంగా జరిగిన హత్యాయత్నం కేసులోని ముగ్గురు నిందితులను చేబ్రోలు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పి వీరనారాయణ వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని గుండవరం గ్రామానికి చెందిన సాతర్ల వెంకటేష్‌కు సాతర్ల గోపి, సాతర్ల శ్రీకాంత్‌ల మధ్య ఆస్తి, భూ వివాదాలు, పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాతర్ల గోపి, సాతర్ల శ్రీకాంత్, తొడెమల వెంకట గోపిలు ముగ్గురు కలిసి పథకం ప్రకారం వెంకటేష్‌పై కత్తితో దాడి చేశారు. బాధితుడికి మెడతోపాటు పలు చోట్ల కత్తి గాయాలయ్యాయి. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, తెనాలి డీఎస్పీ జనార్ధనరావు ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేశారు. నిందితులను గురువారం నారాకోడూరు మినీ బైపాస్ వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి వీరనారాయణ తెలిపారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ పి వీరనారాయణ

కళ్లకు గంతలు కట్టుకుని పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

నేడు సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి

కొరిటెపాడు(గుంటూరు): దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగులు గురువారం శ్యామలానగర్‌లోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 70 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులకు కనబడటం లేదని కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి తమ ఆకలి తీర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, నంద్యాల జిల్లాలకు చెందిన పీఏసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండు నెలలు పైగా పీఏసీఎస్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వివిధ రూపాల్లో ఆందోళన నిరసన కార్యక్రమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. శుక్రవారం(నేడు) రాష్ట్రంలోని అన్ని జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులతో కలిసి సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయాలు ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు ముప్పా వెంకటేశ్వరరావు, టి.వెంకటరామయ్య, కె.సత్యనారాయణ, వి.రామునాయుడు, కృష్ణమోహన్, వీరభద్రుడు, రెడ్డి సత్యారావు విజయనగరం, పార్వతీపురం మన్యం, నంద్యాల జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న పీఏసీఎస్ ఉద్యోగులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

విద్యుత్ సబ్ స్టేషనులో తనిఖీల వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ సీహెచ్.రమేష్
- పెదనందిపాడులో ఆకస్మిక తనిఖీలు

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్‌శాఖ ఎస్ఈ సీహెచ్.రమేష్ హెచ్చరించారు. పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు, అన్నవరం, కాట్రపాడు, పాలపర్రు, పుసులూరు, రాజుపాలెం, రావిపాడు, ఉప్పలపాడు, వరగాని గ్రామాల్లో గురువారం విద్యుత్ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఈ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 40 మంది అధికారులు, 120 మంది సిబ్బంది, 40 బృందాలుగా ఏర్పడి 3,010 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం పెదనందిపాడు విద్యుత్ సబ్ స్టేషనులో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ తనిఖీల వివరాలను వెల్లడించారు. మీటరు ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.40 వేలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 84 మందికి రూ.3.06 లక్షలు, వినియోగం కంటే బిల్లు తక్కువగా వచ్చిన ఒకరికి రూ.ఐదు వేల చొప్పున మొత్తం రూ.3.51 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన పూర్తి వివరాలను 9440812263, 9440812361 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఈఈలు ఎ.కరీమ్, ఏ.సత్యనారాయణ, డీఈఈలు ఏ.వెంకటేశ్వరరావు, ఎన్.మల్లికార్జునప్రసాద్, ఏఈలు డి.మురళీకృష్ణ, యూ.శివశంకర్, ఎం.సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

కిట్స్‌లో మాట్లాడుతున్న టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్. యశ్వంత్

– టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్

ప్రత్తిపాడు: దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడమే కేంద్రం లక్ష్యమని టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర బడ్జెట్ 2026పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్.యశ్వంత్ హాజరయ్యారు. యశ్వంత్ మాట్లాడుతూ వరుసగా 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డ్ సృష్టించారన్నారు. సబ్‌కా సాథ్ సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించినట్లు తెలిపారు. 2026 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమన్నారు. డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ఈ-గవర్నెన్స్ బలోపేతం, ఎగుమతుల ప్రోత్సాహానికి టెక్నాలజీ వినియోగం వంటి చర్యలు భారత వాణిజ్య రంగాన్ని బలపరుస్తాయని వివరించారు. భారతీయ జనతా యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు అనిమేష్ బిశ్వాస్ మాట్లాడుతూ స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వడం వలన యువతకు విశేష అవకాశాలు లభిస్తాయన్నారు. టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి, పెట్టుబడుల వృద్ధి ద్వారా 'వికసిత భారత్' లక్ష్య సాధన వేగవంతమవుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీకి 'ఏఏ గ్రేడ్'

'ఏఏ గ్రేడ్' సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను అభినందిస్తున్నవిద్యాసంస్థల చైర్మన్ రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో ప్రతిష్టాత్మక 'ఏఏ గ్రేడ్' లభించిందని ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ కేవీ క్రిష్ణకిషోర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో 29వ ర్యాంక్ సాధించి 'ఏఏ గ్రేడ్'ను సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ కోర్సులలో విజ్ఞాన్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొత్తం 4,881 కోర్సు సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. వీటిలో 145 గోల్డ్ సర్టిఫికెట్లు, 424 సిల్వర్ సర్టిఫికెట్లు, 2,136 ఎలైట్ సర్టిఫికెట్లు, 2,176 సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఉన్నాయని వివరించారు. 61 ఎన్‌పీటీఈఎల్ స్టార్స్ సర్టిఫికెట్లు లభించడంతో పాటు, 106 మంది విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారని వెల్లడించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వరుసగా తొమ్మిదవ సారి జాతీయ స్థాయిలో టాప్-100లో స్థానం సంపాదించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. 'ఏఏ గ్రేడ్' సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

దొంగతనం కేసులో 8 నెలల జైలుశిక్ష

చీరాలరూరల్: దొంగతనం కేసులో నిందితునిపై ఉన్న నేరారోపణలు రుజువు కావడంతో గురువారం న్యాయమూర్తి నిందితునికి ఎనిమిది నెలలపాటు సాధారణ జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధించినట్లు టూ టౌన్ సీఐ నాగభూషణం తెలిపారు. బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీలో నివాసముంటున్న కుంచాల అంకుల్ ఇంటిలో 2018 మేనెలలో అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు వస్తువులు దొంగిలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 457, 380 ఐపీసీ సెక్షల కింది కేసు నమోదుచేశారు. కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఆదినారాయణపురానికి చెందిన సాతుపాటి బాలరాజుని నిందితుడిగా తేల్చి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. నిందితుడిపై ఉన్న నేరారోపణలను ఏపీపీ సీహెచ్.పద్మావతి సాక్ష్యాధారాలతో నిరూపించారు. కేసును విచారించిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కాత్యాయిని నిందితునికి 8నెలల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33371

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ ప్రముఖ విద్యాసంస్థ నందు పని చేయుటకు లేడి రిసెప్షనిస్ట్, కం లేడి టెలికాలర్ కావలెను. మంచిజీతం, బ్రాడీపేట, 2/11 గుంటూరు. ఫోన్: 8008145999

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ Technical Skills Nerchukoni Job Lo Set Avvali Anukone Vallaku Sadavakasam. Training Period 1 Month if you are Ready to Join Job After Course. No Iterview More details Contact: 8712625322. in between 8 AM to 9 AM Limited Seats Only.

■ ప్రముఖ స్కూల్స్ లో డేటా ఎంట్రీ & అటెండర్స్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను Contact ✆ 8143807128/ 9030928103

■ నరసరావుపేట దగ్గర ప్రముఖ ఆక్వా కంపెనీలో పనిచేయుటకు బాయిలర్ ఆపరేటర్ కావలెను. ITI / డిప్లొమా ఎలక్ట్రికల్ క్వాలిఫికేషన్ కలిగిన యువకులు కావలెను బయోడేటా పంపవలసిన mail.id admin@valvin.in సంప్రదించండి: ✆ 9618157339 /96639 09856 / 9441484802

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గుర్తించాలి.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మికుల గళం

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆందోళనలు

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలో గురువారం కార్మిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం, కార్మిక సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దతు పలికారు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిలోని సాయిబాబా గుడి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ నెహ్రూబొమ్మ సెంటర్ వరకు కొనసాగింది. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతాంగ వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు దర్శనపు సామ్యేలు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, బూరుగ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు రత్నాకర్ శ్రీనివాసరావు, కొప్పుల తిరుమలేశ్‌రావు, రాంబాబు, చిట్టిబాబు, నవీన్, పండు, రాజేష్, చిన్నారావు, తిరుమల, జి.రాంబాబు, చిట్టిబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాస్, సత్య, శ్రీనివాసరావు, రమేష్, నాయకులు డి.వెంకట్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, భర్తులం, దుర్గారావు, మేరి, లక్ష్మి, కూరపాటి స్టీవెన్, బర్నబాసు, నార్ని నాగేశ్వరరావు, కృష్ణ, రేణుక, సరళ, వెంకయ్య, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాజధాని ప్రాంత కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శాంతకుమారి, తోకల బాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు వేణు, నారాయణ, స్వర్ణకుమారి, ఆదిలక్ష్మి, రామారావు, దివ్య, పార్వతి, రజని, గురవయ్య, ప్రజా సంఘాల నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఈమని రామారావు, ఆర్‌వీ రాఘవయ్య, కోటేశ్వరరావు, సుభాని, గాంధీ, స్వరూప, సుబ్బులు, ఆటో కార్మికులు, ఆశా వర్కర్స్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

ఫిరంగిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. నులకపేటలోని యూనియన్ కార్యాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయం, సచివాలయం, ఎంఈవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ శ్రీను (వేపచెట్టు శ్రీను), నాయకులు ఖాసిం, శ్రీను, వినయ్, జాని, విజయ్‌బాబు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: కార్మికులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం చేపట్టిన విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో గురువారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వం ఆ పద్ధతిని విడనాడాలని అన్నారు. కొత్త ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, రైతు సంఘం నాయకులు మార్పుల వెంగళరెడ్డి, సీఐటీయూ నాయకులు చందోలు రామారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రజని, విజయ, సీతారాఘవ, సతీష్, కె.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ దుగ్గిరాలలో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్యాస్ కంపెనీ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సీపీఎం, సీపీఐ నాయకులు మాట్లాడారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షులు జెట్టి బాలరాజు, స్టాలిన్, జి.శ్రీనివాసరావు, నాగిరెడ్డి, చిరంజీవి, జయతి, సునీతకుమారి, విమల, సుజాత, రాహేలమ్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జెట్టి బాలరాజు

క్లుప్తంగా

ఆత్మకూరులో బ్యాంకింగ్‌పై అవగాహన

మంగళగిరి టౌన్: కేఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్టెన్షన్ ఆక్టివిటీ, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో రూరల్ బ్యాంకింగ్ అవగాహన అంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింక్ సేవల ప్రాధాన్యతను ప్రజలకు వివరించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఖాతాల అవసరం, జన్‌ధన్ యోజన, డిజిటల్ లావాదేవీలు, యూపీఐ వినియోగం, ఋణ సదుపాయాలు, రైతులకు అందుబాటులో ఉన్న అంశాలపై ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలి, ఏటీఎం వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలను ప్రజలకు ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో సీఈఏ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

బీసీ పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మంగళగిరి టౌన్: బీసీ పారిశ్రామిక వేత్తలకు సైతం అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు కోరారు. గురువారం బీసీ సంఘ నాయకులతో కలిసి ప్రభుత్వ పరిశ్రమల, వాణిజ్యశాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్‌కు వినతిపత్రాన్ని అందించారు. వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ పరిశ్రమాధిపతులకు, ఎస్సీ ఎస్టీలతో పాటు పెట్టుబడి రాయితీలు కల్పించాలని అన్నారు. బీసీ పారిశ్రామిక వేత్తలను అనర్హత జాబితా నుంచి మినహాయించి అన్ని రకాల యూనిట్లను నెలకొల్పుకొనే అర్హత కల్పించాలని పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేసి బీసీ పారిశ్రామిక వేత్తల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని యువరాజ్‌ను ఆయన కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పూర్ణచంద్రరావు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఆదినారాయణలు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 436వ రోజుకు చేరుకుందని.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, నారదాసు, సుబ్బారావు, గురవయ్య, తుపాకుల నాగేశ్వరరావు, ఆశీర్వాదం, సుధ, ఏసోబు, సూర్యప్రకాష్, మహిళలు ఇమాంబి, రిబ్కా, శారమ్మ, లక్ష్మి, కాసమ్మ, సువర్ణకుమారి, పిచ్చయ్య, యహోషువా, ఇశ్రాయేల్, ఖాసిం పాల్గొన్నారు.

డీఈఓ లీప్ పాఠశాల సందర్శన

విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి నిడమర్రులో నిర్మాణంలో ఉన్న లీప్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా గురువారం సందర్శించారు. పాఠశాలలోని గ్రంథాలయం, క్రీడా మైదానంతో పాటు అన్ని సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్‌ను పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న అన్ని వసతులను ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి ఎక్కువ మంది విద్యార్థులు చేరే విధంగా చొరవ చూపాలని కోరారు.

అనంతరం ఆయన చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న బుద్ధి మాంద్యము గల పిల్లల శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు ఇటువంటి విద్యార్థులకు సహనం, ఓర్పు, దయతో విద్యాబుద్ధులు నేర్పించాలని, భవిష్యత్తులో వారు ఎవరిపై ఆధారపడకుండా వారి పనులు వారే చేసుకునే విధంగా తయారు చేయాలని సూచించారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా పేర్కొన్నారు. మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్, ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త సేకరణ వాహనాల వినియోగం, వనరుల వారీగా చెత్తను వేరుచేయడం, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. ప్రతి వీధిలో సమయపాలనతో చెత్త సేకరణ జరగాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా చెత్త నిల్వలు ఏర్పడితే అవి తొలగించాలని, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా దోమల పెరుదల నివారించే విధంగా మందు పిచికారీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఉప కమిషనర్ శ్రీకాంత్, సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అలీమ్‌బాషా

ఎస్‌ఆర్‌ఎంలో బిజినెస్ ఫెస్ట్ అమేయ

మంగళగిరి టౌన్: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో అమేయ–26 పేరిట జరుగుతున్న బిజినెస్ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. వర్సిటీలోని ప్యారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ఏటా ఈ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సు చదివే విద్యార్థుల్లో సృజనాత్మక వ్యాపార దృక్పథాలను అలవరచాలనే ఆలోచనతో అమేయ పేరుతో ఈ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన మేనేజ్‌మెంట్ విద్యార్థులు 25 జట్లుగా ఏర్పడి నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుకు ఆలోచనలు పంచుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన వివిధ బిజినెస్ స్టాళ్లను పరిశీలించిన నిర్వాహకులు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ది బెస్ట్ మేనేజర్ టైటిల్‌ను విజయవాడ లయోలా కాలేజీకి చెందిన విద్యార్థి శశాంక్ దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ప్యారీ స్కూల్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.వి.రమణారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, ప్రొఫెసర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అమేయ-26 నిర్వాహకులు

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

దుగ్గిరాల: తెగుళ్ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. గురువారం దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో మొక్కజొన్న రైతులతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల సందేహాలకు సమాధానాలు, పంట జాగ్రత్తలు అందించారు. అనంతరం గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎ.మనోజ్ మాట్లాడుతూ.. మొక్కజొన్నలో జింక్, ఇనుము దాతు లోపాల సవరణను వివరించారు. శాస్త్రవేత్త ఎస్.గోపాలస్వామి ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అనంతరం పెసర పంటను పరిశీలించి బూడిద తెగులు, పొగాకు లద్దె పురుగు వంటి సమస్యలకు నివారణ చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి ఏడీ ఆర్.విజయబాబు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటపొలంలో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

దుగ్గిరాల: రేవేంద్రపాడు కాలిబాట వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రేవేంద్రపాడు వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధురాలు ఎం.సామ్రాజ్యాన్ని ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు బలంగా ఢీకొన్నాడు. ఘటనలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం చినకాకానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దుగ్గిరాల: అర్ధరాత్రి రెండు కార్లు బలంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామ పంచాయతీ సమీపంలో విజయవాడ–తెనాలి ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఘటనలో ఒకరు తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భారీగా ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా క్షతగాత్రులు ఆటోలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళ్లారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మంగళగిరి టౌన్: పెదవడ్లపూడి సాయిబాబా మందిరంలో మందడం హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించారు. హస్పిటల్ అధినేత డాక్టర్ షేక్ రహీంబాషా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటిచుక్కల మందులు పంపిణీ చేశారు. 250 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారని గ్రామ మాజీ సర్పంచ్ పాతూరి సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి, ఇసుక, కంకరతో ఇబ్బందులు!

సీతానగరం బోటుయార్డు వద్ద ఓవర్‌లోడ్‌తో వెళ్లిన ఇసుక లారీ నుంచి కిందపడ్డ ఇసుక

పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధితో పాటు పలు ప్రాంతాల్లో ఓవర్ లోడ్‌తో లారీలు తిరుగుతున్నాయి. కనీసం భద్రతా చర్యలు చేపట్టకుండా అతి వేగంతో లారీలు నడపడంతో లారీల్లో తీసుకు వెళుతున్న మట్టి, ఇసుక, కంకర, ఇతర ముడి సరుకులు రోడ్డుపై పడుతున్నాయి. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉండవల్లి నుంచి సీతానగరం మీదుగా బైపాస్‌కు వెళ్లే మార్గంలో రైల్వే అండర్‌పాస్ వద్ద గడ్డర్ ఎత్తుకు మించి లారీల్లో లోడ్ వేసుకు వెళ్లడంతో ఆ గడ్డర్ తగిలి లారీపై ఉన్న ఇసుక, మట్టి, కంకర కింద పడుతోంది. నల్లమట్టి, ఇసుక, కంకర రోడ్డుపై పడడంతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు జారి కింద పడుతున్నారు. ఉండవల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గల మలుపు దగ్గర కూడా ఇదే పరిస్థితి. వారంలో రెండు మూడు సార్లు మట్టి పడడంతో దానిని కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. భారీ వాహనాలు తిరగడంతో దుమ్ము, ధూళి లేచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు, కంతేరు, కృష్ణాయపాలెం, పెనుమాక గ్రామాల్లో రోడ్డుపై ఏదో ఒక చోట ఈ పరిస్థితి నెలకొంటోంది. ప్రతిరోజు సీతానగరం బోటుయార్డు రైల్వే అండర్ పాస్ వద్ద నలుగురు నుంచి ఆరుగురు కార్మికులు ముఠా కూలీల్లా మారి ఇసుక, కంకరను ఎత్తి రోడ్డుపక్కన పడవేయాల్సి వస్తోంది. రైల్వే బ్రిడ్జి వద్ద లారీపై ఉన్న లోడ్ తగిలి బ్రిడ్జికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రమాదాలను నివారించేందుకు అధిక లోడ్‌తో వెళ్లే లారీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

దుగ్గిరాల: పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామ పంచాయతీలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో పలు క్రీడలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు ప్రారంభం కాగా జట్టుల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంబీటీఎస్ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపల్ పి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు లక్ష్మీ నారాయణ, జీవన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ బి.సాయిబాబు, క్రీడాకారులు, రిఫరీలు పాల్గొన్నారు.

పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మహిళల ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై సమావేశం నేడు

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని మహిళలకు టైలరింగ్ రంగంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు తుళ్లూరు హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి నిరుద్యోగులు హాజరై ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. గతంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు లేదా తమ గ్రామాల్లో టైలరింగ్‌పై ఆసక్తి కలిగి జాబ్ వర్క్ లేదా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న మహిళల కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి సెంట్రల్ బిజినెస్ పార్క్, మంగళగిరి నుంచి సంబంధిత ప్రతినిధులు ప్రత్యేకంగా హాజరై టైలరింగ్ ఉద్యోగాలు, జాబ్ వర్క్ అవకాశాలు, పని విధానం, ఉపాధి కల్పనపై అవగాహన కల్పించనున్నారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలి

తాడికొండ: కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. ఈ సందర్భంగా గురువారం తుళ్లూరులోని అంబేడ్కర్ సెంటర్ నుంచి కార్మిక ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో భాగంగా లైబ్రరీ సెంటర్ వద్ద మానవహారం నిర్మించిన కార్మిక సంఘాలు నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షురాలు మన్నవ ధనలక్ష్మి, సీఐటీయూ రాజధాని డివిజన్ కో కన్వీనర్ ఎం.రవి, నేతాజీ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా లేబర్ కోడ్‌లు ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గుంటూరు జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్, రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ సుశీల, కె.గోపిరాజు, యూటీఎఫ్ నాయకులు యు.రాజశేఖర్, సీహెచ్ ఆదినారాయణ, అడవి శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఎన్జీవో యూనియన్ నాయకులు ఎస్‌కే కరీం, సీఐటీయూ నాయకులు పేరం బాబురావు, కుంభ ఆంజనేయులు, ఎస్‌కే జానీ, టి.బాబు, ఓ.రామారావు, కేవీపీఎస్ నాయకులు ఎస్.కోటేశ్వరరావు, అంబేడ్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జె.నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో మానవహారంగా నిరసన తెలియజేస్తున్న కార్మికులు

తాడికొండ: కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం చింతచెట్టు సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం సమీపంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రంకొండ సత్యానందం, సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహన్‌రావు, సీపీఎం నాయకులు చింతల భాస్కరరావు, భద్రయ్య, జోషి, సమాజ్ వాది పార్టీ నాయకులు శాఖమూరి సాంబశివరావు, కన్నెబోయిన వంశీకృష్ణ, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశాలు, పారిశుద్ధ్య కార్మికులు, యానిమేటర్లు, ఆటో వర్కర్లు పాల్గొన్నారు.

తాడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

డాక్టర్ అన్నే సేవలు మరువలేనివి

మంగళగిరి టౌన్: పట్టణంలోని ప్రముఖ వైద్యులు అన్నే సూర్యాజిరావు బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పార్థివదేహాన్ని గురువారం కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి ఉన్న సన్నిహితుల్లో డాక్టర్ అన్నే సూర్యాజిరావు ఒకరని పేర్కొన్నారు. వైద్యరంగంలో నాలుగు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించారని అన్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

వాలెంటైన్స్ డే ఫ్యాషన్

ఫ్లోరల్ బటర్‌ఫ్లైస్ ముంచెత్తే ఎరుపు రంగు
సిల్క్ దారాల మ్యాజిక్..
వాలెంటైన్ డేని స్పెషల్ అట్రాక్షన్‌గా మారుస్తుంది.
ప్రింట్లు, అల్లికలు అదనపు హంగులను తీసుకువస్తాయి.
ప్లెయిన్‌గా ఉన్నా స్టైలిష్ అనిపిస్తాయి.
క్యాజువల్ అయినా, పార్టీవేర్ అయినా
రెడ్ కాంబినేషన్ స్పెషల్ వాలెంటైన్స్ డేని
స్పెషల్‌గా మారుస్తుంది.

వాలెంటైన్ ఫ్లోరల్ రెడ్

ఈ యేడాది వెల్వెట్, శాటిన్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన సూట్లు, డ్రెస్సులు కూడా హైలైట్‌గా నిలుస్తున్నాయి. దీనిలోనూ సస్టైనబిలిటీ ఫ్యాబ్రిక్‌తో పాటు కంఫర్ట్ ఉండే వాటికి ప్రాధాన్యత పెరిగింది. ఫ్యాషన్ దిగ్గజ డిజైనర్లు రెడ్ కలర్ కలెక్షన్‌ను తమ సిగ్నేచర్ డిజైన్స్‌గా అందిస్తుంటారు. వారిలో ఇండియన్ డిజైనర్స్‌గా పేరొంది.. మనదైన వారసత్వ సంపదను సూచించే సబ్యసాచి, శిల్పకళను వస్త్రాలలో చూపే గౌరవ్‌గుప్తా, రొమాంటిక్ వేర్‌ను క్రియేట్ చేసే అనితాడోంగ్రే, బోల్డ్ ప్రింట్స్‌తో మ్యాజిక్ చేసే మసాబా గుప్తా, మోడ్రన్ శైలితో ఆకట్టుకునే అనామిక డిజైన్స్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటాయి. స్పెషల్ డే కోసం స్టైలిష్‌గా వెలిగిపోవడానికి ఈ డిజైనర్స్ ఇస్తున్న సూచనలివి.

లేస్ డిజైన్స్

క్లాసిక్ రెడ్ మిడీ డ్రెస్, మ్యాక్సీ డ్రెస్, స్టైలిష్ స్లిట్స్ ఈవెనింగ్ వేర్‌గా సెట్ అయితే, క్యాజువల్ లుక్ కోసం కుర్తా, కో–ఆర్డ్ సెట్‌లు సరైన ఎంపిక అవుతాయి. లేస్‌తో డిజైన్ చేసినవి, కుచ్చులుగా ఉండేవి, హాఫ్ షోల్డర్స్ స్టైల్.. ఈ రోజున ప్రత్యేకంగా నిలుస్తాయి.

మ్యాచింగ్ డ్రెస్

- మ్యాచింగ్ స్కర్ట్‌లు, శాటిన్ స్లిప్ డ్రెస్‌లు లేదా పేస్టెల్ కలర్స్ బ్లేజర్‌లను వాలెంటైన్స్ డేకి ఎంచుకోవచ్చు. వీటికి మ్యాచింగ్‌గా హృదయాకారపు ఇయర్ హ్యాంగింగ్స్, అందమైన నెక్‌పీస్, క్లచ్‌తో లుక్‌ను పూర్తి చేయవచ్చు.
- సాధారణంగా రెడ్ కలర్‌కే ప్రాముఖ్యం అనుకోవడానికి లేదు. మెరిసే సిల్వర్, గోల్డెన్ కలర్ డ్రెస్సులు ఈవెనింగ్ పార్టీలలో ప్రత్యేకతను చూపుతాయి.
- హార్ట్ షేప్‌లో ఉండే ప్రింట్లు, పోల్కా డాట్స్, పెద్ద పెద్ద ఫ్లోరల్ డిజైన్స్‌ను ఈ రోజు ప్రయత్నించవచ్చు. హై–వెయిస్టెడ్ ప్యాంటు లేదా స్కర్ట్‌తో జత చేసిన హార్ట్–ప్రింటెడ్ బ్లౌజ్ స్టైలిష్‌గా ఉంటుంది.
- భాగస్వామితో కలిసి మ్యాచింగ్ డ్రెస్ ధరించాలనుకుంటే ఒకేలాంటి దుస్తుల కంటే థీమ్ డ్రెస్ మీద దృష్టి పెట్టడం మంచిది. అదెలాగంటే.. ఒకరు రెడ్ కలర్ దుస్తులు, మరొకరు టై, యాక్సెసరీలలో రెడ్ కలర్‌ను చేర్చవచ్చు.

కంఫర్ట్ ముఖ్యం

- ఏ స్టైల్ అయినా సౌకర్యంగా అనిపించే దుస్తులనే ఎంచుకోవాలి.
- వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే అంశాలను చేర్చాలి. ఇష్టమైన రంగు, సిగ్నేచర్ యాక్సెసరీ లేదా ప్రత్యేకమైన స్టైల్ ట్విస్ట్ .. ఇలా ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి.
- లేస్‌తో డిజైన్ చేసిన యాసెంట్స్, రఫ్లెస్ లేదా స్లిట్స్ ఉన్న సిల్హౌట్స్, ఫ్లోయీగా ఉండే మిడి డ్రెస్‌లను ఎంచుకోవచ్చు.

టైమ్‌లెస్‌గా, సొగసైన లుక్ కోసం స్ట్రాపీ హీల్స్, లైట్ వెయిట్ సింపుల్ జ్యూవెలరీని ఈ డ్రెస్‌కు జత చేయచ్చు.

నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

ఆల్ ‘ఇంటి’యా రేడియో!

వన్స్ అపాన్ ఏ టైమ్ రేడియో అంటే...
ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ కాదు. మన కుటుంబసభ్యురాలు!
పొద్దుటే సుప్రభాతంతో నిద్ర లేపి, ప్రపంచంలో, దేశంలో
ఏ మూలన ఏం జరుగుతుందో చెప్పి, బుర్ర హీటెక్కిపోకుండా
చల్లని పాటలు వినిపించి... ఒక్కటా రెండా...
రేడియో అంటే అంతులేని అపురూపమైన జ్ఞాపకాల సంపద....

ఆకాశవాణి-రజని

మన ఆకాశవాణిని జనరంజకం చేసిన వారిలో బాలాంత్రపు రజనీకాంతరావు ఒకరు. ఆకాశవాణిలో స్వరకర్తగా, గీతరచయితగా, సంచాలకునిగా పలు బాధ్యతలు నిర్వహించారు. లలిత సంగీతాన్ని ఆకాశవాణి వేదికగా జనరంజకం చేశారు. 1947 ఆగస్ట్ 15 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి, ప్రధాని నెహ్రూ ప్రసంగం తరువాత రజని రచించి, స్వర పరిచిన ‘మాదీ స్వతంత్రదేశం’ ప్రసారం అయింది.

99%

ఆకాశవాణిగా ప్రసిద్ధమైన ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్) ప్రపంచంలో అతి పెద్ద ప్రసార సంస్థలలో ఒకటి. 23 భాషలలో, 179 మాండలికాలలో మన దేశంలోని 99 శాతం మందికి చేరువైంది.

1923

బాంబే రేడియో క్లబ్ కార్యక్రమాలతో 1923లో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. మొదటి న్యూస్ బులెటిన్ జనవరి 19, 1936లో ప్రసారం అయింది.

ఆకాశవాణి - ఆధ్యాత్మికం - ఉషశ్రీ

రామాయణ, భారత, భాగవతాలను ఆకాశవాణి వేదికగా సామాన్యులకు చేరువ చేశారు ఉషశ్రీ. భగవద్గీత, సుందర కాండలను అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. ఆయన నిర్వహించిన ‘ధర్మసందేహాలు’ కార్యక్రమం చాలా జనాదరణ పొందింది. పౌరాణికాలకు సంబంధించి ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి.

ఆకాశవాణి-మహానటి

మహానటి సావిత్రి సమర్పించిన జనరంజని ప్రత్యేక కార్యక్రమం 1979లో ఉగాది రోజున ప్రసారం అయింది.

ఆకాశవాణి-ఆమె

ఆల్ ఇండియా రేడియోకు ఆగస్ట్ 1947లో మొదటి మహిళా న్యూస్‌రీడర్‌గా సయిదా బానో నియమితులయ్యారు.

సిగ్నేచర్ ట్యూన్ శివరంజని

శివరంజని రాగం ఆధారంగా వాల్టర్ కౌఫ్‌మన్ ఆల్ ఇండియా రేడియో సిగ్నేచర్ ట్యూన్‌ను స్వరపరిచారు. వయోలిన్‌పై వాయించారు.

జనం మెచ్చిన జనరంజని

శ్రోతలు కోరిన పాటల కార్యక్రమం ‘జనరంజని’ అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమాలలో ఒకటి. ఆదివారాలు, పండగ రోజుల్లో ప్రత్యేక జనరంజని కార్యక్రమాలు ప్రసారమయ్యేవి.

బారిష్టర్ పార్వతీశం రాకతో రేడియో నవ్వింది!



మొక్కపాటి ప్రసిద్ధ హాస్య నవల ‘బారిస్టర్ పార్వతీశం’ ఆకాశవాణిలో అత్యంత ప్రజాదరణ పొందిన నాటకాల్లో ఒకటి.

రేడియోలో వేటూరి



విజయవాడ కేంద్రం ద్వారా ప్రసారమైన వేటూరి సంగీత రూపకం ‘సిరికాకొలను చిన్నది’ అద్భుతమైన ఆడియో నాటిక. ఈ సంగీతక రూపకానికి పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం అందించారు.

థీమ్ 2026

ఈ సంవత్సరం ‘వరల్డ్ రేడియో డే’ థీమ్...‘రేడియో అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: ఏఐ ఈజ్ ఏ టూల్, నాట్ ఏ వాయిస్’

పొరం నుంచి పాకం దాకా

ఆమె ఎంబీఏ చేసింది. ముంబాయిలో ఓ పేరున్న కార్పొరేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పెద్ద జీతం మీద పాఠాలు చెబుతూ మంచి పేరే తెచ్చుకుంది. అయితే ఉన్నట్టుండి ఆమె పాఠాలు చెప్పే ఉద్యోగాన్ని మానేసి ఇంటి దగ్గరే హెల్దీ శ్నాక్స్ తయారీకి శ్రీకారం చుట్టింది. రుచిగా, శుచిగా ఉండే చిరుతిళ్లను చాలా తక్కువ ధరకే అమ్మడం మొదలు పెట్టింది. ఇప్పుడామె తయారు చేసే శ్నాక్స్ యూఎస్, కెనడా, ఆస్ట్రేలియాలతో సహా దాదాపు పదిహేను దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆమే జైపూర్‌కు చెందిన రిచాశర్మ. ఇంతకీ ఆమె ఇంత హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకుందో... ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎలా ఎదిగిందో చూద్దాం...

రిచాశర్మది జైపూర్. ఫైనాన్స్‌లో ఎంబీఏ చేసింది. అక్కడే ఓ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసింది. అయితే అది ఆమెకు చాలా దూరం కావడంతో ప్రయాణాలు చేయలేక వడోదరలోని పరుల్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరింది. అక్కడ నాలుగైదేళ్ల పాటు పని చేసింది. పెళ్లి తర్వాత భర్తతో కలిసి ముంబాయి మహానగరంలో కాలు పెట్టింది. అప్పుడే ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టడం, వారి ఆలనా పాలనా చూసుకోవడం తో ఇక ఉద్యోగం ఊసులేకుండా వారితోటే పూర్తికాలం గడిచిపోయింది. మెల్లగా ఆ పిల్లలు రెండు, ఆరు తరగతులకొచ్చారు. వాళ్లకోసం రకరకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన చిరుతిళ్లు తయారు చేసి పెట్టేది. ఈ క్రమంలో ఆమె చేసే తినుబండారాలను పిల్లల ద్వారా వారి స్నేహితులు, వాళ్ల వాళ్ల ఇళ్లలోనివాళ్లూ రుచి చూశారు. అవి వారికి బాగా నచ్చడంతో వారిలో కొందరు ‘మీ పిల్లలకోసం తయారు చేసేటప్పుడే... మరికొద్ది మొత్తంలో మా పిల్లలకు కూడా చేసి పెట్టవచ్చు కదండీ’ అని అడగడంతో రిచాశర్మ గ్లుటెన్, మైదా, డాల్డా లాంటివి లేకుండా రుచికరమైన కమ్మటి శ్నాక్స్ తయారు చేయడం మొదలు పెట్టింది. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలతో లడ్డూలు, ధోక్లా, కచోరీలు, సబ్జీలు తయారు చేసేది. అవి అక్కడివాళ్లకు అమితంగా నచ్చేవి. మాకు కావాలంటే మాకు కావాలని అందరూ పోటీపడేవాళ్లు. దాంతో ఆమె ‘రిచా ప్లేటర్’ పేరుతో శ్నాక్స్ సప్లై చేసేది.

కోవిడ్ మార్చేసిన జీవితం

అలా సాగుతున్న ఆమె జీవితంలో కోవిడ్ పెను మార్పు తెచ్చింది. ఇక్కడ మార్పు అనగానే ఆమె చేసే శ్నాక్స్ బిజినెస్ కాస్తా దెబ్బ తిందేమో అని జాలిపడితే పప్పులో కాలేసినట్టే.. ఎందుకంటే కోవిడ్ సమయం లో రిచాశర్మ రుచిగా శుచిగా శుభ్రంగా చేసే హోమ్ మేడ్ ఫుడ్ కోసం జనాలు ఎగబడ్డారు. దాంతో ఆమె బిజినెస్ ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. అప్పుడే ఆమె తన బిజినెస్ స్కిల్స్‌ను మరింత అభివృద్ధి చేసుకుంది. ఆర్డర్లకు తగ్గట్టే ప్రిపేర్ చేయడం వల్ల మిగిలిపోవడం కానీ, తక్కువ కావడం కానీ ఎప్పుడూ జరగలేదామెకి. దాంతో అప్పటివరకు మామూలు చిన్న చిన్న తినుబండారాల తయారీ నుంచి రకరకాల స్వీట్స్ తయారీకీ శ్రీకారం చుట్టింది రిచా. మొదట్లో నెలకు 20 ఆర్డర్లతో సరిపెట్టుకున్న రిచా శర్మ చూస్తుండగానే నెలకు 500 ఆర్డర్లకు సప్లై చేసేంతగా అభివృద్ధి చెందిందామె వ్యాపారం.

ఖర్, బోరివలి, అంధేరిలకే పరిమితమైన ఆమె కస్టమర్లు కోయంబత్తూరు, బెంగళూరు, ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌ల వరకు విస్తరించారు. తన బిజినెస్‌కు ‘హంబుల్ ఫ్లేవర్స్’ అనే పేరు పెట్టి దానిని ఇంకా ఇంకా పెంచింది రిచా. వచ్చిన లాభాలలో ఐదుశాతం వాటాను ఎన్జీవోలకు డొనేట్ చేస్తుంది రిచా. మరో ఐదుశాతం లాభాలను తనతో పని చేసే వారికి ఇస్తుంది రిచా. వ్యాపారం ద్వారా లాభాలను గడించడం తన లక్ష్యం కాదని, అందరికీ హెల్దీ, టేస్టీ శ్నాక్స్ అందించడంలోనే తనకు సంతృప్తి లభిస్తుందని చెప్పే రిచాను ఇండియన్ ఇన్‌స్పైరింగ్ హోమ్ బిజినెస్ ఉమన్ అవార్డు వరించింది.

విజయపథంలో ఆమె పాదం



వైకల్యం అనే ఓ పదం మనిషి ఆశలను, ఆశయాన్ని చలనం లేకుండా చేయలేదు అని నిరూపించింది. తనను చూసి ఎగతాళి చేసిన అయిన వాళ్లతో పాటు.. కరుడుగట్టిన బయటవాళ్లనూ గెలిచారు కృష్ణవేణి. ఇటీవల వెలువడ్డ గ్రూప్‌-1 ఫలితాల్లో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలంలోని శ్రీరంగరాజపురం (ఎస్ఆర్)కు చెందిన ముద్దంగల కృష్ణవేణి రాష్ట్ర వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. తల్లి రోజువారీ తాపీ పనులకు వెళితే.. తండ్రి వ్యవసాయ కూలి పనులు చేసి బిడ్డను చక్కగా చదివించారు. ఇపుడు ఊరంతా కృష్ణవేణి విజయం గురించి మాట్లాడుతోంది. కానీ ఆ విజయం వెనుక కష్టం గురించి మాత్రం కృష్ణవేణే మాట్లాడాలి. ఆమె ఏం చెబుతోందో తెలుసుకుందాం...

మాది పేద కుటుంబం. అన్న, నేను, తమ్ముడు ముగ్గురం. నాన్న దొరస్వామి. రోజూ పొలంలో కూలి పనులు చేస్తాడు, అమ్మ పేరు రత్నమ్మ. మగాళ్లకు సమానంగా ఇసుక–సిమెంటు కలపడం, ఇటుక రాళ్లు మోయడం లాంటి తాపీ పనులు చేసింది. రోజూ ఎవరో ఒకరు పనికి వెళితే తప్ప.. ఆ రోజు ఇల్లు గడవదు. తిన్నా, తినకున్నా.. నాకు మాత్రం స్కూల్‌లో ఉండడం ఇష్టం. నేను ఆరోతరగతి చదువుతుండగా 2010లో ఓ రోజు ఇంటి దగ్గర బట్టలుతికి, ఆరేస్తుండగా.. 11 కేవీ విద్యుత్ వైరు తగలడంతో నేను కిందపడిపోయాను. మా కుటుంబం పరిస్థితి తలకిందులైపోయింది.

అప్పుల ఊబిలో చిక్కుకున్నాం

ట్రాన్స్‌కో అధికారులకు అప్పటికే చాలాసార్లు చెప్పాం. లైను మార్చమని, వాళ్లు పట్టించుకోకపోవడంతో కరెంటు తీగలు తాకిన నాకు షాక్ తగిలి శరీరమంతా నల్లగా మారిపోయింది. ఇక బతకదన్నారు. చివరి ప్రయత్నంగా తమిళనాడు వేలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నన్ను ఎలాగో బతికించారు. మూడు నెలల తరువాత కాలు, చేయి కోల్పోయిన నన్ను ఇంటికి తీసుకొచ్చారు. అప్పటికే నా వైద్యంకోసం భూములు పోయినాయి. అప్పుల్లో చిక్కుకున్నాం. (ఇప్పటికీ వడ్డీలు కడుతున్నాం) కానీ నాకేమో ఇంట్లో ఉండడం నచ్చదు. ఏది ఏమైనా బడికి వెళ్లాలి. ఊరి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడితే ఊర్లో ఉన్న ఎవరో ఒకరు నన్ను స్కూటర్‌పై ఎక్కించుకుని బడిలో వదిలితే అమ్మో నాన్నో వచ్చి పిలుచుకెళ్లేవాళ్లు. ఆ తర్వాత కృత్రిమ కాలు అమర్చుకున్నాను.

ఆ నిర్లక్ష్యమే కసిని పెంచింది.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి పరిహారం కోరుతూ కలెక్టరేట్ చుట్టూ తిరిగేవాళ్లం. చేయి, కాలు పనిచేయని నన్ను అమ్మ–నాన్న చిత్తూరులో ఉండే కలెక్టరేట్‌కు తీసుకెళ్లేవాళ్లు. క్యూలో నిలబడి చాలాసార్లు మాకు జరిగిన అన్యాయం గురించి మొర పెట్టుకున్నాం. అప్పుడే నేనొకటి గమనించాను. మాకన్నా దారుణమైన పరిస్థితి ఉన్న వాళ్లు కూడా కలెక్టర్ పిలిస్తే వెంటనే అక్కడ నిలబడటం, ఆయన ఆదేశాలు పాటించడం చూశాం. అంటే చదువుకుని చేతిలో అధికారం ఉంటే అన్యాయం జరిగిన వాళ్లకు న్యాయం చేయొచ్చని మాత్రం అర్థమయ్యింది. ట్రాన్స్‌కో అధికారుల మనసు కరగకపోవడంతో అప్పులు చేసి మరీ కోర్టులో కేసు వేశాం. 54 కిలోమీటర్ల దూరాన్ని సైకిల్ తొక్కుతూ నాన్న వాయిదాలకు హాజరయ్యేవారు. అదే నాలో ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకోవాలనే కసిని పెంచింది. 14 ఏళ్ల తరువాత పరిహారం వచ్చినా.. అది మా అప్పులు–వడ్డీలకు కూడా చాల్లేదు. పదో తరగతి వరకు ప్రభుత్వ బడే. మళ్లీ ఇడుపులపాయలో సీటు, అక్కడే బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్) పూర్తి చేశాను.

ఐఏఎస్ అవుతా..

డిగ్రీ పూర్తయ్యాక స్నేహితులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాను. 2022లో వెలువడ్డ గ్రూప్స్ నోటిఫికేషన్‌లో తొలి పరీక్షే తప్పాను. ఆ మరుసటి ఏడాది వెలువడ్డ నోటిఫికేషన్‌లో ఎలాగైనా ఉద్యోగం కొట్టాలని నిర్ణయించుకున్నాను. గ్రూప్–1, గ్రూప్–2కు సమాంతరంగా సిద్ధమయ్యాను. నా ఆర్థిక పరిస్థితి తెలిసి చాలామంది దాతలు చందాలు వేసుకుని హాస్టల్ ఫీజులు, స్టడీ సెంటర్ ఫీజులు కట్టారు. అది ఎప్పటికీ మర్చిపోలేను. ఈ మధ్యే గ్రూప్–2లో సివిల్ సప్లైస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చినా గ్రూప్ 1లో ఉద్యోగం వస్తుందన్న ధీమాతో అందులో చేరలేదు. నా నమ్మకం వమ్ముపోలేదు. అనుకున్నట్లే వచ్చింది. అమ్మా నాన్నలను నా కారులో ఎక్కించుకుని ఊరంతా తిప్పాలి. ఇదే సమయంలో ఎప్పటికైనా ముద్దంగల కృష్ణవేణి.. ఐఏఎస్ అని పిలిపించుకోవాలన్న నా లక్ష్యాన్ని సాధించి తీరతాననే నమ్మకం ఉంది.

– ఎం.లోకనాథన్, సాక్షి, చిత్తూరు అర్బన్

రెట్రో క్వీన్ కల్పనా ఈజ్ బ్యాక్

ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారుతూనే ఉండే నేటి డిజిటల్ కాలంలో కూడా కానీ కొన్ని క్లాసిక్స్‌కు ఎప్పటికీ కాలం చెల్లదనడానికి 1981లో ఒక వెలుగు వెలిగిన రంభ హో పాట, ఇప్పుడు మళ్ళీ దేశవ్యాప్తం గా మార్మోగిపోతోంది. కారణం ఒరిజినల్ రంభా హో గర్ల్ కల్పనా అయ్యర్ తన 69 ఏళ్ల వయసులో చేసిన ఒక అద్భుతమైన డ్యాన్స్ పర్ఫార్మెన్స్. పశ్చిమ బెంగాల్ సిలిగురిలోని ఒక పెళ్లి వేడుకలో ఈ మ్యాజిక్ జరిగింది. తన స్నేహితురాలి కుమారుడి పెళ్లికి వెళ్లిన కల్పనా, అక్కడి వారి కోరిక మేరకు ఏమాత్రం ప్లాన్ చేయకుండానే స్టేజ్ ఎక్కారు. లెజెండరీ సింగర్ ఉషా ఉతుప్ పాడిన అత్యంత ప్రసిద్ధ పాటల్లో ఒకటైన రంభహో పాటకు ఆమె తనదైన శైలిలో స్టెప్పులేసి సందడి చేశారు. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే వైరల్ అవ్వడంపై కల్పనా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అభిమానులంతా తనపట్ల చూపిస్తున్న ప్రేమకి ఎంతో సంతోషంగా ఉందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కల్పనా అయ్యర్ 1980లలో బాలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన డాన్సర్, నటి. ఆమె 1978లో మిస్ ఇండియా రన్నరప్‌గా నిలిచారు. ఆ తర్వాత హిందీ సినిమాల్లో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా డిస్కో డాన్సర్ సినిమాలోని ఔవా ఔవా, అర్మాన్ చిత్రంలోని రంభ హో వంటి పాటలతో ఆమె దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆమెను అప్పట్లో క్యాబరే క్వీన్ అని పిలిచేవారు. ఈ పాట మళ్ళీ ఇంతలా వైరల్ అవ్వడానికి మరో కారణం బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ధురంధర్ సినిమా కోసం ఈ ఐకానిక్ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌లో ఉపయోగించారు. 80ల నాటి ఈ ఎనర్జిటిక్ పాటను నేటి జెన్‌జెడ్ యువత కూడా ఇష్టపడటం విశేషం.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 12న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,60,420	1,47,578	2,70,000
విజయవాడ	1,58,400	1,45,200	2,58,250
విశాఖపట్నం	1,58,400	1,45,200	3,00,000
రాజమండ్రి	1,61,610	1,49,950	2,76,000
ప్రొద్దుటూరు	1,59,100	1,46,370	2,67,500
చెన్నై	1,59,270	1,46,000	3,00,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోస్తా సేద్యానికి ఉప్పు నీటి ముప్పు!



ఉప్ప నీరు సముద్ర తీర ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లోకి చొచ్చుకు రావటం వల్ల ప్రపంచవ్యాప్తంగా కోస్తా ప్రాంత ప్రజలు నీరు, వ్యవసాయం, పర్యావరణం, జీవనోపాధి సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు ఉధృతమవుతున్న నేపథ్యంలో ఈ సమస్య మున్ముందు మరింత తీవ్రమయ్యే సూచనలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీరప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు లభ్యత సమస్య అంతకంతకూ పెచ్చుమీరుతూ ఆయా ప్రాంతాల్లో రైతులు, గ్రామీణుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భూగర్భ జలాల్లోకి ఉప్ప నీటి చొరబాటు సమస్య తాగునీరు, వ్యవసాయ నీటిపారుదల, ఆక్వాకల్చర్ రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. థర్మోఎలక్ట్రిక్ పవర్, పారిశ్రామిక ఉత్పత్తి, మైనింగ్ రంగాలకు కూడా విస్తరించింది. ఉప్ప నీటి కాలుష్యం సాంప్రదాయ వ్యవసాయ పంటల సాగును దెబ్బతీస్తోంది. రైతులు తక్కువ లాభదాయకంగా ఉండేవైనప్పటికీ ఉప్పను తట్టుకోగల పంటల వైపు మళ్లాల్సి వస్తున్నది. ఉప్ప నీటి ముప్ప ప్రపంచవ్యాప్తంగా ఎంత తీవ్రంగా ఉందో, పర్యవసానాలు, పరిష్కారాలేమిటనే అంశాలపై పెన్సిల్వేనియా యూనివర్సిటీ తాజా అధ్యయన వివరాలతో కథనం...

తీరప్రాంత వ్యవసాయ భూముల్లోకి (ఉపరితలంలో, భూగర్భంలోనూ) ఉప్పునీటి చొరబాటు సమస్య తీవ్రమవుతోంది. కోస్తా ప్రాంత వ్యవసాయ ఉత్పాదకతకు, పర్యావరణ వ్యవస్థ స్థిరత్వానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఈ ముప్పు నానాటికీ పెరుగుతోంది. తీరప్రాంతంలో భూమి పైన నీరు, భూగర్భ జలాలను ప్రభావితం చేస్తున్న ఈ సమస్యకు మారుతున్న వాతావరణంలో తీవ్రతరమైన సహజ ప్రక్రియలతో పాటు మానవ కార్యకలాపాలు కూడా కారణమవుతున్నాయి.

భూగర్భంలోకి ఉప్పునీటి చొరబాటుతో పాటు మంచి నీటి జలాశయాలు, ఉపరితల జల వనరులలోకి ఉప్పునీరు ప్రవేశించడం వల్ల తీరప్రాంత వ్యవసాయ మనుగడకు పెను సవాలు విసురుతోంది. ఈ సమస్య ముఖ్యంగా సముద్ర మట్టానికి 10 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న లోతట్టు తీర ప్రాంతాలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా 100 కంటే ఎక్కువ దేశాలను వేధిస్తున్న సమస్య. దీని ప్రభావం ముఖ్యంగా అమెరికా, చైనా, భారతదేశం, ఆస్ట్రేలియా, మెకాంగ్ డెల్టా, మధ్యధరా తీరప్రాంతం, నైలు నది డెల్టా ప్రాంతాల్లో గణనీయంగా ఉంది. సముద్ర మట్టం నిరంతరం పెరుగుతుండడంతో గతంలో ఉప్పునీటి సమస్య లేని తీరప్రాంత వ్యవసాయ భూములకు విస్తరిస్తోంది.



ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం నుంచి చాలా కిలో మీటర్ల వరకు భూగర్భ జలాలు క్రమంగా ఉప్పగా మారిపోతుండటం మనకు తెలిసిన విషయమే. అమెరికాలో 2011 – 2018 మధ్య దక్షిణ ఫ్లోరిడా తీరంలో ఉప్పునీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకు రావటంపై అధ్యయనాలు జరిగాయి. అదేవిధంగా, డెల్మార్వా ద్వీపకల్పంలో, వ్యవసాయ భూములలో ఉప్పు పీడిత ప్రాంత విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చాలా పంటలు నేలలో ఎక్కువ ఉప్పదనం ఉంటే తట్టుకోలేవు. కాబట్టి, వ్యవసాయ పంటల ఉత్పాదకతలో గణనీయమైన తగ్గుదలను గమనించారు. ఉదాహరణకు, డెల్మార్వా ద్వీపకల్పంలోని ఉప్పు నీరు భూగర్భంలోకి చొచ్చుకొచ్చిన ప్రాంతాల చుట్టూ ఉన్న 200 మీటర్ల బఫర్ జోన్‌లో పంటల ఉత్పాదకత తగ్గడం వల్ల వార్షిక నష్టాలు 39.4 మిలియన్ డాలర్ల నుండి 107.5 మిలియన్ డాలర్ల వరకు ఉన్నాయి. ఈ సమస్య తీవ్రమైన సందర్భాల్లో సారవంతమైన వ్యవసాయ భూములను కూడా రైతులు సాగు చెయ్యకుండా పూర్తిగా వదిలివేశారు.

ఉప్పునీటి చొరబాటు అనేక పర్యావరణ మార్పులకు దారితీస్తుంది. వీటిలో ఉప్పును తట్టుకోగల జాతుల దాడి పెరిగిపోతుంది. ఉప్పు నీటి ప్రభావంలో ఉన్న నేలల నుంచి పక్కనే ఉన్న నీటి వనరుల్లో నీటి నాణ్యత, జీవవైవిధ్యం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి.

అవగాహన పెరుగుతున్నప్పటికీ, పరిశోధనలు కొంత మేరకు జరుగుతున్నప్పటికీ.. తీరప్రాంత పంటల ఉత్పత్తిపై ఉప్పునీటి చొరబాటు ప్రపంచ వ్యాప్త ప్రభావాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చెయ్యాల్సిన దశలో మనం ఉన్నాం. ఉప్పునీటి చొరబాటు ప్రభావిత వ్యవసాయ భూమికి అవతల గల వందల మీటర్ల మేరకు విస్తరించిన భూములు కూడా ఈ దుష్ప్రభావాల బారిన ఉండటమే దీనికి కారణం. ఈ నేలల్లో మోస్తరుగా ఉండే దిగుబడి నష్టాలను గుర్తించడం, లెక్కించడం కష్టం. ఉప్పునీటి చొరబాటు ద్వారా ప్రభావితమైన వ్యవసాయ భూమిలో వివిధ దశల్లో వచ్చే మార్పులను పూర్తిగా అర్థం చేసుకుంటే తద్వారా ప్రతి దశకు తగిన నియంత్రణ, యాజమాన్య చర్యలను గుర్తించడానికి అవకాశం ఉంటుంది.

భూగర్భ జలాల అతి వినియోగం

భూమి లోపలి నుంచి నీటిని అతిగా బోర్ల ద్వారా తోడటం కన్నా వర్షపు నీరు తక్కువగా ఇంకుతున్న పరిస్థితుల్లో సముద్రపు ఉప్ప నీరు తీర ప్రాంతం నుంచి భూభాగం లోపలికి చొచ్చుకు రావటం తీవ్రతరమవుతోంది. ఉదాహరణకు అమెరికా గణాంకాల ప్రకారం.. 2000 సంవత్సరం తర్వాత కోస్తా ప్రాంతాల్లో 2,50,000 బోర్ల వివరాలను విశ్లేషించారు. 15% బోర్లు ఉన్న చోట్ల సముద్రపు ఉప్ప నీరు భూగర్భంలోకి ఎక్కువ దూరం చొచ్చుకు వచ్చింది. తీర ప్రాంతాల్లోని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో విస్తారంగా జనాభా సాంద్రత ఉంటుంది. కాబట్టి సముద్రపు నీటి మట్టం పెరగటం కన్నా బోర్ల ద్వారా భూగర్భ జలాలను విచ్చల విడిగా తోడెయ్యటమే సముద్రపు ఉప్ప నీరు భూగర్భంలోకి చొచ్చుకురావటానికి ముఖ్యంగా కారణమవుతోందని నిపుణులు తేల్చారు.

కోస్తా ప్రాంతాల్లో ఆక్వాకల్చర్ చెరువులు విస్తరిస్తున్నందు వల్ల భూగర్భ జలాల వినియోగం మరింత పెరిగి భూమి కుంగిపోవటంతో పాటు సముద్రపు ఉప్ప నీటితో భూగర్భ జలాలు మరింతగా కలుషితం అవుతున్నాయని గుర్తించారు. మెకాంగ్ డెల్టాలో 2050 నాటికి ఉప్ప నీటి బారిన పడే భూభాగం 10–27% పెరుగుతుందని అంచనా. అయితే, ఇదే ప్రాంతంలో సముద్రపు నీటి మట్టం పెరుగుదల కారణంగా ఉప్ప నీరు చొచ్చుకు వచ్చే సమస్య 6–19% మేరకు పెరుగుతుందని అంచనా. మన దేశంలో ఇటువంటి గణాంకాలు అంతగా అందుబాటులో లేవు. సమగ్రమైన వ్యూహాలను అమలు చెయ్యటం అవసరమని ఈ అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.



ఉప్పనీటి చొరబాటుకు కారణాలు

తీరప్రాంత భూముల్లోని భూగర్భ జలాల్లోకి ఉప్పనీటి చొరబాటుకు కారణాల్లో ప్రకృతి సిద్ధమైన వాటితో పాటు మనం చేసేవి కూడా ఉంటాయి.

సహజ కారకాలు:

1. సముద్ర మట్టం పెరుగుదల.
2. తీరప్రాంత భూమి క్షీణత
3. తుఫాన్లు, భారీ ఆటుపోట్లు.
4. దీర్ఘకాలిక కరువు పరిస్థితులు.

ఉప్ప నీరు చొచ్చుకురావటానికి దోహదపడే మన పనులు:

1. వ్యవసాయ, పారిశ్రామిక, గృహ అవసరాల కోసం భూగర్భజలాలను, ఉపరితల నీటిని విపరీతంగా వాడటం.
2. నదుల్లో నీటి సహజ ప్రవాహాన్ని అడ్డుకునే రీతిలో ఆనకట్టల నిర్మాణం.
3. టైడ్ గేట్లు, కాలువలు వంటి నీటి నియంత్రణ నిర్మాణాలు.

ఏటా 3.6 ఎం.ఎం. పెరుగుతున్న సముద్రపు నీటి మట్టం

సముద్రపు నీటి మట్టం పెరుగుదల, భూమి క్షీణత దీర్ఘకాలంలో చోటుచేసుకునే భూభౌతిక ప్రక్రియలు. ఇవి సహజ పరిణామాలు, మానవ కార్యకలాపాల వల్ల భూమి ఎత్తును మార్చి తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.

ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. ప్రపంచ సముద్రపు నీటి మట్టం పెరుగుదల రేట్లలో గణనీయమైన పెరుగుదల నమోదైంది. 1901–1990 మధ్యలో సంవత్సరానికి 1.4 ఎం.ఎం. పెరిగింది. 1993–2015 సంవత్సరాల మధ్య 3.2 ఎం.ఎం. మేరకు పెరిగింది. ప్రస్తుతం సంవత్సరానికి 3.6 ఎం.ఎం. మేరకు సముద్రపు నీటి మట్టం పెరుగుతోంది.

మానవ ప్రేరిత వాతావరణ మార్పు సముద్రపు నీటి మట్టం పెరుగుదల రేటును వేగవంతం చేస్తుందని అంచనా. ఇటీవలి ఐపీసీసీ ఆరవ అంచనా నివేదిక ప్రకారం 2100 నాటికి.. గ్రీన్ హౌస్ వాయువుల తగ్గింపు గణనీయంగా తగ్గిన పక్షంలో ప్రపంచ సగటు సముద్రపు నీటి మట్టం పెరుగుదల ఏటా 0.4 మీటర్లకు చేరుకుంటుందని అంచనా. అయితే, అధిక ఉద్గారాలు అదుపులేకుండా పెరిగిపోతే ఏటా 0.8 మీటర్ల వరకు పెరుగుతుందని నిపుణుల అంచనా.

భూములు నాశనం

తీరప్రాంత పంట భూముల కింద భూగర్భ జలాల్లో ఉప్పు శాతం పెరిగిపోతుండటం వల్ల భూమి స్వభావం పంటల సాగుకు అననుకూలంగా మారిపోతోంది. చౌడుదేలిన భూముల్లో విత్తనాలు సరిగ్గా మొలకెత్తవు. మొలకెత్తినా వేర్లు సరిగ్గా పెరగవు. పంటలు గిడసబారి ఉంటాయి. దిగుబడి తగ్గిపోతుంది. మొక్కలు నత్రజని, ఫాస్ఫరస్‌లను నిలుపు కోవటంలో విఫలమవ్వటం వల్ల పోషకాల లభ్యత తగ్గిపోతుంది.

ఈ సమస్యను తగ్గించడానికి ఉప్పునీరు చొచ్చుకురాకుండా వాటర్ కంట్రోల్ నిర్మాణలు, సబ్‌సర్ఫేస్ డామ్స్, హైడ్రాలిక్ బారియర్స్ నిర్మించుకోవాలి. చౌడుతో పాడైన భూములను తిరిగి సాగుకు అనుకూలంగా మార్చటానికి జిప్సం, సేంద్రియ ఎరువులు, బయోచార్ వంటివి వేసుకోవాలి. అయితే, ఈ ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితాలు ఎలా ఉంటాయన్నది అక్కడ ఉప్పునీటి సమస్య ఎంత తీవ్రంగా ఉంది? భూగర్భ జలాలు ఎంత లోతుగా ఉన్నాయి? అన్నదానిపై ఆధారపడి ఉంటుంది. ఆ భూముల్లో ఎలక్ట్రిక్ కండెక్టివిటీ (ఈసీ) ఎంత ఉందన్న దాన్ని బట్టి అక్కడ సాగు చేసే పంటలను రైతులు మార్చుకోవాల్సి ఉంటుంది. ఈసీ 5లోపల ఉంటేనే సాధారణంగా వరి పంట తట్టుకోగలుగుతుంది. అంతకన్నా ఎక్కువ ఉన్నప్పుడు ఉప్పును తట్టుకునే ప్రత్యేక వంగడాలను రైతులు ఎంచుకోవాల్సి ఉంటుంది.



వాతావరణ మార్పులు తీవ్రతరమవుతున్న ఈ తరుణంలో సముద్ర తీర ప్రాంతాల్లోకి భూగర్భంలో ఉప్పు నీరు చొచ్చుకు వచ్చే సమస్య మున్ముందు మరింత తీవ్రం అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలు ప్రత్యేకంగా స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి, తగిన ప్రణాళికలను అమలు చేయటం ద్వారా నష్టాన్ని కొంత మేరకు తగ్గించుకోవటానికి అవకాశం ఉంటుంది.

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

అముల్ కొత్త ఏఐ అసిస్టెంట్ సర్లాబెన్

పాడి రైతులు పాడి పశువుల సంరక్షణ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సలహాలు, సమాచారం పొందే ప్రక్రియను అముల్ సులభతరం చేసింది. 'సర్లాబెన్' పేరిట కొత్త కృత్రిమ మేధ (ఏఐ) అసిస్టెంట్‌ను అముల్ విడుదల చేసింది. ప్రపంచంలోని అతి పెద్ద పాడి రైతుల డేటాబేస్ అముల్ సొంతం. ఇందులోని 36 లక్షల మంది పాల ఉత్పత్తిదారులకు పశువుల ఆరోగ్యం, పెంపకం, ప్రభుత్వ పథకాలపై మార్గనిర్దేశం చేయడానికి అముల్ ఏఐ అసిస్టెంట్ 'సర్లాబెన్'ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే ఉన్న ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ సిస్టమ్, అముల్ పశుధాన్ అప్లికేషన్లతో సర్లాబెన్ అనుసంధానమై ఉంది. నమోదు చేసుకున్న పాడి రైతులకు పశువుల ఆరోగ్యం, టీకా షెడ్యూళ్లు, వైద్య చికిత్స, దాణా, సంతానోత్పత్తి పద్ధతులపై వ్యక్తిగతీకరించిన సూచనలు సలహాలను ఇది అందిస్తుంది.

'ఈ కృత్రిమ మేధ వ్యవస్థ అముల్ డేటాబేస్‌లోని రైతులకు రోజుకు రూ. 200 కోట్ల విలువైన లావాదేవీలు చేసే 36 లక్షల మంది రైతులకు సేవలందిస్తుంద'ని గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా అన్నారు. ఈ డేటాబేస్‌లో 1,500 మంది పశువైద్యుల బృందం అందించే పశువుల చికిత్స వివరాలు కూడా ఉన్నాయని గుజరాత్‌లోని ఆనంద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మెహతా అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అముల్ ఏఐ అసిస్టెంట్‌ను ప్రారంభించారు.

ప్రతి సంవత్సరం నిర్వహించే దాదాపు 70 లక్షల కృత్రిమ గర్భధారణలు, ఇస్రో ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి సేకరించే పశుగ్రాసం ఉత్పత్తి గణాంకాలు, గుజరాత్‌లోని రైతుల వారీగా పశుగణన డేటాతో ఏఐ అసిస్టెంట్‌ను అనుసంధానం చేశారు. ఏఐ అసిస్టెంట్‌ను రూపొందించడంలో భాగస్వామిగా ఉన్న ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శంకర్ మరువాడ మాట్లాడుతూ రైతులు కోరే సలహాలను అప్పటికప్పుడు అందించడానికి 'సర్లాబెన్' రూపొందించనట్లు చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ అమూల్ ఫార్మర్ మొబైల్ యాప్ ద్వారా అందుబాటులో ఉంది. ఇప్పటికే 10 లక్షల మంది రైతులు దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. 'సర్లాబెన్'ను ఫోన్ కాల్ ద్వారా కూడా రైతులు సంప్రదించవచ్చు. ల్యాండ్ లైన్‌లు ఉన్న రైతులు కూడా దీని ద్వారా పశుపోషణ సంబంధిత సలహాలు పొందగలుగుతారు. ఇదేమాదిరి ఏఐ అసిస్టెంట్లను స్థానిక భాషల్లో దేశవ్యాప్తంగా పశుపోషకులకు అందుబాటులోకి తేవటం చాలా అవసరం.

బిజినెస్ రీల్

కేవైసీపై కస్టమర్లలో అవగాహన కల్పించండి

బ్యాంక్‌లకు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా సూచన

ముంబై: 'ఆర్థిక అక్షరాస్యత వారం'ను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ముంబైలో ప్రారంభించారు. ఈ నెల 13 వరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా ఆర్థిక్ష అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నారు. ఒకటికి మించిన మాధ్యమాల్లో అవగాహన, ప్రచార కార్యక్రమాలను ఆర్‌బీఐ నిర్వహించనుంది. 2016 నుంచి ఆర్‌బీఐ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సురక్షిత కేవైసీ (కస్టమర్ గురించి వివరాలు తెలుసుకోవడం), సమ్మిళిత బ్యాంక్ ప్రాధాన్యాన్ని గవర్నర్ మల్హోత్రా ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవైసీ, ఈ–కేవైసీ, సెంట్రల్ కేవైసీ ప్రాధాన్యాన్ని కస్టమర్లకు ఈ కార్యక్రమంలో భాగంగా తెలియజేయడంపై బ్యాంక్‌లు దృష్టి సారించాలని కోరారు. అదే సమయంలో కేవైసీ సంబంధిత మోసాలు, దుర్వినియోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రిలయన్స్ రిటైల్ 'స్మార్ట్ బజార్ ఎక్స్ఛేంజ్' ఆఫర్లు



హైదరాబాద్: రిలయన్స్ రిటైల్ స్మార్ట్ బజార్ పొదుపు లక్ష్యంగా 'స్మార్ట్ బజార్ ఎక్స్ఛేంజ్' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'పురాన బేచో మెహంగా, ఔర్ నయా ఖరీదో సస్తా' నినాదంతో గృహాల్లో నిరుపయోగమైన, వినియోగంలోని వస్తువులను ఎక్స్ఛేంజీ(మార్పిడి) చేసుకునే వీలు కల్పిస్తుంది. తద్వారా కస్టమర్లు ప్రస్తుత కొనుగోళ్లపై భారీ పొదుపు పొందవచ్చు. పాత వార్తాపత్రికలు, వాడిన దుస్తులు, పాత వంట సామాగ్రి కిలోకు రూ.100 చొప్పున ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. ఈ ఎక్స్ఛేంజ్ విలువను కూపన్ల రూపంలో కిరాణా, గృహావసరాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు తదితర విభాగాల్లో వినియోగించుకోవచ్చని తెలిపింది. ''స్మార్ట్ బజార్‌లో 'విలువ' అనే పదానికి అర్థం ... కుటుంబాలు తమ రోజువారీ ఖర్చులను నియంత్రణకు సహాయపడటమే. కస్టమర్లు అవసరం లేని వస్తువులను సులభంగా మార్పిడి చేసుకొని, వాటి విలువను తమ అవసరాలకు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నాము. ఈ కార్యక్రమం ద్వారా భారత్‌లో అత్యంత విశ్వసనీయ విలువ కలిగిన రిటైల్ గమ్యస్థానంగా ఉండాలనే తమ హామీ మరింత బలపడుతుంది'' అని రిలయన్స్ రిటైల్ స్మార్ట్ బజార్ సీఈవో దామోదర్ మాల్ తెలిపారు. ఫిబ్రవరి 13న(శుక్రవారం) మొదలయ్యే ఈ కార్యక్రమం మార్చి 29 వరకు కొనసాగుతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-2-2026

విశాఖ	490–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	1,001.00	3.31
SHRIRAMFIN	1,083.00	2.48
EICHERMOT	7,936.50	2.13
ICICIBANK	1,432.00	1.84
BEL	444	1.47

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,529.80	-6.4
INFY	1,384.10	-5.97
TCS	2,741.90	-5.77
HCLTECH	1,470.90	-5.2
WIPRO	218.8	-4.79

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,469
ఎన్ఎస్ఈ	1,19,233
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,52,243
ఎఫ్ఐఐ	+ 108
డీఐఐ	+ 277

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.72 (రాత్రి 11.30కు)	$ 64.63 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.40 (రాత్రి 11.30కు)	$ 69.40 (క్రితం ముగింపు)

విశాఖలో ఇళ్ల అమ్మకాలు ఢీలా

- 2025లో 38 శాతం డౌన్
- 2,406 యూనిట్ల విక్రయాలు
- టాప్–15 ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తగ్గిన అమ్మకాలు

న్యూఢిల్లీ: విశాఖపట్టణం సహా దేశవ్యాప్తంగా టాప్–15 ద్వితీయ శ్రేణి పట్టణాల్లో గతేడాది ఇళ్ల అమ్మకాలు ఢీలాపడ్డాయి. 2024తో పోల్చితే 10 శాతం తగ్గి 1.56 లక్షల యూనిట్లుగా ఉన్నట్టు ప్రాప్ ఈక్విటీ సంస్థ వెల్లడించింది. అమ్మకాల విలువ మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1.48 లక్షల కోట్లుగా ఉంది. ప్రీమియం ఇళ్లకు మాత్రం ఆదరణ కొనసాగుతోంది. రూ.కోటికి మించి ధరల శ్రేణిలోని ఇళ్ల అమ్మకాలు గతేడాది 9 శాతం పెరిగాయి. మొత్తం ఇళ్ల విక్రయాల్లో వీటి వాటా 23 శాతం నుంచి 28 శాతానికి పెరిగింది.

- విశాఖపట్టణంలో 2025లో అమ్ముడైన ఇళ్ల యూనిట్లు 2,406గా ఉన్నాయి. 2024లో విక్రయాలు 3,858 యూనిట్లతో పోల్చితే 38 శాతం తగ్గాయి.
- కోయింబత్తూర్‌లో 4 శాతం తక్కువగా 3,702 యూనిట్లు విక్రమయ్యాయి.
- కోచిలో 17 శాతం తగ్గి 2,214 యూనిట్లకు విక్రయాలు పరిమితమయ్యాయి.
- నాగ్‌పూర్‌లోనూ అమ్మకాలు 18 శాతం తగ్గాయి. 6,260 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- భువనేశ్వర్‌లో 4,885 యూనిట్ల విక్రయాలు జరిగాయి. అంతకుముందు ఏడాదితో పోల్చితే 25 శాతం తగ్గాయి.
- వదోదరలో 19 శాతం తగ్గి 13,798 యూనిట్లు, సూరత్‌లో 15 శాతం తక్కువగా 19,835 యూనిట్లు చొప్పున విక్రయాలు నమోదయ్యాయి. గాంధీనగర్‌లో విక్రయాలు 13,884 యూనిట్ల నుంచి 13,710 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- అహ్మదాబాద్‌లో 51,148 యూనిట్ల ఇళ్లు అమ్ముడయ్యాయి. 2024లో విక్రయాలు 55,315 యూనిట్ల కంటే 8 శాతం తగ్గాయి.
- భోపాల్‌లో 5 శాతం తక్కువగా 3,599 యూనిట్లు, జైపూర్‌లోనూ ఇంతే మేర తగ్గి 9,758 యూనిట్లు చొప్పున విక్రయాలు నమోదయ్యాయి.
- మొహాలీలో మాత్రం 34 శాతం అధికంగా 6,118 యూనిట్లు, లక్నోలో 6 శాతం అధికంగా 4,053 యూనిట్లు చొప్పున అమ్ముడయ్యాయి.

ఎన్నో కారణాలు..

గతేడాది ద్వితీయ శ్రేణి పట్టణాల్లో (టైర్–2) అమ్మకాలు ప్రథమ శ్రేణి పట్టణాల్లో మాదిరే ఉన్నట్టు ప్రాప్‌ఈక్విటీ సీఈవో సమీర్ జసూజ తెలిపారు. రూ.కోటిలోపున్న ఇళ్ల సరఫరా తగ్గడమే విక్రయాలు బలహీనపడేందుకు కారణమని పేర్కొన్నారు. టైర్–2 పట్టణాల్లో రూ.కోటిలోపు ఇళ్లకే డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. భూముల ధరలు, నిర్మాణ వ్యయాలు, కొనుగోలుదారుల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగా వచ్చే ప్రాజెక్టుల్లో ఇళ్ల ధరలు అధికంగా ఉంటుండడం డిమాండ్, సరఫరాపై ప్రభావం చూపించినట్టు వివరించారు.

సీడీఎస్ఎల్ రీఇమేజిన్ ఐడియాథాన్

ముంబై: సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (సీడీఎస్ఎల్) మూడో విడత వార్షిక సింపోజియం సందర్భంగా తొలి రీఇమేజిన్ ఐడియాథాన్‌ని నిర్వహించింది. ఇన్వెస్టర్లలో అవగాహన పెంపొందించే సొల్యూషన్స్‌ని రూపొందించేందుకు ఉద్దేశించిన ఈ పోటీలో గోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కి చెందిన ప్రాజెక్ట్ సహాయక్ ప్రథమ స్థానంలో నిల్చి రూ. 5 లక్షల ప్రైజ్‌మనీని గెల్చుకుంది. మొదటి, రెండో రన్నరప్‌లకు రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలు బహుమతి లభించింది. ఎక్స్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలతో పాటు మార్కెట్ మౌలిక సదుపాయాలకు సంబంధించి డేటా కూడా కీలకంగా మారిందని సింపోజియంలో పాల్గొన్న సందర్భంగా సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు.

ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో ఎన్‌టీటీ డేటా జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ వెల్లడించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రాన్స్‌ఫర్మేషన్ నౌ వార్షిక కార్యక్రమం సందర్భంగా ఇందుకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. సంక్లిష్టమైన వ్యవస్థల కారణంగా మధ్య, భారీ స్థాయి కంపెనీలు బీ2బీ చెల్లింపుల విషయంలో పలు సవాళ్లు ఎదుర్కొంటాయని ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ ఎండీ కృణాల్ పటేల్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎస్ఏపీ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించే సంస్థల మధ్య బీ2బీ చెల్లింపులను సరళతరం చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్మేషన్ నౌ కార్యక్రమంలో 1,500 మంది పైగా సీఎక్స్‌వోలు, పరిశ్రమ దిగ్గజాలు పాల్గొన్నారు. డేటా సార్వభౌమత్వం, బాధ్యతాయుతంగా కృత్రిమ మేధను వినియోగించడం తదితర అంశాలపై చర్చించారు. ఆటోమోటివ్, కెమికల్స్, తయారీ తదితర రంగాల్లో ఎస్ఏపీ ఆధారిత వ్యూహాల అమలు తీరుతెన్నులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ గ్లోబల్ సీఈవో నార్బర్ట్ రోటర్‌తో పాటు ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

ఎమ్ఎస్ఎంఈలకు ఆర్‌బీఐ జోష్

రూ. 20 లక్షలవరకూ హామీలేని రుణాలు

ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు(ఎంఎస్ఎంఈలు)కు ఇకపై బ్యాంకులు హామీలేకుండానే రూ. 20 లక్షలవరకూ రుణాలను మంజూరు చేసేందుకు దారి ఏర్పడింది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే విధంగా రిజర్వ్ బ్యాంక్ తాజాగా ఈ అంశంలో సవరణలు చేపట్టింది. తద్వారా చిన్న బిజినెస్‌లకు సులభతర రుణ అందుబాటుకు వీలు కల్పించింది. ఎంఎస్ఎంఈ రంగంలోని యూనిట్లకు ఇచ్చే రూ. 20 లక్షల రుణాల వరకూ బ్యాంకులు కొలేటరల్ సెక్యూరిటీని కోరేందుకు అనుమతించరు. ఇదేవిధంగా కేవీఐసీ సంబంధిత ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన పథకం(పీఎంఈజీపీ)లో భాగంగా సైతం రూ. 20 లక్షలవరకూ ఎలాంటి హామీ లేకుండానే రుణాల జారీకి ఆర్‌బీఐ మార్గదర్శకాలను సవరించింది. ఎంఎస్ఎంఈ యూనిట్ల ఆర్థిక పరిస్థితులు, రుణ చెల్లింపుల తీరు(ట్రాక్ రికార్డ్) ఆధారంగా క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని అనుసరిస్తూ రూ. 25 లక్షలవరకూ రుణ మంజూరీకి సైతం బ్యాంకులను అనుమతించింది. బ్యాంకుల అంతర్గత విధానాలకు అనుగుణంగా వీటిని జారీ చేసేందుకు స్వేచ్ఛ కల్పించింది. అయితే రుణగ్రస్తులు హామీలేని రుణాలకు స్వచ్ఛందంగా పసిడి, వెండి కొలేటరల్‌గా బ్యాంకులవద్ద తాకట్టు పెట్టదలిస్తే బ్యాంకులు అనుమతించవచ్చు. తాజా నిబంధనల ప్రకారం ఇలాంటి సందర్భాలను నిబంధనల ఉల్లంఘనగా పరిగణించరు.

భారత వృద్ధి సూపర్‌ఫాస్ట్

- జీ–20 దేశాల్లో ఎంతో వేగం
- 2026–27లో 6.4 శాతం
- మూడీస్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.4 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా వేసింది. జీ–20 దేశాలన్నింటిలోనూ భారత వృద్ధి వేగవంతంగా ఉంటుందని పేర్కొంది. దేశీ వినియోగం బలంగా ఉండడం, విధానపరమైన మద్దతు చర్యలు, స్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థలను సానుకూలతలుగా ప్రస్తావించింది. భారత బ్యాంకుల ఆస్తుల నాణ్యత (రుణాలు) బలంగా ఉందంటూ.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) ఇచ్చిన రుణాల్లో కొంత ఒత్తిళ్లు ఉన్నట్టు తెలిపింది. అయినప్పటికీ రుణ నష్టాలను అధిగమించేందుకు సరిపడా నగదు నిల్వలు బ్యాంకుల వద్ద ఉన్నట్టు వివరించింది. 2026లో బ్యాంకుల నిర్వహణ వాతావరణం బలంగా ఉంటుందని.. పటిష్టమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, నిర్మాణాత్మక సంస్కరణలు మద్దతుగా నిలుస్తాయని బ్యాంకింగ్ రంగంపై విడుదల చేసిన నివేదికలో మూడీస్ రేటింగ్స్ పేర్కొంది. ''2025లో జీఎస్‌టీ శ్లాబుల క్రమబద్ధీకరణ, అంతకుముందు వ్యక్తిగత ఆదాయపన్ను మినహాయింపుల పరిమితి పెంపు అన్నది వినియోగదారుల కొనుగోలు సామర్థ్యాన్ని అధికం చేస్తుంది. ఇది వినియోగ ఆధారిత వృద్ధికి అనుకూలిస్తుంది''అని మూడీస్ వివరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మూడీస్ అంచనా 6.4 శాతం అన్నది.. బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే పేర్కొన్న 6.8–7.2 శాతం అంచనాల కంటే తక్కువ కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) జీడీపీ 7.4 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నది ప్రభుత్వం అంచనా.

అలాంటప్పుడే రేట్ల కోత..

ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండడంతోపాటు జీడీపీ వృద్ధి బలంగా ఉందని మూడీస్ రేటింగ్స్ గుర్తు చేస్తూ.. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఒకవేళ ఆర్థిక కార్యకలాపాలు నిదానిస్తేనే ఆర్‌బీఐ తదుపరి వడ్డీ రేట్ల కోతను చేపట్టే అవకాశం ఉంటుందని అంచనా వేసింది. 2025 ఫిబ్రవరి నుంచి విడతల వారీ 1.25 శాతం మేర ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడం తెలిసిందే. కానీ, ఫిబ్రవరి సమీక్షలో రేట్లను యథాతథంగా కొనసాగించింది. రుణ వృద్ధి 2026–27లో 11–13 శాతంగా ఉంటుందని మూడీస్ అంచనా వేసింది. 2025–26లో ఇప్పటి వరకు రుణాల్లో వృద్ధి 10.6 శాతంగా ఉన్నట్టు గుర్తు చేసింది. ''కార్పొరేట్ రుణాల నాణ్యత మెరుగ్గా ఉంది. పెద్ద కార్పొరేట్‌లకు సంబంధించి ఒత్తిడిలోని రుణాలను బ్యాంక్‌లు దాదాపు పరిష్కరించుకున్నందున ఇక మీదట వసూళ్లు నెమ్మదించొచ్చు''అని పేర్కొంది.

క్విక్ కామర్స్‌లో హైరింగ్ కిక్

- కార్యాలయ ఉద్యోగులకు డిమాండ్
- జనవరిలో 21 శాతం అధికంగా నియామకాలు
- ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ నివేదిక

ముంబై: క్విక్ కామర్స్ రంగం వేగవంతమైన వృద్ధిని చూస్తుండడంతో.. ఈ రంగంలోని కంపెనీల్లో నియామకాలూ అదే స్థాయిలో పెరుగుతున్నాయి. జనవరిలో క్విక్‌కామర్స్‌లో కార్యాలయ ఉద్యోగ నియామకాలు 21 శాతం పెరిగినట్టు 'ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్' నివేదిక వెల్లడించింది. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారికి డిమాండ్ ఎంతగానో ఉన్నట్టు ఈ సంస్థ తెలిపింది. ''విస్తరణకే మొదటి ప్రాధాన్యం అనే దశ నుంచి క్విక్‌కామర్స్ వ్యవస్థ ఇప్పుడు.. సమర్థత, మేధస్సు ఆధారిత వృద్ధి వైపు అడుగులు వేస్తోంది. డేటా అనలైటిక్స్, ప్రొడక్ట్ టెక్నాలజీ, సరఫరా వ్యవస్థకు సంబంధించి నిపుణులకు గట్టి డిమాండ్ నెలకొంది. కచ్చిత అంచనా, నిల్వలను మెరుగ్గా నిర్వహించడం, కస్టమర్ల అనుభవాన్ని మెరుగుపరచడానికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. స్థిరమైన, టెక్ ఆధారిత వృద్ధిపై ఈ రంగం దృష్టి పెడుతుండడాన్ని ఇది సూచిస్తోంది'' అని ఫౌండిట్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) అనుపమ భీమ్‌రాజక తెలిపారు. ఇక అన్ని రంగాల్లో కార్యాలయ ఉద్యోగుల నియామకాలు జనవరిలో క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 9 శాతం పెరిగినట్టు ఫౌండిట్ నివేదిక వెల్లడించింది. ఆన్‌లైన్‌లో జాబ్ పోస్టింగ్ డేటా ఆధారంగా ఫౌండిట్ ప్రతి నెలా ఈ వివరాలు వెల్లడిస్తుంటుంది.

రెండో దశలోకి..

భారత్‌లో క్విక్‌కామర్స్ రంగం తదుపరి దశలోకి ప్రవేశించినట్టు ఫౌండిట్ నివేదిక తెలిపింది. లాభదాయకత, అంచనా వేయగలగడం, నిర్వహణ సామర్థ్యం అన్నవి.. విస్తరణ కంటే ప్రాధాన్యాలుగా మారినట్టు తెలిపింది.

ఈ రంగంలో డెలివరీ, డార్క్ స్టోర్లలోని సిబ్బందే ఇప్పటికీ అధిక సంఖ్యలో ఉన్నట్టు చెబుతూ.. కార్యాలయ ఉద్యోగాలు సైతం కీలకంగా అవతరిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం క్విక్‌కామర్స్ రంగంలోని మొత్తం సిబ్బందిలో కార్యాలయ ఉద్యోగులు 14 శాతంగా ఉన్నట్టు తెలిపింది. క్విక్ కామర్స్ కార్యాలయ ఉద్యోగాల్లో ప్రతి నాలుగుంటిలో ఒకటికి బెంగళూరు చిరునామాగా ఉన్నట్టు వెల్లడించింది. హైదరాబాద్ సగటు కంటే అధిక వృద్ధిని చూపించినట్టు తెలిపింది. నిర్వహణ టెక్నాలజీ, విస్తరణ ప్రణాళికా నిపుణులకు డిమాండ్ ఈ నగరంలో డిమాండ్ ఉన్నట్టు పేర్కొంది.

క్యూ3 ఫలితాలు

హిందాల్కో లాభం క్షీణత

రూ. 2,049 కోట్లు

న్యూఢిల్లీ: మెటల్స్ రంగ ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 45 శాతం క్షీణించి రూ. 2,049 కోట్లకు పరిమితమైంది. యూఎస్ అనుబంధ సంస్థ నోవెలిస్‌కు చెందిన ఓస్వెగో ప్లాంటులో సెప్టెంబర్, నవంబర్‌లో వాటిల్లిన అగ్ని ప్రమాదాలు లాభాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ ఎండీ సతీష్ పాయ్ పేర్కొన్నారు. అయితే నోవెలిస్ వ్యయసామర్థ్యం, దేశీ బిజినెస్ వృద్ధి కొంతమేర ఆదుకున్నట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,735 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 58,390 కోట్ల నుంచి రూ. 66,521 కోట్లకు ఎగసింది. కాగా.. నోవెలిస్ క్యాష్‌ఫ్లో సవాళ్లకు చెక్‌పెట్టే బాటలో 20–25 కోట్ల డాలర్ల అదనపు ఈక్విటీ పెట్టుబడులను కంపెనీ సమకూర్చనున్నట్లు పాయ్ వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు బీఎస్ఈలో నామమాత్ర నష్టంతో రూ. 964 వద్ద ముగిసింది.

పెట్రోనెట్ లాభం ప్లస్

రూ. 848 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలోనే అత్యధికంగా ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకునే పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 848 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 806 కోట్లు ఆర్జించింది. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా కొచ్చి టెర్మినల్‌ను వినియోగించుకోవడం ఇందుకు సహకరించింది. కంపెనీ గుజరాత్‌లోని దహేజ్, కేరళలోని కొచ్చిలలో టెర్మినళ్లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం ఔట్‌పుట్ 2 శాతం వృద్ధితో 228 ట్రిలియన్ థర్మల్ యూనిట్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం నీరసించి రూ. 297 వద్ద ముగిసింది.

భారత్ ఫోర్జ్ లాభం జూమ్

రూ. 273 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం భారత్ ఫోర్జ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 273 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 213 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,475 కోట్ల నుంచి రూ. 4,343 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. క్యూ4(జనవరి–మార్చి)సహా వచ్చే ఆర్థిక సంవత్సరం(2026–27)లో మరింత పటిష్ట పనితీరు చూపనున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ బాబా కల్యాణీ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3.3 శాతం బలపడి రూ. 1,733 వద్ద ముగిసింది.

నాట్కో ఫార్మా లాభం అప్

రూ. 151 కోట్లు

న్యూఢిల్లీ: ఔషధ రంగ కంపెనీ నాట్కో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం వృద్ధితో రూ. 151 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 132 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 475 కోట్ల నుంచి రూ. 647 కోట్లకు ఎగసింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1.5 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. అంతేకాకుండా కంపెనీ చైర్మన్, ఎండీగా నన్నపనేని వెంకయ్య చౌదరిని ఏడాది కాలానికి తిరిగి ఎంపిక చేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచి ఎంపిక అమలుకానుంది. 3 లక్షల డాలర్ల(రూ. 2.7 కోట్లు) పెట్టుబడితో చిలీలో సొంత అనుబంధ సంస్థ ఏర్పాటుకు సైతం బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో నాట్కో షేరు బీఎస్ఈలో 1.3 శాతం నీరసించి రూ. 840 వద్ద ముగిసింది.

ఇండియన్ హోటల్ లాభం హైజంప్

రూ. 954 కోట్లు

న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ టాటా గ్రూప్ దిగ్గజం ఇండియన్ హోటల్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 51 శాతం జంప్‌చేసి రూ. 954 కోట్లను అధిగమించిది. జీవీకే గ్రూప్‌తో భాగస్వామ్య సంస్థ(జేవీ)లో రూ. 327 కోట్లకు ఈక్విటీ వాటా విక్రయం లాభాలకు దోహదపడింది. అయితే కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 37 కోట్లు కేటాయించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 633 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,533 కోట్ల నుంచి రూ. 2,842 కోట్లకు ఎగసింది. ఇది 12 శాతం వృద్ధికాగా.. ఈ ఏడాది 32 హోటళ్లతోపాటు.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో మరో 40 హోటళ్లను జత కలుపుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీవద్ద గల రూ. 3,900 కోట్ల నగదును తెలివిగా వినియోగించుకోనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో పునీత్ చత్వాల్ పేర్కొన్నారు. హోటళ్ల విభాగం ఆదాయం రూ. 2,579 కోట్లకు చేరగా.. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఈ విభాగం నిర్వహణ లాభం రూ. 1,050 కోట్లను తాకినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 712 వద్ద ముగిసింది.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ లాభం 62 శాతం డౌన్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ఉపకరణాల దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా నికర లాభం ఏకంగా 62 శాతం క్షీణించింది. రూ. 89.67 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో లాభం రూ. 233.45 కోట్లుగా నమోదైంది. మరోవైపు, ఆదాయం రూ. 4,396 కోట్ల నుంచి రూ. 4,114 కోట్లకు తగ్గింది. ఇక మొత్తం వ్యయాలు సుమారు 3 శాతం తగ్గి రూ. 4,038 కోట్లకు దిగి వచ్చాయి. గతేడాది అక్టోబర్‌లో లిస్టయిన తర్వాత ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఆర్థిక ఫలితాలను ప్రకటించడం ఇది రెండోసారి. ప్రీమియం పోర్ట్‌ఫోలియోని విస్తరించడం, వివిధ విభాగాల్లో కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం ద్వారా నాలుగో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను సాధించడంపై దృష్టి పెడుతున్నట్లు కంపెనీ తెలిపింది.

గురువారం బీఎస్ఈలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా షేరు సుమారు 1 శాతం క్షీణించి రూ. 1,518.15 వద్ద క్లోజయ్యింది.

వొకార్డ్ లాభం దూకుడు

రూ. 61 కోట్లు

న్యూఢిల్లీ: ఫార్మాస్యూటికల్స్ రంగ కంపెనీ వొకార్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు దూసుకెళ్లి రూ. 61 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 20 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 725 కోట్ల నుంచి రూ. 888 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో వొకార్డ్ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 1,429 వద్ద ముగిసింది.

కుమార్తెతో కలిసి కిమ్ (ఫైల్)

భవిష్యత్ నేత కిమ్ జు యే

త్వరలో అధికారికంగా ప్రకటించనున్న కిమ్ జోంగ్ ఉన్

- ఇప్పటికే వేదికను సిద్ధం చేసిన ఉత్తర కొరియా నేత
- దక్షిణ కొరియా నిఘా వర్గాల తాజా అంచనా

సియోల్: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్(42) తమ కుటుంబ పాలనను నాలుగో తరంలోనూ కొనసాగించేందుకు ప్రయత్నాలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా దేశ భావి నేతగా 13 ఏళ్ల కుమార్తె కిమ్ జుయేను త్వరలో ప్రకటించే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని సోదర దేశం దక్షిణ కొరియా నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇటీవల దక్షిణకొరియా పార్లమెంట్ సభ్యులతో జరిగిన నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) ఉన్నతాధికారులు సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ నెలాఖరున జరిగే అధికార కమ్యూనిస్ట్ పార్టీ విస్తృత సమావేశంలో కిమ్ వచ్చే ఐదేళ్లలో సాధించాల్సిన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలను వెల్లడించడంతోపాటు తన అధికార నియంత్రణను పదిలం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటారు. కిమ్ తన కుమార్తె కిమ్ జుయేను మొదటిసారిగా 2022 నవంబర్‌లో జరిగిన క్షిపణి పరీక్షను తిలకించేందుకు తనతోపాటు తీసుకువచ్చారు. అప్పటి నుంచి తరచూ తండ్రితో కలిసి ఆయుధ పరీక్షలు, సైనిక కవాతులు, ఫ్యాక్టరీల ప్రారంభం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటోంది. గతేడాది సెప్టెంబర్‌లో కిమ్ చైనా పర్యటనకు కుమార్తెను వెంటబెట్టుకెళ్లారు. జనవరిలో నూతన సంవత్సరం రోజున కిమ్ దంపతులతోపాటు రాజధాని ప్యాంగ్యాంగ్‌లోని కుమ్‌సుసన్ ప్యాలెస్‌కు వెళ్లింది. అక్కడ మొదటి, రెండో తరం పాలకులైన ముత్తాత కిమ్-2 సంగ్, తాత కిమ్ జొంగ్-2ల మాసోలియంలున్నాయి. ఉత్తర కొరియా తర్వాతి తరం పాలకురాలు కిమ్ జుయే అనే విషయం ఈ పరిణామంతో రూఢీ అయిందని విశ్లేషకులు అంటున్నారు. కిమ్ జొంగ్-2 ఆకస్మికంగా అనారోగ్యం బారిన పడటంతో 2010లో జరిగిన పార్టీ సమావేశంలో కిమ్ జొంగ్ ఉన్(26)ను అధికారికంగా వారసుడిగా ప్రకటించారు. 2011లో తండ్రి చనిపోయాక కిమ్ అధికార పగ్గాలు చేపట్టారు. అప్పటికి ఆయనకు సరైన పాలనా పరమైన అనుభవం లేదు. ఇలాంటి ఇబ్బంది రాకూడదనే కుమార్తెకు ముందుగా తగు అనుభవ పాఠాలు నేర్పించి, అధికారం అప్పగించే ఆలోచనలో కిమ్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే, కిమ్ కుమార్తె జుయే గురించిన వివరాలు పెద్దగా బయటకు తెలియడం లేదు. కిమ్ జుయేకు ఇద్దరు తోబుట్టువులు కూడా ఉన్నట్లు ఎన్ఐఎస్ భావిస్తోంది. వీరి వివరాలు కూడా స్పష్టంగా తెలియవు. ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థలు సైతం ఆమెను పేరుకు బదులుగా రెస్పెక్టెడ్ చైల్డ్ అనో మోస్ట్ బిలవ్డ్ చైల్డ్ అని మాత్రమే ప్రస్తావిస్తున్నాయి. త్వరలో జరిగే పార్టీ ఉన్నతస్థాయి సమావేశాన్ని తన పాలనను కొనసాగించే వ్యూహాన్ని అమలు చేసే వేదికగా కిమ్ మార్చుకుంటారని భావిస్తున్నారు. అందులో భాగంగానే, కుమార్తెకు పార్టీలో ఫస్ట్ సెక్రెటరీ పోస్టును ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఈ పోస్ట్ అధికారికంగా కిమ్ తర్వాత నంబర్- 2 స్థానం వంటిది. అయితే, [illegible] కీలక పరిణామాలు వెంటనే బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉదయం అరెస్ట్.. మధ్యాహ్నం రిలీజ్

- లంబోర్ఘిని కారు ప్రమాదం కేసు
- నిందితుడికి కాన్పూర్ కోర్టు బెయిల్

కాన్పూర్: యూపీలోని కాన్పూర్‌లో ఇటీవల జరిగిన లంబోర్ఘిని కారు ప్రమాద ఘటనలో నిందితుడు అరెస్టయిన కొన్ని గంటల్లోనే బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఆదివారం జరిగిన ఘటనలో కారు ఆరుగురిని ఢీకొట్టడం, నిందితుడిని పోలీసులు పట్టుకోకపోవడంతో అధికారులపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివమ్ మిశ్రా(35)ను బుధవారం ఉదయం 10 గంటల వేళ పోలీసులు గుర్తు తెలియని ప్రాంతంలో అదుపులోకి తీసుకుని, కోర్టుకు తరలించారు. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కోరారు. అయితే, పోలీసులు అందజేసిన రిమాండ్ రిపోర్టులో పలు లోపాలున్నాయని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ తెలిపారు. ఏడేళ్లకు తక్కువ కాకుండా శిక్షలు పడే కేసుల్లో రిమాండ్‌కు తగు కారణాలను చూపాలన్న సుప్రీం ఆదేశాలను అనుసరించలేదని ఎత్తిచూపారు. రూ.20 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు. దీంతో, మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతడిని విడిచిపెట్టారు. ఆ సమయంలో పెద్ద సంఖ్యలో పోలీసులు, లాయర్లు, మీడియా సిబ్బందితో కోర్టు ప్రాంగణం నిండిపోయింది.

నిఫా నుంచి కోలుకుని.. గుండెపోటుతో నర్స్ మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో నిఫా వైరస్ బారినపడి కోలుకున్న ఇద్దరిలో ఒకరు ఇతర ఇన్ఫెక్షన్లతో చనిపోయారు. పూర్బ బర్ధమాన్ జిల్లా కట్వాకు చెందిన నర్సు జనవరి మొదటి వారంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. బుర్ద్వాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు జనవరి 11వ తేదీన నిఫా వైరస్ బారిన పడినట్లు తేలింది. నిఫా నుంచి కోలుకున్న తర్వాత కూడా ఆమె కోమాలోనే ఉన్నారు. దీంతో, ఆమెలో రోగ నిరోధక శక్తి తగ్గిపోయింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. జనవరి చివర్లో వెంటిలేటర్‌ను తొలగించారు. అయితే, గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటుకు గురైన ఆమె, బరాసత్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాణాలు వదిలారు'అని అధికారులు తెలిపారు. డిసెంబర్‌లో నిఫా వైరస్ బారిన పడిన బెంగాల్‌కే చెందిన మరో మగ నర్సు మాత్రం కోలుకుంటున్నారని చెప్పారు.

సినిమా పేరు మార్చండి.. లేదా రిలీజ్ చేయకండి!

- భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం తగదు
- 'ఘూస్‌ఖోర్ పండట్' సినిమా టైటిల్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: వివాదాస్పదంగా మారిన 'ఘూస్‌ఖోర్ పండట్'సినిమా టైటిల్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో ఓ కులాన్ని లేదా వర్గాన్ని కించపరచ లేరని స్పష్టం చేసింది. ఆ పేరును మార్చేదాకా సినిమాను విడుదల చేయవద్దంటూ ఆదేశించింది. ఈ అంశంపై కేంద్ర సమాచార, ప్రసార శాఖకు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ)కి, సినిమా నిర్మాత నీరజ్ పాండేకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ప్రముఖ నటుడు మనోజ్ బాజ్‌పేయి నటించిన 'ఘూస్‌ఖోర్ పండట్'సినిమాను ఓటీటీ వేదికగా విడుదల చేయనున్నట్లు నిర్మాత ఇటీవల ప్రకటించారు. అయితే, సినిమా టైటిల్ తమ వర్గం ప్రజలను కించపరిచేలా ఉందంటూ బ్రాహ్మణ్ సమాజ్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ అతుల్ మిశ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమా విడుదలపై స్టే విధించాలంటూ ఆయన పిల్ వేశారు. సినిమా పేరుతోపాటు కథాంశం బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచేలా ఉందని ఆయన ఆరోపించారు. కులాన్ని, మతాన్ని సూచించే పండిత్ అనే పదాన్ని, అవినీతిని సూచించే 'ఘూస్‌ఖోర్(లంచగొండి)'తో కలిపి వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పిల్‌పై గురువారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'జాగృతం చేయడం, ప్రజలను కించపరుస్తూ అశాంతిని సృష్టించడం అనేవి రెండు వేర్వేరు అంశాలు. ఇప్పటికే ఉన్న విభేదాలు చాలవన్నట్లు, మీరు కొత్తగా ఇలాంటి వాటితో మరింతగా అలజడులను ఎందుకు సృష్టిస్తున్నారు'అంటూ నిర్మాతపై మండిపడింది. 'రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యాన్ని మేం గౌరవిస్తున్నాం. అదే సమయంలో దానికీ హద్దులున్నాయి. మీరు ఎవరినైనా ఎందుకు కించపర్చాలి? ఇటువంటి పేరుపెట్టి ఓ వర్గం వారిని ఎందుకు తక్కువ చేయాలని చూస్తున్నారు?'అని ప్రశ్నించింది. 'దీనిని భావ ప్రకటన స్వేచ్ఛగా భావించలేం. ఆ హక్కు ఇతరులను కించపరిచేందుకు ఇచ్చిన లైసెన్సు కాదు. ఇలాంటివి నైతికతకు, సమాజానికి వ్యతిరేకం. పేరు మార్చకుండా సినిమాను విడుదల చేయడానికి మేం అనుమతించం. సినీ నిర్మాతలు, జర్నలిస్టులు తదితరులు ఈ పరిస్థితికి కారణమని భావిస్తున్నాం'అని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, చిత్రనిర్మాత తరపు న్యాయవాది.. కొత్త టైటిల్‌ను ఇంకా ఖరారు చేయలేదని, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా టైటిల్‌ను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. సినిమా టైటిల్ వివాదంపై మంగళవారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టగా..ఆ పేరును మారుస్తామంటూ నెట్‌ఫ్లిక్స్ హామీ ఇచ్చింది. కథాంశాన్ని, ఉద్దేశాన్ని ప్రతిబింబేలా మరో పేరు పెడతామంది.

సస్పెండైన ఎంపీలతో కలిసి ప్రియాంక తదితరుల నిరసన

ముమ్మాటికీ ట్రాప్ డీలే

- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై విపక్షాల ఆగ్రహం
- పార్లమెంట్ ప్రాంగణంలో బైఠాయించి నిరసన

న్యూఢిల్లీ: అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. దేశ ప్రయోజనాలను మోదీ ప్రభుత్వం పణంగా పెట్టిందని మండిపడ్డాయి. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో మకర ద్వారం వద్ద నిరసన తెలిపాయి. కాంగ్రెస్ సభ్యులు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ధర్మేంద్ర యాదవ్, జయా బచ్చన్, సీపీఐ(ఎంఎల్) నేత సుదామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. 'ట్రేడ్ డీల్ కాదు.. ముమ్మాటికీ ట్రాప్ డీల్, ప్రధాని మోదీ అమెరికా ఎదుట లొంగిపోయారు'అని రాసి ఉన్న బ్యానర్లు ప్రదర్శించారు. మధ్యంతర ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. దేశాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తర్వాత ప్రియాంక గాంధీ వాద్రాతోపాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలు సైతం ఈ నిరసనలో పాల్గొన్నారు. మకరద్వారం మెట్లపై బైఠాయించారు. మోదీ సర్కార్ తీరుపై నిప్పులు చెరిగారు. అమెరికా విసురుతున్న ఉచ్చులో చిక్కుకోవద్దని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు.

వివాహమా?.. ఇప్పుడే వద్దులే!

భారత్‌లో 29 ఏళ్లకు పెరిగిన సగటు పెళ్లి వయసు

ఉద్యోగం, వ్యాపారంలో స్థిరపడ్డాకే యువత నిర్ణయం

తగ్గిపోతున్న కులం పట్టింపు... 'జీవన్‌సాథీ'అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: వివాహం చేసుకోవడానికి యువత తొందరపడడం లేదు. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి అంటున్నారు. కెరీర్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యోగంలో లేక వ్యాపారంలో నిలదొక్కుకున్నాక పెళ్లి గురించి ఆలోచిస్తున్నారు. భారత్‌లో సగటు వివాహ వయసు పదేళ్ల క్రితం 27 ఏళ్లు కాగా.. అది ఇప్పుడు 29 ఏళ్లకు చేరుకుంది. అంటే సగటున 29 ఏళ్లకు వివాహ బంధంలోకి అడుగు పెట్టడానికి యువత ఆసక్తి చూపుతోంది. వివాహ పరిచయ వేదిక 'జీవన్‌సాథీ'నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. వివాహాలపై 2016 నుంచి 2025 దాకా ప్రజల్లో మారిన ధోరణిని అధ్యయనం చేశారు. అలాగే ఈ ఏడాది 30 వేల మంది అభిప్రాయాలు సైతం సేకరించారు. 'అతిపెద్ద మార్పు: జీవిత భాగస్వామి ఎంపిక, పెళ్లి విషయంలో నిబంధనలు తిరగరాస్తున్న భారత్'ఒక నివేదికను జీవన్‌సాథీ తాజాగా విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికరమైన అంశాలున్నాయి.

- పెళ్లంటే యువతలో అయిష్టత ఏమీ లేదు. ఒక ఇంటివారు కావాలనే కోరుకుంటున్నారు. కానీ, అందుకోసం తొందర పడడం లేదు. 29 ఏళ్లు వచ్చాక తోడు కోసం అన్వేషిస్తున్నారు.
- ఈ మార్పు రావడం వెనుక ఆర్థిక కోణమే కీలకంగా కనిపిస్తోంది. ఉద్యోగంలో కుదురుకొని ఆర్థికంగా స్థిరపడితే జీవిత భాగస్వామితో ఆనందంగా గడపొచ్చన్నది యువత ఆలోచన. సాధారణంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కాపురంలో కలతలు రేగుతుంటాయి. ఆ పరిస్థితి రావొద్దని నేటి యువత భావిస్తోంది.
- పెళ్లిని వ్యక్తిగత ఎదుగుదలకు అవరోధంగా కొందరు భావిస్తున్నారు. అందుకే అనుకున్న లక్ష్యం సాధించిన తర్వాత పెళ్లి ఆలోచన తీసుకొస్తున్నారు.
- జీవిత భాగస్వామి మృతిచెందడం లేదా తొలి వివాహం విఫలమైన సందర్భాల్లో మరో పెళ్లి కోసం ఆరాటపడుతున్నవారి సంఖ్య దేశంలో పెరుగుతోంది.
- 2016లో 11 శాతం మంది రెండో పెళ్లి కోసం ప్రయత్నాలు సాగించారు. ఇప్పుడు వారి సంఖ్య 16 శాతం పెరిగింది.
- విడాకులు తీసుకున్న తర్వాత మరో పెళ్లి చేసుకోవడంలో ఎలాంటి తప్పు లేదని చాలామంది భావిస్తున్నారు. తొలిసారి పెళ్లికి సిద్ధమైనవారు కూడా అప్పటికే ఒకసారి విడాకులు తీసుకున్న వారిని వివాహమాడేందుకు ముందుకొస్తుండడం గమనార్హం.
- సరైన జీవిత భాగస్వామి కోసం అన్వేషించే వారి సంఖ్య కూడా తక్కువేమీ లేదు. పెళ్లి విషయంలో వయసు, ఆదాయం వంటి వాటికి ప్రాధాన్యం లేదని, 'రైట్ పర్సన్'కావాలని, అందు కోసం ఎన్నాళ్లయినా వేచి చూస్తామని అంటున్నారు.
- కులం పట్టింపు తగ్గిపోతుండడం మరో శుభ పరిణామం. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలో కులం ముఖ్యం కాదని కొందరు చెబుతున్నారు. 2016తో పోలిస్తే ఇప్పుడు ఇలాంటివారి సంఖ్య మరింత పెరిగింది. గ్రామాలతో పోలిస్తే పట్టణాలు, నగరాల్లో ఈ ధోరణి అధికంగా ఉంది.
- పెళ్లి అనేది వ్యక్తిగత వ్యవహారమని, భార్య/భర్తను తామే ఎంపిక చేసుకుంటామని యువత వాదిస్తోంది. వీరి సంఖ్య 2016లో 67 శాత ఉండగా, ప్రస్తుతం 77 శాతానికి చేరుకుంది. పెళ్లి కుదిర్చే పనిని తమ కుటుంబ సభ్యులకు అప్పగించే పరిస్థితి క్రమంగా తగ్గుముఖం పడుతోంది.
- భార్య తమ కంటే ఎక్కువ సంపాదిస్తున్నప్పటికీ యువకులు పెద్దగా ఇబ్బంది పడడం లేదు. ఎక్కువ సంపాదించే భార్య రావాలని 87 శాతం మంది కోరుకుంటున్నట్లు అధ్యయనంలో తేలింది. భర్త తమ కంటే తక్కువ సంపాదించినప్పటికీ తమకు అంగీకారమేనని 15 శాతం మంది యువతులు చెప్పారు.

పాక్షికంగా ప్రభావం చూపిన సమ్మె

- సమ్మెలో కదంతొక్కిన 30 కోట్ల మంది కార్మికులు
- కార్మిక సంఘాల ఐక్య వేదిక ప్రకటన

న్యూఢిల్లీ: కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు గురువారం సమ్మె చేపట్టాయి. కార్మికులు, రైతులు, పలు రంగాల శ్రామికులు కలిపి దేశవ్యాప్తంగా మొత్తంగా 30 కోట్ల మంది సమ్మెలో పాల్గొన్నారని కార్మిక సంఘాలు ప్రకటించాయి. అయితే సమ్మె ప్రభావం దేశవ్యాప్తంగా పాక్షికంగానే కన్పించింది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ప్రజా రవాణా, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్యకలాపాలు యథాథతంగా కొనసాగాయి. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే వేలాది మంది కార్మికుల భారీ నిరసన ప్రదర్శనలతో జనజీవనం కాస్తంత స్తంభించింది. ఒడిశా, కేరళ, తమిళనాడు, గోవా, జార్ఖండ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో సమ్మె ప్రభావం అత్యధికంగా కన్పించింది. చాలా రాష్ట్రాల్లో కార్మిక సంఘాలు ఆయా పని ప్రాంతాలు, ఫ్యాక్టరీలు, కర్మాగారాల ప్రధాన ద్వారాల వద్ద ధర్నాకు దిగి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించాయి. అత్యంత వివాదాస్పద నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కార్మికసంఘాలు డిమాండ్‌చేశాయి. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, సస్టేనబుల్ హార్నెసింగ్, అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) చట్టాలను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్‌చేశాయి. వీబీ జీ రాంజీ చట్టాన్ని పక్కనబెట్టి వెంటనే పాత ఎంజీనరేగా చట్టాన్ని యథాతథంగా పునరుద్ధరించాలని కోరాయి. సమ్మె కు సంఘీభావంగా పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు తమ కార్యాలయాలు, కర్మాగారాలకు ఆలస్యంగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 600కుపైగా జిల్లాల్లో సమ్మె విజయవంతమైందని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లతోపాటు సంయుక్త కిసాన్ మోర్చాలు, వ్యవసాయ కార్మికుల సంఘాల సంయుక్త వేదిక గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎస్ ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంఘాలు ఈ సంయుక్త ఫో రమ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. ఢిల్లీ లో అన్ని పారిశ్రామిక వాడల నుంచి పలు కార్మిక సంఘాల కార్యకర్తలు నిరసన ప్రదర్శనలను చేపట్టారు. జంతర్ మంతర్ వద్ద సమావేశం నిర్వహించి కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక ముఖ్యనేతలు తూర్పారబట్టారు. తమ రాష్ట్రంలో బ్యాంకింగ్, బీ మా, బొగ్గు రంగంలో కార్యకలాపాలు పూర్తి గా స్తంభించిపోయాయని జార్ఖండ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీఓఐ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఉమేశ్ దాస్ ప్రకటించారు. కేరళలో కేఎస్ఆర్‌టీసీ బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. ప్రైవేట్ బస్సులూ రోడ్డెక్కకపోవడంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో మాత్రం జనజీవనానికి ఎలాంటా ఆటంకం కలగలేదు.


అమృత్‌సర్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు

వైకల్య పింఛను రాజ్యాంగ హక్కు ప్రభుత్వమిచ్చే పరిహారం కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ఓ జవానుకు అందజేయాల్సిన వైకల్య పింఛనును ప్రభుత్వం నిలిపివేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. వైకల్య (డిజెబిలిటీ పెన్షన్) పింఛను ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది కాదని స్పష్టం చేసింది. అది రాజ్యాంగబద్ధమైన హక్కని ప్రకటించింది. పింఛను అందజేయడంలో వివక్ష చూపడం లేదా తగ్గించడం వంటి చర్యలు సరికాదని తలంటింది. ఓ మాజీ సైనికోద్యోగికి వైకల్య పింఛను అందించాల్సిందేనంటూ సాయుధ బలగాల ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం గురువారం కొట్టివేసింది. వైకల్య పింఛను ప్రభుత్వమిచ్చే దానం కాదు, అది దేశ సేవలో చేసిన త్యాగానికి దక్కిన గుర్తింపని తెలిపింది. 'పింఛను ప్రభుత్వం ఇచ్చే పారితోషికం కూడా కాదు. గత సేవలకు ప్రతిఫలంగా చెల్లించే వాయిదా వేసిన వేతనం. నిర్ణీత నిబంధనలు పూర్తి చేసిన తర్వాత, అది ఒక స్థిరమైన, చట్టపరంగా అమలు చేయదగిన హక్కుగా మారుతుంది. పింఛను ప్రయోజనాలు ఆస్తి హక్కు వంటివి. చట్టపరమైన అధికారం లేకుండా వీటిని ఆపేయడం, తగ్గించడం, రద్దు చేయడం సాధ్యం కాదు'అని ధర్మాసనం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఆదర్శవంతమైన యజమానిగా ఉండాలని, దేశం కోసం పనిచేసిన వారికి ప్రయోజనాలు అందించే విషయంలో నిష్పక్షపాతంతో, సమానత్వంతో వ్యవహరించాలని ఉద్బోధించింది. ఒక ప్రయోజనాన్ని విధానం ద్వారా గుర్తించి, న్యాయస్థానం ధ్రువీకరించినప్పుడు, అమలు విషయంలో వివక్ష చూపరాదని పేర్కొంది. న్యాయపరమైన తీర్పులు, ప్రభుత్వ నిర్ణయాల ద్వారా మాజీ సైనికులకు చెందాల్సిన పింఛనును నిరాకరించడమంటే ఆస్తిని లాక్కోవడమే అవుతుందని తెలిపింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 300ఏని ఉల్లంఘించడమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. వైకల్య పింఛను హక్కు చాలా విలువైంది, ఒకసారి అది అర్హమైనదిగా తేలితే, బకాయిలు సహా చెల్లించాల్సిందేనని ఆదేశించింది.

చైనా నుంచి నింగిలోకి పాక్ ఉపగ్రహం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ తన రెండో స్వదేశీ భూ పరిశీలన ఉపగ్రహం(ఈఓ2)ను చైనా భూతలం నుంచి విజయవంతంగా ప్రయోగించింది. గురువారం చైనాలోని యాంగ్‌జియాంగ్ తీరప్రాంత ప్రయోగ కేంద్రం నుంచి ప్రయోగించిన ఈఓ-2 ఎర్త్ అబ్జర్వేటరీ శాటిలైట్‌ను పాకిస్తాన్‌లోని స్పేస్ అండ్ అప్పర్ అట్మాస్ఫియర్ రీసెర్చ్ కమిషన్ తయారుచేసింది. జాతీయాభివృద్ధి ప్రణాళిక, సహజ వనరుల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, పట్టణాల విస్తరణ ప్రణాళికల రచనకు కొత్త ఉపగ్రహం సాయపడనుందని పాకిస్తాన్ ప్రకటించింది. పరిపాలనా, విపత్తుల నిర్వహణ, వాతావరణ విశ్లేషణ, వ్యూహాత్మక నిర్ణయాత్మకను మెరుగుపరిచేలా అత్యంత స్పష్టమైన ఉపగ్రహ ఛాయాచిత్రాలను కొత్త శాటిలైట్ అందజేయనుంది. పాకిస్తాన్ తన తొలి ఈఓ-1 శాటిలైట్‌ను జియూక్వాన్ శాటిలైట్ ప్రయోగకేంద్రం నుంచి గతేడాది ప్రయోగించిన విషయం తెల్సిందే.

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లలో 2,800కుపైగా ఖాళీలు

న్యూఢిల్లీ: అఖిలభారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా 2,800కుపైగా పోస్టులు భర్తీచేయాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గురువారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర సిబ్బంది శిక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పలు వివరాలను వెల్లడించారు. 2025 జనవరి ఒకటో తేదీనాటి సివిల్ లిస్ట్ ప్రకారం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో 1,300, ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో 505, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 1,029 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విడివిడిగా చూస్తే గరిష్టంగా 6,877 ఐఏఎస్ పోస్టులకు ప్రభుత్వం అనుమతించగా ఇందులో 18.9 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఐపీఎస్‌లో 9.9 శాతం ఖాళీలున్నాయి. ఐఎఫ్ఎస్‌లో గరిష్టంగా 32.2 శాతం పోస్టులు భర్తీచేయాల్సి ఉంది. ఈ మూడు సర్వీస్‌లను కలుపుకుంటే 15,169 పోస్టులకుగాను 2,834 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి హత్య

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణంగా హత్యకు గురయ్యారు. కమాల్‌గంజ్ ప్రాంతంలోని మౌల్వీబజార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. చంపారా టీ గార్డెన్‌లో పనిచేసే రతన్ షువో కర్(28) బుధవారం నుంచి కనిపించకుండాపోయాడు. దీంతో, అతడి సోదరుడు లక్ష్మణ్ కర్ అతడి కోసం వెతుకుతున్నాడు. గురువారం ఉదయం స్థానికులిచ్చిన సమాచారంతో వెళ్లి చూడగా టీ గార్డెన్‌లో విగతజీవిగా రక్తపు మడుగులో పడి ఉన్నాడు. కాళ్లు, చేతులు తాడుతో కట్టేసి ఉన్నాయి. తన తమ్ముడికి ఎవ్వరితోనూ శత్రుత్వం లేదని లక్ష్మణ్ తెలిపాడు. అయితే, గురువారం ఎన్నికల నేపథ్యంలో ఈ దారుణం జరిగి ఉంటుందని స్థానికులు అంటున్నారు. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సోమవారం మైమన్‌సింగ్‌లో సుసేన్ చంద్ర సర్కార్ అనే హిందూ వ్యాపారి అతడి దుకాణంలోనే హత్యకు గురికావడం తెల్సిందే.

అమెరికా నేవీ నౌకలు ఢీ.. ఇద్దరికి గాయాలు

వాషింగ్టన్: కరీబియన్ ప్రాంతంలో మోహరించిన అమెరికా యుద్ధ నౌకలు రెండు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు భద్రతాసిబ్బందికి స్వల్పంగా గాయాలయ్యాయని యూఎస్ సదరన్ కమాండ్ గురువారం వెల్లడించింది. యూఎస్ఎస్ ట్రక్స్‌టన్, యూఎస్ నేవీ సప్లయ్ నౌక సరుకును కేబుళ్ల ద్వారా మార్చే సమయంలో సమాంతరంగా ప్రయాణిస్తూ ఢీకొన్నాయని తెలిపింది. ఆ సమయంలో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారంది. ఘటన అనంతరం రెండు నౌకలు సురక్షితంగా ముందుకు ప్రయాణం సాగించాయని వివరించింది.

రద్దు చేసినా మాకు అభ్యంతరం లేదు

- డిఫాల్ట్ బిల్డర్లకు వంతపాడటం తప్ప ఏమీ చేయడం లేదు
- రెరాపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) ఏర్పాటుపై రాష్ట్రాలన్నీ పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సంస్థ నియమాల ఉల్లంఘనలకు పాల్పడే నిర్మాణదారుల(డిఫాల్ట్ బిల్డర్ల)కు వంతపాడటం తప్ప ప్రజల కోసం ఏమీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సంస్థ తీరుతో ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్నారని వ్యాఖ్యానించింది. సంస్థను రద్దు చేసినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. రెరా కార్యాలయాన్ని సిమ్లా నుంచి ధర్మశాలకు తరలించాలన్న హిమాచల్ ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు గతేడాది జూన్‌లో స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, ఇతరులు వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది. అదేవిధంగా, హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. సిమ్లా నగరంలో రద్దీ తీవ్రరూపం దాల్చడం వల్లనే ధర్మశాలకు రెరా కార్యాలయాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు లాయర్ సుగంధా ఆనంద్ చెప్పారు. అయితే, తాము పర్యవేక్షించే 90 శాతానికి పైగా ప్రాజెక్టులు సిమ్లాకు చుట్టుపక్కల 40 కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయని రెరా తరపు లాయర్ పేర్కొన్నారు. రెరాలో ప్రభుత్వం తరపున రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉండటంపై ధర్మాసనం.. ప్రజలకు ఏవిధంగానూ ఉపయోగపడని రెరా ఇప్పుడో ఓ పునరావాస కేంద్రంగా మారిపోయిందంటూ వ్యాఖ్యానించింది. సిమ్లా నగరం చాలా ఇరుగ్గా తయారైందని అంగీకరించిన ధర్మాసనం..రెరా కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తనకు నచ్చిన చోటుకు మార్చుకోవచ్చునంది. అయితే, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ తుది తీర్పుకు లోబడి ఉంటుందని స్పష్టతనిచ్చింది. సాధారమైన, ఇలాంటి విధానపరమైన నిర్ణయాలు న్యాయస్థానాల పరిధిలోకి రావని ధర్మాసనం పేర్కొంది. రెరా నిర్ణయాలపై అప్పీల్ అధికారాలను సిమ్లాలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి నుంచి ధర్మశాలలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి పరిధిలోకి తేవాలని ఆదేశాలు జారీ చేసింది.

సాక్షి ప్లస్
శుక్రవారం । 13-2-2026

విస్పతి అధిపతిగా ఉండేవారిని ఏమని పిలిచేవారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలి వేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు.ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతో పాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం'అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞ యాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు,నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర,ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికి తోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్స, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధా న్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ' లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అధర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతో పాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు బాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి
   2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి
   4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది (ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

కోడ్స్: ఎ బి సి డి ఇ
1 5 4 1 2 3
2 3 4 5 2 1
3 3 4 1 2 5
4 1 2 3 4 5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?



1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. ది హాంగ్
23. అసోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్టాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక(DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశ పెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండిస్తున్నారు?
జ. నిజామాబాద్
33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం-రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (–40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్- కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం(1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫిర్రోయింగ్, స్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్పటికీయ భూభాగం

బహుళార్థసాధక ప్రాజెక్టు	నది	నిర్మించిన ప్రదేశం	లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు
భాక్రానంగల్ ప్రాజెక్టు	సట్లెజ్	భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
బియాస్ ప్రాజెక్టు	బియాస్	పాంగ్ (పంజాబ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
దామోదర్ ప్రాజెక్టు	దామోదర్	జార్ఖండ్	పశ్చిమ బెంగాల్, జార్ఖండ్
హిరాకుడ్ ప్రాజెక్టు	మహానది	సంబల్‌పూర్	ఒడిశా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	నందికొండ (నల్గొండ, తెలంగాణ)	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
తుంగభద్ర ప్రాజెక్టు	తుంగభద్ర	మల్లాపూర్ (బళ్లారి)	కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
కోసి ప్రాజెక్టు	కోసి నది	హనుమాన్ నగర్ (బిహార్)	బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం)
చంబల్ ప్రాజెక్టు	చంబల్	మధ్యప్రదేశ్	మధ్యప్రదేశ్, రాజస్థాన్
గండక్ ప్రాజెక్టు	గండక్	వాల్మీకి నగర్ (బిహార్)	బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్
రామ్‌గంగా ప్రాజెక్టు	రామ్‌గంగా	కాలాగర్	ఉత్తరాఖండ్

పర్వతాలు	రాష్ట్రం
మహాదేవ్ కొండలు	మధ్యప్రదేశ్
రాజ్‌మహల్ కొండలు	జార్ఖండ్
మిష్మి కొండలు, డాప్లా కొండలు	అరుణాచల్‌ప్రదేశ్
కచార్ కొండలు	అసోం
పాట్‌కాయ్ కొండలు	నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్
ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు	మేఘాలయ
పళని కొండలు, నీలగిరి కొండలు, షేవరాయ్ కొండలు	తమిళనాడు
యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు	కేరళ
లూషాయ్ కొండలు	మిజోరాం
గిర్ కొండలు	గుజరాత్

తీరప్రాంత మైదానం	విస్తరించిన రాష్ట్రం
సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
ఉత్కల్ తీరం	ఒడిశా
కోరమండల్ తీరం	తమిళనాడు
మలబార్ తీరం	కేరళ
కెనరా తీరం	కర్ణాటక
కొంకణ్ తీరం	గోవా, మహారాష్ట్ర

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో	
మొత్తం జనాభా	121 కోట్లు
జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో)	17.7%
అక్షరాస్యత	74%
లింగనిష్పత్తి	1000 : 943
జనసాంద్రత	382
పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	గోవా (62.2%)
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	హిమాచల్ ప్రదేశ్ (90%)

కాకతీయ ప్రభువుల కాలంలో ప్రసిద్ధిగాంచిన నృత్యం ఏది?

తెలంగాణలో పుట్టి ఇక్కడే అభివృద్ధి చెందిన ఒక అపురూప జానపద కళారూపం 'ఒగ్గుకథ'. ఒగ్గు అంటే శివుడి చేతిలోని 'ఢమరుకం' అనే అర్థం కూడా ఉంది. ఇది అచ్చమైన తెలంగాణా దేశీ పదం. ఒగ్గు కథలను తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కురుమలు తమ 'కులపురాణం'గా భావిస్తారు. మిద్దె రాములు, చుక్క సత్తయ్య లాంటి వారు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఒగ్గు కళాకారులు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ సంస్కృతి-కళలు

జానపద కళలు - కళాకారులు

తెలంగాణ రాష్ట్రంలో అనేక రకాల జానపద కళాకారులు ఉన్నారు. వీరు తమ కళలనే కులవృత్తులుగా చేసుకొని వాటి ద్వారా జీవనం సాగిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ సిలబస్‌లో వీటన్నింటినీ ప్రత్యేక అధ్యాయంగా పేర్కొన్నారు. అందువల్ల అభ్యర్థులు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, కళారూపాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కొలనుపాక భాగవతులు

కొలనుపాక భాగవతులనే గంటె భాగవతులుగా పేర్కొంటారు. వీరికి, ఆంధ్ర ప్రాంతంలో ఉండే గంటె భాగవతులకూ వ్యత్యాసం ఉంది. తెలంగాణలో గంటె భాగవతులు ఎక్కువగా కరీంనగర్ జిల్లా కొలనుపాకలో ఉన్నారు. వీరు రాత్రి వేళల్లోనే ప్రదర్శన చేస్తారు. వీరి ప్రదర్శనలకు సాహిత్యపరంగా అంతగా ప్రాముఖ్యం లేదు. వీరు ప్రదర్శనల్లో ప్రధానంగా గరిటెలను ఉపయోగిస్తారు. అందువల్ల వీరిని గరిటె భాగవతులు, గంటె భాగవతులుగా వ్యవహరిస్తారు. ప్రతి పాత్రధారి చేతిలోనూ ఒక గరిటె ఉంటుంది. అందులో చమురు పోసి, వత్తి వేసి వెలిగిస్తారు. ప్రతి పాత్ర హావభావాలూ, ఆంగిక చలనాలు ఈ గరిటె వెలుతురు వల్ల ప్రేక్షకులకు విశదంగా వెల్లడవుతాయి. ప్రదర్శనలో భాగంగా మధ్య మధ్య నటనను సాగిస్తూ, గరిటెలలోని వత్తిని ఎగదోస్తూ ఉంటారు. గరిట ప్రాముఖ్యంతోనే నాటకాలను ప్రదర్శిస్తారు.

శారదకాండ్రు

శారదకాండ్రు అనే జానపద కళాకారులు కేవలం తెలంగాణాలోనే కనిపిస్తారు. వీరు ఎక్కువగా వరంగల్ ప్రాంతంలో ఉన్నారు. బుర్రకథ వాయిద్యకారులు, శారద కథకులకు మధ్య పెద్ద వ్యత్యాసమేమీ కనిపించదు. బుర్రకథకుల మాదిరిగానే వీరు కూడా డక్కీలను ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే తంబురాను 'శారద' అంటారు. అందువల్ల వీరికి శారదకాండ్రు అనే పేరు వచ్చింది.

గంగిరెద్దులాట

ఇది తెలంగాణ రాష్ట్రంలో ఒక చక్కని జానపద కళ. సాధారణంగా పూజగొల్ల కులానికి చెందిన వారు గంగిరెద్దులను ఆడిస్తారు. వీరు ఎద్దును చక్కగా అలంకరించి, ఊళ్లలో తిరుగుతూ దాన్ని ఆడిస్తారు. వీరు ప్రధానంగా భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తారు. ఒక గంగిరెద్దుతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వీరిలో ఒకరు గంగిరెద్దును ఆడిస్తే.. మరో వ్యక్తి డోలు వాయిస్తాడు. మూడో వ్యక్తి సన్నాయి వాయిస్తాడు. ఇది గ్రామస్థులకు మంచి వినోదం. సాధారణంగా వీరు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎక్కువగా కనిపిస్తారు.

ఒగ్గుకథ

ఒగ్గుకథ ఒక కళారూపం. కురు కులానికి చెందినవారు దీన్ని ప్రదర్శిస్తారు. 'ఒగ్గు' అంటే త్రినేత్రుడైన శివుడిని ప్రార్థించడం. వీరశైవారాధకుల్లో పురోహితులైనవారు శైవ దీక్ష తీసుకుంటారు. ఒగ్గు దీక్ష తీసుకున్నవారు మల్లన్న, వీరన్న కథలను వల్లె వేస్తారు. కోయతెగకు చెందిన ఒక వంశస్థులు సమ్మక్క కథ చెబుతూ పాటలు పాడతారు.

బుడబుక్కల వాళ్లు

వీరు తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతికి చెందినవారు. వీరు ఊరూరా తిరుగుతూ ఉంటారు. సాధారణంగా వీరు క్షుద్రదేవతలను పూజిస్తారు. తెల్లవారుజామున విచిత్ర వేషధారణతో ఢమరుకం వాయిస్తూ గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతారు. జ్యోతిషం చెబుతూ, తాయత్తులు కడుతూ యాచిస్తారు.

బుడగ జంగాలు

బుడగ జంగాలు శివభక్తులు. ఒక చేతిలో గంట వాయిస్తూ, శివుడి గురించి యక్షగానం చేస్తూ భిక్షాటన చేస్తారు. వినసొంపైన జానపద పాటలు పాడుతారు. ప్రజలకు విభూతిని పంచుతారు. అందువల్ల వీరిని 'జంగమదేవర' అని పిలుస్తారు. వీరు వాయించే గంటపై చిన్న 'నంది' విగ్రహం ఉంటుంది.

భిక్షుక కుంట్లు

వీరు కూడా తెలంగాణా ప్రాంతానికి చెందిన సంచారజాతివారే. వీరు సత్యహరిశ్చంద్ర, మార్కండేయ, భక్త ప్రహ్లాద కథలను ఎంతో రమ్యంగా చెబుతారు. ప్రదర్శనలో నలుగురు కళాకారులు ఉంటారు. ప్రధాన కథకుడు చేతిలో 'పన్నుకర్ర' పట్టుకొని అటూ ఇటూ ఊపుతూ కథ చెబుతాడు. మిగిలినవారు మద్దెల, హార్మోనియం, తాళాలు వాయిస్తూ అతడిని అనుకరిస్తారు.

రంజు కళాకారులు

విశ్వ బ్రాహ్మణులపై ఆధారపడి రంజు, పవన, సమయాలు ఇచ్చే ప్రదర్శనలు ఎంతో రమ్యంగా ఉంటాయి. వీరు 'రంజు' అనే వాయిద్యాన్ని వాయిస్తారు. వీర బ్రహ్మేంద్ర స్వామి కథ, విశ్వకర్మ పురాణం చెబుతారు. వీరు శైవ మతాన్ని అనుసరిస్తారు.

డోలి కళాకారులు

కోయ జాతికి చెందిన వీరు అడవుల్లో, పర్వత ప్రాంతాల్లో నివసిస్తారు. డోలి కళాకారులు వారి జాతికి చెందిన ఆదిపురుషుల గురించి కథల రూపంలో చెబుతారు. కోయ జాతిలో మూడో తరానికి చెందిన 'పేరంబోయరాజు' కథను వల్లె వేస్తారు.

బండారు కళాకారులు

వీరు పెరిక కులంపై ఆధారపడి ఉంటారు. బండారు కళాకారులు పెరిక జాతి గొప్పతనం గురించి పురాణకథలు చెబుతారు. వీరు ఏ రకమైన వాయిద్యాలను ఉపయోగించరు. ప్రధాన కథకుడు కథ చెబుతూ ఉంటే మరో ఇద్దరు వంత పాడతారు.

డాఢీల ప్రదర్శన

వీరు లంబాడీ తండాలకు వెళ్లి అక్కడి పెద్దలను కలిసి ప్రదర్శనలు ఇస్తారు. వీరిని 'భట్టు' అనే పేరుతో కూడా పిలుస్తారు. వీరు తమ జాతిలో మూలపురుషుల కథలను పాడుతూ సంచారం చేస్తూ భిక్షాటన చేస్తారు. వీరు ఒక బృందంగా ఏర్పడి పాటలు పాడతారు. ఒక్కో బృందంలో అయిదు నుంచి 15 మంది సభ్యులు ఉంటారు.

అసాదులు

తెలంగాణా ప్రజలకు అనేక గ్రామ దేవతలను పూజించే ఆచారం ఉంది. వీరు ప్రకృతి దేవతలను కూడా పూజిస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ, పెద్దమ్మ పేర్లతో దేవతలను పూజిస్తారు. రాష్ట్రంలో అడుగడుగునా ఇలాంటి దేవాలయాలు కనిపిస్తాయి. ఈ దేవాలయాల్లో అన్ని రకాల శూద్ర కులాలకు చెందినవారు అర్చకులుగా ఉంటారు. వీరినే 'అసాదులు' అంటారు. ఈ అసాదులు అమ్మవార్లను 'తాంత్రిక' పద్ధతిలో పూజిస్తారు. మాల కులంలో మాల దాసరులు ఉన్నట్లుగానే.. మాదిగ కులంలో అసాదులనే తెగకు చెందినవారు ఉంటారు. అసాదులంటే మాల, మాదిగ కులాల్లో పూజారి వర్గానికి చెందినవారని 'ఆరుద్ర' పేర్కొన్నారు. వీరు ప్రధానంగా ఎల్లమ్మ కథను గానం చేస్తూ చిందులు వేస్తారు.

కప్పతల్లి

అత్యంత ప్రాచీనమైన జానపద కళ ఇది. నృత్యం, పాట, తప్పెట, లయతో ఈ జానపద కళ ఎంతో రమ్యంగా ఉంటుంది. తప్పెటను ఎదురు రొమ్ముపై పెట్టుకొని వాయిస్తారు. తెలంగాణలో ఈ కళను 'కప్పతల్లి'గా వ్యవహరిస్తారు.

కాటి కాపరులు

వీరు దహన కార్యక్రమాల్లో పాలు పంచుకొంటారు. శ్మశానంలో అన్ని ఏర్పాట్లు చేస్తారు. మరణించిన వారి గురించి కీర్తిస్తూ పాటలు పాడటం ద్వారా యాచిస్తారు. చనిపోయిన వ్యక్తి దుస్తులను కూడా వీరు స్వీకరిస్తారు.

మాయాజాల కళాకారులు

వీరిని 'విప్ర వినోదులు'గా పేర్కొంటారు. వీరు గారడి ద్వారా అనేక మాయలను ప్రదర్శించి, యాచిస్తారు.

మందెచ్చు కళాకారులు

వీరు యాదవ కులానికి చెందినవారు. ఈ జానపద కళాకారులు 'ఒల్లమాదేవి' కథను పాడుతూ యాచిస్తారు. వీరిలో ప్రధాన కళాకారుడు ఒక చేతిలో కత్తి, మరో చేతిలో చిరుతలు పట్టుకొని కథకు సంబంధించిన పాటలు పాడతాడు. మరో ఇద్దరు.. ఒకరు కత్తి, మరొకరు కర్ర పట్టుకొని ఇతడికి వంత పాడతారు.

తోటి కళాకారులు

గిరిజన, అడవి జాతులకు చెందిన కోయ, గోండు, నాయకపోడు కులాలకు ఆశ్రిత కులం తోటివారు. గిరిజన జాతులన్నీ లక్ష్మీదేవి జాతికి చెందినవి. తోటి కళాకారులు కురువంశానికి చెందినవారిగా, వారికి వారసులుగా భావిస్తారు. వీరు కురువంశ మూలపురుషుల కథలు చెబుతారు.

పెద్దమ్మ కళాకారులు

వీరు సంచార జాతికి చెందిన మహిళా కళాకారులు. సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి ప్రదర్శనలు ఇస్తారు. పెద్దమ్మ దేవత విగ్రహాన్ని ఒకరి చేతిలో ఉంచుతారు. మరో కళాకారిణి డోలు వాయిస్తుంది. చేతిలో పెట్టిన విగ్రహాన్ని కళాకారిణి తలపై పెట్టుకొని డోలు శబ్దానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తుంది. వీరు నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు 'పండుగ శాయన్న' గాథను పాడుతూ ప్రదర్శన నిర్వహిస్తారు.

యానాది భాగవతం

యానాది కులానికి చెందినవారు చెప్పే భాగవతాన్ని 'యానాది భాగవతం' అంటారు. వీరు చెంచులక్ష్మి కథను ఎంతో రమ్యంగా చెబుతారు. దీన్నే 'గరుడాచల భాగవతం'గా వ్యవహరిస్తారు. వీరు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ కథను వల్లె వేస్తారు.

పర్థాన్ కళాకారులు

ఇది గోండు జాతి పుట్టు పుర్వోత్తరాలకు సంబంధించిన జానపద కళ. ఆదిమవాసీలైన పర్థాన్‌లు 'దేవాల్ పులాక్' పురాణగాథను ఆలపిస్తూ ప్రదర్శనలు ఇస్తారు. వీరు డక్కి, తాళాలు అనే వాయిద్యాలను ఉపయోగిస్తారు.

జముకులవారు

పోచమ్మ, ఎల్లమ్మ, అక్కమ్మ, సారంగధర మొదలైన గ్రామ దేవతల కథలను వీరు ఎంతో మనోరంజకంగా చెబుతారు. వీరు ఉపయోగించే వాయిద్యాల్లో 'జమిడిక' లేదా 'బవనిక' ముఖ్యమైంది.

వీరముష్టివారు

వీరు వైశ్యులకు అనుయాయులు. వైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీకన్యకాపరమేశ్వరి గురించి పాటలు పాడతారు. వీరు 'జంగాల' దగ్గర కూడా యాచిస్తారు.

సాతాను వైష్ణవులు

వీరు వైష్ణవ భక్తులు. విష్ణువును ఆరాధిస్తారు. విష్ణువు గురించి పాటలు పాడుతూ యాచిస్తారు.

పిట్టల దొర

తెలంగాణాలో ఆదరణ ఉన్న మరో ముఖ్యమైన జానపద కళాకారుడు 'పిట్టల దొర'. ఈ వేషాన్నే 'లత్కోర్ సాబ్', 'బుడ్డర్ ఖాన్', 'తుపాకి రాముడు'గా పేర్కొంటారు. ఇది పగటి వేషాల్లో ఒక రకానికి చెందింది. వీరు ప్రధానంగా గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తారు. పిట్టల దొర వేషగాళ్లు సమాజంలోని లోపాలు, కుతంత్రాలను హాస్యాత్మకంగా, వ్యంగ్య రూపంలో చెబుతారు. ఖాకీ ప్యాంటు లేదా నిక్కరు, చిరిగిన ఖాకీ షర్టు, తలపై దొర టోపి, కాళ్లకు బూట్లు ధరిస్తారు. టోపిపై ఒక పక్కన తెల్లటి ఈక, చేతిలో కట్టె తుపాకీ, మెడలో రుమాలు ఉంటుంది. వీరు ముఖానికంతా తెల్ల రంగు పూసుకుని, ఫ్రెంచ్‌కట్ మీసంతో దొరలా హంగామా చేస్తూ విరామం లేని వాగ్ధోరణితో ప్రజలను అలరిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో మాయాజాల కళాకారులుగా ఎవరిని పిలుస్తారు?
   1) మందెచ్చు కళాకారులు
   2) విప్ర వినోదులు
   3) ఒగ్గుకథ కళాకారులు
   4) శారదకాండ్రు
2. మిద్దె రాములు, చుక్క సత్తయ్య ఏ కళలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు?
   1) ఒగ్గుకథ 2) బుర్రకథ
   3) హరికథ 4) గుస్సాడి నృత్యం
3. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గిరిజనులు చేసే నృత్యం పేరు?
   1) సిద్దీ నృత్యం 2) గుస్సాడి నృత్యం
   3) గరగల నృత్యం
   4) పేరిణీ తాండవం
4. కాకతీయ ప్రభువుల కాలంలో ప్రసిద్ధిగాంచిన నృత్యం ఏది?
   1) సిద్దీ నృత్యం
   2) రేల నృత్యం
   3) కోలాటం
   4) పేరిణీ తాండవం
5. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ దేవతలను పూజించే శూద్ర కుల అర్చకులను ఏమంటారు?
   1) శారదకాండ్రు
   2) వీరముష్టివారు
   3) అసాదులు
   4) బండారు కళాకారులు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 3.

She buys milk and butter from the...

PRACTICE TEST

1. The girl in the pink frock is my daughter. (**Use:** wearing)
   1) Wearing pink frock is my daughter.
   2) The girl wearing in the pink frock is my daughter.
   3) My daughter is wearing pink frock.
   4) The girl wearing the pink frock is my daughter.
2. She said that she had gone there the night before.
   1) She said, "I went there the night before."
   2) She said "she went there the previous night."
   3) She told that 'she had gone there last night.'
   4) She said, "I went there last night."
3. Join the following simple sentences into a single sentence. He was tired of work. He lay down to rest.
   1) He was tired of work; he was lay down to rest.
   2) Being tired of work, he lay down to rest.
   3) So tired of work, to lay down to rest.
   4) Too tired of work he was laid down to rest.
4. She buys milk and butter from the ____
   1) Dairy
   2) diary
   3) daily
   4) dairies
5. ____ being fined he was sent to prison.
   1) beside
   2) in
   3) besides
   4) always
6. I have been in this office ____ six years.
   1) since
   2) from
   3) for
   4) last
7. All laughed at her. (Change into Passive)
   1) Everyone laughed at her
   2) Everybody laughed at her
   3) She was laughed at by all
   4) All were laughed at by her
8. You will never be hurt by him. (Change into Active)
   1) Nobody hurts you
   2) He will never hurt you
   3) He may not hurt you
   4) He may be hurting you
9. I cannot lift this box, I need ____ help.
   1) few 2) a few
   3) a little 4) little
10. Which sentence is correct?
    1) Bread and butter are a wholesome food.
    2) The captain, with all his men, were drowned.
    3) Either Ramu or Anil were absent.
    4) The jury were divided in their opinion.
11. In which sentence the verb is used in past continuous and simple past?
    1) We were playing when you came.
    2) The boys are doing their homework when the bell rang.
    3) She was dancing and playing.
    4) She was singing when I meet her.
12. There is ____ hotel in ____ centre of ____ town.
    1) the, the, the
    2) the, a, the
    3) a, the, the 4) a, a, the
13. I met him ____ hour ago.
    1) a 2) an
    3) the 4) no article
14. They have gone to a movie. (Use an appropriate question tag)
    1) Have they?
    2) Had they?
    3) Hadn't they?
    4) Haven't they?



15. Raju rides a bicycle. ____?
    1) is he
    2) does he
    3) was he riding
    4) doesn't he
16. He flatters her whenever he meets her. The meaning of flatter is ____.
    1) prays
    2) preys
    3) prize
    4) praise
17. Keep him at arm's length, means
    1) keep him close
    2) keep him in front
    3) keep him near
    4) keep him away
18. Which of the sentence is correct?
    1) "I have seen a tiger", Ravi said.
    2) Ravi said "I seen tiger?"
    3) "I am seeing a tiger" Ravi said
    4) Ravi said, "I have saw a tiger?"
19. Identify the sentence with correct use of punctuation.
    1) "try and try again," said the teacher.
    2) "Try and Try again," said the Teacher.
    3) "Try and try again," said the teacher.

BANK EXAMS

ENGLISH

    4) The teacher said, "try and try again".
20. The police found him guilty. The structure of the sentence is
    1) S+V+ pronoun + complement
    2) S + V + O1 + O2
    3) S + V + IO + DO
    4) S + V + O + complement
21. Identify the silent letters in 'phlegm'
    1) P, l
    2) P, h, g
    3) H, g, m
    4) G, m, l
22. 'My Dear' is an expression used in ____
    1) formal letters
    2) semi formal letters
    3) personal letters
    4) official letters
23. Usually informal letters will be written to ____.
    1) Colleagues
    2) Boss
    3) Editor
    4) Near & dear
24. You have been summoned. The opposite of the underlined word is ____.
    1) Call for
    2) Said for
    3) Dismiss
    4) Call upon
25. He has ____ a lot of weight.
    1) Put in
    2) Put on
    3) Put through
    4) Put off

PASSAGE

We are living in the midst of a great chemical experiment, and some serious consequences are becoming apparent to scientists. More than two billion pounds of chemicals are spewed into the air each year which are brewing a disastrous stew. The greatest consequences of the atmosphere crisis may be global warming and the ozone depletion. The Earth appears to be warming due to greenhouse effect. Scientists estimate that average temperature could climb about 2 degrees Celsius in 20 years. Global warming is the predict result of the greenhouse effect, created by the greenhouse gases, such as carbon dioxide and methane, in the atmosphere. This change in the global climate would have disastrous results, including drought, coastal flooding and increased species extinction. Also, the scientists have discovered a hole in the ozone layer. The ozone layer is the only protection for life on Earth against deadly ultraviolet radiation from the sun. Once the ozone layer is completely destroyed, all life on Earth will cease exist, killed by the deadly radiation. The planet will become a barren rock devoid of all life. And when this happens the process of industrialization would have to take the blame which has resulted in increased use of fossil fuels such as coal, petroleum and diesel.

26. Which of the following can be inferred from the given passage?
    1) The use of all chemical products should be immediately stopped.
    2) Scientists will have a hard time to estimate the rate of change of temperature in the years to come due to enormous changes in environment.
    3) The environmental disaster in the future will happen as a result of increased usage of fossil fuels.
    4) All of the above
27. Greenhouse effect envisages ____
    1) Carbon dioxide and methane
    2) Harmful gases
    3) Global warming
    4) Chemicals
28. The scientists have discovered a hole in the ozone layer. Hole means ____.
    1) complete
    2) partial
    3) fissure
    4) comprehensive
29. This is really helping us from the ultraviolet radiation____.
    1) global warming
    2) green house gases
    3) ozone layer
    4) industrialization
30. This pen is yours, isn't it?
    1) this is a statement
    2) request
    3) interrogation
    4) asking for information

Key

1) 4	2) 4	3) 2	4) 1	5) 3
6) 3	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 3	13) 2	14) 4	15) 4
16) 4	17) 4	18) 1	19) 3	20) 4
21) 2	22) 3	23) 4	24) 3	25) 2
26) 4	27) 3	28) 3	29) 3	30) 4